# తెలుగు

## పాఠ్యప్రణాళిక - విద్యాప్రమాణాలు

ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు

**2012 సంవత్సరం**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

# ముందుమాట

భావ వినిమయానికి, భావ గ్రహణానికి మానవుడికి ఉన్న సర్వోత్తమమైనసాధనం భాష, భాష అనేది వ్యాకరణ బద్ధంగా నేర్పితే వచ్చేది కాదని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. భాష అనేది విభాగాల నుండి మొత్తానికి గాక, మొత్తం నుండి విభాగాలకు పయనిస్తుందనేది భాష నూతన సిద్ధాంతం. ఆధునిక భాషా సిద్ధాంతాల కనుగుణంగా విద్యా విధానాల్లోను తదంతర్గతమైన పాఠ్యాంశాలలోను ఎన్నో మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని NCF-2005, RTE-2009, NCFTE-2010 లను ఆధారంగా చేసుకొని రాష్ట్ర ప్రణాళికా పరిధి పత్రం-2011ను రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసింది. దీన్ని ప్రాతిపదికగా చేసుకొని భాష ఆధారపత్రాన్ని తద్వారా భాషా ప్రమాణాలను నిర్ధారించారు.

భాషా ఆధారపత్రంలో భాష-నూతన దృక్పథాలు, పాఠ్యాపుస్తకాల రూపకల్పన, భాషా విద్యా ప్రమాణాలు, మూల్యాంకనం, ఉపాధ్యాయ వృత్త్యంతర శిక్షణ, తదితర విషయాలను పొందుపరిచారు.

ఇక నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనకు, మూల్యాంకనానికి ఒక్క మాటలో చెప్పాలంటే విద్యాగమ్యానికి చుక్కాని లాంటి విషయాన్ని ఈ గ్రంథంలో పొందుపరచారు. పాఠశాల స్థాయిలో పిల్లల భాషాభ్యసనంపై విద్యా ప్రణాళికలు-పాఠ్యప్రణాళికలు వాటి ప్రభావం పిల్లలను ప్రభావితం చేసేలా ఉంటాయి. అందువల్ల వీటిని తయారు చేయడంలో జాగరూకులుగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆవశ్యంగా భావించి, ప్రస్తుత సమాజాన్ని, భాషాపోకడలను, వ్యవహారాలను దృష్టిలో ఉంచుకొని నూతన పాఠ్యపుస్తకాల కొరకు పాఠ్యప్రణాళికను సిద్ధం చేశారు. ఇది బోధనాభ్యసన తీరును ప్రభావితం చేసేలా, ఉపాధ్యాయుల, పిల్లల పనితీరును నిర్దేశించేలా ఉన్నాయి.

ఆయా తరగతులకు నిర్దేశించిన దశలను, సామర్థ్యాలను, ప్రమాణాలను అనుసరించి పాఠాలను రూపొందించడానికి విద్యా ప్రణాళికను సంసిద్ధం చేశారు. ఇది పిల్లలకు భాష పట్ల అభిరుచి పెరిగేలా, మరింత ఆసక్తి కలిగేలా ఉంటుందనే భావిస్తున్నాం. ఈ ప్రణాళికలో విద్యార్థికి కేవలం భాషనే కాకుండా సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల మేళవింపులను ఆకళింపు చేసుకొనేలా, మానవ విలువలు, నైతిక విలువలు, విశ్వమానవ వ్యక్తిత్వం మొదలగు అంశాలను ఆధారంగా చేసుకున్న ఇతి వృత్తాలను తదనుగుణమైన ప్రక్రియలను మార్గదర్శనం చేశారు. వీటి ద్వారానే ఒకటి నుండి పదవ తరగతి వరకు గల పాఠ్యాపుస్తకాల రూపకల్పన జరుగుతుంది. తరగతి బోధనకు, పిల్లల్లోని సహజ భాషానైపుణ్యాలను వెలికి తీయడానికి ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

ఈ పుస్తకం పాఠ్యపుస్తకాల రూపకర్తలకు, ఉపాధ్యాయులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకు సంబంధించిన తాత్త్విక నేపథ్యాన్ని, మూలభావనలను ఇది అందిస్తోంది. తరగతి గదుల్లో పిల్లల నుండి సాధించాల్సిన సామర్థ్యాలను, తత్ప్రమాణాలను నిర్దేశిస్తూ ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తున్నాం. అంతేకాక భాషాభిమానులకు, తల్లిదండ్రులకు, మేథావులకు ఈ పుస్తకం నుండి భాషా లక్ష్యాలు, భాషా ప్రణాళికల వివరాలు సంబంధిత అంశాలు లభిస్తాయి. దీని ఫలితాలు తుది దశ వరకు సమర్థవంతంగా చేరి మన విద్యా వ్యవస్థను విజయతీరాలకు చేరుస్తామనడంలో అతిశయోక్తి లేదని భావిస్తున్నాము.

ఇది భవిష్యత్తు పాఠ్యప్రణాళికల, విద్యా ప్రణాళికల రూపకల్పనల్లో మార్గదర్శిగా నిలువడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నాం.

## రూపొందించినవారు

### ప్రాథమిక తరగతులు

**శ్రీనివాసుల రఘురామ్,** ఉపాధ్యాయుడు, గుంటూరు
**వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, పశ్చిమ గోదావరి
**అగుడూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, చిత్తూరు
**ఎమ్. రాంబాబు,** ఉపాధ్యాయుడు, విశాఖపట్నం
**కె. వెంకటేశ్వర్లు,** ఉపాధ్యాయుడు, వరంగల్
**ఆర్. విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్
**కె. సోమేశ్వరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం
**దివ్వెల చిన్నారావు,** ఉపాధ్యాయుడు, విజయనగం
**గుడిసేవ విష్ణుప్రసాద్,** ఉపాధ్యాయుడు, కృష్ణా
**బలగం రామమోహన్,** ఉపాధ్యాయుడు, అదిలాబాద్
**కె. గోపాల్,** ఉపాధ్యాయుడు, నల్గొండ
**అంగర గోపాలకృష్ణాచార్యులు,** తూర్పు గోదావరి

### ప్రాథమికోన్నత, ఉన్నత తరగతులు

**జి. వెంకటస్వామి,** విశ్రాంత ఉపన్యాసకులు, యస్.సి.ఇ.ఆర్.టి.
**ఎన్. సరోజినిదేవి,** విశ్రాంత ఉపన్యాసకులు, యస్.సి.ఇ.ఆర్.టి.
**వి. చెన్నయ్య,** స్కూ.అ, తెలుగు, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా
**వి. శరత్‌బాబు,** తెలుగు పండిత్, అంబర్‌పేట, హైదరాబాద్ జిల్లా
**పల్లెర్ల రామమోహన్‌రావు,** స్కూ.అ, తెలుగు, వేముల, మహబూబ్‌నగర్ జిల్లా
**డా. దోనేపూడి నరేష్‌బాబు,** తెలుగు పండిత్, గోస్పాడు, కర్నూలు జిల్లా
**డా. ఎస్. రఘు,** తెలుగు పండిత్, నామవరం, నల్లగొండ జిల్లా
**పి. మాధవి,** తెలుగు పండిత్, భారతీయ విద్యా భవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాద్ జిల్లా.
**చెఱుకూరి వెంకట సూర్యనారాయణ శర్మ,** స్కూ.అ, తెలుగు మగటపల్లి, తూ.గో.జిల్లా
**కట్టా శ్రీనివాసరావు,** స్కూ.అ, తెలుగు, తాడువాయి, పశ్చిమగోదావరి జిల్లా
**సిహెచ్. ఏడుకొండలు,** ఉపాధ్యాయుడు, ప్రకాశం జిల్లా
**ఎ. భానుప్రకాష్,** ఉపాధ్యాయుడు, మెదక్ జిల్లా

## విషయనిపుణులు - సంపాదకవర్గం

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్

**డా. పోరంకి దక్షిణామూర్తి**
విశ్రాంత ఉపసంచాలకులు, తెలుగు అకాడమి
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

**డా. డి. చంద్రశేఖర్ రెడ్డి**
విశ్రాంత ప్రధానాచార్యులు
ఆంధ్రసారస్వత ఓరియంటల్ కళాశాల, హైదరాబాద్

**డా. దహగాం సాంబమూర్తి**
విశ్రాంత ప్రధానాచార్యులు
ఉపాధ్యాయ విద్యా కళాశాల, వరంగల్

**డా. బూదాటి వెంకటేశ్వర్లు**
ప్రొఫెసర్, తెలుగు విభాగాధిపతి
ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం

**డా. నోరి రాజేశ్వరరావు**
ఉపన్యాసకులు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం
ప్రభుత్వ ప్రాచ్య కళాశాల, నల్లకుంట, హైదరాబాద్

## మార్గదర్శకులు

**డా. ఎన్. ఉపేందర్ రెడ్డి**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం
ఎస్.సి.ఇ.ఆర్.టి. ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

**శ్రీ ఎ. సత్యనారాయణరెడ్డి**
సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి.
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

# విషయసూచిక

## పాఠ్యప్రణాళిక - విద్యా ప్రమాణాలు

### భాషలు (తెలుగు/ ఉర్దూ/ సంస్కృతం/ హిందీ)


| | | పేజి.సం. |
|---|---|---|
| **I.** | పాఠ్యప్రణాళిక మార్పు - ఆవశ్యకత | **1** |
| **II.** | రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011 - సంక్షిప్త సారాంశం | **2** |
| **III.** | భాషా విద్యా ప్రణాళిక | |
| | *అ) భాషా స్వభావం, పిల్లల అభ్యసనం, నూతన దృక్పథం* | **11** |
| | *ఆ) భాష, సమాజం, ఇతర అంశాలు* | **15** |
| | *ఇ) భాషా బోధనా లక్ష్యాలు/ అభ్యసనా ఫలితాలు* | |
| | *A. ప్రాథమిక స్థాయి - బోధనా లక్ష్యాలు (1 నుండి 5 వరకు)* | **23** |
| | *B. ఉన్నత స్థాయి - బోధనా లక్ష్యాలు (6 నుండి 10 వరకు)* | **24** |
| **IV.** | పాఠ్యప్రణాళిక - మొదటి దశ - 1, 2 తరగతులు | |
| | అ) భాషా సామర్థ్యాలు - అభ్యసనా సూచికలు | **26** |
| | ఆ) పాఠ్యపుస్తకాలు | **29** |
| | ఇ) పాఠ్యాంశాల వివరాలు | **31** |
| | ఈ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు | **33** |
| | ఉ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు | **34** |
| | ఊ) మూల్యాంకనం | **35** |
| | ఋ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి | **37** |

**V. పాఠ్యప్రణాళిక – రెండవ దశ – 3, 4, 5 తరగతులు**

అ) భాషా సామర్థ్యాలు – అభ్యసనా సూచికలు 38

ఆ) పాఠ్యపుస్తకాలు 45

ఇ) పాఠ్యాంశాల వివరాలు 48

ఈ) అభ్యసన వాతావరణం – బోధనాభ్యసన ప్రక్రియలు 54

ఉ) ఉపాధ్యాయుల తయారీ – బాధ్యతలు 56

ఊ) మూల్యాంకనం 57

ఋ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి 59

**VI. పాఠ్యప్రణాళిక – మూడవ దశ – 6, 7, 8 తరగతులు (ప్రథమ, ద్వితీయ భాషలు)**

అ) భాషా సామర్థ్యాలు (ప్రథమ భాష) – అభ్యసనా సూచికలు 61

ఆ) భాషా సామర్థ్యాలు (ద్వితీయ భాష) – అభ్యసనా సూచికలు 70

ఇ) పాఠ్యపుస్తకాలు 78

ఈ) పాఠ్యాంశాల వివరాలు 80

ఉ) అభ్యసన వాతావరణం – బోధనాభ్యసన ప్రక్రియలు 88

ఊ) ఉపాధ్యాయుల తయారీ – బాధ్యతలు 89

ఋ) మూల్యాంకనం 90

ఎ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి 91

**VII. పాఠ్యప్రణాళిక – నాల్గవ దశ – 9, 10 తరగతులు (ప్రథమ, ద్వితీయ భాషలు)**

అ) భాషా సామర్థ్యాలు (ప్రథమ భాష) – అభ్యసనా సూచికలు 61

ఆ) భాషా సామర్థ్యాలు (ద్వితీయ భాష) – అభ్యసనా సూచికలు 102

ఇ) పాఠ్యపుస్తకాలు 106

ఈ) పాఠ్యాంశాల వివరాలు 109

| | పేజి.సం. |
|---|---|
| ఉ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు | 117 |
| ఊ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు | 119 |
| ఋ) మూల్యాంకనం | 120 |
| ఎ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి | 121 |
| **VIII. అనుబంధాలు** | |
| అ) పిల్లలు - భాష | 129 |
| ఆ) పిల్లలు భాష నేర్చుకొన్నట్టే రాయడమూ నేర్చుకోగలరా? | 133 |
| ఇ) భాషా బోధనలో భిన్న ధోరణులు | 136 |
| ఈ) పిల్లలు చదివే పుస్తకాలేవీ? కథలేవీ? | 140 |
| ఉ) మన చదువుల్లో కథల స్థానం ఏమిటి? | 143 |
| ఊ) పిల్లలూ, పుస్తక ప్రపంచం | 148 |
| ఋ) కథలోంచి భాష నేర్పడం ఎలా? | 153 |


*భాషావిద్యలో పఠనానికి ప్రముఖస్థానం అంగీకరించినప్పటికి పాఠ్యప్రణాళిక కేవలం స్మృతి కృత్యాలతో, సమాచార గ్రహణానికి పరిమితమై భారమైంది. పఠనానందం కల్గించకుండా ఊసుపోక పఠనానికి కారణమౌతుంది. అందువల్ల అన్ని దశల్లో వైయక్తిక పఠనావకాశాలు కల్పించుట ద్వారా పఠన సంస్కృతిని పెంపొందించవచ్చు. ఉపాధ్యాయులు కూడా ఈ పఠన సంస్కృతికి ఉదాహరణలు కావాలి. పఠనాన్ని నిరుత్సాహపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అదనపు పఠనసామగ్రిని సిద్ధం చేయడం, సరఫరాచేయడం ద్వారా అన్ని బోధనాంశాల్లో అన్ని దశల్లో పఠనాసక్తిని పెంపొందించవచ్చు.*

***- NCF 2005***

***- జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005***

# I. పాఠ్యప్రణాళికమార్పు - ఆవశ్యకత

భాషను భావప్రసారంగా, భావ వినిమయ సాధనంగా చూస్తుంటాం. కానీ భాషను విస్తృత పరిధిలో చూడాలి. భాషకు, ఆలోచనలకు సంబంధం ఉంది. భాషతో ఆలోచనా పరిధి పెరుగుతుంది. 'ఈనాటి శాస్త్ర పరిజ్ఞానం అభివృద్ధి చెందడానికి హేతువు భాష' అని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే భాషను ఆలోచన పెంచేదిగా చూడాల్సిన అవసరముంది. భాష వల్ల ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. మానవ సంబంధాలు మెరుగుపడడం, జ్ఞాన పరిధి విస్తృతం కావడం, ఇతర విషయాలు నేర్చుకోవడంలో భాష సాధనంగా తోడ్పడడం, విరామ కాలాన్ని సద్వినియోగపరచుకోవడం వంటి వాటిలో భాష కీలక పాత్ర పోషిస్తోంది. భాష వల్ల మన ఆలోచనలు క్రమబద్ధీకరించబడతాయి. భాష సంస్కృతి సంప్రదాయాలను ఇతర తరాలకు అందించడానికి తోడ్పడుతుంది. భాష ఉపాధి మార్గాలు చూపడంలో కూడా కీలక పాత్ర వహిస్తుందనేది మరవకూడదు. భాష ఆధారంగా జీవనోపాధిని పొందుతూ ఎన్నో వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఉదాహరణకు పత్రికారంగం, ప్రసారమాధ్యమం, న్యాయవాద వృత్తి, ఉపాధ్యాయ వృత్తి, రాజకీయ జీవితం గడిపేవారు, కళలను నేపథ్యంగా ఉపాధిని పొందేవారు (బుర్రకథలు, ఒగ్గుకథలు) మొదలగునవి. కవులు, రచయితలు మొదలైనవారు తమకున్న భాషా పటిమతో జీవనోపాధి పొందుతున్నారు.

భాషకు ఉన్న ఈ విస్తృత ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒక సాధారణ సబ్జక్టుగా చూడడం, పరీక్షల కోసం సిద్ధం చేయడం సరైనది కాదు. నేటి ఆధునిక సమాజంలో మానవుని ప్రేరేపించే అంశాలు ఎన్నో ఉంటాయి. ప్రసారమాధ్యమాలలోని ప్రకటనలు, పత్రికారంగంలోని ప్రకటనలు, వాణిజ్య వ్యాపార రంగాలు, ఉత్పత్తి రంగాలు సమాజంలో వినిమయ సంస్కృతిని పెంచి పోషిస్తుంటాయి. అట్లే ప్రతి విషయాన్ని తమదైన కోణంలో ప్రాచుర్యంలోకి తీసుకొస్తుంటాయి. వీటికి ఆకర్షితులు కాకుండా విచక్షణతోటి హేతుబద్ధంగా ఆలోచించే శక్తి పిల్లలకు లభించాలి. ఇది కేవలం భాష ద్వారానే సాధ్యమవుతుంది. భాష వల్ల పిల్లలు విమర్శనాత్మక దృక్పథం, హేతుబద్ధంగా ఆలోచించడం, సందర్భోచితంగా, అర్థవంతంగా మాట్లాడడం, బహుకోణాల్లో విశ్లేషించడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటివి చేయగలరు.

వీటిని సాధించాలంటే భాషాబోధన పరిధి విస్తృతం కావాలి. ఉదాత్తమైన సదాశయంతో పాఠ్యప్రణాళికలు సిద్ధం కావాలి. మూసపోసిన విధానాలు అనగా దిద్దించడం, బట్టీపట్టించడం, పరీక్షలకు సిద్ధం చేయడం వంటి వాటికి స్వస్తిపలకాలి. అవగాహన చేసుకోవడం, ఆలోచించడం, ప్రతిస్పందించడం, విమర్శనాత్మకంగా, హేతుబద్ధంగా, సృజనాత్మకంగా, స్వంతంగా వ్యక్తీకరించేవిధంగా భాషా విద్యాప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు నూతన భూమికను పోషించాల్సిన అవసరముంది.

భాష విభిన్న ప్రక్రియలలో ఉనికిని కలిగి ఉంటుంది. సమాజంలో భాషా వినియోగం పెరిగేకొలదీ అది మార్పులకు గురి అవుతూ ఉంటుంది. అట్లే నూతన ప్రక్రియలు కూడా ఆవిష్కరించబడుతుంటాయి. భాషకు ఉన్న ఈ స్వభావాన్ని, భాషలో చోటుచేసుకున్న నూతన పోకడలను, నూతన ప్రక్రియలను పిల్లలు అవగాహన చేసుకొని పట్టు సాధించాలి. ఇందుకనుగుణంగా పాఠ్యప్రణాళికలు నవీనీకరించబడాలి. వీటి ఆధారంగా సాధించాల్సిన సామర్థ్యాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు కూడా సమూలంగా మారాలి.

పిల్లలు నాణ్యమైన విద్యను పొందడానికి ఉద్దేశించిన నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టంలోని గుణాత్మక అంశాలు, ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రంలోని కీలక సూత్రాల ప్రకారం, విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళికలు ఆధునీకరించబడాలి. వీటిని అమలు పర్చడంలో భాగంగా పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలలో మార్పులు రావాలి. వీటి ప్రకారం భాషా బోధన అంటే పాఠ్యపుస్తకాలకే పరిమితమై - పరీక్షలకు సిద్ధం చేయడంకాదు. పిల్లల్లో ఆధునికశక్తి, సృజనాత్మకత, కల్పనాశక్తి, వ్యక్తీకరణశక్తి మొదలగునవి వృద్ధిపరచాలి. పిల్లలు జ్ఞాన నిర్మాణులుగా మారాలి.

దురదృష్టవశాత్తు ఇప్పటికీ కూడా మనం భాషకున్న ఈ శక్తిని, అత్యంత సంక్లిష్టమైన భాషను అలవోకగా పట్టుకునే పిల్లల శక్తిని పట్టించుకోవడం లేదు. పిల్లలు నేర్చుకోగలరని, పిల్లలకున్న శక్తి సామర్థ్యాలు అమోఘమని నమ్మి భాషా పాఠ్యప్రణాళికలను నూతన దృక్పథంతో రూపొందించినపుడు హేతుబద్ధమైన రేపటి పౌరులను తయారు చేయగలుగుతాం. ప్రణాళికాకర్తలలో ఈ విశాల దృక్పథం, ఆలోచన ఉండడం అవసరం.

ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని భాషా బోధన లక్ష్యాలను విస్తృత పరిధిలో నిర్ధారించి సృజనాత్మకత, ఉన్నత వైఖరులు, మానవతా విలువలు పెంపొందించేలా చేయడం కోసం పాఠశాలవిద్యలో 1 నుండి 10వ తరగతి వరకు నూతన పాఠ్యప్రణాళికలను మరియు వాటి ఆధారంగా నూతన పాఠ్యపుస్తకాలను రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణా సంస్థ రూపొందించింది. వీటిని ఆకళింపు చేసుకొని అమలుపరచాల్సి ఉంటుంది. వీటిపైన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరియు పర్యవేక్షణాధికారులు, దృష్టిసారించి అవగతం చేసుకొని, ఆశించిన రీతిలో అమలుచేసి పిల్లల బహుముఖ ప్రజ్ఞాలకు తోడ్పడాలి.

# II. రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధిపత్రం - 2011 - సంక్షిప్త సారాంశం

**నేపథ్యం:**

చదువుకోవడం అనేది ఒకప్పుడు గౌరవప్రదమైన కార్యక్రమం మాత్రమే. కానీ ప్రస్తుతం అది ఒక ప్రాథమిక హక్కు కూడా. ఎలిమెంటరీ స్థాయివరకు బడిఈడు పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడం **"ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (RTE-2009)"** ప్రకారం ప్రాథమిక హక్కుగా మారింది. విభిన్న సంస్కృతులు, భాషావైవిధ్యత కల్గిన మనదేశంలో **అందరికీ విద్య**ను అందించడం గురించి భారతరాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. గత ఆరు దశాబ్దాలుగా అందరికీ విద్యను అందించడానికి మనదేశంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలుజరిగాయి, జరుగుతున్నాయి కూడా! అయినప్పటికీ ఇంకను సవాళ్లు తెరముందుకు వస్తూనే ఉన్నాయి. బాలకార్మికత, బడిబయట పిల్లలుండడం; నాణ్యతాలోపం; జవాబుదారీతనం లోపించడం; యాంత్రికమైన బోధనాభ్యసన ప్రక్రియలు, ప్రమాణాల పేరుతో అధిక సమాచార భారంతో బరువెక్కిన పాఠ్యపుస్తకాలు; ఒత్తిడి, ఆందోళన, మార్కులు, ర్యాంకులకు పరిమితమైతున్న మూల్యాంకన విధానాలు; అడుగంటుతున్న విలువలు, రోజురోజుకు వ్యాపార ధోరణి పెరుగుతూ క్రమేణా ఉన్నవారు ఒకరకమైన చదువులు, లేనివారు ఇంకోరకమైన చదువులు పొందుతున్న విద్యావాతావరణం, మౌలిక వసతుల కొరత మొదలగు సవాళ్ళను మనం గమనించవచ్చు. ***మన రాష్ట్రంలోని పరిస్థితి కూడా ఇందుకు విభిన్నంగా ఏమీ లేదు. వీటికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుముఖం పట్టడం, సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడాన్నే జ్ఞానంగా భావించడం, గిరిజనులు, అల్పసంఖ్యాకవర్గాలు, బాలికలు మొదలగు వర్గాలు ఇతర వర్గాలతో సమానంగా విద్య పొందలేక పోవడమనే అదనపుసమస్యలు కూడా ఉన్నాయి.***

ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో జాతీయ విద్యాప్రణాళిక చట్రం -2005 (NCF - 2005) ను **"భారరహిత అభ్యసనం"** (Learning without burden) అనే నివేదిక ఆధారంగా రూపొందించింది. పిల్లల చదువులు బట్టీ విధానాలకు పరిమితం కాకుండా, అర్థవంతంగా మారాలని, నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించాలని, నేర్చుకోవడమనేది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, ఆందోళన, పోటీతత్వం అధిగమించేలా పరీక్షల విధానాలను సంస్కరించాలని **జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005** సూచించింది. (APSCF & Position paper SCERT website లో ఉన్నది www.apscert.gov.in)

ఈ అంశాలతోపాటు పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడాన్ని చట్టబద్ధం చేస్తూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (Right to Free and Compulsory Education Act - 2009) అమలులోకి వచ్చింది. **పాఠశాల విద్యలో కీలకమైన వ్యక్తులు ఉపాధ్యాయులు.** ఉపాధ్యాయ నిర్మాణం పైననే నాణ్యమైన విద్య ఆధారపడి ఉంటుందని **ఉపాధ్యాయ విద్య జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2010** ని (NCFTE - 2010) జాతీయ ఉపాధ్యాయ విద్యా సంస్థ (NCTE) రూపొందించింది.

భారంలేని విద్య నివేదిక, జాతీయ విద్యాప్రణాళిక చట్రం (NCF - 2005), విద్యాహక్కు చట్టం (RTE - 2009), జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రం (NCFTE) - 2010 ప్రతిపాదనలు, మార్గదర్శకాలను పరిశీలించినపుడు మన రాష్ట్రంలోని పాఠశాల విద్యలో సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని భావించారు. ఇందుకోసం మనరాష్ట్రంలోకూడా **రాష్ట్ర విద్యాప్రణాళిక చట్రం 2011** (State Curriculum Frame Work - 2011) ను రూపొందించడానికి జాతీయస్థాయి విషయనిపుణులు ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు మొదలగు వారితో సలహా సంఘాన్ని, స్టీరింగ్ కమిటీని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసింది. అట్లే వివిధ సబ్జక్టులు, సహపాఠ్యఅంశాలకు చెందిన 18 అంశాలలో ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించి ప్రతిపాదనలతో **ఆధారపత్రాలను రూపొందించడానికి ఒక్కొక్క అంశానికి ఒక ఫోకస్‌గ్రూపును** కూడా నియమించింది.

**వాటి వివరాలు:**

**1. విద్యా విషయక ఆధారపత్రాలు** (Position Papers on Subject Areas) :

1.1 భాష - భాషాబోధన - ఆధారపత్రం (Position Paper on Language and Language Teaching)

1.2 ఆంగ్లబోధన - ఆధారపత్రం (Position Paper on English Teaching)

1.3 విజ్ఞానశాస్త్ర విద్య - ఆధారపత్రం (Position Paper on Science Education)

1.4 గణిత విద్య - ఆధారపత్రం (Position Paper on Mathematics Education)

1.5 సాంఘికశాస్త్ర విద్య - ఆధారపత్రం (Position Paper on Social Science Education)

1.6 పరిసరాలు - అభ్యసనం - ఆధారపత్రం (Position Paper on Habitat and Learning)

1.7 కళావిద్య - ఆధారపత్రం (Position Paper on Art Education)

**2. వ్యవస్థాపక సంస్కరణలు** (Position Papers on Systemic Reforms) :

2.1 విద్యా లక్ష్యాలు - ఆధారపత్రం (Position Paper on Aims of Education)

2.2 వ్యవస్థాపర సంస్కరణలు - ఆధారపత్రం (Position Paper on Systemic Reforms)

2.3 ఉపాధ్యాయ విద్య - ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధి - ఆధారపత్రం
(Position Paper on Teacher Education and Teacher Professional Development)

2.4 అభ్యసనం కొరకు మూల్యాంకనం - ఆధారపత్రం (Position Paper on Assessment of Learning)

2.5 విద్యా సాంకేతికత - ఆధారపత్రం (Position Paper on Education Technology)

2.6 విద్యాప్రణాళిక - పాఠ్యపుస్తకాలు - ఆధారపత్రం (Position Paper on Curriculum and Textbooks)

**3. రాష్ట్ర సంబంధిత ముఖ్యమైన అంశాలు** (Position Papers on State concerns) :

3.1 విభిన్న వర్గాల విద్య (ఎస్.సి., ఎస్.టి., మైనార్టీ - బాలికలు - సమ్మిళిత విద్య) - ఆధారపత్రం
(Position Paper on Education for Diversities - S.C, S.T, Minority, Girls, Inclusive)

3.2 ఆరోగ్య - వ్యాయామ విద్య - ఆధారపత్రం (Position Paper on Health and Physical Education)

3.3 బాల్యారంభ విద్య - ఆధారపత్రం (Position Paper on Early Childhood Education)

3.4 పని మరియు విద్య - ఆధారపత్రం (Position Paper on Work and Education)

3.5 నైతికత - విలువలు - మానవ హక్కులు - ఆధారపత్రం
(Position Paper on Ethics, Values and Human Rights)

రాష్ట్ర విద్యాప్రణాళిక చట్టం 2011ని మరియు 18 ఆధారపత్రాలను రూపొందించడానికి ఈ కింది నివేదికలను పరిగణనలోకి తీసుకున్నారు. అవి.

- **రాజ్యాంగ నిబంధనలు (Constitutronal) భారత రాజ్యాంగ ప్రవేశిక మరియు 73, 74 వ రాజ్యాంగ సవరణలు.**
- **జాతీయ విద్యా ప్రణాళిక చట్టం 2005 (NCF - 2005)**
- **'భారరహిత అభ్యసనం' నివేదికలు (GOI - Report on Learning without burden)**
- **ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (RTE-2009)**
- **ఉపాధ్యాయవిద్య - జాతీయ విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2010 (NCFTE-2010)**.
- **జాతీయ విజ్ఞాన కమీషన్ ప్రతిపాదనలు (National Knowledge Commission Recomendations)**

పై నివేదికలకు చెందిన, ప్రతిపాదనల ఆధారంగా రాష్ట్ర విద్యాప్రణాళిక చట్టం 2011 (APSCF 2011) కింది సూత్రాలను ప్రతిపాదించింది. వీటి ఆధారంగానే వివిధ సబ్జక్టులు, సహపాఠ్య అంశాలకు చెందిన ఆధారపత్రాలను, సిలబస్‌ను, విద్యాప్రమాణాలను రూపొందించారు. అట్లే పాఠ్యపుస్తకాలను ఆధునీకరించి, మూల్యాంకనం మరియు పరీక్షల్లో సంస్కరణలు చేపడతారు. ఈ క్రమంలో APSCF-2011 ప్రతిపాదించిన రాష్ట్ర దృక్పథాన్ని (Perspectives of the State) మరియు APSCF-2011 కీలక సూత్రాలను (Key Principles) ను పరిశీలిద్దాం.

## మనరాష్ట్ర దృక్పథం (perspective of the State):

- విద్యయొక్క ప్రాథమిక ఉద్దేశ్యం పిల్లలందరినీ బాధ్యతాయుతమైన, హేతుబద్ధమైన, పౌరులుగా (Responsible and Rational Citizens) తయారుచేయడం. విద్యాలక్ష్యాలు దీనిపై ప్రధానంగా దృష్టిసారించడం. అట్లే పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రశంసిస్తూ, సామాజిక మార్పుకు దోహదపడే వ్యక్తులుగా పిల్లలను తీర్చిదిద్దడం.
- విద్యాప్రణాళిక రూపకల్పనలో పిల్లలయొక్క అవసరాలు, కోరికలు కేంద్రబిందువులుగా ఉండడం.

- పిల్లలు నేర్చుకోవడంలో ఒక జ్ఞానాత్మక క్రమం (Cognitive sequence in learning) ఉంటుంది. విద్యాప్రణాళికను ఈ క్రమం మరియు పిల్లల మానసికస్థాయిల ఆధారంగా రూపొందించడం. ఫలితాలకంటే కూడా వాటిని పొందే ప్రక్రియలను పరిపుష్టి చేయడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం. దీనివల్ల పిల్లలు కేవలం సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడంకంటే వాటిని అర్థవంతంగా పొందడం, విశ్లేషించడం వంటి నైపుణ్యాలను పొందుతారు.
- జ్ఞానమనేది (knowledge) సమగ్రమైంది. దీన్ని వివిధ సబ్జక్టుల పేరుతో విడదీసి ముక్కలు ముక్కలుగా అందించడమనేది కృత్రిమమైనది. జ్ఞానమనేది జ్ఞానాత్మక సామర్థ్యాలతో (Cognitive abilities) కూడినదనేది నిర్వివాదాంశం. ఒకే అంశాన్ని వివిధ లక్ష్యాల సాధనకోసం అనగా భాషా సామర్థ్యాల సాధనలో, గణిత సామర్థ్యాల సాధనలో, సామాజిక స్పృహను పెంపొందించడానికి, తార్కిక ఆలోచనలను వృద్ధిపరచడానికి, విశ్లేషణలు మరియు నిర్ధారణలు చేయడానికి వినియోగించవచ్చు.
- విద్యాప్రణాళిక అనేది గతిశీలమైనది (Dynamic). ఇది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదు. ఇది పరిసరాలు, బాహ్యప్రపంచంతో అనుసంధానమై పిల్లలు, ఉపాధ్యాయుల సృజనాత్మకతను పెంచడానికి దోహదపడాలి.
- విద్యా ప్రణాళికతోపాటు, విద్యాపరిపాలన, పాఠశాలకు చెందిన అన్ని కార్యకలాపాలలో వికేంద్రీకరణను (Decentralisation) అమలుచేయడం.

## APSCF-2011 మౌలిక సూత్రాలు (Key principles)

- పిల్లలు తమకున్న సహజమైన శక్తిసామర్థ్యాల ఆధారంగా నేర్చుకునేలా ప్రధానంగా దృష్టిపెట్టడం.
- పిల్లలభాష మరియు సమాజంలోని వివిధ రకాలైన జ్ఞాన వ్యవస్థలను గౌరవించడం, వాటిని అభ్యసనంలో వినియోగించడం.
- జ్ఞానాన్ని బడిబయటి జీవితంతో అనుసంధానం చేయడం.
- బట్టీ విధానాలకు స్వస్తిపలకడం. వాటికి బదులుగా పరస్పర ప్రతిచర్యలు (Interactions) , ప్రాజెక్టుపనులు, అన్వేషణలు (Explorations), ప్రయోగాలు, విశ్లేషణలు వంటి పద్ధతులద్వారా పిల్లలు అర్థవంతంగా నేర్చుకోవడం.
- నేర్చుకోవడాన్ని పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, పిల్లల సమగ్ర అభివృద్ధికోసం విద్యాప్రణాళిక తగిన అవకాశాలు కల్పించడం. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలలో మార్పులు చేర్పులు చేపట్టడం.
- నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని (Continuous Comprehensive Evaluation) అమలు చేయడం ద్వారా పరీక్షలను సరళీకరించి, బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయడం. పిల్లలు ఎంత నేర్చుకున్నారని తెలుసుకోడానికి మూల్యంకనం చేయడానికి బదులు పిల్లలు నేర్చుకోడానికి దోహదపడేలా మూల్యాంకన విధానాలను సంస్కరించడం (Assessment for Learning).
- పాఠ్యప్రణాళికలోని విభిన్న అంశాలను సమ్మిళితంచేస్తూ, అర్థవంతంగా నేర్చుకోడానికి వీలుగా సామాజిక నిర్మాణాత్మక (Social constructivism), విధానాలను తులనాత్మక / విమర్శనాత్మక (Critical pedagogy) బోధనా విధానాల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించడం.
- పిల్లల సంస్కృతి, అనుభవాలు, స్థానిక అంశాలకు తరగతి గదిలో ప్రాధాన్యత కల్పించడం.

రాష్ట్ర దృక్పథం మరియు కీలక సూత్రాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2011 ను రూపొందించారు. ఇది కింది అంశాలలో మార్పులను చేర్పులను ప్రతిపాదించింది.

**పాఠ్యపుస్తకాలు:-**

ఇప్పటి వరకు రూపొందిన పాఠ్యపుస్తకాలు సుమారు 10 సంవత్సరాలకొకసారి మార్పులు చేర్పులకులోనైనవి. ఐతే మౌలికమైన మార్పులు నామమాత్రంగానే చోటుచేసుకున్నాయని చెప్పవచ్చు. అట్లే పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ఆధారమైన విద్యాప్రణాళిక చట్రం లేదా సబ్జక్టుల వారీగా ఆధారపత్రాలుగానీ గతంలో రూపొందించలేదు. దీని వల్ల పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలు మారినవేగాని, విషయఅమరికలో, అభ్యాసాలలో వైవిధ్యత చోటుచేసుకోలేదు. అట్లే పాఠశాల విద్యకు చెందిన సబ్జక్టుల ద్వారా ఆశించే లక్ష్యాలు లేదా సబ్జక్టుల స్వభావం, పిల్లల స్వభావం వంటివి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదు. అట్లే పాఠ్యపుస్తకాలు ప్రమాణాల పేరుతో అధిక సమాచారంతో నిండి బరువెక్కాయి. గణితం, విజ్ఞానశాస్త్రం వంటి సబ్జక్టులలో పై తరగతులలోని అంశాలు కింది తరగతులలో చేరాయి. ఇది మానసికంగా కూడా పిల్లలకు భారమైంది. ఐతే రాష్ట్రంలో అమలుజరిగిన APPEP, DPEP వంటి కార్యక్రమాలవల్ల ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలలో కొంతవరకు మార్పులు చోటుచేసుకున్నా, ఇది NCF-2005, RTE-2009, APSCF-2011 ప్రకారం మరింత సమగ్రంగా మారాల్సిన అవసరం ఉంది.

**రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం -2011 వీటిని అధిగమించి అర్థవంతమైన పాఠ్యపుస్తకాలను రూపొందించడానికి కింది ప్రతిపాదనలు చేసింది.**

- భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి సబ్జక్టులలో పాఠ్యపుస్తకాలు రూపొందించడానికి సబ్జక్టువారీగా ఆధారపత్రాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపచేసేలా, పిల్లలు తమకున్న సహజమైన శక్తి సామర్థ్యాలు వినియోగించి నేర్చుకోడానికి దోహదపడాలి.
- పాఠ్యపుస్తకాలు సమాచారంతో బరువెక్కకుండా, పిల్లలే సమాచారాన్ని సేకరించేలా, ఆ సమాచారాన్ని విశ్లేషించేలా, నిర్ధారణలుచేసేలా అవకాశం ఉండాలి.
- పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోడానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. ఆ జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించడానికి అవకాశం ఉండాలి.
- పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, అదనపు అభ్యసనం కోసం సంప్రదింపు గ్రంథాలు, మ్యాగజైన్లు, పత్రికలు, సామగ్రి, సమాజ సభ్యులతో పరస్పర ప్రతిచర్యలు జరిగేలా పాఠ్యపుస్తకాలు అవకాశం కల్పించాలి.
- పాఠ్యపుస్తకాలలోని భాష సరళంగా మారాలి. నేర్చుకోడానికి భాష ఒక అవరోధంగా ఉండరాదు. బహుభాషత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి (Multilinguality).
- పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు లింగ వివక్షకు తావివ్వరాదు. పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా, ఆలోచింపజేసేలా, మానవ హక్కుల పట్ల స్పృహ పెంచేవిగా ఉండాలి. ఇందుకోసం ఆలోచనానైపుణ్యాలు అనగా ప్రతిస్పందించడం (Reflection), విమర్శనాత్మకంగా ఆలోచించడం (Critical thinking), బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical thinking), సృజానాత్మకంగా ఆలోచించడం (Creative thinking), భావప్రసారనైపుణ్యాలు (Communication Skills) వంటివి పెంపొందించాలి.
- స్థానిక కళలు, సంస్కృతి, ఉత్పాదక కార్యకలాపాలు, స్థానిక అంశాలు మొదలగునవి పాఠ్యాంశాలుగా ఉండాలి.
- ఆయా సబ్జక్టులకు నిర్ధారించిన విద్యాప్రమాణాలు (Academic Standards), ఆశించిన అభ్యసన ఫలితాలు (Expected learning outcomes) సాధించడానికి వీలుగా అభ్యాసాలు ఉండాలి.

- కృత్యాలు, ప్రాజెక్టు పనులు, అన్వేషణలు, ప్రయోగాలు, బహువిధాలైన సమాధానాలు వచ్చే ప్రశ్నలు (Open ended questions), క్రీడలు, ఫజిల్స్ మొదలగు వాటి రూపంలో ఆలోచింపజేసే అభ్యాసాలు ఉండాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా నేర్చుకునేలా, జట్టుపనుల్లో పాల్గొనేలా, పూర్తితరగతి ద్వారా నేర్చుకునేలా అభ్యాసాలు ఉండాలి (Individual, group, whole class activities).
- పిల్లలు సహపాఠ్యాంశాలైన మానవతావిలువలు, నైతికత, కళలు, ఆరోగ్యం, పని మొదలగు అంశాలను కూడా గ్రహించడానికి వీలుగా పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు మరియు అభ్యాసాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు కింది తరగతులకు చెందిన కనీస సామర్థ్యాల పునశ్చరణకు అవకాశం కల్పిస్తూనే, తరగతి సామర్థ్యాలు సాధించడానికి మరియు పై తరగతులకు చెందిన అంశాలకు అనుసంధానించేలా ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు ఆకర్షణీయంగా, అందంగా ఉండాలి. నాణ్యమైన పేపరు, ముద్రణ, చిత్రాలతో కూడి ఉండాలి.

**బోధనాభ్యసన ప్రక్రియలు (Teaching Learning Processes) :**

బట్టీపట్టడం, వల్లెవేయడం, పుస్తకాలలోని, గైడ్లు, ప్రశ్నల బ్యాంకులలోని అంశాలను ఎత్తిరాయడం, లేదా యాంత్రికంగా చదవడం వంటి యాంత్రికమైన విధానాలకు బదులు బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలు అర్థవంతంగా నేర్చుకోడానికి దోహదపడాలి. ఇందుకోసం APSCF 2011 కింది ప్రతిపాదనలు చేసింది.

- పరస్పర ప్రతిచర్యలు (Interactions), స్వీయవ్యక్తీకరణ (Self Expression), ప్రశ్నించడం (Questioning) వంటివి బోధనాభ్యసన ప్రక్రియలలో కీలకం కావాలి.
- ప్రయోగాలు, అన్వేషణలు, కృత్యాలు, ప్రాజెక్టు పనులు, క్రీడలు మొదలగునవి బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం కావాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలంటే ఉపాధ్యాయులు వివరించడం లేదా చదివి విన్పించడం కాదు. ఉపాధ్యాయులు పిల్లలు నేర్చుకోడాన్ని ప్రేరేపించేలా, పాల్గొనేలా చేయాలి. అవసరమగు సామగ్రిని ఉపయోగించాలి. అందుబాటులో ఉంచాలి. అభ్యసన వాతావరణాన్ని కల్పించాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా, తోటివారితో, ఉపాధ్యాయుల ద్వారా, సామాగ్రి ద్వారా అభ్యసించేలా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ఉండాలి. పిల్లల అభ్యసన సమయం పూర్తిగా సద్వినియోగం కావాలి.
- పిల్లలందరు తమ ఇంటి భాషలో నేర్చుకోడానికి అనువైన ఏర్పాట్లు / వాతావరణం ఉండాలి. ఉపాధ్యాయులు పిల్లల భాషను వినియోగించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ పిల్లల అనుభవాలు, పూర్వజ్ఞానం ఆధారంగా ప్రారంభంకావాలి.
- స్థానిక కళలు, ఉత్పాదక అంశాలు, శ్రమజీవుల అనుభవాలను బోధనాభ్యసన ప్రక్రియల్లో వనరులుగా ఉపయోగించాలి.

### మూల్యాంకనం - పరీక్షలు:-

పిల్లల్ని అంచనా వేయడానికి ఇప్పటి వరకు కేవలం పరీక్షల పైనే ఆధారపడుతున్నాం. పరీక్షలు కూడా పిల్లల్ని అంచనావేయడానికి బదులుగా పిల్లల్ని దోషులుగా చూపడానికి, న్యూనతకు గురయ్యేలా చేయడానికి, ఒత్తిడి, ఆందోళనను పెంచడానికి తోడ్పడుతున్నాయి. ఒకరకంగా పరీక్షలే విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011 కింది ప్రతిపాదనలను చేసింది.

- మూల్యాంకనం మరియు పరీక్షలు పిల్లల్ని కేవలం అంచనావేయడానికి పరిమితం కాకుండా, పిల్లలు నేర్చుకోడానికి దోహదపడాలి. (Assessment for Learning)
- RTE-2009 సూచించిన విధంగా మూల్యాంకనాన్ని నిరంతరం సమగ్రంగా నిర్వహించడం. (Continuous and Comprehensive Evaluation - CCE)
- పిల్లలను అంచనావేయడానికి కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా ప్రాజెక్టు పనులు, అసైన్‌మెంట్లు, ఫోర్టుపోలియోలు, సెమినార్లు, ప్రదర్శనలు, అనెక్‌డోట్స్, పరిశీలనలు వంటివాటిని కూడా వినియోగించడం. ఈ అంశాలకు సంవత్సరాంత పరీక్షలలో తగు భారత్వాన్ని కేటాయించడం.
- ఇందుకోసం మూల్యాంకనాన్ని బోధనభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయడం.
- పరీక్షలలోని ప్రశ్నల స్వభావాన్ని మార్చడం. బట్టీని ప్రేరేపించే ప్రశ్నలు, పాఠ్యపుస్తక సమాచారానికే పరిమితమయ్యే ప్రశ్నల స్థానంలో పిల్లలు సొంతంగా ఆలోచించి రాయడానికి, తమ అనుభవాలను వ్యక్తపరచడానికి, బహు విధాలైన సమాధానాలు రావడానికి (Open Ended Questions), నిత్యజీవితంతో అన్వయించడానికి (Application Oriented) వీలుగా ఆలోచింపచేసే ప్రశ్నలు ఉండడం.
- పిల్లలు గైడులు, పాఠ్యపుస్తకంలో ఉన్న సమాచారాన్ని బట్టీ పట్టి రాయకుండా, స్వంతంగా ఆలోచించిరాయాలి.
- పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని ఏమేరకు వినియోగించగలరో అంచనావేయడానికి మూల్యాంకనం తోడ్పడడం.
- పిల్లలు తమను తాము స్వీయ మూల్యాంకనం చేసుకోవడం, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రగతిని స్వయంగా పరీక్షించుకోడానికి వీలుగా పారదర్శక, బహిరంగ మూల్యాంకన విధానాలను అమలు పర్చడం.
- బోర్డు పరీక్షల్లో కూడా పాఠశాలలో నిర్వహించిన నిరంతర, సమగ్ర మూల్యాంకన అంశాలకు తగిన భారత్వాన్ని కేటాయించడం.
- బోర్డు పరీక్షల జవాబుపత్రాలను కోరినప్పుడు తల్లిదండ్రులకు అందచేయడం. పునర్ మూల్యాంకనం చేయడం.
- సహపాఠ్య అంశాలైన వైఖరులు, విలువలు, పని, ఆరోగ్యం, ఆటలు మొదలగువాటిని కూడా మూల్యాంకనం చేయడం.

### వ్యవస్థాపరమైన సంస్కరణలు (Systemic Reforms):

రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 ను అమలుపరచడానికి పైన తెల్పిన అంశాలలోని మార్పు చేర్పులతోపాటు కింద తెల్పిన వ్యవస్థాపరమైన సంస్కరణలను కూడా ప్రతిపాదించింది.

- పరిపాలన మరియు పాఠశాల నిర్వహణలో వికేంద్రీకరణ కోసం పంచాయితీ రాజ్ సంస్థలను భాగస్వాములను చేయడం.

- పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడి అధీనంలో పనిచేసేలా ECE కేంద్రాలను ఏర్పాటుచేయడం. పిల్లల సంరక్షణ, ఆరోగ్య బాధ్యతలను ICDS శాఖ, విద్యాబాధ్యతలు విద్యాశాఖవారు స్వీకరించడం.
- RTE 2009 సూచించిన విధంగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడం.
- అట్లే పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పరచి, పాఠశాల నిర్వహణలో వారిని భాగస్వాములను చేయడం.
- ప్రణాళిక, నిర్వహణ, మానిటరింగ్, నిధుల వినియోగం మొదలగు అన్ని అంశాలలో వికేంద్రీకరణ విధానాలను అమలుపర్చడం.
- ఉపాధ్యాయ విద్యతోపాటు, ఉపాధ్యాయ సహాయ, సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం.
- పాఠశాల విద్యకు చెందిన వివిధ సంస్థలు (School, School Complex, Mandal Resource Centre, DIET, SCERT) మరియు వ్యక్తులకు పనితీరు సూచికలు (Performance Indicators) రూపొందించి అమలుజరపడం ద్వారా జవాబుదారీతనం పెంచడం.
- ఉపాధ్యాయ విద్య ప్రణాళిక చట్రాన్ని రూపొందించి అమలుపర్చడం, ఉపాధ్యాయ విద్యలో సంస్కరణలు చేపట్టడం.
- పిల్లల్లో మానవత విలువలు, ఉన్నత వైఖరులను పెంపొందించడానికి తరగతివారీగా పిల్లలకోసం ప్రత్యేక వాచకాలను రూపొందించడం.
- పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం.

సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ఆ సమాజం విద్యారంగంలో సంపూర్ణ అభివృద్ధిని సాధించాలి. ఇందుకు పునాది పాఠశాలవిద్య. పాఠశాల విద్యను సంస్కరించి, పిల్లలను సమాజాభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా, హేతుబద్ధమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అవసరమైన నైపుణ్యాలు, విలువలు, వైఖరులు పెంపొందించడానికి రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 దిశానిర్దేశం చేస్తుంది. ఇందుకోసం రూపొందించిన ఆధారపత్రాలద్వారా ఆయా సబ్జెక్టులు మరియు అంశాలలో ప్రతిపాదనలు చేశారు. వీటిని అమలుపరచడానికి వ్యవస్థాపర సంస్కరణలను చేపడతారు. ఇందుకోసం అన్నివర్గాల ప్రజలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంఘాలు మొదలగు వారి నుండి సలహాలు సూచనలు స్వీకరించి అవసరమైన మార్పులు చేర్పులు చేపడతారు. తద్వారా రాష్ట్రం విద్యారంగంలో అభివృద్ధిని సాధించి, అగ్రగామిగా నిలపడానికి ప్రయత్నం చేద్దాం.

*జాతీయ విద్యా ప్రణాళికా చట్రం 2005- మౌలిక సూత్రాలు:*

- బడిబయట జీవనానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయాలి.
- *బట్టీ పద్ధతుల నుండి అభ్యసనను దూరం చేయడం.*
- *పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా, పిల్లల్లో సమగ్ర వికాసానికి పాఠ్యప్రణాళికను పరిపుష్టం చేయడం.*
- *పరీక్షలను మరింత సరళం చేసి తరగతి గది జీవనానికి అనుసంధానం చేయడం.*
- *దేశ ప్రజాస్వామిక నియమాలకు లోబడి పిల్లల ఆసక్తులు, అభిప్రాయ అభినివేశాలను అభివృద్ధి పరచడం.*

* * *

# III. భాషా విద్యా ప్రణాళిక

అ) భాషా స్వభావం - పిల్లల అభ్యసనం - నూతన దృక్పథం

ఆ) భాష, సమాజం, ఇతర అంశాలు

ఇ) భాషా బోధనాలక్ష్యాలు / అభ్యసనాఫలితాలు

**A.** ప్రాథమికస్థాయి - 1 నుండి 5 వరకు

**B.** ఉన్నతస్థాయి - 6 నుండి 10 వరకు

# III. అ) భాషా స్వభావం - పిల్లల అభ్యసనం - నూతన దృక్పథం

## పరిచయం

సామాన్య ప్రజలందరూ భాషను ఒక భావ వ్యక్తీకరణ సాధనంగా మాత్రమే గుర్తిస్తారు లేదా భావిస్తారు. ఇక వృత్తినిపుణులైన భాషా శాస్త్రవేత్తలు భాష పదబంధాలను అనుసంధానం చేయడమని, వాక్య నిర్మాణ నియమాల సమాహారమని భావిస్తారు. భాష వివిధ స్థాయిలల్లోని ధ్వనులు, వర్ణాలు, పదాలు, వాక్యాలు, వ్యవస్థీకృతమైన పలు నియమాలకు లోబడి భాషలు పనిచేస్తాయని ఈ దృక్పథం వెల్లడిస్తుంది. ఐనప్పటికీ ఈ దృక్పథం మనకు భాషయొక్క పూర్తి స్వరూపాన్ని ఆవిష్కరించదు. అందువల్ల భాషను విస్తృతమైన చట్రంలోనే దర్శించాలి. తద్వారా దీనిని ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే అధ్యాపకులకు, పాఠ్యపుస్తక రచయితలకు, విద్యా ప్రణాళికా రూపకర్తలకు, విద్యాక్షేత్ర ప్రణాళికా రచయితలకు ఉపయుక్తం చేయాలి. దీనిని బహుముఖంగా పరిశీలించాలి. అంటే నిర్మాణపరంగా, సామాజిక దృష్టితో, సాంస్కృతిక దృష్టితో, మనోవైజ్ఞానిక దృష్టితో, సాధారణాత్మక దృష్టితో భాషను పరిశీలించాల్సి ఉంటుంది. భాషాభ్యసనం అనుకరణ ద్వారా జరుగుతుందన్న అంశంతో స్పష్టంగా భిన్నమైన దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది లేదా విభేదించాల్సి ఉంటుంది.

## భాష అంటే?

భాషలు లేని వ్యక్తులు లేదా సమాజాలను ఊహించలేం. వ్యక్తుల గుర్తింపుకు భాష తప్పనిసరి. ఇది సమాజంలోని పరిసరాల్లోని ఇతర వ్యక్తులతో వీరిని అనుసంధానం చేస్తుంది. మన మనస్సుల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజం మరియు పరిసరాలు భాష ద్వారానే వ్యక్తమవుతాయి.

భాష మానవులకు గల ప్రత్యేక లక్షణం. ఇది భావవాహిక. దీనిని మనం ఆలోచించడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి, ఆడుకోవడానికి, కలలు కనటానికి, వ్యాఖ్యానించడానికి, ఉద్వేగాల వ్యక్తీకరణకు, సమాచారాన్ని పంచుకోవడానికి ఉపయోగించుకుంటాం. ఇతరులతో మాట్లాడటానికే గాక మనలో మనమే మాట్లాడుకోవడానికి కూడ భాషను ఉపయోగిస్తాం. ఈ భాష మన సామాజిక వైఖరులకు, అధికార సంబంధాలకు దగ్గరి సంబంధం కల్గి ఉందన్న విషయాన్ని కూడా మన దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయశిక్షకులు, విద్యా ప్రణాళికా రచయితలు అందరూ, పిల్లలు నాలుగేండ్ల వయస్సు నాటికే భాషా విషయక వృద్ధులౌతారని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు కాని, బంధువులు కాని ఎవరూ తమ పిల్లలకు ప్రత్యేకంగా భాషను బోధించరు. పిల్లలే స్వయంగా సుసంపన్నమైన భాషా నియమాల వ్యవస్థను, భాషాధ్వనులు, పదాలు, వాక్యాలు వాటి అర్థాలను అర్థం చేసుకొంటారు. సందర్భానికి తగిన భాషారూపాన్ని ఎంపిక చేసుకొని వ్యక్తీకరించడాన్ని పిల్లలు సొంతం చేసుకొంటారు. ఒక తెలుగు మాట్లాడే శిశువు ఎప్పుడు 'నీవు' అనాలో ఎప్పుడు 'మీరు' అనాలో తెలుసుకొని ఉంటుందన్నది వాస్తవాంశమే.

## భాషావిభాగం (Language Faculty)

పై అంశాలననుసరించి పిల్లలు పుట్టుకతోనే సహజమైన భాషా శక్తిని, భాషాభ్యసనను కల్గియున్నారని స్పష్టమవుతోంది. పలువురు పిల్లలు ఒక భాషను మాత్రమే గాక తమ పరిసరాల్లోని పలు భాషలను మాట్లాడటాన్ని మనం గమనించవచ్చు. మనం ఒక వేళ పిల్లల్లో గల ఈ సహజ భాషాభ్యసన శక్తిని రక్షితమూ, సుసంపన్నమైన పరిసరాలలో పెంచిపోషించగల్గితే పిల్లలు తప్పనిసరిగా ఆ భాషలను అభ్యసించగల్గుతారు అని చెప్పవచ్చు.

పిల్లల్లో సహజంగా, అంతర్గత భాషాభ్యసన శక్తియుందన్న విషయ స్పృహకు బోధనశాస్త్రపరంగా అధిక ప్రాధాన్యత ఉంటుంది. తగినంత పరిచయం లభిస్తే కొత్త భాషనైనా సులభంగా పిల్లలు అభ్యసిస్తారని, ఆ అభ్యసన భాషలో వ్యక్తీకరణకు అవకాశాలు కల్పిస్తే వారు సమర్థంగా తమ భాషాపాటవాన్ని ప్రదర్శిస్తారని చెప్పవచ్చు. అందువల్ల మన బోధనలో వ్యాకరణానికి ప్రాధాన్యం ఇవ్వకుండా అర్థానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

## పిల్లలు భాషను ఎలా పొందుతారు? (How do children acquire language)

మాతృభాషా విషయంలో సామాన్య శిశువు కింది విధంగా వ్యక్తీకరిస్తాడు

ఉదా : అమ్మా! అన్నం పెట్టు. అన్నం తిని ఆడుకుంటా.

పై వాక్యాలలో శిశువు 'అన్నంపెట్టు' అని అన్నదేగాని పెడతాను, పెట్టుతాను, పెడతాడు, పెడుతుంది వంటి పదాలు వాడలేదు. ఇందుకు కారణం శిశువు అమ్మను (తల్లి) అడుగుతోంది. కాబట్టి శిశువు పెట్టు అనే పదాన్ని అందువల్లే వాడింది. అదే విధంగా శిశువు ఆడుకుంటా అంది. అంతేకాని ఆటాడు, ఆడతాడు అని అనలేదు. కారణం నేను అన్న ఉద్దేశ్యంతో శిశువు ఆ పదాన్ని వాడడమే.

ఈ ఉదాహరణ ఒక విషయం స్పష్టం చేస్తోంది. శిశువు తనదైన భాషా రూపాన్ని నిర్మించుకొంది. ఆ రూపానికి సంబంధించిన జ్ఞానం శిశువుకుంది. శిశువు తెలుగు భాషా వాక్య స్వరూపం గురించి సహజంగానే తెల్సుకొంది. ఈ రూపం ఇలా ఉంటుందని ఎవరూ చెప్పలేదు. అందువల్ల ప్రతి భాషోపాధ్యాయుడు ఈ అంశాలను దృష్టియందుంచుకోవాలి. పిల్లలందరూ ఈ సహజమైన శక్తియుక్తులు గల వారని, వారు భాషా విషయక జ్ఞానాన్ని సృజించగల్గుతారని, వారు భాషకు సంబంధించిన సమాచారంతో పరస్పర చర్య జరుపుతారని గ్రహించాలి.

ఒక వేళ మనం పై వాక్యాన్ని నిశితంగా పరిశీలిస్తే భాష ఎంత క్లిష్ట నిర్మాణం గలదో ఎవరైనా గ్రహించవచ్చు. ఇది సంక్లిష్టమైన నియమాలతో కూడిన వ్యవస్థ. పై వాక్యం సంక్లిష్టమైన పదక్రమంలో ఉంది. కర్త, కర్మల మధ్య సంబంధముంది, కర్తరి, కర్మణి క్రియలను తెల్పుతుంది.

ఎవరూ భాషను పదం వెనుక పదం, వాక్యం వెనుక వాక్యంగా బోధించరు. కాని పిల్లలు అనియతంగానే అర్థవంతమైన సందర్భాల్లో భాషకు సంబంధించిన జ్ఞానాన్ని సంపాదిస్తారు. భాషా సంపాదనలో తక్షణ ఫలితాలను అంతగా మనమెప్పుడూ ఆశించరాదు. పిల్లలు శారీరకంగా, జ్ఞానాత్మకంగా సమర్థులైనప్పుడే వారు మాట్లాడతారు. అట్లే సందర్భాన్ని బట్టి చెప్పాల్సి వచ్చినపుడు మాట్లాడతారు. మాట్లాడనంతమాత్రాన వారికి భాష అలవడలేదని భావించకూడదు. యాంత్రికమైన, అర్థరహితమైన పునశ్చరణ పిల్లలు కంఠతా పట్టి వృధాగా శ్రమపడటానికి మాత్రమే ఉపకరిస్తుంది. కాని నిజమైన భాష అలవడదు.

కాబట్టి మనం ఏమిచెప్పగలమంటే....

- జన్యుపరంగానే మానవ శిశువులకు ఒక భాషా వ్యవస్థ సంక్రమించింది. దానినే 'విశ్వవ్యాకరణం' అంటారు. (ఛామ్స్కీ). మనం భాషా సంపాదన అనేది కేవలం శిశువులోని ఈ అంతర్గత శక్తిని ఆవిష్కరించటమే.
- భాషా సంపాదన చక్రీయ పద్ధతిలో ప్రగతి సాధిస్తుంది. రేఖీయ పద్ధతిలోగాని సమీకృత పద్ధతిలో గాని కాదు.
- భాషా సంపాదనలో అనుకరణకు ప్రాధాన్యత తక్కువ. మనం అనుకరణగా భావించే అంశాలు శిశువులకు జన్మతః అలవడిన భాషా విషయక జ్ఞానం మాత్రమే.
- పదే పదే వల్లె వేయడం వల్ల భాష అలవడదు. అవసరానుగుణమైన, అర్థవంతమైన భాషా వినియోగ సందర్భాల్లో ఆవృత్తమయ్యే భాషా విషయక వాస్తవాల వల్ల భాష అలవడుతుంది.
- కేవలం పరస్పర సంబంధం లేని ఒంటరి (isolated) పదాలు, వాక్య నిర్మాణాల ద్వారా భాష అలవడదు. పలు సందర్భాల్లో జరిగే వ్యక్తీకరణల వల్ల జరుగుతుంది.
- భాష కేవలం శ్రవణ, భాషణ, పఠన, లేఖనాలనే నాల్గు నైపుణ్యాల సమాహారం కాదు. ఈ నైపుణ్యాలను ప్రదర్శించుటకు అవసరమైన అంతర్గత శక్తుల మొత్తం మాత్రమే.
- భాష పొందడమనేది మొత్తం నుండి భాగాల వైపు పయనిస్తుంది. కాని భాగాల నుండి మొత్తం వైపు కాదు. ఇది భాషకు సంపూర్ణత్వాన్ని (holistic treatment) కోరుతుంది. పిల్లలకు భాషా వినియోగ సందర్భాలను పరిచయం చేసి ఆయా సందర్భాల్లో పిల్లల వ్యక్తీకరణకు అవకాశం కల్పిస్తే ఫలితంగా పిల్లలు భాషా సామర్థ్యాన్ని పొందగలుగుతారు.
- పరస్పర సహకారమున్న సందర్భాల్లోనే భాషా సంపాదన జరుగుతుంది. (వైగాట్స్కీ, బ్రూనర్) ఈ సన్నివేశాల్లోనే పిల్లలు, పరస్పర వైయక్తిక, అభివ్యక్తిలో పాలు పంచుకుంటారు.

**భాషలో అందించే వనరులు - ఫలితాలు**

- ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు కొంత సహనం ఉండాలి. తమ పిల్లలకు పాఠ్యం బోధనలో పిల్లలకు లభించిన భాషా విషయకంగా అందించే అంశాలకు(inputs) అనుగుణంగాఫలితాలు (out put) ఉండకపోవచ్చు. భాషాభ్యసనకాలంలో, కొంత నిశ్శబ్దానికి కూడా స్థానముంటుంది. పిల్లలు శారీరకంగా, జ్ఞానాత్మకంగా ఎప్పుడు సంసిద్ధులైతారో అప్పుడు out put, Input కన్న అధికంగా ఉంటుంది.
- భాషాభ్యసనంలో ఒక క్రమమంటూ ఉండదు. ఉదా: ధ్వనులు - వర్ణాలు - పదాలు - వాక్యాలు ఈ వరుసలో భాషాభ్యసనం జరుగదు. పిల్లలు సమగ్రమైన ప్రక్రియల్లో పాల్గొంటూ తమదైన ధ్వని, పద, వాక్య, అర్థ వ్యవస్థలను నిర్మించుకుంటారు.
- సులభం నుండి క్లిష్టత, క్లిష్టత నుండి సులభం అనే క్రమం భాషాభ్యసనంలో ఉండదు. తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ఎవరూ సులభమైన వాక్యాలని, క్లిష్టమైన వాక్యాలని చెప్తూ పిల్లలతో మాట్లాడరు.

- సందర్భాని కనుగుణంగా పిల్లలు అసంఖ్యాకమైన పదాల అర్థాలు సొంతం చేసుకొంటారు. అర్థనిర్మాణ ప్రక్రియలో భాగస్వాములౌతారు.
- పిల్లలు అసంఖ్యాకమైన వాక్యాలను సృష్టిస్తారు. ఇందుకు అవసరానుగుణంగా తెలిపిన పరిమితమైన పదజాలాన్నే ఉపయోగించుకొంటారు.
- పిల్లలకు సవాళ్లు విసరగల, సమగ్రమైన Input కావాలి. సమగ్రత అనేది ఒక మనో ప్రక్రియ (mental process) ఇతర భాషలను వినునపుడు పిల్లలకు ఎన్నో అంశాలు తోడ్పడుతాయి. (సందర్భం, భావ వ్యక్తీకరణ సామర్థ్యం, తెలిసిన పదాలు, హావభావాలు మొదలగునవి)

*లక్షలాది మంది పిల్లలు లేఖనాన్ని ఒక యాంత్రిక నైపుణ్యంగా నేర్చుకుంటున్నారు. వర్ణమాలలో అక్షరాల ఆకారాలను నేర్పడంతో ఇది ఆరంభమవుతుంది. ఒక్కొక్క అక్షరాన్ని డజనుసార్లు కాపీ చేయమని పిల్లవాడికి చెప్తారు. వాళ్లు రాసిన ఆకారాన్ని ఉపాధ్యాయుడు పరిశీలిస్తాడు. ఈ విధంగా వర్ణమాల పూర్తి కావడానికి చాలా పాఠశాలల్లో అనేక వారాలు పడుతుంది. ఈ సుదీర్ఘ సమయంలో పిల్లవాడికి రాయడం నేర్చుకోవడం నిరర్థకంగా భాసిస్తుంది. తరువాత కాలంలో పదాలను రాయమన్నప్పుడు ఆ పైన వాక్యాలు నిర్మించమన్నప్పుడు ఏమి రాయాలో ఉపాధ్యాయుడు చెప్తాడని వాళ్లు ఆశిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక విషయాన్ని చెప్పడానికి సాధనంగా వాళ్ళు లేఖనాన్ని భావించరు. ఉపాధ్యాయుడు చేయించే ఒక అభ్యాసంగా మాత్రమే దాన్ని వాళ్ళు భావిస్తారు. ఈ పరిస్థితి నుండి మారాలంటే మనం లేఖనాన్ని సంభాషణకు కొనసాగింపుగా పరిచయం చేయాలి.*

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

* * *

# III. ఆ) భాష, సమాజం, ఇతర అంశాలు

## భాష మరియు సమాజం

పిల్లలు సహజంగా భాషా సామర్థ్యాలతో జన్మించినప్పటికి ఆయా భాషలను వాటి సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సందర్భాల్లో సంపాదిస్తారు. పిల్లలు ఎదుటి వ్యక్తులు, సమయం, సందర్భానికనుగుణంగా భాషను ఉపయోగిస్తారు.

**'సమాజం వెలుపల భాష అభివృద్ధి కాదు' - *Aurorin***

అరోరిన్ అను భాషావేత్త అభిప్రాయంలో భాషకు, సమాజానికి మధ్య దగ్గరి సంబంధం ఉంది. సమాజం లేకుండా భాషలేదు. సమాజం మారితే భాష కూడా మారుతుంది. పిల్లలు అంతర్గత శక్తియుక్తులు మరియు సామాజిక పరిసరాలు మధ్య జరిగే పరస్పర సంక్లిష్ట చర్య ఫలితంగా భాష ఉపయోగపడుతుంది. భాషను సామాజిక వ్యక్తీకరణకు ఉపయోగిస్తారు. సమాజావసరాలకనుగుణంగా భాష మారుతుంది. మానవ సంబంధాల మధ్య జరిగే వ్యవహారంలో భాష ప్రముఖపాత్ర పోషిస్తుంది. అట్లే భాష గొప్పతనం (popularity) సామాజిక పరస్పర చర్యలు, వినియోగం మరియు విధులపై ఆధారపడి ఉంటుంది. ఒకే విధమైన ఆసక్తులు, ఒకే విధమైన విలువలు, విశ్వాసాలు గల ప్రతిభా సమూహాలతో సమాజం ఏర్పడుతుంది. ఈ క్రమంలో వారికి ఒక భాష అవసరమవుతుంది. భాష ప్రజలను దగ్గర చేస్తుంది. వారిని కలిపి ఉంచుతుంది.

## బహుభాషత్వం (Multilingualism)

మానవుని గుర్తింపులో బహుభాషత్యం ఒక అంతర్భాగం. సుదూరమైన గ్రామీణ ప్రాంతాలలో ఏకభాషీయుడైనా ఎక్కువసార్లు నూతన సందర్భాలను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఆయా భాషలకు చెందిన పదజాలాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతాడు.

మన తరగతి గదులు సహజంగా బహుభాషలకు నెలవైనవి. అన్ని సమాజాల్లో వైవిధ్యభరితమైన వ్యక్తీకరణతో పలు సందర్భాల్లో సంభాషిస్తారు. అందువల్ల తరగతిలోని ఈ బహుభాషా లక్షణాన్ని బోధనకు, అభ్యసనకు ఒక ఆటంకంగా భావించకుండా ఈ లక్షణాన్ని ఒక వనరుగా గుర్తించి దీనిని ఒక బోధన వ్యూహంగా ఉపయోగించుకోవాలి. తద్వారా పిల్లలు తమ జ్ఞానాత్మక నైపుణ్యాలకు పదును పెట్టుకొని ఉద్దేశిత భాషను సంపాదిస్తారు. అందువల్ల భాషా ప్రణాళిక రచనలో బహుభాషత్వము కీలకాంశం కావాలి. పిల్లలు సహజంగా తరగతుల్లో మాట్లాడే వారి వారి భాషలను గౌరవించాలి. ఒక వేళ పిల్లలు మాటలను వినక (లేక) పోతే వారు తమను దూరం చేసినట్లుగా, తరగతి నుండి వెలివేసినట్లుగా భావిస్తారు. ఆ కారణంగా వారు తరగతిని మధ్యలోనే వదిలివేస్తారు. అట్లే యాంత్రికంగా, సాంకేతికమైన, విసుగు కల్పించే వ్యాకరణాంశాలను బోధించకుండా ఈ బహుభాషలను ఉపయోగించి ఆయా భాషల నిర్మాణాన్ని బోధనలో ప్రతిబింబించవచ్చు.

### ఆంధ్రప్రదేశ్ బహుభాషత్వం :

భారతదేశంలోని ఇతర రాష్ట్రాలవలనే ఆంధ్రప్రదేశ్ కూడా బహుభాషలు మాట్లాడే ప్రాంతం. వివిధ భాషా కుటుంబాలకు చెందిన పలు భాషలు ఈ రాష్ట్రంలో వాడుకలో ఉన్నాయి. వీటిలో ప్రధానమైనవి తెలుగు, ఉర్దూ మరియు ఆంగ్లం. వీటితో బాటు పలు గిరిజన భాషలు కూడా వాడుకలో ఉన్నాయి. విద్యా విషయకంగా ఆసక్తి, ఆదుర్దా ఉన్నవారందరూ ఈ భాషలపై ప్రత్యేక దృష్టి కనబరచాల్సిన అవసరముంది. కాని పలు విద్యావేత్తలు, అధ్యాపకులు ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్లం, తెలుగు భాషలే సమస్యలని భావిస్తారు. ఈ క్రమంలోనే మన విద్యా ప్రణాళిక, విషయ ప్రణాళిక, పాఠ్యపుస్తకాలు, తరగతి ప్రక్రియలు బహుభాషా వ్యవహర్తలను దృష్టిలో పెట్టుకొని సిద్ధం చేయాల్సిన అవసరముంది. ఈ బహుభాషిత్వాన్ని ప్రోత్సహించడం దానిని వినియోగించడం జ్ఞానాభివృద్ధికి, విద్యా విషయక ఉపలబ్ధిలో ధనాత్మక, సకారాత్మక పర్యవసానాలకు కారణమవుతుంది.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు అధికార భాషయైనా ఇతర భాషలు కూడా భావ వ్యక్తీకరణకు ఉపయోగంలో ఉన్నాయి. కొలామీ, కోయ, కొండ, బంజారా, కువి, గోండి, సవర, ఒరియా వంటి భాషలను గిరిజన ప్రాంతాల్లో మాట్లాడుతున్నారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, తూమాటి దోణప్ప, భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావు, బూదరాజు రాధాకృష్ణ వంటి ప్రసిద్ధులైన భాషావేత్తలు, సాహిత్యవేత్తల పరిశోధనలు కూడా బహుభాషల విద్యా బోధన అమలులో ఉపయుక్తంగా ఉంటాయి.

### భాష - ఆలోచన :

భాషముందా? ఆలోచన ముందా? అను ప్రశ్న వాస్తవానికి కఠినమైనది. భాష మరియు ఆలోచనలు ఓ విధంగా వైయక్తికాలు మరియు ఒక దానిని ఒకటి ప్రభావితం చేస్తాయి. భాషలేని ఆలోచనను మనం ఊహించగలమా? శిశువుల ఉద్వేగ పార్శ్వాలను భాష స్పర్శిస్తుంది. వాటిని క్రియాశీలం (activate) చేస్తుంది. అలా వ్యక్తి ఆలోచించడానికి, దానికి అనుగుణంగా ఏదో ఒకటి చేయడానికి, సామాజిక సందర్భంలో జీవితాన్ని గడపడానికి భాష తోడ్పడుతుంది. ఆలోచన భాషను చైతన్యశీలిగా చేస్తుంది.

- భాష మరియు ఆలోచన విడదీయరానివి. వీటి మధ్య గల సంబంధం వాస్తవానికి సంక్లిష్టమైనది.
- మన ఆలోచనా ప్రక్రియలకు భాష రూపాన్ని ఇస్తుంది. ఇంతకు ముందు అన్వేషణకు నోచుకోని ఎన్నో జ్ఞానతీరాలకు, ఊహాతీరాలకు మనల్ని భాష చేరుస్తుంది.
- ఒక తరం నుండి మరో తరానికి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భాష ద్వారానే సంక్రమిస్తాయి.

భాష ఆలోచనను రేకెత్తిస్తుంది. వైవిధ్యభరితమైన తార్కిక ఆలోచన, సృజనాత్మకతకు దారితీస్తుంది. అందువల్ల పిల్లలను కొంగొత్త తీరులతో ఆలోచించడానికి అవకాశాలు కల్పిస్తే ఆ పిల్లలు పలు విధాలుగా, పలు సందర్భాల్లో భాషను వినియోగిస్తారు. ఉదా: పాటలు, పద్యాలు, వ్యాసాలు, కథలు మున్నగునవి రాస్తారు.

భాషాతరగతిలో విద్యార్థులు తమ ఆలోచనలను, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి అవకాశాలుండాలి. తరగతిగది నియమాలు మరియు విద్యార్థి ఉపాధ్యాయుల సంబంధాలు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరుస్తాయి.

**భాష మరియు మాండలికం :**

భాష మరియు మాండలికాలకు సంబంధించి పలువురు భాషకు ప్రాధాన్యత ఇచ్చి మాండలికాన్ని అంతగా ఎదగని, సంకుచిత భాషారూపంగా పరిగణిస్తారు. భాష మరియు మాండలికాల మధ్య గల సంబంధాలపై అపోహలు కింది విధంగా ఉంటాయి.

- భాషలు ఏదో ఒక నియతవ్యాకరణ నియమాలను అనుసరిస్తాయి. వాటికి లిపి ఉంటుంది. మాండలికాలకు ఈ లక్షణాలుండవు.
- భాషను జనాభాలోని అధిక సంఖ్యాకులు మాట్లాడుతారు. మాండలికం పరిమిత సంఖ్యలోని ప్రజలు, స్థానికంగానే మాట్లాడుతారు.
- భాషను ప్రమాణీకరించి, సున్నితం (Sophisticate) చేసి సాహిత్యంలో, ప్రతికా రంగంలో, ప్రభుత్వం మరియు ఇతర కార్యాలయాలు, న్యాయస్థానాల్లో వాడుతారు. మరో వైపు మాండలికం పరిమిత ప్రాంతాల్లో కేవలం సంభాషణలకే పరిమితమవుతుంది.
- ఏమైనప్పటికీ, భాషాశాస్త్రవేత్తల దృష్టిలో భాషకు మరియు మాండలికానికి మధ్య ఎలాంటి భేదం లేదు. రెంటికీ వ్యాకరణం ఉంది. రెండూ ఆ నియమాలను పాటిస్తాయి.
- మాండలికాలకు కూడా లిపి రూపమీయవచ్చు. వాటికి వ్యాకరణం రాయవచ్చు. నిఘంటువులను కూర్చవచ్చు.
- ఏది మాండలికం, ఏది గ్రాంథికం అనేది కేవలం సామాజిక, రాజకీయ సమస్య మాత్రమే. భాష కూడా అన్ని హంగులు కల ఒక మాండలికమే అని అంటారు. (It has been said that language is only a dialect with an army and navy) అంటే అధికారంలో ఉన్నవారు, సంపన్నులైన వారు ఉపయోగించే భాషా రూపానికే వత్తాసు పెరిగి అది ప్రామాణిక భాషగా గుర్తింపుపొందుతుంది.

ఈ విధమైన సంక్లిష్ట సామాజిక, రాజకీయ ప్రక్రియలో, సౌకర్యాలు లభించని, సౌకర్యాలకు దూరంగా ఉన్న పిల్లలు భాషా విషయంగా ఇబ్బందులకు లోనవుతారు. వారి భాషలు ప్రామాణిక భాష మిషతో గుర్తింపుకు నోచుకోవు. ఇక ఉపాధ్యాయుడు స్వచ్ఛమైన ప్రామాణిక భాషా రక్షకుడినని భావిస్తాడు.

ఉపాధ్యాయులు కింది అంశాలను దృష్టి యందుంచుకోవాలి

- శిశువు ఎంతో భాషా నిధితో పాఠశాలకు వస్తాడు. తాను మాట్లాడే భాషకు సంబంధించిన అన్ని నియమాలను, వ్యాకరణాన్ని తెలిసియుంటాడు.
- తన మాతృభాష పాఠశాలలో మాధ్యమభాష కాక పోవడం అనేది శిశువుకు ఒక రాజకీయ సమస్య. కాని తన మాతృభాషలో ఏ విధమైన పొరపాట్లు చేయడు.
- ప్రామాణిక భాషాభ్యసనంలో శిశువు చేసే పొరపాట్లు తప్పులు కావు. అర్థరహితాలు కావు. ఆ తప్పులకు ఒక క్రమం ఉంటుంది. ఆ తప్పులు కాలక్రమంలో సవరణకు నోచుకుంటాయి. అభ్యసనంలో ఇవి అత్యవసరమైన సోపానాలు మాత్రమే.
- తప్పులు చేయకుండా ఏ శిశువూ భాషను నేర్చుకోలేడు. మరియు ప్రథమ భాషాభ్యాసకులు కూడా రెండో భాషను మరియు మూడో భాషను నేర్చుకోవడంలో ఇలాంటి పొరపాట్లే చేస్తారు.

## భాష మరియు లిపి :

భాష ప్రాథమిక వ్యవహారశీలి (speech) వ్యవహారాన్ని అక్షరబద్ధం చేయుట ద్వారా లిపి ఏర్పడుతుంది. ఒక భాషకు దాని లిపికి మధ్య అంతర్గత సంబంధమంటూ ఏది లేదు. ఒక లిపి ఆ భాషా వ్యక్తీకరణకు లిఖిత రూపంలో ఉపయోగపడుతుంది. వాస్తవానికి ప్రపంచ భాషలన్నింటినీ ఏదో ఒక లిపిలో రాయవచ్చు. అట్లే ఒక భాషను ఎన్నో లిపుల్లో మార్పులకు చేర్పులకు లోబడి రాయవచ్చు. లిపి కన్న ముందునుండే భాష ఉంది. మరియు లిపి, భాషలు కొన్ని భాషా సాహిత్య అభివృద్ధిలో ఎలాంటి పాత్రను పోషించవు. సమాజంలోని వ్యక్తులు, పెద్దలు, రాజకీయ వర్గాల వారి ఉపయోగంపై ఆ భాషా లిపి ఆధారపడుతుంది. ఈ భావనలతో అధికారంలోకి వచ్చిన వారిని బట్టి లిపులు మారుతాయని అర్థం చేసుకోవచ్చు. ఓ కాలంలో Perso-Arabic Scriptలో ఉన్న భాషలు ఈనాడు దేవనాగరి, గురుముఖి లేదా రోమన్‌లిపిలో రాయబడుతున్నాయి. ఈనాటి కాలంలోని ఉర్దూ పద్యసంపద (perso-arabic) లిపిలోనూ, దేవనాగరి మరియు రోమన్ లిపుల్లో లభిస్తోంది. సంబాలీ భాష ఐదు రకాల లిపిల్లో రాయబడుతోంది.

## రెండో భాషను నేర్చుకోవడం :

ఇంతకు ముందే ప్రస్తావించినట్లుగా మానవులు తమదైన భాషా సామర్థ్యాలతో లక్షణాలతో జన్మించారు. ఈ భాషా లక్షణమే వారు ఎన్నో భాషలను ఏ కాలంలోనైనా తమ జీవిత కాలంలో నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. పిల్లలు కొత్త భాషలను త్వరగా నేర్చుకుంటారన్న మాట వాస్తవం. ఐతే ఏకరూపత గల ధ్వని వ్యవస్థలు గల భాషలు నేర్పడం చాలా సులభంగా త్వరగా జరుగుతుంది. ఇక పెద్దలు కొత్త భాషా పదాలను, వాక్యాలను మరింత త్వరగా సొంతం చేసుకొంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లలు హిందీ లేదా ఆంగ్ల భాషలను అభ్యసించాలనుకున్నప్పుడు సమస్యలు ఎదురవుతాయి.

ఈ సమస్యలు పిల్లల వైపు నుండి కావు పిల్లలవి కావు. సమస్యలు ఆ భాషల సామగ్రి, బోధన పద్ధతులు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఆ భాషల బోధనకు అభ్యసనానికి గల వసతి సౌకర్యాల వల్లనే ఉత్పన్నమవుతాయి. ఒక వేళ మనం సుసంపన్నమైన, రక్షిత, ప్రోత్సహించగల రెండో భాషా పరిసరాలను సమకూర్చగలిగితే ఆ భాషను పిల్లలు సునాయాసంగా నేర్చుకొంటారు. సుసంపన్నమైన పరిసరాలు అంటే పిల్లలకు పలు భాషావినియోగ సందర్భాలను పరిచయం చేయడం అంటే కథలు, నాటికలు, హాస్యోక్తులు, ప్రకటనలు, పాటలు, గేయాలు మున్నగువాటి పరిచయం ద్వారా పిల్లలను ఆ భాషాభ్యసనంలో నిమగ్నం చేసి దాని వ్యవహారాన్ని విశ్లేషించగల సామర్థ్యాన్ని పిల్లలకు అలవరచవచ్చు. ఈ విధమైన పరిసరాలను సృజించడమే కొంత ఇబ్బందికరం. ఐతే అభ్యసించాల్సిన పిల్లల భాషా సంస్కృతిని, సంప్రదాయాలను గౌరవిస్తూనే, వాటిని సృజనాత్మకంగా బోధన ప్రక్రియలో ఉపయోగించుకుంటూనే రెండో భాషను అభ్యసించడానికి తగిన పరిసరాలను పాఠశాలల్లో ఏర్పర్చాల్సి ఉంటుంది. స్థూలంగా రెండో భాషాబోధన మొదటి భాషాభ్యసన పరిసరాలకు దగ్గరి పరిసరాల్లో జరిగితే ఆ భాష సులువుగా పిల్లల వశమవుతుంది. ఐతే ఇది కొంత కష్టతరమైన అంశం. ఐనప్పటికీ ఆ భాషల మధ్య దగ్గరి సంబంధాన్ని స్థాపించడం సాధ్యంకూడా.

## భాష మరియు సమ్మిళిత విద్య (Language and Inclusive Education)

మానవులందరికీ ఏదో ఒక వైకల్యముందన్న విషయం ప్రత్యేకంగా ప్రస్తావించవల్సిందే. పిల్లలకు మరియు వృద్ధులకు ఇతరుల సాయం కావాలి. కొందరు పాడలేరు. కొందరికి వినికిడి శక్తి తక్కువ. కొందరికి మేధోపరమైన సమస్యలుంటాయి. నూటికి నూరుపాళ్లు వైకల్యరహితంగా, ఆరోగ్యవంతంగా ఉన్న వ్యక్తి అంటూ ఈ ప్రపంచంలో ఉండడు. ఇట్టి ప్రపంచాన్ని మనం సృష్టించుకున్నాం. కేవలం దృష్టి మాంద్యంగల వారికే కాక ప్రజలందరికీ మార్గాలు సుగమంగానే ఉండాలి. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలను అంటే శారీరక, దృష్టి, వినికిడి, వైకల్యాలున్న వారందరికీ పాఠశాలలు అందుబాటులో ఉండాలి. అందరు పిల్లలకు మేథోపరమైన, ప్రతిభాపరంగా సుసంపన్నమైన, సంస్కృతి, పరిసరాలు గల పాఠశాలలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అట్లే భాషా వ్యవహార సమస్యలు గల పిల్లలకూ తగిన వసతులు పాఠశాలల్లో కల్పించాలి. వినికిడి సమస్య గల పిల్లలకు సంకేతాల భాష ఉంటుందని అది ఫ్రెంచి, జర్మన్, హిందీ, తెలుగు భాషల వలెనే వ్యవస్థీకృతమైనదని గుర్తించాలి. ఐతే అధికార వర్గాలు ఈ సంకేత భాషాబోధనకు ఏ విధమైన సౌకర్యాలు కల్గించుటలేదు. భాషా సంబంధ సామర్థ్యాలలో సమస్యలనెదుర్కొంటున్న పిల్లలందరికీ వారి బహు భాషలను గౌరవించి తరగతుల్లో ఉపయోగించే వాతావరణం కల్పించాలి. అట్లే మన తరగతుల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలుంటారు. ఇందుకు పలు కారణాలుంటాయి. వీటివల్ల వారు భాషాభ్యసనంలో వెనుకబడతారు. ఐతే దశాబ్దాల తరబడి జరిగిన పరిశోధనలు సమ్మిళిత (Inclusive) అభ్యసన పరిసరాలు కల్పిస్తే ఈ సమస్యలకు గరిష్ఠ పరిష్కారాలను కనుగొనవచ్చునని నొక్కి చెప్తున్నాయి.

ఇలాంటి కష్టనిష్ఠూరాలపై ఆధారపడి ఎవరైనా వృత్తిపరంగా ప్రత్యేకమైన భాషావైకల్యం (dyslexia) ను నిర్ధారణ (diagnose) చేయవచ్చు. హ్రస్వదృష్టి, వినికిడి లోపం మున్నగునవి భాషా సంబంధ సమస్యలకు దారితీస్తాయి. వీటిని అధిగమించడానికి తరగతులు సమ్మిళిత (Inclusive) అభ్యసన పరిసరాలను కల్పించాలి. సమ్మిళిత తరగతి గది అంటే పిల్లల అన్ని స్థాయిల భేదాలను దృష్టియందుంచుకొని బోధనాభ్యసన పరిసరాలను సృష్టించడం అన్నమాట. ఐతే కొందరు పిల్లలకు ప్రత్యేక సహాయం అవసరముండవచ్చు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. వీలైనంత వరకు సామాన్య తరగతి గది నుండి ఏ పిల్లవాడినీ వెలుపలికి తీసుకొని పోరాదు. ఉదాహరణకు వినికిడి శక్తి లోపం గల వారికోసం సాధారణ తరగతిలో సంకేత భాషలో వ్యవహరించే వ్యక్తిని (signer) నియమించవచ్చు. దృష్టిదోషమున్న పిల్లలకు బ్రెయిలీ లిపితో పాటు మాట్లాడే పుస్తకాల వంటి Software Programmes ను సాధారణ తరగతుల్లోనే ఉపయోగించవచ్చు. అంతేగాక ఈ వైకల్యాలు గల పిల్లలందరికీ (శారీరక వికలాంగులతో సహా) రాంపులు, మరుగుదొడ్లు, కూర్చోనే సౌకర్యాలు అందుబాటులో ఉంటే వారు భాషాభ్యసనంలో ఏమాత్రం వెనుకంజవేయరు.

## RTE 2009 మరియు భాషాంశాలు :

పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (RTE-2009) 2009 పిల్లలందరికీ అంటే 6 -14 సంవత్సరాల వయోపరిమితిలోని వారందరికీ ఉచిత నిర్బంధ విద్యనందించాలని నిర్దేశిస్తోంది. అంతేగాక నాణ్యత గల విద్యను ఉద్దేశిస్తోంది. RTE 2009 రాష్ట్రాలు తమ విద్యా ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, పరిగణన వ్యూహాలు (సమగ్ర నిరంతర మూల్యాకనం)ను నాణ్యమైన విద్యనందించడానికి సిద్ధం చేయాలని నొక్కి చెప్తోంది. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే అధ్యాపకులు, ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న ఛాత్రులు, తల్లిదండ్రులు, సమాజంలోని నాయకులు RTE 2009లో పొందుపరచిన భాషా సంబంధ విషయాలను అర్థం చేసుకోవాల్సిన అవసరముంటుంది.

RTE 2009-4 సెక్షన్ 8 (సి) ప్రకారం బలహీన వర్గాల వారి పిల్లలు, disadvantaged సమూహాల పిల్లలను ఏవిధంగానూ వివక్షకు గురిచేయరాదు. వారు ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయడాన్ని ఏ సందర్భంలోనూ ఆటంకపరచరాదు. ఈ చట్టం పిల్లలను భయం నుండి, ఒత్తిడి (truma) నుండి, ఉద్విగ్నతల నుండి దూరం చేయాలని, వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడాన్ని ప్రోత్సహించాలని చెపుతోంది (RTE 2009. section 29. 2g: 9) ఈ అంశం స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది (RTE 2009. section 9 (c) )

ఈ చట్టం మాధ్యమ భాష విషయంలో కూడా సిఫార్సు చేసింది. మాధ్యమ భాష వీలైనంత వరకు పిల్లల మాతృభాష కావాలి. (RTE section 29. 2f.9) అందువల్ల పిల్లల మాతృభాషలను గౌరవించడం. వాటిని మధ్యమభాషలుగా విద్యా ప్రక్రియలో ఉపయోగించడం జరగాలి. భాషాభ్యసనంలో పిల్లలు ఏ విధమైన భయాలకు, ఉద్రిక్తతలకు లోనుకాకుండా చూడాలి. వాస్తవానికిఈ కొత్త దృక్పథంపై ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు చట్టంలోని కింది సెక్షన్‌లో సమాధానం లభిస్తుంది.

అధ్యాయం II సెక్షన్-4లో ఆరు సంవత్సరాల వయస్సు పైబడిన పిల్లల్లో ఎవరైనా పాఠశాలలో చేరకపోతే, చేరినా ఎలిమింటరీ విద్యను పూర్తి చేసుకోలేకపోతే అతడు ఆ వయస్సుకు తగిన తరగతిలో తప్పక ప్రవేశం కల్పించాలి. ఐతే వయోపరిమితికి అనుగుణంగా తరగతిలో ప్రవేశం పొందిన పిల్లలు తరగతిలోని ఇతర పిల్లలతో సమాన స్థాయిని పొందడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఇందుకు కాలపరిమితిని నిర్దేశించాలి. (RTE 2009:3)

పై సెక్షన్లననుసరించి ప్రత్యేక భాషా సమస్యలున్న పిల్లలు తరగతుల్లో ఉన్నట్లయితే ఉదా: వారు చదవడం, రాయడం చేయలేకపోతే వారికి ప్రత్యేక శిక్షణనందించాలి. వారిపై ప్రత్యేక దృష్టి కనబరచాలి. ఈ సమస్యలను అధిగమించడానికి తగిన బోధనాభ్యసన సామాగ్రి, మార్గదర్శకం సమకూర్చాలి.

ఇలా అన్ని సెక్షన్లు భాషా ప్రాతిపదికపై పిల్లలకు ఏ విధమైన విచక్షణకు లోను చేయరాదని నొక్కి చెప్తున్నాయి. బహుభాషా చట్రంలోని పిల్లందరి భాషలకు సమానమైన గౌరవ ప్రతిపత్తులను సమకూర్చడమే విద్యావ్యవస్థ యొక్క ఉద్దేశ్యం కావాలి.

ఇక సెక్షన్ 29 అధ్యాయం 6 (RTE 2009:9 ) ప్రకారం విద్యా ప్రణాళిక మరియు మూల్యాంకన పద్ధతులు కింది అంశాలను దృష్టియందుంచుకోవాలి.

అ. రాజ్యాంగంలో పొందుపరచిన విలువలు.

ఆ. పిల్లల సర్వాంగీణ వికాసం.

ఇ. పిల్లల జ్ఞానాభివృద్ధి సామర్థ్యాలు, ప్రతిభను పెంపొందించుట.

ఈ. పిల్లలు శారీరక మానసిక శక్తులను సంపూర్ణంగా అభివృద్ధి చేయుట.

ఉ. స్నేహపూరిత వాతావరణంలో శిశుకేంద్రంగా పరిశోధన, అన్వేషణ కృత్యాల సహాయంతో అభ్యసనం.

ఊ. పిల్లల మాతృభాషలోనే విద్యాబోధన.

ఋ. భయంలేని, ఒత్తిడి లేని ఉద్విగ్నతలు లేని పరిసరాల్లో పిల్లల స్వేచ్ఛ భావవ్యక్తీకరణకు అవకాశాలు.

ౠ. పిల్లల జ్ఞానావగాహనలను, వినియోగ దక్షతను అంచనా వేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనము.

## నూతన దృక్పథం - తరగతి గది అన్వయం:

భాషాపాటవానికి, బహుభాషత్వానికి మధ్య దగ్గరి సంబంధముందని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విద్యావిషయక ఉపలబ్ధి, జ్ఞాన నిర్మాణం, సామాజికంగా సహనశీలతలు కూడా బహుభాషత్వాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల బహుభాషత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముంటుంది. భాష వ్యక్తులు, సమూహాల మధ్య ఎదుగుతుంది. భాషలు కేవలం పాఠ్యపుస్తకాలకు, నిఘంటువులకు, వ్యాకరణాలకు మాత్రమే పరిమితమవుతే అవి నిర్వీర్యమౌతాయి. పర్యవసానంగా భాషలు మరణిస్తాయి. భాషలకు సరిహద్దులు అంటూ ఉండవు. అవి ఒక భాష నుండి మరో భాషలోకి చొచ్చుకొని పోతాయి. మనం తరుచుగా పలు సందర్భాల్లో ఇతర భాషా పదాలను, వ్యక్తీకరణాలను అరువు తెచ్చుకుంటూనే ఉంటాం. అందువల్ల జాతీయాలు, అనువాదం, రెండు భాషల పదాలను కలగలిపి వాడడం (Code mixing). మాతృభాష స్థానంలో రెండో భాషా పదాలను వాడడం (Code switching) మున్నగు వాటిని సమర్థంగా ఉపయోగించుకొని పిల్లల భాషలను అభివృద్ధి పరచవచ్చు. ఈ భావన తరగతిలోని బహు భాషత్వాన్ని ఒక వనరుగా ఒక బోధన వ్యూహంగా ఉపయోగించుకోవడానికి తోడ్పడుతుంది.

తరగతిలోని అందరు పిల్లల స్వీయ భాషలలో భాషా కృత్యాలను సులభంగా సిద్ధం చేయవచ్చు. వారి వారి భాషల్లో బహువచనాలు ఏర్పడే నియమాల, పద్ధతులను గుర్తించమని చెప్పవచ్చు. పిల్లలు చిన్న జట్లలో పనిచేస్తూ ఏకవచనం, బహువచనంలోని పదాలకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించవచ్చు. వీటి మధ్య గల సారూప్యతలను, భేదాలను వారు పరిశీలించవచ్చు. వారు వాటిని వివిధ వర్గాలుగా విడదీయవచ్చు. తద్వారా వచనాలు ఏర్పడే నియమాలను రూపొందించుకొని వాటిని మరింత సమాచారం కోసం పరీక్షించుకోవచ్చు. Code mixing, Code Switching మరియు అనువాదాలు మున్నగు వాటిలో పలు ప్రయోగాలు తరగతిలో చేయవచ్చు. వివిధ భాషలు వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ఈ తరగతులతో సుసంపన్నం చేయవచ్చు.

RTE 2009లోని విషయాలను, సిఫార్సులను పూర్తిగా అమలుకావడానికి వాటిని గౌరవించాలి. బలహీనవర్గాలు, అణగారిన వర్గాల వారిని ఏమాత్రం విచక్షణతో చూడకుండా వారంతా ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసుకునేటట్లు చూడాలి. అట్లే బహుభాషలు, బహుళ సంస్కృతులు గల పిల్లలను పాఠశాలలో చేర్చి వారికి విద్యాబోధన జరపడానికి వ్యూహాలను పన్నాలి. బహుభాషా తరగతి గదులను విశ్లేషణాత్మక ఆలోచనలకు, జ్ఞానాభివృద్ధికి తత్ఫలితంగా ఉన్నత ప్రమాణాలు గల విద్యా విషయక ఉపలబ్ధికి సహాయకాలుగా, వనరులుగా ఉపయోగించుకోవచ్చు.

## భాషాభ్యసనం - ఆశించే ఫలితాలు / సాధించాల్సిన సామర్థ్యాలు:

భాషాభ్యసనం వల్ల పిల్లల్లో ఆలోచనాశక్తి, వ్యక్తీకరణశక్తి, అభివృద్ధి జరగాలి. పిల్లల్లో ఉన్నతమైన వైఖరులు పెంపొందాలి. కానీ భాషాభ్యసన ఫలితాలను కేవలం శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలకే పరిమితం చేస్తున్నాం. భాషాభ్యసనం వీటితోబాటు పిల్లల్లో కల్పనాశక్తిని, సృజనాత్మకతనూ, భాషను వినియోగించే సమర్థతను పెంపొందించడానికి దోహదపడాలి. ప్రతిస్పందించడం (Reflection), హేతుబద్ధంగా / విమర్శనాత్మకంగా ఆలోచించడం (Rational / critical thinking), బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical thinking), సృజనాత్మకంగా ఆలోచించడం (Creative thinking) వంటి ఆలోచనా నైపుణ్యాలు (Thinking skills) పెంపొందించాలి. పిల్లల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలు, వైఖరులు పెంపొందింపజేయడాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల విద్యలో భాషాభ్యసనంద్వారా పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలను నిర్ధారించారు. అవి :

1. **వినడం, అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం:** పిల్లలు తాము విన్నదాన్ని గురించి అర్థంచేసుకోగలగాలి. ఆలోచించగలగాలి. విన్నవాటి గురించి తమ ప్రతిస్పందనలు తెలియజేయాలి. విన్న అంశంలోని వాస్తవాలను, కారణాలను అంతరార్థాలను విశ్లేషించి గ్రహించగలగాలి..

2. **తగు విధంగా మాట్లాడడం:** పిల్లలు బడికి వచ్చేనాటికే ధారాళంగా మాట్లాడతారు. ఐతే పాఠశాలలో చేరిన పిల్లలు సందర్భోచితంగా సరైన భాషను ఉపయోగించి మాట్లాడే సామర్థ్యాన్ని పొందాలి. తమకు తెలిసిన వాటి గురించి, చూసినవాటి గురించి, విన్నవాటి గురించి క్రమపద్ధతిలో ఎదుటివారికి అర్థమయ్యేలా మాట్లాడగలగాలి. చర్చల్లో పాల్గొనడం, ఉపన్యాసాలివ్వడం, వాదించడం, వాఖ్యానించడం, వర్ణించడం, వివరించడం వంటివి చేయగలగాలి. ఆత్మవిశ్వాసంతో, ఆలోచించి మాట్లాడగలగాలి. సందర్భోచితంగా, సరయిన భాషను ఉపయోగించగలగాలి.

3. **చదవడం, అర్థంచేసుకుని వ్యక్తీకరించడం:** పిల్లలు పాఠ్యపుస్తకాలను, మ్యాగజైన్‌లను, వార్తాపత్రికలను... ఇలా దేనినైనా ధారాళంగా చదవగలగాలి. చదివిన విషయాన్ని అర్థంచేసుకోవాలి. చదివిన విషయం గురించి విశ్లేషించగలగాలి, వ్యక్తీకరించగలగాలి. చదివిన అంశం ఆధారంగా వివరించడం, వ్యాఖ్యానించడం, కీలకాంశాలను గుర్తించడం, సమాచారాన్ని పట్టికల రూపంలో రాయడం, పాత్రల స్వభావాన్ని గుర్తించడం వంటివి చేయగలగాలి.

4. **రాయడం:** పిల్లలు తమకు తెలిసిన, చదివిన, విన్న, చూసిన వాటిగురించి సొంతమాటల్లో విషయాన్ని క్రమపద్ధతిలో, దోషరహితంగా రాయగలగాలి. ఆలోచనలు, అనుభూతులు, అనుభవాల గురించి రాయగల్గాలి. తమ అభిప్రాయాలను, ప్రతిస్పందనల గురించి రాయగల్గాలి. వివరించి రాయడం, కారణాలు రాయడం వంటివి చేయగల్గాలి.

5. **పదజాలం:** పాఠ్యపుస్తకాలలోని పాఠాలకు సంబంధించిన, తాము గ్రహించిన నూతన పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగించగలగాలి. వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, బాలసాహిత్యం వంటి వాటిలోని అంశాలను చదివినపుడు తెలియని పదాల అర్థాలను సందర్భాన్నిబట్టి ఊహించగలగాలి. అవసరమైనప్పుడు నిఘంటువును ఉపయోగించడం అలవాటుకావాలి.

6. **సృజనాత్మక వ్యక్తీకరణ:** పిల్లలందరిలో అంతర్లీనంగా సృజనాత్మకత ఉంటుంది. భాషాభ్యసనం వల్ల పిల్లల్లో సృజనాత్మకంగా వ్యక్తీకరించే సామర్థ్యం వృద్ధిచెందాలి. పిల్లలు కథలు, కవితలు, గేయాలు, పాటలు, సంభాషణలు వంటివి రాయగలగాలి.

7. **ప్రశంస:** పిల్లల్లో ఇతరులు, ఇతర భాషలు, సంస్కృతులు, వర్గాలలోని మంచితనాన్ని, గొప్పతనాన్ని ప్రశంసించే వైఖరి పెంపొందాలి. తద్వారా పిల్లల్లో విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం జరగాలి.

8. **భాషను గురించి తెలుసుకుందాం:** భాషకు సంబంధించిన సూత్రాలను, నియమాలను, వాక్య నిర్మాణ పద్ధతులు, శైలి, పదజాలం వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఇతర భాషలతో వాటిని పోల్చడం ద్వారా మాతృభాష ఆధారంగా ఇతర భాషలపై పట్టుసాధించగలగాలి.

> *'జ్ఞానం' అనేది విద్యార్థికి ఇవ్వబడేది కాదు. ఇదొక స్వయంచోదక శక్తి. అనుభవం ద్వారాసముపార్జించబడేది. నూతన సమాచారం పట్ల పిల్లవాడు ఆచరణాత్మక నిర్ణయాత్మక అవగాహన కలిగినపుడు మాత్రమే సముపార్జించబడుతుంది.*
>
> *- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాప్రణాళికా పరిధి పత్రం - 2011*

* * *

# III. ఇ) భాషా బోధనాలక్ష్యాలు / అభ్యసనాఫలితాలు

## A. ప్రాథమికస్థాయి - బోధనా లక్ష్యాలు (1 నుండి 5 వరకు)

పాఠశాల విద్యలో ప్రాథమిక స్థాయి పునాది వంటిది. ప్రాథమిక విద్య అంటేనే భాషాభ్యసనం, గణితాభ్యసనమని జాతీయ విద్యా ప్రణాళిక చట్టం 2005 (National Curriculum Framework 2005) పేర్కొన్నది. పిల్లల భాషాస్థాయి / సామర్థ్యం పటిష్ఠంగా ఉంటేనే, దీని ఆధారంగా పిల్లల అభ్యసనం ఇతర విషయాల్లో కూడా మెరుగ్గా ఉంటుంది.

ప్రాథమికస్థాయిలోనే పిల్లలు పాఠశాలలోకి ప్రవేశిస్తారు. పాఠశాలలో చేరేసరికే పిల్లలందరిలో భాషాసామర్థ్యం ఉంటుంది. అత్యంత సంక్లిష్టమైన భాషను / భాషలను అలవోకగా పొంది దాన్ని వినియోగించే శక్తితోనే పాఠశాలలో ప్రవేశిస్తున్నారు. పిల్లలు విని అర్థంచేసుకోవడం, మాట్లాడడం, సంకేతాలు / చిత్రాల ద్వారా భావాన్ని గ్రహించడం, చిత్రపఠనం చేయగల్గడం, ప్రశ్నించడం వంటి భాషాసామర్థ్యాలు కలిగి ఉన్న పిల్లలకు పాఠశాలల్లో చేరిన తర్వాత చదవడం, రాయడం వంటి సామర్థ్యాలలో పట్టుసాధించేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలలకు ఉంటుంది.

ఐతే భాషాభ్యసనం అంటే కేవలం ధారాళంగా చదవడం, తప్పుల్లేకుండా రాయడం / ఉక్తలేఖనం రాయడం, అందంగా రాయడం వంటి అంశాలకే ప్రాధాన్యతనివ్వడం, భాషాబోధనను దీనికే పరిమితం చేయడం అనేవి దశాబ్దాల తరబడి కొనసాగుతున్నదే!

భాష అంటే భావాత్మకమైనదని, ఆలోచనాత్మకమైనదని, సృజనాత్మకతమైనదనే కోణంలో ఆలోచించినప్పుడు భాషాబోధన లక్ష్యాలలో స్పష్టమైన వ్యత్యాసం గోచరిస్తుంది. ఇందుకనుగుణంగా భాషా బోధనా లక్ష్యాలను నిర్ధారించాల్సి ఉంటుంది. పిల్లల్లో సహజంగా ఉండే సృజనాత్మకత భాషాభ్యసనం వల్ల మరింత ఇనుమడించాలి. ధారాళంగా చదవడంతోపాటు చదివిన దాన్ని అర్థంచేసుకోవడం, దాని గురించి చెప్పగలగడం, ప్రతిస్పందించడం వంటివాటిపై పిల్లలు పట్టుసాధించాలి. అట్లే తప్పులు లేకుండా రాయడంతో పాటు తెల్సినదాని గురించి, చూసిన, విన్న, చదివిన అంశాలగురించి పిల్లలు సొంత మాటల్లో రాయగలగాలి. పిల్లలు తమ అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలను, అభిప్రాయాలను లిఖితరూపంలో / రాయడం ద్వారా వ్యక్తీకరించడంలో నైపుణ్యం సాధించాలి.

పిల్లలకు బడికిరాకముందే భాషవచ్చినప్పటికీ భాషకు సంబంధించిన ప్రాథమిక నియమాలు, వాక్య నిర్మాణం వంటి వాటిపై అవగాహన చేసుకోవడం ప్రారంభంకావాలి. భాషలోని వివిధ ప్రక్రియలతో పరిచయం ఏర్పడి వాటిని విన్నా, చదివినా భావాన్ని గ్రహించ గలగడం ప్రాథమిక స్థాయిలోనే ప్రారంభం కావాలి. మాట్లాడే భాషకు, రాసే భాషకు మధ్యగల వ్యత్యాసాన్ని గ్రహించి లిఖితరూపంలో వ్యక్తీకరించదల్చుకున్న విషయాన్ని పూర్తి వాక్యాలుగా, వాక్యనిర్మాణ సూత్రాలకనుగుణంగా రాయడం అలవర్చుకోవాలి.

ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలకు బాలసాహిత్యం, కథల పుస్తకాలు, వార్తాపత్రికలు, మ్యాగజైన్ల వంటివి చదవడం అలవాటుగా మారాలి. అనగా స్వతంత్ర పాఠకులుగా ఎదగడానికి అవసరమైన వైఖరులు ఏర్పడాలి. 'చదవడం' అనేది కేవలం పరీక్షలకోసమో, మార్కులకోసమో అనే భావన కోసం కాకుండా తమకోసం, జ్ఞానాన్ని పెంచుకోవడం కోసం,

వివిధ విషయాల గురించి ఇతరులపై ఆధారపడకుండా స్వయం అధ్యయనం ద్వారా అవగాహనను ఏర్పరచుకోవడం అనేది అలవడాలి. పాఠశాలలోని గ్రంథాలయం ప్రాధాన్యతను గుర్తెరిగి, క్రమం తప్పకుండా వెళ్ళడం, ప్రతిరోజు తప్పని సరిగా కొంత సమయం గ్రంథాలయంలో గడపడం, అవసరమైన పుస్తకాలను తీసుకొని చదవడం వంటి ప్రాథమికమైన వైఖరులు ప్రాథమిక దశలోనే బలపడాలి. ఇందుకు అవసరమైన అభ్యాసం పాఠశాల దశలో భాషాబోధన ద్వారా జరగాలి. పఠన సంస్కృతి అలవడేలా పిల్లలను తయారుచేయడం భాషాబోధనాలక్ష్యాలలో అతికీలకమైనది.

## B. ఉన్నతస్థాయి - బోధనా లక్ష్యాలు (6 నుండి 10 వరకు)

ప్రాథమిక దశను పూర్తి చేసిన పిల్లలు 6వ తరగతిలో ప్రవేశిస్తారు. ప్రాథమిక దశలో భాషపైన ప్రాథమిక పట్టుకలిగి చదవడం, రాయడం వంటి మౌలిక సామర్థ్యాలతో ప్రాథమికోన్నత దశలో ప్రవేశిస్తారు. భాషా బోధన భాషా సామర్థ్యాల సాధనకే పరిమితం కాకుండా ఇతర సబ్జక్టుల అభ్యసనానికి, అవగాహనను పెంపొందించడానికి, వ్యక్తీకరించడానికి ప్రాథమికోన్నత స్థాయి దోహదపడాలి. ఉన్నత స్థాయికి చేరేసరికి పిల్లల్లో భాషపట్ల అభిరుచి, ఆసక్తి పెరిగి స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి. విమర్శనాత్మక దృక్పథంతో ఆలోచించి హేతుబద్ధమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందాలి.

విద్యార్థి విద్యాభ్యాసంలో భాషపట్ల సమగ్రమైన దృక్పథం, అవగాహన పొంది తద్వారా భాషను సమర్థంగా దైనందిన జీవితంలో ఉపయోగించే సామర్థ్యాన్ని అట్లే తన అభివృద్ధి కోసం భాషను ఉపయోగించుకునే సమర్థత పిల్లలు ఉన్నతస్థాయిలోనే పొందాలి. ఇందుకనుగుణంగా భాషా బోధన లక్ష్యాలు ఉండాలి. ఉన్నత స్థాయి పూర్తిచేసిన పిల్లలు తమకున్న సామర్థ్యంతో ఉపాధి అవకాశాలను కూడా పొందడానికి అవసరమైన శిక్షణ భాషా బోధన ద్వారా లభించాలి. భాషా బోధన అంటే పాఠంలోని విషయాలను వివరించడం, వ్యాకరణాంశాలను బోధించడం, పరీక్షలకు సిద్ధం చేయడమనే సాంప్రదాయక భావజాలం నుండి బయటపడి నూతన దృక్పథంతో ఆలోచించాలి.

దైనందిన జీవితంలోని భాషా వ్యవహార రూపాలను అర్థం చేసుకోవడం, వాటిని సందర్భోచితంగా వినియోగించగలగడం, వాటిని ఉత్పత్తి చేయగలగడం వంటి సామర్థ్యాలను పిల్లలు పొందాలి. ఇందుకనుగుణంగా భాషా లక్ష్యాలను నిర్ధారించాలి. స్వయం అధ్యయనం అలవాటు కావడం, పరామర్శ గ్రంథాలను ఎప్పటికప్పుడు సంప్రదించడం, పఠన సంస్కృతి అలవడడం ఈ దశలోనే జరగాలి. వీటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు కింది అంశాలను ఉన్నతస్థాయిలో భాషా బోధనా లక్ష్యాలుగా నిర్ధారించవచ్చు.

- వినడం, విన్నదాన్ని అర్థం చేసుకోవడం చేయగలిగిన పిల్లలు వాటి గురించి ప్రతిస్పందించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం చేయగలగాలి. ప్రసంగాలు, వ్యాఖ్యానాలు, గోష్ఠులు, చర్చలు, ఇంటర్వ్యూలు మొదలగునవి విని వాటి గురించి బహుకోణాల్లో ప్రతిస్పందించగలగాలి.
- స్వేచ్ఛగా మాట్లాడగలిగిన పిల్లలు సందర్భోచితంగా, అర్థవంతంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలి. మాట్లాడేటప్పుడు జాతీయాలను, సామెతలను ఉపయోగించడం, వినేవారికి ఆసక్తి కలిగేలా మాట్లాడగలగాలి. చర్చల్లో పాల్గొనడం, ప్రసంగాలు ఇవ్వగలగడం, సద్యోభాషణం చేయగలగాలి. క్రమపద్ధతిలో తార్కికంగా, వివరించగలగాలి. ప్రశ్నలకు సూటిగా, సమర్థంగా స్పందించగలగాలి.

- ధారాళంగా చదివి అర్థం చేసుకోగలిగిన పిల్లలు ఉన్నత స్థాయిలో విమర్శనాత్మకంగా ప్రతిస్పందించడం, చదివిన దాని గురించి అభిప్రాయాలు చెప్పడం, భాషా శైలిని గుర్తించడం, వాటి గురించి వ్యాఖ్యానించడం, కీలకాంశాలు గుర్తించడం చేయగలగాలి. చదివిన విషయాన్ని దైనందిన జీవితంతో, సమకాలీన అంశాలకు అన్వయించి విశ్లేషించగలగాలి. కవులు/ రచయితలు/ వ్యాసకర్తల ఉద్దేశాలను, ఆంతర్యాలను గ్రహించగలగాలి. చదువుతున్న విషయంలో కీలకాంశాలను గుర్తించాలి. చదవడం ఒక సంస్కృతిగా మారాలి. గ్రంథాలయాలను, అంతర్జాలాన్ని సమర్థంగా ఉపయోగించుకుని జ్ఞాన పరిధిని విస్తృతపరచుకోవాలి. పరిశోధనా దృక్పథం పెరగాలి.
- సొంతమాటల్లో రాయగలిగిన పిల్లలు ఏ విషయం గురించైనా సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయడం, తార్కిక క్రమంలో రాయడం, వివరించి రాయడం, కారణాలు రాయడం, విశ్లేషణలు రాయడం, అభిప్రాయాలు రాయడం చేయగలగాలి. సంక్షిప్తంగా లేదా వివరణాత్మకంగా, సందర్భోచితంగా రాసే శక్తి అలవడాలి. చదువరులకు ఆసక్తిగొలిపేలా పదబంధాలు, జాతీయాలు, సామెతలు వంటివి రాయడంలో వినియోగించాలి. రాయడం ద్వారా ఆలోచనలు క్రమబద్ధీకరించబడతాయి కాబట్టి పిల్లల్లో రాయడమనే సంస్కృతి కొనసాగేలా అవసరమైన శిక్షణ ఈ స్థాయిలో పొందాలి. విమర్శనాత్మకంగా, బహుకోణాల్లో విశ్లేషిస్తూ రాసే శక్తి ఇనుమడించాలి.
- పిల్లల్లో సహజమైన సృజన ఉంటుంది. కథలు చెప్పడం, వాటిని పొడిగించడం, అభినయించడం వంటివి చేయగలిగిన పిల్లల సృజనాత్మక శక్తి ఉన్నత స్థాయిలో మరింత వృద్ధి చెందాలి. భాషలోని విభిన్న వ్యవహార రూపాలను ఉత్పత్తి చేయగలగాలి. సందర్భోచితంగా ఇతివృత్తానికి అనుగుణంగా సంభాషణలు రాయగలగడం, కవితలు రాయడం, కథనాలు రాయడం, వార్తాంశాలు రాయడం, కరపత్రాలు తయారు చేయడం, పోస్టర్లు తయారు చేయడం, ప్రాతినిధ్య లేఖలు రాయగలగడం, పుస్తక సమీక్షలు రాయడం, ఆత్మకథలు మొదలగునవి రాయగలగాలి. నాటకీకరణ, ఏకపాత్రాభినయం, మూకాభినయం వంటివి చేయగలగాలి. వీటిలో నిపుణత సాధించేలా ఉన్నత స్థాయిలో పిల్లలకు తగిన అభ్యాసం లభించాలి. ఇవి భవిష్యత్తులో పిల్లలకు విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఉపయోగపడడంతోపాటు ఉపాధి మార్గాలుగా కూడా దోహదపడతాయి.
- భాష గురించి ప్రాథమిక అవగాహన కలిగిన పిల్లలు భాషలోని వాక్య నిర్మాణాలను, అలంకారిక శైలిలను, నియమాలను అవగాహన చేసుకోవాలి. పద్యాలు, ద్విపదలు, గేయాలు వంటివి ఛందోబద్ధంగా రాయడంలోని విశిష్టతను అర్థం చేసుకొని ప్రశంసించగలగాలి. మాతృభాషలోని వ్యాకరణ నియమాల ఆధారంగా ఇతర భాషలను, వాటి వాక్య నిర్మాణాలను అవగాహన చేసుకొని వాటిపైన పట్టు సాధించగలగాలి.
- భాషాభ్యసన ద్వారా పిల్లలు సంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకొని ప్రశంసించగలగాలి. వీటిని కాపాడడానికి తదుపరి తరాలకు అందించడానికి తమ వంతు పాత్రను పోషించాలి. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలలోని వివిధ ప్రక్రియలను ప్రశంసించగలగాలి. కవులు, రచయితలు, కళాకారుల కృషిని అభినందించగలగాలి. సమాజానికి, సాహిత్యానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించగలగాలి.

పాఠశాల విద్య పూర్తయ్యేసరికి పిల్లల్లో విచక్షణా శక్తి, విమర్శనాత్మక దృక్పథం పెంపొందాలి. సందర్భోచితంగా ప్రతిస్పందించడం, సమకాలీన అంశాల గురించి ప్రశ్నించడం చేయగలగాలి. ఇందుకనుగుణంగా పిల్లల్లో జ్ఞానాత్మక/ ఆలోచనాత్మక నైపుణ్యాలు భాషాభ్యసనం ద్వారా జరగాలి. ప్రతిస్పందించడం, హేతుబద్ధంగా ఆలోచించడం, బహుకోణాల్లో విశ్లేషించడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటివి భాషాభ్యసనంలో కీలక అంశాలుగా మారాలి. ఆలోచించడం, వ్యక్తీకరించడం, విలువలు, వైఖరులు పెంపొందడం భాషా బోధనలో కీలక లక్ష్యాలుగా మారాలి.

# IV. పాఠ్యప్రణాళిక - మొదటిదశ - 1, 2 తరగతులు

## అ) భాషా సామర్థ్యాలు - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. వినడం, అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం

| 1వ తరగతి | 2వ తరగతి |
|---|---|
| • పరిచితమైన అంశాలకు సంబంధించిన చిత్రాలలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారో చెప్పగలగాలి.<br>• చిత్రం గురించి స్వేచ్ఛగా మాట్లాడగలగాలి.<br>• ఇష్టమైన వాటి గురించి మాట్లాడగలగాలి.<br>• తమకు తెల్సినవాటి గురించి మాట్లాడగలగాలి.<br>• చేయగల్గిన వాటి గురించి మాట్లాడగలగాలి.<br>• పాఠశాలలో ఇచ్చే సూచనలు విని అర్థం చేసుకొని ఆ ప్రకారంగా ప్రవర్తించాలి.<br>• పరిచితమైన బాలగేయాలు, చిన్నచిన్న కథలు, పాటలు విని అర్థం చేసుకోవాలి. వాటి గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ? వంటి ప్రశ్నలకు జవాబులు చెప్పగలగాలి.<br>• వర్ణమాలలోని అక్షరాలను, గుణింతాక్షరాలను స్పష్టంగా పలకాలి.<br>• అల్పప్రాణులు, మహాప్రాణుల మధ్య హ్రస్వాలు, దీర్ఘాక్షరాల మధ్య ఉచ్చారణ భేదాల్ని గుర్తించగలగాలి. | • ఇచ్చిన చిత్రాల గురించి ఆలోచించి మాట్లాడగలగాలి.<br>• చిన్న చిన్న కథలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• తమ అనుభవాల గురించి స్వేచ్ఛగా చెప్పగలగాలి.<br>• చూసిన, విన్న సంఘటనల గురించి మాట్లాడగలగాలి.<br>• తమకు నచ్చిన, నచ్చని వాటి గురించి చెప్పగలగాలి.<br>• పోలికలు-భేదాలు గురించి మాట్లాడగలగాలి.<br>• దినచర్య గురించి చెప్పగలగాలి.<br>• జట్టు పనులు, వ్యక్తిగత కృత్యాలలో ఇచ్చే సూచనలు విని అర్థం చేసుకొని ఆ విధంగా చేయగలగాలి.<br>• అపరిచితమైన బాలగేయాలు, పొడుపుకథలు, పాటలు, కథలు మొదలగు వాటిని విని అర్థం చేసుకోవాలి. ఎందుకు? ఎలా? వంటి ప్రశ్నలకు జవాబులు చెప్పగలగాలి.<br>• ద్విత్వ, సంయుక్త, సంశ్లేషాక్షరాలను స్పష్టంగా పలకాలి. |

## II. ధారాళంగా చదవడం - అర్థం చేసుకోవడం

| 1వ తరగతి | 2వ తరగతి |
|---|---|
| • గేయాలు, పాటలు, కథలు, సన్నివేశాలలో కీలకపదాన్ని గుర్తించి, చదవగలగాలి.<br>• కీలక పదంలోని అక్షరాలను గుర్తించి, చదవగలగడం.<br>• చిత్రాల ఆధారంగా పదాలను చదవడం.<br>• పదాలను విడిగాను, వాక్యాలలోను గుర్తించడం, చదవగల్గడం.<br>• సరళపదాలు, గుణింత పదాలు చదవగలగడం.<br>• గేయంలోని ప్రాస పదాలు గుర్తించి, చదవగలగడం.<br>• వాన చినుకులు, చిత్రకథల పుస్తకాలు చదవగలగడం.<br>• బొమ్మల ఆధారంగా వాక్యాలు చదవడం.<br>• సరళమైన వాక్యాలను ధారాళంగా చదవగలగడం.<br>• వర్ణమాలలోని అక్షరాలను, గుణింతాక్షరాలను విడిగాను పదాలలోను గుర్తించి స్పష్టంగా చదవగలగడం.<br>• వర్ణమాల అక్షరాలు, గుణింతాక్షరాలతో పదాలు తయారుచేసి చెప్పగలగడం. | • సరళపదాలు, గుణింత పదాలతోపాటు ఒత్తుల పదాలు ధారాళంగా చదవగలగాలి.<br>• కోరిన (సూచించిన) వాక్యాలను గేయంలో, పాఠంలో గుర్తించడం.<br>• పదాలలోని అక్షరాల తేడాను గుర్తిస్తూ చదవడం.<br>• చిత్రాలకు తగిన పేర్లు రాయడం. వాటిని ఉపయోగించి వాక్యాలు చెప్పడం.<br>• అక్షరాలను సరిచేసి పదాలు రాయడం.<br>• అంత్యాక్షరి పదాలను కలపడం.<br>• ఇచ్చిన పదాలలో తప్పు అక్షరాన్ని సరిచేసి చదవడం, రాయడం.<br>• ప్రాసపదాలను గుర్తించి చదవడం, రాయడం.<br>• అక్షరాలను కలిపి చదవడం, రాయడం.<br>• పదాలను, వాక్యాలను ధారాళంగా చదవడం, కోరిన ఒత్తు పదాలను గుర్తించి రాయడం.<br>• తప్పొప్పులను గుర్తించడం.<br>• వాక్యాలలో / పేరాలలో సూచించిన అక్షరంతో ఉన్న పదాలను గుర్తించి చదవడం.<br>• అక్షరాలకు ఒత్తులు చేర్చి చదవడం.<br>• సరియైన పదాలతో ఖాళీలను పూరించడం.<br>• తారుమారైన పదాలను సరిచేసి వాక్యాలు రాయడం.<br>• బొమ్మను చూసి దానికి సంబంధించిన వాక్యాలను పాఠంలో గుర్తించి చదవడం.<br>• పదాలను జతపరచి చదవడం, రాయడం.<br>• కథవాచకాలు, బాలగేయాలు, అభినయగేయాలు, పొడుపుకథలు మొదలయినవి ధారాళంగా చదవగలగాలి. |

## III. రాయడం

| 1వ తరగతి | 2వ తరగతి |
| --- | --- |
| • చుక్కలను కలుపుతూ పదాలలోని అక్షరాలను రాయడం, చదవడం. | • వర్ణమాలలోని అక్షరాలతో పదాలు రాయడం. |
| • పదాలను గీతలలో అందంగా రాయడం. | • బొమ్మకు తగిన పదం రాసి, వాక్యాలు రాయడం. |
| • బొమ్మను చూసి సరైన పదాన్ని ఖాళీలలో రాయడం. | • ఇచ్చిన పదం / వాక్యాలలోని అక్షరాలతో కొత్త పదాలు రాయడం. |
| • పదంలోని అక్షరాలతో కొత్త పదాలు రాయడం. | • సూచించిన అక్షరాలతో మొదలయ్యే పదాలు రాయడం. |
| • అక్షరాలను కలిపి పదాలు రాయడం, చదవడం. | • పట్టికలో ఇచ్చిన అక్షరాలకు గుణింతాలు చేర్చిరాయడం, వాటితో పదాలు రాయడం. |
| • ఇచ్చిన అక్షరాలతో కొత్తపదాలు రాయడం. | • గళ్ళలోని అక్షరాలతో పదాలు రాయడం. |
| • గళ్ళలోని అక్షరాలతో పదాలు రాయడం, వాక్యాలు చెప్పడం. | • బొమ్మలకు తగిన పేర్లు రాయడం, వాటికి తగిన వాక్యాలు రాయడం. |
| • బొమ్మల ఆధారంగా గళ్ళనుడికట్టును పూరించడం. | • ప్రశ్నలకు జవాబులు రాయడం. |
| • పదాలలోని అక్షరాలను సరిచేసి రాయడం. | • ఆధారాలను చదివి గళ్ళను పూరించడం. |
| • పట్టికల ఆధారంగా పదాలు రాయడం. | • పదాలను చదవడం, స్వీయ ఉక్తలేఖనం (Self Dictation) రాయడం. |
| • వర్ణమాల ఆధారంగా రెండక్షరాలు, మూడక్షరాలు నాలుగక్షరాల పదాలు రాయడం. | • పాత్ర స్వభావం గురించి సొంతమాటల్లో రాయడం. |
| • హల్లులకు గుణింతాలు చేర్చిరాయడం. కోరిన గుణింతంతో పదాలు రాయడం. | • సంబంధమున్న పదాలను రాయడం. |
| • సరియైన పదాన్ని జతపరిచి రాయడం, చదవడం. | • పదాలకు సరియైన ఒత్తును చేర్చిరాయడం. |
| • సరియైన పదాలతో ఖాళీలను పూరించడం. | • తారుమారైన పదాలను సరిచేసి వాక్యాలు రాయడం. |
| • తారుమారైన పదాలను సరిచేసి వాక్యాలు రాయడం. | • పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయడం. |
| • బొమ్మల ఆధారంగా వాక్యాలు రాయడం. | • పదాలను జతపరిచి సొంతవాక్యాలు రాయడం. |
| | • పట్టికలోని పదాల ఆధారంగా వాక్యాలు రాయడం. |
| | • చిత్రం ఆధారంగా పదాలు రాయడం ఆ పదాలను ఉపయోగించి వాక్యాలు రాయడం. |
| | • సూచించిన / తెలిసిన వాటి గురించి సొంత మాటల్లో రాయడం. |

## IV. సృజనాత్మకత

| 1వ తరగతి | 2వ తరగతి |
|---|---|
| • గేయాన్ని పాడడం, అభినయించడం.<br>• బొమ్మగీసి తగిన పేరు రాయడం, రంగులు వేయడం, చిత్రం గురించి రెండు మూడు వాక్యాలు రాయడం.<br>• తరువాత ఏం జరిగిందో ఊహించి చెప్పడం.<br>• పాత్రకనుగుణంగా నటించడం.<br>• గేయాన్ని పొడిగించడం (మౌఖికం)<br>• చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పడం, రాయడం. | • గేయాలను లయబద్ధంగా పాడడం, అభినయించడం.<br>• అభినయ గేయాలను పొడిగించి రాయడం.<br>• చిత్రాలను గీయడం, రంగులు వేయడం, వాటి గురించి రెండు, మూడు వాక్యాలు రాయగలగడం.<br>• చిత్రం చూసి, దాన్ని గురించి రాయడం.<br>• బొమ్మల ఆధారంగా కథ రాయడం.<br>• అసంపూర్తిగా ఉన్న బొమ్మను గీయడం, రంగులు వేయడం వాటి గురించి రాయడం.<br>• చిత్రం ఆధారంగా సంభాషణలు రాయడం.<br>• నాటకీకరణ చేయడం.<br>• తమను గురించి తాము పరిచయం చేసుకోవడం మరియు ఇతరులను పరిచయం చేయడం.<br>• బొమ్మలు చూసి పొడుపు కథలు చెప్పడం, రాయడం. |

# ఆ) పాఠ్యపుస్తకాలు

**1, 2 తరగతుల పాఠ్యపుస్తకాలు కింది లక్షణాలు కలిగి ఉండాలి.**

- అక్షరాలను విడివిడిగా పరిచయం చేయడంకన్నా పద పద్ధతిలో సందర్భోచితంగా, అర్థవంతంగా నేర్చుకొనే రీతిలో పరిచయం చేయాలి. అందుకనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించాలి.
- పాఠ్యపుస్తకం వాచకం, అభ్యాస పుస్తకంగా ఉపయోగపడాలి.
- పాఠ్యపుస్తకాలను పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా రూపొందించాలి.
- పాఠ్యపుస్తకం భౌతిక లక్షణాలు అనగా పేపరు నాణ్యత, పరిమాణం, ముద్రణ, కవర్‌పేజి, అక్షరాల పరిమాణం (ఫాంట్) వంటివి చదవడానికి, అనుకూలంగా అందంగా ఆకర్షణీయంగా ఉండాలి.

- పాఠాలు వివిధ వ్యవహార రూపాలలో ఉండాలి. అవి బాలగేయాలు, పాటలు, కథలు, చిత్రకథలు, గేయకథలు, సంభాషణ, సన్నివేశం మొదలగు రూపాల్లో ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోని చిత్రాలు భావాన్ని అర్థంచేసుకోవడంతోపాటు సూచనలను, కృత్యాలకు సంబంధించిన అవగాహనను పెంపొందించేవిగా ఉండాలి.
- చిత్రాలు వర్ణచిత్రాలుగా వుండాలి. పాఠ్యాంశాల స్వభావం / ఇతివృత్తం ఆధారంగా వీలైనంత మేరకు వాస్తవ, వర్ణణాత్మక చిత్రాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకంలో ఎక్కువ భాగం చిత్రాలతోకూడి ఉండాలి.
- చిత్రాలు ఆలోచింపజేసేవిగా ఉండాలి.
- పాఠాలు వీలైనంతమేరకు పరిచితమైన అంశాల ఆధారంగా ఉండాలి. వాడుకలోఉన్న గేయాలు, కథలు, పాటలు, పరిచిత సన్నివేశాలను పాఠ్యాంశాలుగా ఉపయోగించుకోవాలి.
- పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలు సామర్థ్యాల వారీగా ఉండాలి.
- వినడం, మాట్లాడడానికి చెందిన అభ్యాసాలు పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడించడానికి వీలుగా ఉండాలి.
- చదవడానికి చెందిన అభ్యాసాలు ధారాళంగా చదవడానికి అభ్యాసం కల్పించేవిగా ఉండాలి. అర్థంచేసుకుని చెప్పడానికి వీలుండాలి.
- రాయడానికి చెందిన అభ్యాసాలలో అందంగా రాయడం, తప్పులు లేకుండా రాయడం, సొంతంగా రాయడంపై అభ్యాసం కల్పించేవిగా ఉండాలి.
- సృజనాత్మకత వ్యక్తీకరణకు చెందిన అభ్యాసాలు వీలయినంతవరకు ప్రతిపాఠ్యాంశంలో ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోని సూచనలు పిల్లలు చదివి అర్థంచేసుకోవడానికి వీలుగా ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోని భాష అన్ని ప్రాంతాల పిల్లలకు అర్థమయ్యేలా ఉండాలి.
- రెండవ తరగతి పాఠ్యపుస్తకంలో ప్రారంభ పాఠాలలో ఒకటవ తరగతికి చెందిన అంశాలను పునశ్చరణకోసం వినియోగించాలి.
- భాషాభిరుచిని పెంపొందించేలా పొడుపుకథలు, సామెతలకు సంబంధించిన పాఠ్యాంశాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకం ప్రారంభంలోనే విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలను చేర్చాలి.
- పాఠ్యపుస్తకాన్ని వినియోగించడం గురించి ఉపాధ్యాయులకు సూచనలు చేర్చాలి.
- పాఠశాలలో మొదటిసారిగా చేరిన విద్యార్థులకు పాఠశాల పరిసరాలు, తరగతిగది వాతావరణం అలవాటుపడేలా చేయాలి. ఇందుకోసం పిల్లలచే మాట్లాడించడానికి పిల్లలకు పరిచయం ఉన్న పరిసరాలకు సంబంధించిన (ఉదా:- కుటుంబం, వంటగది మొదలైనవి) పెద్ద చిత్రాలు (Big Pictures) కేవలం చిత్రాలతో కూడిన పాఠాలు ఒకటవ తరగతి పాఠ్యపుస్తక ప్రారంభంలో చేర్చాలి.
- విలువలు పెంపొందించుటకు 2వ తరగతి నుండి నీతి పద్యాలను చేర్చాలి.
- చదవడం అలవాటు చేయడానికి, భాషాభిరుచిని పెంపొందించడానికి వీలుగా చిత్రాలతో కూడిన రకరకాల కథలను "చదవండి-ఆలోచించండి" పేరుతో చేర్చాలి.
- సూచనలను అర్థంచేసుకొని, సొంతంగా అభ్యాసాలను చేయుటకు పురిగొల్పేలా సామర్థ్యాలకు అనుగుణంగా లోగోలు ఉండాలి.

# ఇ) పాఠ్యాంశాల వివరాలు

## 1వ తరగతి - పాఠాల వివరాలు

| క్రమ సంఖ్య | ప్రధానాంశం | ప్రక్రియ | పాఠం వివరాలు |
|---|---|---|---|
| 1 | స్వేచ్ఛగా మాట్లాడడం | పరిచితమైన చిత్రాలు | పిల్లలకు పరిచయం ఉన్న సన్నివేశాలు / సంఘటనలకు సంబంధించిన చిత్రాలు (ఇల్లు, వంటిల్లు, బడి, బస్టాండు మొ॥నవి) |
| 2 | సరళ పదాలు | గేయాలు, సంఘటనలు | చిట్టి చిలకమ్మా, వానావానావల్లప్ప, సీతమ్మ వాకిట సిరిమల్లెచెట్టు, బడిలో గంట ఏమంది?, చారెడు కళ్ళకు కాటుక బెట్టి మొదలగు ప్రాచుర్యంలో ఉన్న బాల గేయాలు, పిల్లల స్వభావం / అలవాట్లకు సంబంధించిన సంఘటనలు / సన్నివేశాలు. |
| 3 | గుణింత పదాలు | సన్నివేశాలు, అభినయ గేయం, కథలు, చిత్రకథలు | • కూరగాయలు, ఆకుకూరలు, జంతువులు, ఆటలు, పిల్లల వస్తువులు, మొదలగు వాటికి సంబంధించిన గేయాలు / సన్నివేశాలు.<br>• అల్లీ బిల్లీ జాబిల్లి, చందమామరావే జాబిల్లిరావే, కోతి బావకు పెళ్ళంట... మొదలగు ప్రాచుర్యంలో ఉన్న అభినయ గేయాలు. |
| 4 | పొడుపు కథలు (భాషాభిరుచి సృజనాత్మకత) | పొడుపు కథలు | • పిల్లలకు పరిచయం ఉన్న అంశాలకు సంబంధించిన పొడుపు కథలు. ఉదా : నాలుక, చెప్పులు, చుక్కలు, తేనెతుట్టె, చందమామ, ఇంద్రధనుస్సు, ఉత్తరం మొదలగునవి. |
| 5 | చదువు - ఆనందించు (భాషాభిరుచి) | చిత్ర కథలు | • భాషాభిరుచి, సహకారం, జాతర, ఆటలు మొదలగు వాటికి సంబంధించిన చిత్రకథలు (ఉదా:- చీమ, పావురం కథ) |

## 2వ తరగతి - పాఠాల వివరాలు

| క్రమ సంఖ్య | ప్రధానాంశం | ప్రక్రియ | పాఠం వివరాలు |
|---|---|---|---|
| 1 | వర్ణమాల, గుణింతాలు పునశ్చరణ | అభినయగేయాలు, బాలగేయాలు | కూరగాయలకు సంబంధించిన అభినయగేయం, దీపావళి పండుగకు సంబంధించిన అభినయ గేయం, చందమామరావే జాబిల్లిరావే బాలగేయం, హాస్యం కలిగించేలా ఉన్న జంతువులకు సంబంధించిన అభినయ గేయం. |
| 2 | మహాప్రాణాక్షరాల గుణింతాల పునశ్చరణ | కథ | సాహస కథ (జానపదం) |
| 3 | ఒత్తులు (ద్విత్వాలు) పరిచయం | అభినయ గేయాలు, బాలగేయాలు, హాస్యకథ | • చిట్టి చిట్టి మిరియాలు, పొట్టేలు కన్న తల్లి గొర్రె గొర్రె, బావా బావా పన్నీరు, వచ్చే వచ్చే మబ్బులువచ్చే, గువ్వకు జరమమ్మా, చెమ్మ చెక్క చారడేసి మొగ్గ, ఏనుగొచ్చిందేనుగు, రింగు రింగు బిళ్ళ రూపాయిదండ మొదలగు బాల, అభినయ గేయాలు.<br>• తెలివి తక్కువ తనాన్ని తెలిపే హాస్యకథ. |
| 4 | సంయుక్త, సంశ్లేష పదాలు పరిచయం | కథనం | • స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన కథనం. |
| 5 | పొడుపుకథల పునశ్చరణ | సంభాషణ రూపంలోని కథ | • సింహం, కుందేలు సమయస్ఫూర్తి కథ (యక్ష ప్రశ్నల లాగా) |
| 6 | సహకారం, సృజనాత్మకత | చిత్రకథ | ఆపదలో సహాయపడడం అనే ఇతివృత్తం ఆధారంగా జంతువుల కథ. |
| 7 | ఉపాయం, భాషాభిరుచి | గేయకథ | కాకి గుడ్లను పాము మింగడము, ఉపాయంతో కాకి ఆపదనుండి గట్టెక్కడం కథ. |
| 8 | సంస్కృతి(తెలుగు నెలలు) | సంభాషణ | తెలుగు నెలల గురించి వివరించే సంభాషణ (తాతయ్య - పిల్లల మధ్య) |
| 9 | నైతిక విలువలు | శతక పద్యాలు | తెలుగుబిడ్డ, తెలుగుబాల, భరతబాల, వేమన, సుమతీ శతకాలనుండి 8 పద్యాలు. |
| 10 | చదవండి-ఆనందించండి (భాషాభిరుచి) | చిత్రకథలు, హాస్యకథలు, కథ | గాలిపటం, కుందేలు-కోతి స్నేహం, పిల్లల ఆటలు, పరమానందయ్య శిష్యులకు సంబంధించిన చిత్రకథలు, హాస్యకథలు, కథలు. |

## ఈ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు

**1. అభ్యసన వాతావరణం :**

- పిల్లలు స్వేచ్ఛగా పాల్గొనేలా ఆహ్లాదకరమైన తరగతిగది వాతావరణం ఉండాలి.
- భయం, ఆందోళన, దండన, దూషణలను పూర్తిగా నిరోధించాలి.
- పిల్లలందరూ వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతిగది కృత్యాలలో పాల్గొనడానికి వీలుగా తరగతిగదిలో తగిన సౌకర్యాలు ఉండాలి.
- పిల్లలను ఎప్పుడూ ఒకే స్థలంలో కూర్చోబెట్టకుండా కృత్యాలకనుగుణంగా అర్ధవృత్తం, వృత్తాకారం, జట్లలో కూర్చుని పనిచేయడానికి వీలుగా తరగతి గదిలో కూర్చుండబెట్టే విధానం ఉండాలి.
- పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడేలా, ప్రశ్నించడానికి వీలుగా తరగతిగది వాతావరణం ఉండాలి.
- 1, 2 తరగతుల్లో పాఠ్యపుస్తకం ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. పాఠ్యపుస్తకంతోబాటు అదనపు పఠన సామాగ్రిని అందుబాటులో ఉంచి వినియోగించాలి.
- పిల్లలకు చదవడం వచ్చేంతవరకు వేచిచూడకుండా పఠన సామాగ్రిని ఉపయోగించి చదవడం నేర్పడాన్ని ప్రారంభించాలి. పిల్లలతో చిత్రకథ పుస్తకాలు, కార్డులు ఇచ్చి మాట్లాడించడం, ఊహింపజేయడం ద్వారా చదవడాన్ని నేర్పించాలి.
- ప్రతిరోజూ బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా మాట్లాడించడానికి, ప్రశ్నించడానికి తగినంతసమయం కేటాయించాలి. అమలుపరచాలి.
- పిల్లలతో మాట్లాడించడం ద్వారా వారు చెప్పిన పదాలు, వాక్యాలు, సంఘటనలను నల్లబల్లపై రాసి వీటి ఆధారంగా చదవడం, రాయడానికి కృత్యాలు నిర్వహించాలి.
- పిల్లల అభ్యసన సమయం పూర్తిగా సద్వినియోగం అయ్యేలా భాషాబోధనకు కేటాయించిన 90 నిమిషాల సమయాన్ని కృత్యాలతో నిర్వహించాలి. కృత్యాలు ఆలోచింపజేసేలా పిల్లల అనుభవాల ఆధారంగా ఉండాలి.
- మొదటి 45 నిమిషాలను బోధనకు ఉపయోగించాలి. రెండో 45 నిమిషాలను పిల్లలతో వ్యక్తిగతంగా అభ్యాసం చేయించాలి.
- పిల్లలు గీసిన బొమ్మలు, రాసిన అంశాలను తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించాలి. పోర్ట్‌ఫోలియోలో భద్రపరచాలి.
- తరగతిగదులలో వివిధ నేపథ్యాలు, భాషా వైవిధ్యాలు కలిగిన పిల్లలుంటారు. తప్పనిసరిగా పిల్లలు వారి వారి ఇంటిభాష / మాతృభాషలో మాట్లాడడాన్ని అనుమతించాలి. వారి మాతృభాష ఆధారంగా నేర్పాలి.
- పిల్లలు తమకు ఇష్టమైన కథా పుస్తకాలు, సామగ్రిని స్వేచ్ఛగా తీసుకొని ఉపయోగించేలా తరగతి వాతావరణం ఉండాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల్లో అందుబాటులోని, సరఫరా చేసిన సామగ్రిని తప్పనిసరిగా వినియోగించాలి.
- చదవడం-రాయడం నేర్పడానికి అవసరమైన వర్ణమాల చార్టులు, గుణింతాల చార్టులు, ఒత్తుల చార్టులు పదజాల పట్టికలు. తరగతి గదిలో అందుబాటులో ఉంచుకోవాలి.

## 2. బోధనాభ్యసన ప్రక్రియలు :

- పాఠ్యబోధన పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పూర్తి తరగతి కృత్యాలు నిర్వహించేటప్పుడు పిల్లలను అర్థచంద్రాకారంలో కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు వారితోపాటు కూర్చోవాలి.
- పాఠాన్ని ప్రారంభించే ముందు పాఠం చిత్రం ఆధారంగా పిల్లలందరి చేత మాట్లాడించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలడగాలి.
- తర్వాత పాఠాన్ని బోధించాలి. గేయాన్ని నల్లబల్ల / చార్టుపై రాయాలి. ఉపాధ్యాయులు గేయాన్ని చదివి వినిపించాలి. పిల్లలచేత పలికించాలి. గేయాన్ని రాగయుక్తంగా పాడుతూ పిల్లలచే పాడించాలి. తరువాత ఉపాధ్యాయుడు గేయాన్ని అభినయంతో పాడి చూపి పిల్లలచే అభినయం చేయించాలి.
- గేయం / కథ / పాట / సంభాషణ... దీనిలో కీలక పదాన్ని గుర్తింపచేయాలి. కీలక పదంలోని అక్షరాలను స్పష్టంగా పలకడం, చదవడం అభ్యాసం చేయించాలి.
- కీలక పదంలోని అక్షరాలను / గుణింతాలు / ఒత్తులు పాఠంలో గుర్తింపచేయాలి.
- కీలక పదంలోని అక్షరాలు / గుణింతాలు / ఒత్తులు, వర్ణమాల, గుణింతాల, ఒత్తుల చార్టులలో గుర్తింపజేయాలి.
- చదవడం - రాయడం అభ్యాసాలను జట్టు కృత్యాలుగా నిర్వహించాలి.
- కీలక పదంలోని అక్షరాలు / గుణింతాలు / ఒత్తులుతో వచ్చే పదాలు చదివించాలి. రాయించాలి.
- చదవడం - రాయడం అభ్యాసాలకు సంబంధించిన సూచనల గురించి పిల్లలకు అవగాహన కల్పించి వ్యక్తిగతంగా రాయించాలి.
- గ్రంథాలయ పుస్తక పఠనం కోసం కేటాయించిన పీరియడ్‌లో వాన చినుకులు, కథావాచకాలు, బాలసాహిత్యం, అదనపు పఠన సామగ్రిని తప్పనిసరిగా వినియోగించాలి.
- తప్పనిసరిగా ప్రతిరోజు కనీసం 10 నిముషాలు పిల్లలతో మాట్లాడించాలి. 10ని॥లు ఉక్తలేఖనం, దోషాలు సరిదిద్దడం జరగాలి. తర్వాత 25 ని॥లు పాఠ్యపుస్తకం ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ జరగాలి.
- భాషాబోధనకు 90 ని॥ల సమయం ఉంటుంది. కాబట్టి మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, రెండవ 45 ని॥ల సమయంలో పిల్లలతో వ్యక్తిగతంగా అభ్యాసం చేయించడం, తప్పులు సరిదిద్దడం జరగాలి.

## ఉ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు

- 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు తరగతివారీ బాధ్యతలు స్వీకరించి అందుకు అనుగుణంగా కాలనిర్ణయ పట్టిక రూపొందించుకోవాలి.
- భాషకు కేటాయించిన 90 నిమిషాలలో 10 నిమిషాలు పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడింప జేయడం, ప్రశ్నింపజేయడం, 10 నిమిషాలు పిల్లలకు ఉక్తలేఖనం చెప్పడం, దోషాలను సవరించడం, 25 నిమిషాలు పాఠ్యపుస్తకం ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు అభ్యసనం కల్పించాలి. స్థాయిల వారీగా గ్రూపులు చేసి వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ అన్ని స్థాయిల పిల్లలకు తగిన అభ్యాసం కల్పించాలి.

- వార్షిక ప్రణాళికను, పాఠ్య ప్రణాళికను రూపొందించుకోవాలి. దీని ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.
- పిల్లలకు కృత్యాల నిర్వహణకు అవసరమైన వర్ణమాల, గుణింతాలు, ఒత్తులు, పదజాల పట్టికలు, పోస్టరు కార్డు / పాఠం రాసిన చార్టు, మాస్కులు మొదలగు సామగ్రిని ముందుగానే సిద్ధంచేసుకోవాలి.
- ప్రతిరోజు పిల్లలతో మొదటి పది నిమిషాలు పాఠం / చిత్రం ఆధారంగా లేదా తెలిసిన అంశాలపై మాట్లాడించాలి.
- ప్రతిరోజు పిల్లలతో ఉక్తలేఖనం రాయించి పిల్లలు చేసిన దోషాలను గుర్తించి వాటిని నల్లబల్లపై రాసి చర్చ ద్వారా పిల్లలే తమ తప్పులు సరిదిద్దుకునేలా చూడాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలలో పిల్లలందరూ పాల్గొనేలా చూడాలి. పిల్లలతో కీలకపదాల్ని గుర్తింపజేయడం. పదాలలోని అక్షరాలను చార్టులలో గుర్తింపజేయడం, వాటితో పదనిర్మాణం చేయించడం, ఈ పదాలను నల్లబల్లపై రాయించడం, చదివించడం చేయాలి. ఆ పదాలను నోటుపుస్తకాలలో రాయించాలి.
- పిల్లలతో బొమ్మలు గీయించడం, రంగులు వేయించడం, నమూనాలు తయారుచేయించడం, వాటి గురించి మాట్లాడించడం చేయాలి. పిల్లలు చేసినవాటిని గోడపత్రికలో ప్రదర్శించి అభినందింపచేయాలి. పోర్టుఫోలియోలో భద్రపరచాలి.
- పిల్లల చేతిరాత మెరుగుపరచడానికి నోటుపుస్తకాలలో తగిన అభ్యాసం కల్పించాలి. వీటిని ఎప్పటికప్పుడు దిద్దాలి.
- పిల్లలతో వానచినుకులు, కథావాచకాలు వంటి బాలసాహిత్యాన్ని వినియోగిస్తూ పఠన ప్రారంభ కార్యక్రమాన్ని కొనసాగించాలి. ప్రతిరోజూ గ్రంథాలయ పుస్తకాలను చదివించాలి.
- పిల్లలందరు కనీసం 30 పుస్తకాలు చదివేలా ప్రణాళికను రూపొందించి అమలుచేయాలి.
- 1, 2 తరగతులు పూర్తయ్యేసరికి పిల్లలందరు నిర్దేశిత తరగతి వారీ సామర్థ్యాలు సాధించేలా బాధ్యత వహించాలి.
- ఇందుకోసం తాను సామర్థ్యాల ఆధారంగా సొంతంగా తయారుచేసిన ప్రశ్నాపత్రాలనుఉపయోగించి పరీక్షలు నిర్వహించాలి. పిల్లల ప్రగతిని సామర్థ్యాల వారీగా నమోదుచేసి విశ్లేషించాలి. తదుపరి చర్యలు చేపట్టాలి.

## ఊ) మూల్యాంకనం

- పిల్లల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే కాకుండా ఇతర సాధనాల ద్వారా ఎప్పటికప్పుడు అంచనావేసి అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
- ఇందుకొరకు నిరంతర సమగ్ర మూల్యాంకనం నిర్వహించాలి.
- ప్రాథమిక స్థాయిలో 1, 2 తరగతులలో భాషా సామర్థ్యాల ఆధారంగా మూల్యాంకనం జరపాలి.
- వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం, రాయడం, సృజనాత్మకత అనేవి 1, 2 తరగతులకు కేటాయించిన భాషాసామర్థ్యాలు.

- మూల్యాంకనం అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా బోధనాభ్యసన ప్రక్రియల్లో పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, పిల్లలు రాసిన అంశాలు - పరిశీలించి మూల్యాంకనం చేస్తుండాలి.
- 1, 2 తరగతులకు వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం, సృజనాత్మకత - సామర్థ్యాలను మౌఖిక పరీక్షగా నిర్వహించాలి.
- ధారాళంగా చదివి - రాసే అంశాలను, అనగా జతపర్చడం, ఖాళీలను పూరించడం, తప్పొప్పులు గుర్తించడం మొదలగునవి మరియు రాయడం సామర్థ్యానికి సంబంధించిన అంశాలను రాత పరీక్షగా నిర్వహించాలి.

**మౌఖికంగా నిర్వహించే మూల్యాంకనం :**

- పిల్లలు విన్న గేయాలను, పాటలను, కథలను తమ సొంత భాషలో చెప్పే విధానాన్ని పరిశీలించాలి.
- పాఠం బోధించు సమయాల్లో, ఇతర సమయాల్లో కూడా పిల్లలు ప్రశ్నించే తీరు, ప్రశ్నలకు సమాధానాలు చెప్పే తీరును పరిశీలించాలి.
- పిల్లలు తమ అభిప్రాయాలను సొంతంగా, స్వేచ్ఛగా చెప్పే తీరును (అనగా "నీవైతే ఏం చేస్తావు?" నీకిష్టమైనదేది? ఎందుకిష్టం?", "నీకు తెలిసిన కూరగాయలు చెప్పు" మొదలగు ప్రశ్నలు) పరిశీలించాలి.
- గేయాలను అభినయించే తీరును, లయబద్ధంగా పాడే తీరును కూడా పరిశీలించాలి.
- గేయాలను పొడిగించి చెప్పడం పరిశీలించాలి.
- పదాలను, వాక్యాలను చూసి ధారాళంగా చదవడం, చిత్రం చూసి పేరు చెప్పడం, చిత్రం గురించి స్వేచ్ఛగా మాట్లాడడం పరిశీలించాలి.
- తోటి పిల్లలతో కలిసి ఆడడం, పాడడం, పనిచేయడం పరిశీలించాలి.

**రాత పరీక్ష "రాయడం" సామర్థ్యం మూల్యాంకనం :**

- రాయడం అన్నది ప్రాథమిక స్థాయిలోనే నేర్పాలి. కనుక పిల్లలచే తప్పనిసరిగా నోటు పుస్తకాలలో రాయడం అలవాటు చేయాలి.
- ప్రారంభ దశలోనే ఎప్పటికప్పుడు వారు రాసిన తప్పులను సరిచేస్తూ సరియైన విధంగా రాసేటట్లు చూడాలి.
- సరళపదాలు, గుణింతపదాలు, ఒత్తులపదాలు, తమకు తెలిసిన పదాలను సొంతంగా, తప్పులేకుండా రాయడాన్ని పరిశీలించాలి.
- తమకు తెలిసిన, చదివిన, విన్న, చూసిన వాటి గురించి సొంతమాటల్లో 2, 3 వాక్యాలు రాయడాన్ని పరిశీలించాలి.
- వాక్యాల రూపంలో రాసేటప్పుడు పూర్తి వాక్యాల్లో రాయడాన్ని (వాక్య నిర్మాణ క్రమం) పరిశీలించాలి.

- అక్షరాలను, పదాలను అందంగా రాయడాన్ని, పదాల మధ్య సరైన దూరంతో రాయడాన్ని, దోషరహితంగా రాయడాన్ని పరిశీలించాలి.
- మూల్యాంకనం అనేది సామర్థ్యాల వారీగా నిర్వహించబడాలి. ఇందుకోసం సామర్థ్యాల వారీగా కేటాయించిన భారత్వపట్టిక ప్రకారం ప్రశ్నా పత్రం రూపొందించుకోవాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనంలో భాగంగా పిల్లలు రాసిన నోటు పుస్తకాలను, ప్రాజెక్టు పనులను పరిగణలోకి తీసుకొని పరిశీలించాలి.

## ఋ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి

1, 2 తరగతుల్లో కింది బోధనాభ్యసన సామగ్రి అందుబాటులో ఉండాలి. దానిని వినియోగించాలి.

- వర్ణమాల ఛార్టులు
- గుణింతాల ఛార్టులు
- ద్విత్వ, సంయుక్తాక్షరాల ఛార్టు
- స్నేహ బాలకార్డులు
- బాలసాహిత్యం
- వార్తాపత్రికలు / మేగజైన్లు
- వానచినుకులు పుస్తకాలు
- కథావాచకాలు
- చిత్రకథ పుస్తకాలు
- అక్షరాల కార్డులు
- పదజాల పట్టికలు మొదలైనవి
- ఆలోచింపజేసే చిత్రాలు

*విద్యార్థులు దోషరహితంగా రాయాలనే ఉపాధ్యాయులు కోరుకుంటారు. పిల్లలు తమ అభిప్రాయాలను. సొంత ఆలోచనలను, అనుభూతులను లిఖిత రూపంలో వ్యక్తీకరించే తీరుకు ప్రాధాన్యం లభించడంలేదు. ఉచ్చారణదక్షతకు సంబంధించి మొదటగానే నిర్ణయించుకున్న మాండలికంలో మాట్లాడడానికి అనుమతించరు. యాంత్రికంగా సరిగా రాయమని పట్టుపట్టడంవల్ల పిల్లలు తమ ఆలోచనల్ని, అభిప్రాయాల్ని స్వేచ్ఛగా లిఖితరూపంలో వ్యక్తీకరించలేరు. రాత నైపుణ్యాన్ని కూడా ఒక కళాత్మక క్రియగా, వ్యక్తీకరణగా చూడాల్సిన అవసరాన్ని ఉపాధ్యాయులు గుర్తించేట్లు చేయాలి. లేఖనాన్ని కేవలం కార్యాలయ నైపుణ్యంగా పరిగణించకుండా జాగ్రత్తపడాలి. ప్రాథమికదశలో రాతనైపుణ్యాలను సమగ్రంగా అభివృద్ధిపరచాలి. ఈ నైపుణ్యాలను భాషణం, శ్రవణం, పఠనంతో అనుసంధానించాలి. మాధ్యమిక స్థాయిలో నోట్సు రాసుకోవడం ఒక నైపుణ్యాభివృద్ధి సూచికగా ఉపయోగించుకోవాలి. తద్వారా యాంత్రికంగా నల్లబల్ల పై రాసినదాన్ని పాఠ్యపుస్తకాలు లేదా దర్శిని పుస్తకాల్లో ఉన్న విషయాలను ఎత్తిరాయడాన్ని నిరుత్సాహపరచవచ్చు. సంప్రదాయంగా నేర్పే లేఖలు, వ్యాసాల రచనలను విలువరించుటయేగాక ఊహాకల్పనలు, మౌలికతలకు విద్యాక్షేత్రంలో ప్రముఖస్థానం లభిస్తుంది.*

*- జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005*

# V. పాఠ్యప్రణాళిక - రెండదశ - 3, 4, 5 తరగతులు

## అ) భాషా సామర్థ్యాలు - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. వినడం, అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
| --- | --- | --- |
| • గేయాలను రాగంతో పాడడం. అభినయం చేయడం.<br>• గేయాలు, కథలు, సంభాషణలు, వ్యాసాలు, ఆత్మకథలు, సంఘటనలు, పదాలు మొ॥వి విని అర్థం చేసుకోవడం. సొంత మాటల్లో చెప్పగలగడం.<br>• తెలిసిన, విన్న, చూసిన అంశాల గురించి సొంతమాటల్లో అర్థమయ్యేలా క్రమపద్ధతిలో చెప్పగలగడం.<br>• వ్యక్తుల గురించి, పాఠాలలోని పాత్రల గురించి తమ అభిప్రాయాలను చెప్పగలగడం.<br>• వివిధ సన్నివేశాల్లో సందర్భోచితంగా సరైన భాషను ఉపయోగించడం.<br>• పాఠంలోని చిత్రాల గురించి మాట్లాడగలగాలి. కథ / పాఠ్యాంశాన్ని ఊహించగలగాలి.<br>• పాఠ్యాంశములోని సన్నివేశాలను నిజజీవిత సన్నివేశాలకు అన్వయించి చెప్పగలగాలి. | • గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు మొదలయిన వాటిని విని అర్థంచేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• చర్చల్లో పాల్గొనగలగాలి. తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>• చిన్న చిన్న ప్రసంగాలను ఇవ్వాలి. తెలిసిన వాటి గురించి చెప్పగలగాలి.<br>• కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.<br>• పాఠంలో చిత్రాల గురించి మాట్లాడగలగాలి. కథ / పాఠ్యాంశాన్ని ఊహించగలగాలి.<br>• కథలను పొడిగించి చెప్పగలగాలి.<br>• పాఠ్యాంశ సన్నివేశాలను నిజజీవిత సన్నివేశాలకు అన్వయించి చెప్పగలగాలి. | • గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు, వార్తలు మొదలయిన వాటిని విని అర్థం చేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• చర్చల్లో పాల్గొనగలగాలి. తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>• చిన్న చిన్న ప్రసంగాలు చెయ్యాలి. తెలిసినవాటి గురించి చెప్పగలగాలి.<br>• కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.<br>• పాఠంలో చిత్రాల గురించి మాట్లాడగలగాలి. కథ / పాఠ్యాంశాన్ని ఊహించగలగాలి.<br>• కవుల అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>• కథను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• చూసిన అంశాన్ని గురించి వర్ణించి చెప్పగలగాలి. |

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • పాఠ్యాంశం ఆధారంగా తరువాత ఏం జరుగుతుందో / ఏమౌతుందో ఊహించి చెప్పగలగాలి.<br>• కథలు, సంఘటనలు, జరిగిన సన్నివేశాలు నిజజీవితంలో తమకు ఎదురైన సందర్భాలను గురించి చెప్పగలగాలి.<br>• పాఠాలకు తగిన మరికొన్ని శీర్షికల పేర్లను చెప్పగలగాలి.<br>• చిన్న చిన్న ప్రసంగాలను విని అర్థంచేసుకోగలగాలి. | • పద్యాలలోని నీతులను అన్వయాలను చెప్పగలగాలి.<br>• పాఠాలకు తగిన మరికొన్ని శీర్షికల పేర్లను చెప్పగలగాలి.<br>• వివిధ రకాల ప్రకటనల గురించి చెప్పగలగాలి.<br>• ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి ప్రచార మాధ్యమాల ద్వారా తెలియజేసేముందు జాగ్రత్త చర్యలను గురించి చెప్పగలగాలి.<br>• నచ్చిన పాత్రల గురించి చెప్పగలగాలి. సమాచారాన్ని చేరవేయడానికి అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి చెప్పగలగాలి. | • సూచించిన పదబంధాలను ఏఏ సందర్భాలలో వాడుతారో సోదాహరణంగా చెప్పగలగాలి.<br>• పాఠ్యాంశాలు విన్నప్పుడు, చదివినప్పుడు తమలో కలిగిన అనుభూతులను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• వివిధ రకాల పోస్టర్ల గురించి, వాటి ఉపయోగాల గురించి చెప్పగలగాలి.<br>• పద్యాలలోని నీతులను, అన్వయాలను చెప్పగలగాలి. |

## II. ధారాళంగా చదవడం - అర్థం చేసుకొని చెప్పడం, రాయడం

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • గేయాలను, కథలను, సంభాషణలను, పద్యాలను మొదలైన వాటిని ధారాళంగా చదవాలి. చదివిన అంశాల గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ... వంటి ప్రశ్నలకు సమాధానాలను చెప్పగలగాలి. రాయగలగాలి.<br>• చదివిన అంశాలలోని ప్రాసపదాలు, జంటపదాలు, వ్యతిరేకపదాలు మొదలయిన వాటిని గుర్తించాలి.<br>• చదివిన అంశాలలోని పదాల అర్థాలను సందర్భాన్ని బట్టి గ్రహించాలి.<br>• చదివిన అంశం గురించి అర్థం చేసుకోవాలి. సొంతమాటల్లో చెప్పాలి. రాయాలి. | • పద్యాలు, గేయాలు, పాటలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథల వంటి ప్రక్రియా రూపాలను చదవగలగడం, అర్థం చేసుకొని చెప్పగలగడం.<br>• బాల సాహిత్యం, వార్తపత్రికలు, మేగజైన్‌లు, అపరిచిత అంశాలను చదవగలగడం, అర్థం చేసుకోవడం.<br>• ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, తప్పొప్పులు గుర్తించడం, అర్థాలు గ్రహించడం, శీర్షికలు నిర్ణయించడం, విషయాన్ని క్రమపద్ధతిలో ఉంచడం వంటివి చేయగలగాలి. | • పద్యాలు, పాటలు, గేయాలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయ కథల వంటి ప్రక్రియ రూపాలను చదవగలగాలి. అర్థం చేసుకొని చెప్పగలగాలి.<br>• బాలసాహిత్యం, వార్తాపత్రికలు, సంచికలు, అపరిచిత అంశాలను చదవగలగాలి. అర్థం చేసుకోగలగాలి.<br>• ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం. తప్పొప్పులు గుర్తించడం. అర్థాలు గ్రహించడం. శీర్షికలు నిర్ణయించడం, విషయాన్ని క్రమపద్ధతిలో అమర్చడం వంటివి చేయగలగాలి. |

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
| --- | --- | --- |
| • వివిధ రూపాల్లో ఉన్న బాలసాహిత్యాన్ని ధారాళంగా చదవగలగాలి. అర్థంచేసుకొని చెప్పాలి.<br>• పాఠ్యపుస్తకం చివరలో గల పదపట్టికను ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి.<br>• పదాలను జతపరిచి వాక్యాలను రాయగలగాలి.<br>• ఎవరు ఎవరితో అన్నారు సందర్భాలను చెప్పగలగాలి.<br>• పాఠ్యపుస్తకం చివరగల నిఘంటు రూపంలోని పదపట్టికలను ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి.<br>• పాఠం ఆధారంగా ప్రశ్నలకు సమాధానాలు రాయగలగాలి.<br>• తప్పొప్పులను గుర్తించగలగాలి.<br>• తారుమారుగా ఇచ్చిన వాక్యాలను వరుసక్రమంలో రాయగలగాలి.<br>• చిత్రానికి తగిన వాక్యాలను పాఠంలో గుర్తించగలగాలి.<br>• భావాలకు తగిన వాక్యాలను గేయం / పద్యాలలో గుర్తించగలగాలి.<br>• పేరా / సన్నివేశం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>• ఖాళీలను సరియైన పదాలతో పూరించి రాయగలగాలి.<br>• బొమ్మ బదులు పదం ఉంచి పాఠం చదవగలగాలి. రాయగలగాలి.<br>• తారుమారైన అక్షరాలను సరిచూసి పదాలు రాయగలగాలి.<br>• పాదభంగం లేకుండా పద్యాలను పూరించగలగాలి. | • ప్రాస పదాలను గుర్తించి రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా పట్టికలు నింపగలగాలి. కారణాలు రాయగలగాలి.<br>• భావాలకు తగిన వాక్యాలను గేయం / పద్యాలలో గుర్తించగలగాలి.<br>• పాఠం ఆధారంగా పాత్రల స్వభావం గురించి రాయగలగాలి.<br>• పాఠ్యపుస్తకం చివరగల నిఘంటువులోని పదపట్టికలను ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి. | • పాఠం ఆధారంగా పాత్రల స్వభావం గురించి రాయగలగాలి.<br>• పదాలను జతపరిచి వాక్యాలు రాయగలగాలి.<br>• భావాలకు తగిన వాక్యాలను గేయం / పద్యాలలో గుర్తించగలగాలి.<br>• ఖాళీలలో సరియైన పదాలను ఊహించి రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా పట్టికలు పూరించడం.<br>• ఎవరు? ఎవరితో అన్నారో... సందర్భాలను రాయగల్గాలి.<br>• పాఠ్యపుస్తకం చివరగల నిఘంటువు రూపంలోని పదపట్టికలను ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి. |

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • తెలిసిన, విన్న, చూసిన విషయాలు, కథలు, తన అనుభవాలు, ఇష్టాయిష్టాలు మొదలైనవాటిని గురించి సొంతమాటల్లో ఐదు, ఆరు వాక్యాలు లేదా పేరా రాయాలి.<br>• తప్పుల్లేకుండా, విరామచిహ్నాలు ఉపయోగించి క్రమపద్ధతిలో రాయాలి. రాసేటప్పుడు సంపూర్ణ వాక్యాలను అర్థవంతంగా సరైన పదాలను ఉపయోగించి రాయాలి.<br>• పాఠానికి తగిన శీర్షికలు రాయగలగాలి. ఆ పేరును సూచించడానికి తగిన కారణాలు రాయగలగాలి.<br>• ఆత్మకథ గురించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>• పద్యాలకు తగిన భావాలను సొంతమాటల్లో రాయగలగాలి. | • పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలయిన వాటిని సొంతమాటల్లో రాయగలగాలి.<br>• ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ సొంతమాటల్లో కనీసం 8 వాక్యాలు రాయగలగాలి. అట్లే ఒకటి, రెండు పేరాలు రాయగలగాలి.<br>• ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏం చేస్తారో రాయగలగాలి. తను అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొ॥గు వాటి గురించి రాయగలగాలి.<br>• సూచించిన సన్నివేశాన్ని గురించి వర్ణించి రాయగలగాలి.<br>• నచ్చిన, నచ్చని అంశాల గురించి సొంత మాటల్లో అభిప్రాయాలను రాయగలగాలి.<br>• సందర్భానుసారంగా తగిన సామెతలు, జాతీయాలను పదబంధాలు ఉపయోగించి రాయగలగాలి.<br>• కథ, సంఘటన చదివిన తరవాత కలిగిన అనుభూతులను, భావాలను సొంతమాటల్లో రాయగలగాలి.<br>• దినచర్య గురించి రాయగలగాలి.<br>• క్రమపద్ధతిలో ఉత్తరాలను రాయగలగాలి. | • పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలయిన వాటిని సొంతమాటల్లో రాయగలగాలి.<br>• ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ సొంతమాటల్లో 8 లేదా 10 వాక్యాలు రాయగలగాలి. ఒకటి రెండు పేరాలు రాయగలగాలి.<br>• ఊహించి లేదా తానే ఆస్థానంలో ఉంటే ఏం చేస్తారో రాయగలగాలి. ఆయా సందర్భాలలో తమ అనుభవాల గురించి, చూచిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాయగలగాలి.<br>• కవి భావాలను గురించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>• సందర్భానుసారంగా తగిన సామెతలు, జాతీయాలు, పదబంధాలను ఉపయోగించి రాయగలగాలి.<br>• చూసిన, తెలిసిన ప్రదేశాల విశేషాల గురించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>• నచ్చిన, నచ్చని అంశాల గురించి కారణాలను వివరిస్తూ సొంతమాటల్లో రాయగలగాలి. |

## IV. పదజాలం

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగించాలి. సొంతవాక్యాలు రాయగలగాలి.<br>• పదాలకు వ్యతిరేకపదాలు, వచనాలు మార్చి వాటితో వాక్యాలు రాయగలగాలి.<br>• ఇచ్చిన పదాలకు సంబంధించిన ఇతర అర్థాలు రాయగలగాలి. వాటిని ఉపయోగించగలగాలి.<br>• బహువచన రూపాలు ఎలా ఏర్పడతాయో చెప్పగలగాలి. వచనాలకు అనుగుణంగా వాక్యాలు రాయగలగాలి.<br>• వర్ణమాలనుపయోగించి పదాలను రాయగలగాలి. గళ్లలోని అక్షరాలనువయోగించి వదాలను రాయగలగాలి. ఇష్టమైన జంతువులు, పక్షులపేర్లు రాయగలగాలి.<br>• మైండ్ మ్యాపింగ్‌నువయోగించి వాక్యాలు రాయగలగాలి.<br>• అంత్యాక్షరి పదాలను రాయగలగాలి. | • ఇచ్చిన పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించ గలగాలి.<br>• సందర్భాన్ని బట్టి అర్థాలను గ్రహించ గలగాలి. తిరిగి ఉపయోగించ గలగాలి.<br>• పదపట్టికలు, గళ్లనుడికట్లు, వంటి భాషాక్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాయగలగాలి.<br>• వచనాలకు అనుగుణంగా వాక్య నిర్మాణం చేయగలగాలి.<br>• జాతీయాలను, సామెతలను సందర్భోచితంగా ఉపయోగించగలగాలి.<br>• సమూహములో సంబంధము ఉన్న / లేని పదాలు గుర్తించగలగాలి, రాయగలగాలి. | • ఇచ్చిన పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించ గలగాలి.<br>• సందర్భాన్ని బట్టి అర్థాలను, నానార్థాలను, పర్యాయపదాలను గ్రహించగలగాలి.<br>• పదపట్టికలు, గళ్ళనుడికట్టు, వంటి భాషా క్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాయగలగాలి.<br>• పదాలను జతపరిచి వాక్యాలు రాయగలగాలి.<br>• సమూహములో సంబంధము ఉన్న / లేని పదాలను గుర్తించగలగాలి, రాయగలగాలి.<br>• ఇతర విషయాలకు చెందిన సాంకేతిక (పారిభాషిక) పదజాలాన్ని అర్థంచేసుకోగలగడం, అభ్యసనను మెరుగుపరచుకో గలగాలి. |

*తప్పులు వెదక్కండి*

*మనం పిల్లలకు మాటిమాటికి అడ్డుపడకుండా ఉంటే, వారిని నిరాశా నిస్పృహలకు లోనుచేయకుండా ఉంటే, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉంటే వారు ఎన్నిసార్లయినా తమ ప్రయత్నాలు పట్టువిడవక చేస్తూ తమ పనిలో సంపూర్ణత్వాన్ని సాధించేతీరుతారు. ఎందుకంటే ప్రతివ్యక్తీ తాను చేసే పనిని సక్రమంగా బాగా చేయాలని తపించిపోతుంటాడు. దీనినే పెద్దవారు అర్థం చేసుకోగలిగితే పిల్లలను వారి స్వేచ్ఛకు వదిలి వేయగలుగుతారు.*

*- గిజుభాయి*

## V. సృజనాత్మకత

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • సూచనల ఆధారంగా చిత్రాలు గీసి రంగులు వేయగలగాలి.<br>• పాఠం ఆధారంగా చిత్రాలు గీసి రంగులు వేయగలగాలి.<br>• పరిసరాలలోనున్న చెట్లు, పువ్వులు గీసి రంగులు వేయగలగాలి. వాటి గురించి కవితలు, గేయాలు రాయగలగాలి.<br>• ఇష్టమైన ఆటవస్తువుల బొమ్మలు గీయగలగాలి. వాటి గురించి రాయగలగాలి.<br>• కాగితాలతో బొమ్మలు చేయగలగాలి. వాటి గురించి రాయగలగాలి.<br>• వేలి ముద్రలతో బొమ్మలు వేయగలగాలి. వాటితో కథను రాయగలగాలి. చిత్రాల ఆధారంగా కథను ఊహించి రాయగలగాలి.<br>• చిత్రం ఆధారంగా గేయాలను పొడిగించగలగాలి.<br>• పాఠంలోని భావాన్ని అన్వయించి ఇచ్చిన గేయాలను పొడిగించగలగాలి.<br>• పాఠంలో ఉన్న గేయాన్ని పొడిగించి రాయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.<br>• పాఠంలోని భావాన్ని అన్వయించి ఇతర వస్తువులకు ఆపాదించి ఊహించి రాయగలగాలి.<br>• చిత్రం ఆధారంగా హాస్య సంభాషణలు రాయగలగాలి. | • కథలు, కవితలు, గేయాలను పొడిగించగలగడం, సొంతంగా రాయగలగడం, ఆత్మకథలు, నినాదాలు, సూక్తులు, లేఖలు, సంభాషణలు మొదలగు వాటిని రాయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.<br>• సూచనలకు అనుగుణంగా చిత్రాలను గీయడం, రంగులు వేయడం వాటి గురించి రాయగలగాలి.<br>• మాస్కులు తయారుచేయడం, మట్టితో బొమ్మలు వేయడం, రంగులు వేయడం, ప్రదర్శించి మాట్లాడడం చేయగలగాలి.<br>• పద్య భావాలకు తగినట్టుగా (అనుగుణంగా) సొంతంగా కథ రాయగలగాలి.<br>• జాతీయాలు, సామెతలు ఉపయోగిస్తూ సొంతంగా కథలు రాయగలగాలి.<br>• సందర్భానుసారంగా హాస్యోక్తులు రాయగలగాలి. | • కథలు, కవితలు, గేయాలను పొడిగించగలగాలి. సొంతంగా రాయగలగాలి. ఆత్మకథలు, నినాదాలు, సూక్తులు, లేఖలు, సంభాషణలు మొదలయిన వాటిని రాయగలగాలి. ఏకపాత్రల అభినయం మరియు నాటకీకరణ చేయగలగాలి.<br>• సూచనలకు అనుగుణంగా చిత్రాలు గీయడం, వాటిని గురించి వర్ణించగలగాలి. పోస్టరు అభినందన పత్రాలు, ఆహ్వానపత్రాలు - గ్రీటింగ్ కార్డులు, మాస్కుల తయారీ, నమూనాలను తయారు చేయగలగాలి.<br>• సూచనల ఆధారంగా ప్రసంగ వ్యాసాలను రాయగలగాలి.<br>• సందేశాత్మక వ్యాసాలు రాయగలగాలి. |

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • చిత్రం ఆధారంగా పాత్రల సంభాషణలు రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా పాత్రల మధ్య సంభాషణలు రాయగలగాలి.<br>• గేయాలకు సంభాషణలు రాయగలగాలి. మాస్కులు తయారుచేయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.<br>• చిత్రం ఆధారంగా బయోడేటా రాయగలగాలి.<br>• పద్యభావాలకు తగిన సంభాషణలు రాయగలగాలి.<br>• కథలను ఊహించి రాయగలగాలి. పాఠంలోని భావాన్ని అన్వయించి కథలను ఊహించి రాయగలగాలి.<br>• పద్యభావాలకు తగిన కథలను రాయగలగాలి. | | |

## VI. ప్రశంస

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • ఇతరులను, ఇతర భాషలను గౌరవించడం<br>• ప్రాంతాల వారీగా జరిగే పండుగలను ఆచారాలను, సంస్కృతులను తెలుసుకోగలగాలి.<br>• ఇతర భాషలకు చెందిన పదాలను వాక్యాలను అర్థం చేసుకోగలగాలి. | • తోటివారు, మహిళలు, ఇతర వర్గాలు, ఇతర సంస్కృతులు, సేవలు చేసిన వారిని, భాషాశైలిని ప్రశంసించగలగాలి.<br>• అమాయకులను, ప్రతిభావంతులను, పోటీలలో గెలిచిన వారిని, ప్రకృతిని, పర్యావరణాన్ని, మూగజీవులను (పక్షులు, జంతువులు, చెట్లు) మరియు అంగవైకల్యంగలవారిని గౌరవించగలగాలి, ప్రశంసించగలగాలి. | • తోటివారు, మహిళలు, ఇతర వర్గాలు, ఇతర సంస్కృతులు, సేవలుచేసిన వారిని, భాషాశైలిని ప్రశంసించగలగాలి.<br>• అమాయకులను, ప్రతిభావంతులను, పోటీలలో గెలిచినవారిని, ప్రకృతిని, పర్యావరణాన్ని, మూగజీవులను (పక్షులు, జంతువులు, చెట్లు...) మరియు అంగవైకల్యంగలవారిని గౌరవించగలగాలి. ప్రశంసించగలగాలి. |

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| | • ఎదుటివారిలోని లోపాలను గుర్తించి, వాటివల్ల కలిగే నష్టాలను సంయమనంతో వివరించగలగాలి.<br>• ఇతర భాషలకు చెందిన పదాలను, వాక్యాలను అర్థం చేసుకోగలగాలి. | • ఇతర భాషలకు చెందిన పదాలను, వాక్యాలను అర్థం చేసుకోగలగాలి. |

## VII. భాషను గురించి తెలుసుకుందాం!

| 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|
| • పదాలలోని హ్రస్వ, దీర్ఘాక్షరాలు, అల్పప్రాణ, మహాప్రాణ అక్షరాలను స్పష్టంగా పలకడంలో తేడాను గుర్తించగలగాలి.<br>• వాక్యాలలోని నామవాచకాలు, సర్వనామాలు, క్రియలను గుర్తించాలి. ఉదాహరణలు చెప్పాలి. | • భాషాభాగాలను కాలాలు, విరామచిహ్నాలను ఉపయోగించగలగడం, కాలాలకు అనుగుణంగా క్రియలను ఉపయోగించగలగాలి. సమాపక, అసమాపక క్రియలను గుర్తించి ఉపయోగించగలగాలి. | • భాషాభాగాలతోపాటు కాలాలకు అనుగుణంగా క్రియలను ఉపయోగించగలగాలి. వాక్య నిర్మాణాన్ని, వాక్యాల రకాలను, (సామాన్య, సంయుక్త, సంక్లిష్ట) గుర్తించగలగాలి. క్రియరహిత వాక్యాలు, కర్త, కర్మ, క్రియలను, విభక్తులను గుర్తించగలగాలి ఉపయోగించగలగాలి. |

# ఆ) పాఠ్యపుస్తకాలు

**3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకాల లక్షణాలు :**

- 3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకాలు పిల్లలను ఆలోచింపజేయడానికి ఆలోచనలను క్రమపద్ధతిలో వ్యక్తీకరించడానికి, సృజనాత్మకతను పెంపొందించడానికి వీలుగా ఉండాలి.
- పాఠ్యపుస్తకాలలో కనీసం 40% చిత్రాలు ఉండాలి
- ప్రతి పాఠానికి పిల్లలను సంసిద్ధులను చేయడానికి ఉన్ముఖీకరణ చిత్రాన్ని చేర్చాలి. దీని ఆధారంగా ప్రశ్నలు అడగడం, మాట్లాడించడానికి అవకాశం ఉండాలి.
- 3వ తరగతి పాఠ్యపుస్తకం 50% అభ్యాసపుస్తకంగా ఉండాలి.

- 4, 5 తరగతులు పాఠ్యపుస్తకాలు కూడా 30%-40% వరకు అభ్యాస పుస్తకంగా ఉండాలి.
- పాఠ్యపుస్తకాలలో 16 నుండి 18 వరకు పాఠ్యాంశాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలలో పాఠాలు వివిధ వ్యవహార రూపాలలో ఉండాలి. అవి కథలు, గేయకథలు, హాస్యకథలు, అద్భుత కథలు, జానపద కథలు, పద్యాలు, కథనం, ఆత్మకథ, గేయాలు, లేఖలు వ్యాసం, సంభాషణ మొదలగు వాటి రూపంలో ఉండాలి.
- 'చదువు - ఆనందించు' పేరుతో పిల్లలు చదవడం కోసం కథలు, గేయాలు, పాటలు వంటివి చేర్చాలి.
- ప్రారంభపాఠాలలో వర్ణమాల, గుణింతాలు, ఒత్తులు వంటివి పునశ్చరణకోసం అభ్యాసాలను చేర్చాలి.
- 3, 4, 5 తరగతులు పూర్తయ్యేసరికి కనీసం 30-40 పద్యాలు నేర్చుకోవాలి. ఇవి వేమన, సుమతీ, తెలుగు బాల, భరతబాల, కుమార, కుమారీ, నార్ల, తెలుగుబిడ్డ మొదలగు శతకాలలోని పద్యాలు ఉండాలి.
- విద్యార్థులను వివిధ కోణాలలో ఆలోచింపచేసే విధంగా పాఠాలు, అభ్యాసాలు ఉండే విధంగా పాఠ్యపుస్తకాన్ని రూపొందించాలి. (అనగా ఆలోచనాపరిధి విస్తరణకు అనుగుణంగా ఉండాలి).
- పాఠ్యపుస్తకంలో ప్రతి పాఠంలో భాషా విద్యా ప్రమాణాల ఆధారంగా అభ్యాసాలను పొందుపర్చాలి.
- పాఠ్యాంశాలు పిల్లల స్వభావానికి దగ్గరగా చదవడానికి వీలుగా, ఆనందించేలా, ఆలోచింపజేసేవిగా ఉండాలి.
- 3 వ తరగతి ప్రారంభ పాఠాలు 1, 2 తరగతుల సామర్థ్యాలు అనగా చదవడం, రాయడంపై పునరభ్యాసం కలిగించేలా, సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా ఉండాలి.
- ప్రశ్నలు ఒకే సమాధానం వచ్చేలా కాకుండా రకరకాల జవాబులు వచ్చేలా ఉండాలి. అట్లే పాత్రలు వాటి స్వభావాలు, వాటి ఔచిత్యం మొదలగు వాటి గురించి పిల్లలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తీకరించేలా ఉండాలి.
- పాఠాలకింద పదాలకు అర్థాలు నేరుగా ఇవ్వకుండా సందర్భాన్నిబట్టి అర్థాలను గ్రహించేలా అభ్యాసాలు ఉండాలి. అలాగే పాఠ్యపుస్తకం చివర 'అ'కారాది క్రమంలో పదాలు-అర్థాల జాబితా ఇచ్చి వాటిలో వెతికి పదాలకు అర్థాలను కనుగొనమని చెప్పవచ్చు.
- పాఠ్యాంశాలను కింది ఇతివృత్తాల ఆధారంగా ఎంపికచేయాలి.
    - ★ **దేశభక్తి, మానవతా విలువలు, మానవసంబంధాలు, సహకారం.**
    - ★ **సామాజిక స్పృహ, పర్యావరణం, జీవనైపుణ్యం / జీవకారణ్యం.**
    - ★ **భాషాభిరుచి, సంస్కృతి, సంప్రదాయాలు.**
    - ★ **సృజనాత్మకత, కాల్పనికత, హాస్యం.**
    - ★ **పిల్లల శక్తిసామర్థ్యాలు, పిల్లల స్వభావం, ఆసక్తులు, సమయస్ఫూర్తి.**

- వీలైనంతమేరకు పాఠ్యాంశాలను బాలసాహిత్యం నుండి, బాలలఅకాడమి, సి.బి.టి., ఎన్.బి.టి. వాటి సంస్థల ప్రచురణల నుంచి గేయాలు, కథలు, కథనాలు, పాటలు మొదలగునవి ఎంపికచేయాలి.
- పిల్లల్లో చదివే అలవాటు, ఆసక్తి పెంపొందడానికి, స్వీయ అధ్యయనంపై పట్టు పెరగడానికి కథలు / గేయాలు / సంభాషణలు / వ్యాసాలు / చిత్రకథ వంటి రూపాల్లో 'చదవండి-ఆనందించండి' పేరుతో చేర్చాలి.
- ప్రతి పాఠం చివరలో అభ్యాసాల తరువాత పాఠ్యాంశానికి సంబంధించి ప్రభావితంచేసే విధంగా సూక్తి ప్రత్యేకమైన రంగుపట్టికలో ఉండాలి.
- వ్యాకరణాంశాలు కేవలం కంఠతాపట్టడానికి కాకుండా ఇచ్చిన అంశాన్ని చదివి విశ్లేషించి తమకు తాము సూత్రీకరించుకునేలా లేదా నియమాలు గ్రహించేలా అభ్యాసాలు ఉండాలి.
- అభ్యాసాలుగా భాషాక్రీడలు, పజిల్స్, ప్రాజెక్టుపనులు ప్రశంసాపూర్వక కృత్యాలు మొదలగువాటిని చేర్చాలి.
- పాఠ్యపుస్తకంలోని చిత్రాలు పాఠంలోని విషయాన్ని ఊహించేవిధంగా, బోధనాభ్యసన ప్రక్రియలను అర్థం చేసుకునేలా, ఆలోచింపజేసేలా సృజనాత్మకతను పెంపొందించడానికి వీలుగా ఉండాలి.
- భాషాభ్యసనం పాఠ్యపుస్తకానికే పరిమితంకాకుండా అదనపు పఠన సామగ్రిని చదవడానికి వీలుగా ఉండాలి.
- పాఠ్యపుస్తకం ప్రారంభంలోనే విద్యా సంవత్సరం పూర్తయ్యే సరికి సాధించాల్సిన సామర్థ్యాల జాబితాను చేర్చాలి.
- అట్లే పాఠ్యపుస్తకాన్ని వినియోగించడం గురించి ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు సూచనలు కూడా చేర్చాలి.
- ప్రతి పాఠంలో ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల గురించి పిల్లలే తమను తాము అంచనావేసుకోవడానికి "స్వీయ మూల్యాంకనం" కోసం అభ్యాసాన్ని చేర్చాలి.
- పాఠంలోని చిత్రాల ఆధారంగా సంభాషణలు ఊహించి చెప్పడానికి పాఠం చదివి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోవడానికి సూచనలు ఉండాలి.
- పాఠాన్ని చదవడానికి ఆసక్తికలిగే విధంగా ప్రేరణా వాక్యాలు ఉండాలి.
- సూచనలను అర్థంచేసుకొని సొంతంగా అభ్యాసాలను చేయుటకు పురిగొల్పేలా సామర్థ్యాలకు అనుగుణంగా లోగోలు ఉండాలి.
- పాఠంలోని విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడానికి అభ్యాసాలవద్ద కూడా చిత్రాలు ఉండాలి.
- ఉపాధ్యాయులకు పాఠ్యబోధనకు నిరంతర సమగ్ర మూల్యాంకనకు అనువుగా ఒక క్రమమైన పద్ధతిలో (సంసిద్ధత, పాఠ్యబోధన, సామర్థ్యాలు సాధించడానికి అభ్యాసాలు, స్వీయమూల్యాంకనం) పాఠాల అమరిక, ఉండాలి.
- ఉపాధ్యాయులు - పిల్లల మధ్య, పిల్లలు - పిల్లల మధ్య, సమాజసభ్యులు - పిల్లలమధ్య, అదనపు అభ్యసన / పఠన సామగ్రి - పిల్లల మధ్య పరస్పర ప్రతిచర్యలకు అవకాశం కల్పించే విధంగా పాఠాలు, అభ్యాసాలు ఉండాలి.
- ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువుగా పాఠాలు, బహుళ స్థాయికి ఉద్దేశించిన రకరకాల సామర్థ్యాధారిత అభ్యాసాలు ఉండాలి.
- పిల్లలు తమకున్న భాషా సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించడానికి వివిధ కృత్యాలతో కూడిన ప్రాజెక్టుపనులు ఉండాలి.

## ఇ) పాఠ్యాంశాల వివరాలు

### 3వ తరగతి - పాఠాల వివరాలు

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 1 | దేశభక్తి | గేయం | దేశభక్తిని కలిగించే గేయం - తొలకరి చిరుజల్లులు | రచన : జంధ్యాల వెంకటేశ్వరశాస్త్రి మూలం : మలెల్ల మందారాలు, బాలల అకాడమి |
| 2 | ఇతిహాసం | కథ | బాలభీముని బాల్యాన్ని గురించి తెలిపే ఇతిహాసకథ. | |
| 3 | సున్నితత్వం | సంఘటన | దారితప్పిన ఎలుగుబంటి చేసిన పనుల గురించి తెలిపే సంఘటన - దారితప్పిన బాలు | |
| 4 | పర్యావరణం, సున్నితత్వం | గేయం | బాలల్లారా వినండి. ఏమవుతుందో చెప్పండి. | నాళం కృష్ణారావు - "గోరు ముద్దలు" |
| 5 | హాస్యం | కథ | రామకృష్ణుడు వరహాలయ్యకు బుద్ధి చెప్పడానికి సమయస్ఫూర్తితో అబద్ధమాడే హాస్యకథ - పారిపోయిన గిన్నెలు. | |
| 6 | వ్యాసం | దేశనాయకుల జీవిత విశేషాలు - స్ఫూర్తి | దేశనాయకుల జీవిత విశేషాలు - స్ఫూర్తి గురించి తెలిపే వ్యాసం - మహాత్ముడు. | |
| 7 | సహకారం | గేయకథ | కష్టాల్లో ఉన్న వారికి తగిన సహకారమందివ్వాలని తెలిపే గేయకథ - సహకారం. | |
| 8 | పర్యావరణం, పరిశుభ్రత | వ్యాసం | పరిసరాల - పరిశుభ్రత గురించి తెలిపే వ్యాసం - ఆరోగ్యమే - మహాభాగ్యం. | |
| 9 | సంస్కృతి / పండుగలు | సంభాషణ | వివిధ మతాలకు సంబంధించి పండుగలయొక్క విశేషాలు మరియు సంస్కృతి సంప్రదాయాల గురించి తెలిపే సంభాషణ - మన పండుగలు. | |

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 10 | పిల్లల సామర్థ్యాలు | గేయం | భలె భలె భలె భలె బాలల మండి భలేగ ఆటలు ఆడెదమండి - మా ఆటలు. | |
| 11 | హాస్యం | గేయకథ | బెల్లం లడ్డూ తనబాధ గురించి బ్రహ్మదేవుడికి చెప్పుకునే గేయకథ - లడ్డూబాధ. | డా॥ మహీధర నళినీమోహన్.<br>మూలం : కోంతి తపస్సు<br>గేయకథలు - బాలల అకాడమీ. |
| 12 | కళలు / వస్తువుల తయారీ విధానం | ఆత్మకథ | గాలిపటం! తనగురించి తాను చెప్పుకునే ఆత్మకథ. | |
| 13 | వినోదం / విలువలు | చిత్రకథ | కోతి చేసిన అల్లరి పనుల గురించి తెలిపే చిత్రకథ - కోతి - పెన్సిల్ | |
| 14 | దర్శనీయస్థలాలు | వ్యాసం | పిల్లల మర్రి ప్రత్యేకత గురించి తెలిపే వ్యాసం. | |
| 15 | కాల్పనికత | కథ | తగని కోరికలు కోరితే ఏం జరుగుతుందో తెలిపే వినోదకథ. | |
| 16 | విలువలు | శతక పద్యాలు | సుమతీ, వేమన, తెలుగుబిడ్డ, తెలుగుబాల, భరతబాల (10) | |
| | **చదువు - ఆనందించు**<br>సమయస్ఫూర్తి - ధైర్యం, పర్యావరణం, భూతదయ - జంతువులను ప్రేమించడం, హాస్యకథ, అద్భుతకథ, తెలుగువారి సంస్కృతి, మానవసంబంధాలు | కథ, వ్యాసం, సంభాషణ, | సీసాభూతం, ఋతువులు, దయ, పరుగోపరుగు, కాకుల లెక్క, వింతలోకం, తిథులు, బంగారు పాప వంటివి కథలు, వ్యాసాలు, సంభాషణలు. | |

## 4వ తరగతి - పాఠాల వివరాలు

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 1 | ప్రకృతి | గేయం | వర్షాలు | శ్రీవానమామలై వరదాచార్యులు గారి "విప్రలబ్ధ" నుంచి |
| 2 | హాస్యకథ | కథ | పరమానందయ్య శిష్యుల గురించి తెలిపే హాస్యకథ - సూదికథ. | |
| 3 | సృజనాత్మకథ | కథ | తిమ్మరుసు బాల్యంలోని సంఘటన - కథ. | కరుణశ్రీ డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి |
| 4 | పర్యావరణం | కథనం | ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం గురించి తెలిపే కథనం. | |
| 5 | దేశభక్తి | గేయం | "విహరింపనిమ్మా! విహరింపనిమ్మా!" జెండా గేయం. | గురజాడ రాఘవ శర్మ |
| 6 | సంస్కృతి | వ్యాసం | వినాయక చవితి పండుగ ప్రత్యేకత గురించి మరియు సంస్కృతి సంప్రదాయాలు గురించిన వ్యాసం. | |
| 7 | నైతిక విలువలు | శతక పద్యాలు | వేమన, సుమతి, తెలుగుబిడ్డ, తెలుగుబాల, కుమారా శతకం నార్లవారి మాట (10) | |
| 8 | భాషాభిరుచి | గేయకథ | ఎలుక విందు గేయకథ. | దాశరథి కృష్ణమాచార్య |
| 9 | జీవవైవిధ్యం | గేయం | అదిగోచిలుక - రండ్రరా - రండి. | మల్లెపందిరి గిడుగు రాజేశ్వరరావు |
| 10 | సమయస్ఫూర్తి | కథ | "ఎలుగుబంటి - రైతు' సమయస్ఫూర్తి కథ. | |
| 11 | పిల్లల స్వభావం | కథనం | పిల్లల స్వభావం, అలవాటును తెలిపే కథనం. | పూల పొట్లాలు - బాలల అకాడమి |

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 12 | సామాజిక స్పృహ | సంభాషణ | చెట్లను కాపాడుకోవడం, జీవవైవిధ్యం, విద్యుత్ పొదుపు మొదలయిన వాటికి సంబంధించిన సృజనాత్మకత సంభాషణ | |
| 13 | వికలాంగులు | కథనం | వికలాంగుల మనోభావాలు, ఆత్మవిశ్వాసం గురించి తెలిపే కథనం - చక్రాలకుర్చీ | మూలం : NCERT పాఠ్యపుస్తకంలో నుండి అనువాదం |
| 14 | పిల్లల స్వభావం | కథ | ఇష్టమైన వాటిని ఇతరులతో పంచుకోవడంలో ఉన్న ఆనందం మరిదేనిలోనూ లేదని తెలిపే బొమ్మ గుర్రం కథ | మూలం : చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్ దీపా అగర్వాల్ |
| 15 | పిల్లల శక్తులు | కథనం | గిరిజన పిల్లల్లో దాగియున్న అంతర్గత శక్తులు / నైపుణ్యాలు గురించి తెలిపే కథనం. | |
| 16 | సమాజం | కథనం | పోస్టాఫీసు గురించిన కథనం | |
| | **చదువు - ఆనందించు** భాషాభిరుచి, సంస్కృతి, కళలు, మొ॥వి. | వ్యాసం, కథ, గేయం | చిన్నకృష్ణుని కథ, రంజాన్ పండగ, సరోజినీనాయుడు, తెలుగు సంవత్సరాలు, పడవలు చేద్దాం, చిత్రకళ వాటికి సంబంధించిన కథలు, వ్యాసాలు, గేయాలు. | |

*__పిల్లలతో సంభాషణ__*

*సంభాషణల ద్వారా ఉపాధ్యాయుడు పిల్లవాడి మనస్సు లోతుల్లోకి వెళ్ళగలడు. దానితో పాటే వాడి భాషాలోపాలను కూడా పసిగట్టగలడు. రోజూ పిల్లవాడితో ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ఉండడంవల్ల వాడి భాషాజ్ఞానం పెరుగుతుంది. తమ అభిప్రాయాలను క్రమబద్ధంగా వ్యక్తీకరించే శక్తిని పొందుతుంటాడు. అలాగే భాష ద్వారా సంస్కారవంతమైన జీవితాన్ని నాగరికమైన ప్రవృత్తిని నేర్చుకుంటూ ఉంటాడు.*

*- గిజుభాయి*

## 5వ తరగతి - పాఠాల వివరాలు

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 1 | దేశభక్తి | గేయం | స్వతంత్రోత్సవం దేశభక్తి భావాన్ని పెంపొందింపజేసే గేయం.<br>పవిత్ర భారత సవిత్రకోహూ... గేయం. | 'గౌతమీ కోకిల' వేదుల సత్యనారాయణ శాస్త్రి |
| 2 | మానవ సంబంధాలు | కథనం | సహవాసం మానవ సంబంధాల గురించి తెలిపే కథనం. | |
| 3 | దర్శనీయ స్థలాలు | వ్యాసం | త్రిలింగాలు దర్శనీయస్థలం. వివిధ ప్రాంతాల ప్రాశస్త్యాన్ని తెలిపే వ్యాసం. | |
| 4 | పర్యావరణం | కథనం | ప్రకృతిపై ప్రేమ, ఆరాధన పెంపొందించుకోవడం, పర్యావరణ పరిరక్షణ వంటివి తెలిపే 'మాతోట' గేయం. | "గుజ్జనగూళ్ళు" నుండి |
| 5 | పిల్లల స్వభావం | కథ | గోపిడప్ప కథ | మూలం : CBT న్యూఢిల్లీ |
| 6 | శాస్త్రీయత | వ్యాసం | అన్నం విలువ, రైతు విలువ, పంట పండించటంలోని వ్యయప్రయాసల్లోని శాస్త్రీయతను తెలిపే వ్యాసం. | |
| 7 | స్ఫూర్తి విలువలు | వ్యాసం | "జెండా వెంకయ్య" గురించిన వ్యాసం. | |
| 8 | వికలాంగుల ఆత్మగౌరవం | లేఖ | మనసుంటే మార్గం ఉంటుంది అన్నట్లు వికలాంగుల ఆత్మగౌరవం. వారిలో ఉండే నైపుణ్యాలు, పట్టుదల గురించి తెలిపే వ్యాసం. | మూలం : NCERT పాఠ్యపుస్తకం నుండి అనువాదం |
| 9 | జీవవైవిధ్యం | గేయకథ | జీవరాశిని కాపాడడం గురించి తెలిపే గేయకథ "సీతాకోక చిలుకలు చూడు ఎన్నో రంగుల రెక్కలు చూడు". | అవంత్స సోమసుందర్ |
| 10 | హాస్యం | కథ | నీడ గురించి పిల్లలను హాస్య సన్నివేశాలతో ఆనందింపజేసే హాస్యకథ. | |

| క్రమ సంఖ్య | ఇతివృత్తం | ప్రక్రియ | పాఠం | రచయిత / మూలం |
|---|---|---|---|---|
| 11 | పిల్లల శక్తిసామర్థ్యాలు | కథనం | ప్రయత్నం అనేది చాలా ముఖ్యమైనది. అనుకున్నది సాధించడానికి పడే తపన, దానివల్ల కలిగే ప్రయోజనం గురించి తెలిపే కథనం. | మూలం : 'బాలజ్యోతి' మాసపత్రిక |
| 12 | సంస్కృతి | వ్యాసం | "సంక్రాంతి పండుగ" వ్యాసం. | "ఆశావాది ప్రకాశ్ రావు" |
| 13 | సమాజం | కథనం | పిల్లల మనోభావాల గురించి తెలిపే రామన్నకథ. | మూలం : 'పూలపొట్లాలు' బాలల అకాడమి. |
| 14 | పఠనాభిలాష | ఆత్మకథ | పుస్తకాల గురించి తెలిపే "ఆత్మకథ". | |
| 15 | సామాజిక స్పృహ | పోస్టర్ సంభాషణ | వనరులను వృథాచేయకుండా పొదుపుగా వాడుకోవడం గురించి తెలిపే సంభాషణ (విద్యుత్ పొదుపు గురించి) | |
| 16 | నైతిక విలువలు | శతక పద్యాలు | సుమతి, వేమన, కుమార, తెలుగుబాల, తెలుగుబిడ్డ శతకాలతో కూడిన పద్యాలు (10) | |
| | **చదువు - ఆనందించు** (సమయస్ఫూర్తి, సంస్కృతి, పరిశీలనా శక్తి, భాషాభిరుచి, మానవతా విలువలు, ప్రకృతి) | కథలు, గేయాలు | శిబిచక్రవర్తి కథ, సమయస్ఫూర్తితో జవాబులు ఇచ్చే కథ, ఎండగురించి గేయం, క్రిస్మస్ పండుగ గురించి వ్యాసం. సూక్ష్మ బుద్ధి కథ, అన్నదమ్ముల కథ. | |

*రాయడం బోధించడం ఏ వయస్సులో ఎప్పుడు మొదలుపెట్టాలన్న నిర్ణయం తీసుకోవలసింది ఉపాధ్యాయుడే. తాను బోధిస్తున్న పిల్లల సామర్థ్యాల కనుగుణంగా ఈ నిర్ణయం ఉండాలి.*

*- ప్రొ॥ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

# ఈ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు

## 1. అభ్యసన వాతావరణం :

3, 4, 5 తరగతుల్లో భాషకు చెందిన అభ్యసన వాతావరణం, బోధనాభ్యస ప్రక్రియలు ఏవిధంగా ఉండాలో చర్చిద్దాం.

- తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండాలి.
- పిల్లలందరివద్ద పాఠ్యపుస్తకాలు ఉండాలి.
- ప్రతి పాఠాన్ని పీరియడ్లుగా విభజించి ప్రణాళిక చేసుకోవాలి. అందులో ఉన్ముఖీకరణచిత్రం ఆధారంగా మాట్లాడించడానికి ఒక పీరియడ్, పాఠం బోధించడానికి 3 నుండి 4 పీరియడ్లు, మిగిలిన 5 నుండి 6 పీరియడ్లు అభ్యాసాలను చేయించడానికి వినియోగించాలి.
- తరగతి గదిలో గోడపత్రిక, పోస్ట్‌బాక్స్ వంటివి పిల్లల సృజనాత్మక వ్యక్తీకరణకు ఉపయోగపడతాయి. కాబట్టి వీటిని నిర్వహించాలి.
- పిల్లల స్థాయికి చెందిన బాలసాహిత్యం, కథలకార్డులు, కథల పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. పిల్లలే స్వేచ్ఛగా వీటిని వినియోగించుకునే వాతావరణం ఉండాలి.
- పిల్లలను మాట్లాడించేటప్పుడు పిల్లల అభిప్రాయాలను ఖండించడం, ఇతరులతో పోల్చడం, కించపరచడం వంటివి చేయరాదు.
- పిల్లలతో పాఠ్యపుస్తకం చదివించడం, పాత్రల గురించి చర్చించడం, పిల్లలు అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తీకరించేలా చూడాలి.
- పాఠ్యాంశాలకు చెందిన చిత్రాలు, వర్ణనాత్మక చిత్రాలు, ప్రకృతికి చెందిన చిత్రాలు, సృజనాత్మక చిత్రాలను ప్రదర్శించి పరిశీలింపజేయాలి. వీటిగురించి స్వేచ్ఛగా మాట్లాడించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలో పూర్తితరగతిగది కృత్యాలు, జట్టు కృత్యాలు, వ్యక్తిగత కృత్యాలు ఉండాలి. పిల్లలు వ్యక్తిగతంగా రాయడం, ప్రదర్శించడం, చదవడం, వాటిగురించి మాట్లాడడం నిత్యకృత్యంగా మారాలి.
- కథలు, వర్ణన, వివరణ మొదలగు వాటిపై పిల్లలు ప్రశ్నలు అడగాలి. జవాబులపై ప్రతిస్పందించాలి.
- కథలను నాటకీకరణ చేయాలి.
- పిల్లలకు తప్పనిసరిగా సొంతంగా రాయడంపై (స్వీయరచన) అభ్యాసం కల్పించాలి. అనగా తెలిసిన విషయాలపై తమ అనుభవాలు, అనుభూతులు సొంతమాటల్లో రాయగలగాలి.
- భాషకు కేటాయించిన మొదటి 90 నిమిషాలలో ప్రతిరోజూ మొదటి 10 నిమిషాలలో పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడాలి. ప్రశ్నించాలి. 45 నిమిషాలు పాఠ్యపుస్తకం / అభ్యసన సామగ్రి పిల్లలు వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి పనులలో పాల్గొనాలి. చివరి 35 నిమిషాలు పిల్లలను స్థాయిలవారీగా గ్రూపులనుచేయాలి. వెనకబడిన పిల్లలకు ఉపాధ్యాయుడు పఠన సామగ్రి, అభ్యసన సామగ్రినుపయోగించి చదవడం, రాయడంపై తగిన అభ్యసనం కల్పించాలి.
- 'స్వీయరచన' అభ్యాసంలో వెనుకబడిన పిల్లలకు ఉపాధ్యాయుడు ప్రత్యేక సహకారం అందించాలి. పునరభ్యాసనం కల్పించాలి.
- పిల్లలు తాము రాసిన డైరీలోని అంశాలను వారానికి ఒకసారి చదివి విన్పించాలి.

- గోడ పత్రికను పిల్లలే నిర్వహించాలి. పిల్లలు ప్రదర్శించిన అంశాలను పఠన సామగ్రిగా వినియోగించాలి. పిల్లల ప్రదర్శనాంశాలపై చర్చ జరగాలి.
- పిల్లలు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను జట్లలో చేసిన పిదప సొంతంగా తమ నోటుపుస్తకాలలో రాసుకోవాలి.
- గ్రంథాలయ పుస్తక పఠనానికి కేటాయించిన పీరియడ్‌లో పిల్లలు తమకు నచ్చిన పుస్తకాలను తీసుకొని చదవుకోవాలి. చదవడంలో ఇబ్బంది ఎదుర్కొనే పిల్లలు జట్లలో చర్చిస్తూ పఠన ప్రక్రియను కొనసాగించాలి. చదవడం అసలే రాని పిల్లలు ఉపాధ్యాయుడి సహకారంతో చదవడం నేర్చుకోవాలి.
- లింగ వివక్ష లేకుండా ఆడ, మగ ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరూ కలిసి బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనాలి.

## 2. బోధనాభ్యసన ప్రక్రియలు - నిర్వహణ విధానం :

- పాఠ్యబోధన ప్రధానంగా పాఠంలోని విషయానికే పరిమితం కారాదు. ఉన్ముఖీకరణ, పఠనకృత్యాలు - అర్థసంగ్రహణ, పాఠంలోని విషయం గురించి చర్చ-అవగాహన, సామర్థ్యాల సాధనకోసం అభ్యాసాల నిర్వహణ, చివరకు 'నేనివి చేయగలనా?', స్వీయ మూల్యాంకన కృత్యాల నిర్వహణ జరగాలి. ఇందుకనుగుణంగా పీరియళ్ళను కేటాయంచుకోవాలి.
- పాఠ్యబోధన పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పూర్తి తరగతి కృత్యాలు నిర్వహించేటప్పుడు పిల్లలను అర్థచంద్రాకారంలో కూర్చోపెట్టి ఉపాధ్యాయుడు వారితోపాటు కూర్చోవాలి.

**ఉన్ముఖీకరణ :**

- పాఠాన్ని ప్రారంభించే ముందు ఉన్ముఖీకరణ చిత్రం గురించి ఆలోచింపజేసే ప్రశ్నలడుగుతూ పిల్లలందరిచేతా మాట్లాడించాలి.
- పాఠంలోని చిత్రాన్ని చూసి పాఠ్యాంశాన్ని ఊహింపచేయాలి.
- పాఠంలోని చిత్రాల ఆధారంగా సంభాషణలు ఊహించి చెప్పించాలి.

**పఠనకృత్యాలు - అర్థసంగ్రహణ :**

- పాఠాన్ని పిల్లలచే చదివించి తెలియని పదాలకు అర్థాలను / వ్యక్తిగత / జట్లలో అకారాది పట్టిక చూసి తెలుసుకొనేలా చేయాలి.
- ఇంకా అర్థాలు తెలియని పదాలు ఏమైనా ఉంటే ఉపాధ్యాయుడు ఆ పదాలను సందర్భోచిత వాక్యాలలో ఉపయోగించి అర్థాలు తెలియజేయాలి.

**పాఠ్యాంశం గురించి చర్చ - అవగాహన :**

- పఠన కృత్యాలు - అంటే విద్యార్థుల వ్యక్తిగత బాహ్య పఠనం, ఉపాధ్యాయుల ఆదర్శ పఠనం, విద్యార్థుల వ్యక్తిగత మౌనపఠనం చేయించాలి.
- ఉపాధ్యాయులు విద్యార్థులతో చర్చిస్తూ, ఆలోచింపచేసే ప్రశ్నలడుగుతూ పాఠ్యాంశాన్ని అవగాహన కల్పించాలి.

**అభ్యాసాల నిర్వహణ :**

- సామర్థ్యాధారిత అభ్యాస కృత్యాలను వాటి స్వభావాలను అనుసరించి పూర్తి తరగతి / జట్టు / వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి.
- తెలుగు భాషా బోధనకై కేటాయించిన 90ని॥ల సమయంలో మొదటి 45 ని॥లు సోపానాల ప్రకారంగా పాఠ్యబోధన చేయాలి. రెండవ 45 ని॥లలో ఆరోజు బోధించిన అంశాలపై ఆయా సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాలను పిల్లలతో సొంతంగా రాయించాలి.

**'నేనివి చేయగలనా?' స్వీయ మూల్యాంకనం :**

- పాఠం పూర్తయిన తరువాత "నేనివి చేయగలనా?" శీర్షికలోని అంశాలను పిల్లలచే వ్యక్తిగతంగా చేయించాలి. ఒక్కొక్క అంశాన్ని ఎంతమంది పిల్లలు చేయగలిగారో పరిశీలించాలి. అవసరమైన అంశాలకు పునరభ్యాసం కల్పించాలి.
- ఒక పాఠానికి సగటున 10 పీరియళ్ళు అవసరమైతాయి. ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడానికి ఒక పీరియడ్, పఠనకృత్యాలు, అర్థసంగ్రహణంనకు ఒక పీరియడ్, పాఠంలోని విషయం గురించి చర్చ అవగాహనకు 3 పీరియళ్ళు, అభ్యాసాల నిర్వహణకు 5 పీరియళ్ళు చొప్పున కేటాయించుకోవాలి.
- భాషకు 90 ని॥ల సమయం ఉంటుంది కాబట్టి, మొదటి 45 నిముషాల్లో నిర్వహించిన బోధనాభ్యసన ప్రక్రియల ఆధారంగా, రెండవ 45 ని॥లలో పిల్లలు వ్యక్తిగతంగా రాసేలా అభ్యాసం కల్పించాలి. పిల్లలు రాసిన వాటిని చదివించి సరిదిద్దాలి.
- భావం సరిగా రాసారా? వాక్య నిర్మాణం ఎలా ఉంది? పదజాలాన్ని ఎలా వినియోగించారు? అక్షర దోషాలు ఏమున్నాయి? అనే అంశాల ఆధారంగా చర్చ నిర్వహించి దోషాలను సరిదిద్దాలి.

## ఉ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు

- 3, 4, 5 తరగతుల పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు పూర్తిగా చదవాలి. పాఠ్యాంశాలపై అవగాహనను ఏర్పరచుకోవాలి.
- ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలను రాయాలి. వాటి ఆధారంగా సంసిద్ధులు కావాలి.
- వార్షిక ప్రణాళిక నమూనా : 1) తరగతి, 2) సబ్జక్టు, 3) అవసరమైన పీరియళ్ళు, 4) సంవత్సరాంతానికి సాధించాల్సిన సామర్థ్యాలు, 5) మాసవారీగా పాఠాల విభజనలు,

| మాసం | బోధించాల్సిన పాఠాలు | అవసరమైన పీరియళ్ళు | వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

6) ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు, 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు.

పైన తెల్పిన విధంగా వార్షిక ప్రణాళికను రాయాలి. ఇందుకోసం పాఠ్యపుస్తకంలోని ఉపాధ్యాయులకు సూచనలు, విషయసూచిక, సాధించాల్సిన సామర్థ్యాలు, పాఠాలు, అభ్యాసాలు మొదలగువాటిని క్షుణ్ణంగా చదవాలి. వీటి ఆధారంగా వార్షిక ప్రణాళికను తయారుచేసుకోవాలి.

- అట్లే ప్రతి పాఠానికి పాఠ్యప్రణాళికను కూడా నిర్ణీత నమూనాలో రాయాలి. 1) పాఠం పేరు, 2) అవసరమైన పీరియళ్ళ సంఖ్య, 3) పాఠంద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు, 4) పీరియళ్ళ వారీగా విభజన,

| మొదటి నలభై ఐదు నిమిషాలు | | | | రెండవ నలభై ఐదు నిమిషాల్లో పిల్లలకు కల్పించే అభ్యాసం |
|---|---|---|---|---|
| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం | బోధనా వ్యూహాలు | వనరులు, సామగ్రి | |
| | | | | |

5) ఉపాధ్యాయుల తయారీ - అదనపు సమాచారం సేకరణ, 6) ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు

- వార్షిక ప్రణాళిక ప్రకారం మాసవారీగా పాఠ్యాంశాలు పూర్తిచేయుటకు సామగ్రిని సిద్ధంచేసుకోవాలి.
- ప్రతి పాఠాన్ని బోధనకు సరిపడా పీరియడ్లుగా విభజించుకోవాలి. అందులో 40% బోధనకు 60% అభ్యాసాలు చేయించడానికి వినియోగించాలి.
- పాఠ్యాంశాల ఆధారంగా సామర్థ్యాలను అన్వయించి అభ్యాసం కల్పించాలి.
- పాఠ్యాంశాలు, పఠనసామగ్రి, అభ్యసన సామగ్రి, బాలసాహిత్యం పిల్లలచే చదివించడం, చర్చించడం, మాట్లాడించడం, డైరీ రాయించడం, ప్రోత్సహించడం చేయాలి.
- పిల్లలను ఆలోచింపజేయడం, వ్యక్తీకరించడం, ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి.
- భాషాబోధనకు కేటాయించిన సమయం పూర్తిగా సద్వినియోగం అయ్యేలా పిల్లలకు అర్థవంతమైన కృత్యాలు, అభ్యాసాలను కల్పించాలి.
- ఆడపిల్లలు, మగపిల్లలు, ప్రత్యేక అవసరాలుగల పిల్లలను కలిపి జట్లు చేయడం, కలిసి పనిచేయడం, అనుభవాలు పంచుకోవడం, ఒకరికొకరు సహకరించుకునేలా ప్రోత్సహించాలి.
- కథలు, పాఠ్యాంశంపై చర్చ జరిగే సందర్భంలో వివిధ భాషా నేపథ్యాలు గల పిల్లలను వారి వారి భాషల్లో చెప్పించాలి. ఉపాధ్యాయులు అవసరమైతే ఇతర భాషలకు చెందిన పిల్లలకు అర్థం చేయించడానికి పిల్లల సహకారం కూడా తీసుకోవచ్చు.
- బహుళస్థాయికి చెందిన పిల్లలకు తగిన అభ్యాసం కల్పించాలి.
- అభ్యాసాలు చేయడంలో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక సహకారం అందించి అభ్యాసాలను పూర్తి చేసేలా చూడాలి. పునరభ్యసనం కల్పించాలి.
- భాషాభ్యసనంలో ఆశించిన ఫలితాలను దృష్టియందుంచుకొని పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనావేయాలి. సొంతంగా ప్రశ్నాపత్రాలు రూపొందించుకొని పరీక్షలు నిర్వహించాలి. నిరంతర సమగ్ర మూల్యాంకానికి పిల్లల నోటు పుస్తకాలు, అసైన్‌మెంటులు, ప్రాజెక్టు పనులు, పోర్టుఫోలియోలు, ప్రశంసాపూర్వక పనులు, సృజనాత్మక వ్యక్తీకరణ వంటి ఆధారాలతో పిల్లల ప్రగతిని అంచనా వేసి నమోదు చేయాలి.
- పిల్లల స్వీయరచనా సామర్థ్యం పెరిగేలా ప్రతిరోజు ఏదైనా అంశం ఇచ్చి పిల్లలు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి. పిల్లలు రాసిన అంశాలపై చర్చ నిర్వహించాలి.
- ఉపాధ్యాయులు తమ వృత్తిపర సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై భాషాపరమైన అంశాలపై చర్చించాలి. తోటి ఉపాధ్యాయుల అనుభవాలను గ్రహించాలి. తదుపరి మాసానికి ప్రణాళిక వేసుకోవాలి. వృత్త్యంతర శిక్షణలకు హాజరై వృత్తిపరనైపుణ్యాలను పెంపొందించుకోవాలి.
- విద్యాసంవత్సరంలో పిల్లలు కనీసం 20-30 బాలసాహిత్యంకు చెందిన పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. పిల్లలు తాము చదివిన అంశాలగురించి డైరీలో రాసేలా చూడాలి.
- ఉపాధ్యాయుడు కూడా ప్రతిరోజు డైరీ రాయాలి. దీనిలో పిల్లల ప్రగతి, సృజనాత్మకత, తన అనుభూతులు స్వీయ ప్రతిస్పందనలు నమోదుచేయాలి.
- ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకంలోని అంశాలకే పరిమితం కాకుండా పరామర్శ గ్రంథాలు, అంతర్జాలం, ప్రసారమధ్యమాల నుండి అదనపు సమాచారాన్ని సేకరించాలి. దాన్ని తరగతిగదిలో వినియోగించాలి.
- ప్రతిపాఠంలో ఇచ్చిన అభ్యాసాలను పిల్లలే సొంతంగా రాసేలా చూడాలి. ఎట్టి పరిస్థితుల్లో గైళ్ళు చూసి రాయడాన్ని నిరోధించాలి.
- పిల్లలు రాయలేరని భావించి ఉపాధ్యాయులే సమాధానాలను నల్లబల్లపైరాసి రాసుకోమనకూడదు. దీనివల్ల పిల్లలు ఎప్పటికీ కూడా సొంతంగా రాసే సామర్థ్యాన్ని పొందలేదు.
- పిల్లల్లో సొంతంగారాసే సామర్థ్యం వృద్ధిచెందడానికే పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలు ఉన్నాయి. వీటిని పిల్లలే సొంతంగారాసేలా చూసి, వాటిని తరగతిలోనే చర్చ ద్వారా సరిదిద్దాలి.
- పిల్లలు రాసిన అంశాలను సరిదిద్దేటప్పుడు భావం, వాక్యనిర్మాణం, పదజాలం, అక్షరదోషాలపరంగా చర్చించి సరిదిద్దాలి. ఆ తరవాత వ్యక్తిగతంగా మళ్ళీ రాయమనాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మకతలోని అంశాలను, ప్రశంస లేదా ప్రాజెక్టుపనిలోని అంశాలను ప్రదర్శింపజేసి వాటిని సంకలనం చేసి తరగతిలో ప్రదర్శింపజేయాలి.

## ఊ) మూల్యాంకనం

- రాష్ట్రంలో 2010 ఏప్రిల్ మాసం నుండి నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చినందున నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలుజరగాలి. మూల్యాంకనం వల్ల పిల్లలను దోషులుగా చిత్రీకరించే విధానానికి బదులు పిల్లల అభ్యసనం, స్థాయి మెరుగుపడడానికి మూల్యాంకనం దోహదపడాలని APSCF 2011 కూడా పేర్కొనింది. భాషాబోధనోద్దేశాలు ఏమేరకు నెరవేరబడ్డాయో అంచనావేసి తదుపరి చర్యలు చేపట్టడానికి అనుగుణంగా నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరగాలి. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయిలో 3, 4, 5 తరగతుల్లో మూల్యాంకనం కింది విధంగా నిర్వహించబడాలి.
- భాషా విద్యాప్రమాణాలు / సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా మూల్యాంకనం నిర్వహించాలి.
- మూల్యాంకనం అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా బోధనాభ్యసన ప్రక్రియల్లో పిల్లల భాగస్వామ్యం ప్రతి స్పందనలు, పిల్లలు రాసిన అంశాలు, రాతపరీక్షలు, ప్రాజెక్టు పనులు మొదలగు వాటిని పరిశీలించి నిర్మాణాత్మక మూల్యాంకనం చేయాలి.
- **పిల్లల భాగస్వామ్యం - ప్రతిస్పందనలు :**
  - పిల్లలు వినడం, విన్నదాన్ని అర్థంచేసుకోవడాన్ని, చదివిన దాన్ని అర్థం చేసుకొని తమ ఆలోచనలను వ్యక్తంచేయడాన్ని, ప్రశ్నించడాన్ని, వివిధ రకాలైన కృత్యాలలో పాల్గొనడాన్ని, బోధనాభ్యసన ప్రక్రియలల్లో పాల్గొనడాన్ని. ప్రాజెక్టు పనుల్లో పాల్గొనేటప్పుడు పిల్లలు భాగస్వామ్యాన్ని పరిశీలించి మూల్యాంకనం చేయాలి.
- **రాసిన అంశాలు :**
  - పిల్లలు తప్పులు లేకుండా రాయడం, అందంగా రాయడం, సొంతంగా రాయడం, క్రమపద్ధతిలో రాయడాన్ని, నివేదికలు రాయడాన్ని, అభిప్రాయాలు రాయడాన్ని, విమర్శనాత్మకంగా, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా రాయడాన్ని పరిశీలించి మూల్యాంకనం చేయాలి.
  - ఇందుకోసం కేవలం పరీక్షలప్పుడు రాసే జవాబు పత్రాలపైననే ఆధారపడకుండా నోటు పుస్తకాలలో (కవితలు, కథలు, గేయాలు, నివేదికలు), పాఠ్యపుస్తకాలలో రాసిన అంశాలను పరిగణలోకి తీసుకొని పరిశీలించి మూల్యాంకనం చేయాలి.
- **లఘుపరీక్ష :**

  నిర్దిష్ట సమయంగానీ, ముందస్తు ప్రణాళికగానీ, పిల్లలకు ముందే చెప్పాల్సిన అవసరంగానీ లేకుండా పిల్లల స్థాయిని అంచనా వేయడానికి అప్పటికప్పుడు నిర్వహించాలి. దీని ద్వారా పిల్లలు సాధించిన సామర్థ్యాలను అప్పటికప్పుడు మూల్యాంకనం చేయాలి.
- **ప్రాజెక్టు పనులు :**

  భాషాబోధన భాషా నైపుణ్యాల సాధనకే పరిమితం కాకుండా సృజనాత్మకత, కాల్పనిక శక్తి, ప్రశంసాపూర్వకమైన వైఖరి, మానవ సంబంధాల మెరుగుదల మానసికోల్లాసం వంటివి కూడా మూల్యాంకనం చేయాలి. ఇందుకోసం భాషా వాచకాలలో ఇవ్వబడిన ప్రాజెక్టు పనులను పిల్లలచే చేయించాలి. వాటిని ప్రదర్శింపచేయాలి. వాటికి నివేదికలు రాయించాలి. వాటి ఆధారంగా పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేసి నమోదు చేయాలి.
- పిల్లలు నిర్దిష్ట సమయంలో నిర్దేశించిన సామర్థ్యాలను ఏ మేరకు సాధించారో అంచనా వేయడానికి సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సామర్థ్యాల ఆధారంగా నిర్వహించాలి. ఇందుకోసం సామర్థ్యాల వారీగా కేటాయించిన భారత్వ పట్టిక ప్రకారం ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి.
- వినడం మాట్లాడడం, ప్రశంస వంటి సామర్థ్యాలకు మౌఖిక పరీక్ష లేదా పరిశీలన ద్వారా అంచనావేయడం, ధారాళంగా చదవడాన్ని సృజనాత్మకతను, మౌఖిక, రాత పరీక్షల ద్వారా నిర్వహించవచ్చు. స్వీయరచన, పదజాలం వ్యాకరణాంశాలకు రాత పరీక్ష ద్వారా నిర్వహించాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ఉపాధ్యాయులే సొంతంగా ప్రశ్నపత్రాలు రూపొందించుకొని నిర్వహించాలి.

- ప్రశ్నలకు జవాబులు ఆరోపించి సొంతమాటల్లో రాసేలా ఉండాలి.
- ప్రశ్నలు బహుళ సమాధానాలు వచ్చేలా ఉండాలి.
- మూల్యాంకనం అనేది కేవలం పరీక్షించడానికే పరిమితం చేయరాదు. పిల్లలు రాసిన జవాబు పత్రాలను పరిశీలించి ఏమేమి బాగా చేయగలిగారు? ఏ ఏ సామర్థ్యాల్లో వెనుకబడ్డారో గుర్తించి పునరభ్యసనం కల్పించాలి.
- పిల్లలకు పరీక్షలంటే భయం ఆందోళన కలగకుండా ప్రత్యామ్నాయ సాధనాలను కూడా వినియోగించాలి.
- పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను పిల్లలు సొంతంగా రాసేటప్పుడు, వారు బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనడం, పాఠంలోని స్వీయ మూల్యాంకన కృత్యాల ఆధారంగా కూడా పిల్లల స్థాయిని, ప్రగతిని అంచనావేయాలి.
- పిల్లల ప్రగతిని నమోదు చేయడానికి సిసిఇ రిజిష్టరును నిర్వహించాలి.
- అట్లే పిల్లల ప్రగతిని నమోదుచేసి తల్లిదండ్రులకు పంపడానికి క్యుములేటివ్ రిజిష్టరును నిర్వహించాలి.

## ఋ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి

1. **3, 4, 5 తరగతులు - భాషా బోధన వనరులు :**

- నింఘటువు - తెలుగు నిఘంటువు, ఇంగ్లీషు, తెలుగు నిఘంటువు, ఆంధ్రనామ సంగ్రహము, అమరకోశము, పూర్వ గాథాలహరి, విద్యార్థి కల్పతరువు.
- వర్ణాలకు సంబంధించి పాటల పుస్తకం.
- హాస్యకథలు (పరమానందయ్య శిష్యులకథలు, తెనాలి రామలింగ కథలు, నసీరుద్దీన్ కథలు మొదలగునవి).
- సమయస్ఫూర్తి కథలు (అక్బర్ బీర్బల్ కథలు / మర్యాదరామన్న కథలు).
- ప్లాస్టిక్ అనర్థాల గురించి వివరించే పేపర్ కథనాలు / వ్యాసాలు.
- పాతవార్తా పత్రికలు, చార్టులు.
- సరోజినీనాయుడు జీవిత చరిత్రపుస్తకం.
- జాతీయ భావం పెంపొందించే గేయాలు, పాటలు, కథలు.
- వివిధ పండుగల గురించి ఆయా సందర్భాల్లో వచ్చే వార్తా కథనాలు.
- శతకాలు (వేమన, సుమతి, కుమార, తెలుగుబాల, తెలుగుబిడ్డ, నార్ల మొదలగునవి)
- జంతువుల కథలు.
- ప్రకృతి సంరక్షణకు సంబంధించిన నినాదాలు, కథనాలు, గేయాలు, పాటలు, పద్యాలు మొదలగునవి.
- జాతీయాలు, సామెతల పుస్తకాలు వీటితో కూడిన కథలు.

*'వికాసం' అనేది స్వయంగా ఆవిర్భవించేది. మానవుడు వికసించాలనే విషయంలో తన వికాసాన్ని ప్రధానంగా ఎంచుకుంటాడు. తానుగానే వికసించడానికి కార్యోన్ముఖుడవుతాడు. అయితే ఉపాధ్యాయుని లాంటివారు వికాసానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలరు. ఇందుకోసం పరిస్థితులు, సాధనాలను ఎన్నుకోవలసిన అవసరం ఉంటుంది. మనం పిల్లలకు నోటిమాటగా ఏమీ చెప్పకపోయినా వారి కొరకు మనం ఏర్పాటుచేసే వాతావరణమే వారికి దిశానిర్దేశం చేస్తుంది. శిక్షణా సాధనాలలో సంగీతానికి సంబంధించిన వాయిద్యాలు పిల్లలను సంగీతం పట్ల సహజంగానే ప్రేరేపిస్తాయి. అలాగే పెద్దలు పిల్లల కొరకు మంచి వాతావరణం కలుగజేయగలిగితే ఏమీ చెప్పకపోయినా వారు విషయాలను గ్రహించేస్తూ ఉంటారు. అనగా బాలల వికాసానికి వాతావరణమే ముఖ్యమైనది. వారు అభివృద్ధి చెందాలనే తపనను వారిలో మనం కలిగిస్తేచాలు. బాలలను ప్రేరేపించే వాతావరణం, వారికి తోడ్పడే సాధనాలు. ఈ రెండూ కూడా వారిలో స్వయం స్ఫూర్తిని కలిగించడానికి దోహదం చేస్తాయి.*

*- రోహిత్ ధనకర్, దిగంతర్, జైపూర్*

- పిల్లల పాటలు, గేయాలు, జాతీయ గీతాలు.
- వికలాంగులై ఉంది గొప్పవారైన వారి కథలు, వార్తలు (సేకరణలు).
- చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్ పుస్తకాలు.
- వివిధ వృత్తుల, సంచార జాతుల వారికి వివరాలతో ఉన్న పుస్తకాలు, చిత్రాలు.
- తపాలావ్యవస్థ సమాచారం, పిన్‌కోడ్‌లు.
- స్వాతంత్ర్యోద్యమకారులు చిత్రాలు, వివరాలు, జీవితచరిత్రలు.
- వివిధ రకాల గ్రీటింగ్ కార్డులు.
- ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోని దర్శనీయ స్థలాల వివరాలు, చిత్రాలు.
- చెట్లు, మొక్కల గురించిన కవితలు / గేయాలు / పాటలు / పద్యాలు / చిత్రాలు.
- సంగీత వాద్యాల చిత్రాలు, వివరాలు.
- రైతు జీవితచిత్రం, ఎదురయ్యే ఇబ్బందులను తెలిపే వార్తా కథనాలు చిత్రాలు.
- పింగళి వెంకయ్య జీవితచరిత్ర.
- వివిధ దేశాల జాతీయ పతాకాల చిత్రాలు.
- స్వాతంత్ర్యోద్యమ గాథలు.
- ప్రకృతి సంబంధ చిత్రాలు (సూర్యోదయం, సూర్యాస్తమయం,తోటలు, సెలయేళ్లు, పక్షులు)
- ఎగ్జిబిషన్‌ల వివరాలు, చిత్రాలు.
- సంక్రాంతి వంటి పర్వదినాలకు చెందిన గాథలు.
- కాలుష్యం మంచినీటి ఎద్దడి అంశాలపై వార్తా కథనాలు, చిత్రాలు.
- వార్తా పత్రికల్లోని కథలు, కవితలు, చిత్రాలు, గేయాలు, ఛలోక్తులు.
- వివిధ రకాల పోస్టర్లు.

**2. 3, 4, 5 తరగతులు - బోధనాభ్యసన సామగ్రి :**

- తరగతిలో వివిధ రకాల కథల పుస్తకాలు, కథాకార్డులు, బాలసాహిత్యం అందుబాటులో ఉండాలి.
- పాటలు, గేయాలు, కథలకు చెందిన దృశ్య శ్రవణ సామగ్రి.
- పిల్లలు సృజనాత్మకంగా ఆలోచించడానికి వీలుగా ప్రకృతి చిత్రాలు, కాల్పనిక చిత్రాలు, హాస్యచిత్రాలు, కార్టూన్లు, అటవీనేపథ్య చిత్రాలు మొదలగునవి సేకరించి అందుబాటులో ఉండేలాచూడాలి.
- పదజాల పట్టికలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికల్లో పిల్లలకు సంబంధించిన అంశాలు.
- ద్విభాష చిత్ర కథలు (Bilingual Picture Stories) కార్డులు, చిత్రపదకోశాలు మొదలగునవి.
- శబ్దరత్నాకరము, శబ్దచింతామణి మొదలైన తెలుగు నిఘంటువులు అందుబాటులో ఉంచాలి.

# VI. పాఠ్యప్రణాళిక - మూడవదశ - 6, 7, 8 తరగతులు (ప్రథమ, ద్వితీయ భాషలు)

## (అ) 6, 7, 8 తరగతులు - భాషా సామర్థ్యాలు (ప్రథమ భాష) - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. వినడం, అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • దేశభక్తిగేయాలు, కథలు, పద్యాలు, నాటికలు మొదలగునవి విని అర్థం చేసుకుని ప్రతిస్పందించగలగాలి.<br>• గేయాలు, పాటలు, పద్యాల గురించి మాట్లాడగలగడం, వాటి భావాలను సొంతమాటల్లో చెప్పగలగడం.<br>• తాము చేసిన సహాయాల గురించి, పనుల గురించి వివరించగలగడం.<br>• కథలను సొంతమాటల్లో క్రమపద్ధతిలో వినసొంపుగా చెప్పగలగడం.<br>• అనుభవాలను, అనుభూతులను గురించి మాట్లాడగలగడం.<br>• పాఠంలో విషయాన్ని శీర్షికతో పోల్చి అభిప్రాయాన్ని చెప్పగలగడం.<br>• కవి/రచయిత ఉద్దేశాలను గ్రహించి వివరించగలగడం | • దేశభక్తిగేయాలు, కథలు, పద్యాలు, నాటికలు మొదలగునవి విని అర్థం చేసుకుని మాట్లాడగలగడం.<br>• దైనందిన జీవితంలోని సంఘటనలను, సన్నివేశాలను నిశితంగా పరిశీలించి, ఉదాహరణ పూర్వకంగా మాట్లాడగలగడం.<br>• నచ్చిన పద్యాలను వాటి భావాలను నచ్చిన పాత్రలగురించి చెప్పగలగడం.<br>• పాఠ్యాంశ శీర్షికల గురించి మాట్లాడడం, చర్చించగలగడం.<br>• కవి, రచయిత ఉద్దేశాలను, అభిప్రాయాలను చెప్పగలగడం.<br>• కవుల/రచయితల సందేశాలను విమర్శనాత్మకంగా మాట్లాడగలగడం.<br>• పాత్రల స్వభావాన్ని విశ్లేషించి, అందుకు ఆధారమైన అంశాలతో మాట్లాడగలగడం. | • పద్యాలు, గేయాలు, వార్తా వ్యాఖ్య, వచనకవిత మొదలగు వాటివిని అర్థంచేసుకుని స్పందించగలగాలి.<br>• ఏదైనా ఒక అంశం గురించి సమర్థిస్తూ లేచి విభేదిస్తూ సరైన కారణాలతో వివరించగలగాలి.<br>• పాఠ్యాంశాల ద్వారా వచ్చే సందేశాలను చెప్పగలగాలి. బేధాలను గుర్తించగలగాలి. పోలుస్తూ మాట్లాడగలగాలి.<br>• పద్యాల, గేయాల భావాలను స్పష్టంగా వివరించగలగాలి.<br>• సూచించిన అంశంపై మిత్రులతో చర్చల్లో చురుకుగా పాల్గొనగలగాలి.<br>• భావాలను ఊహిస్తూ చెప్పగలగాలి. సరైన దిశలో అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>• వివిధ సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ మాట్లాడగలగాలి. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పాఠంలోని అంశాలను దైనందిన జీవితానికి అన్వయిస్తూ చెప్పగలగడం.<br>• స్థానిక కళారూపాలను చూసి, విని తమ అభిప్రాయాలను చెప్పగలగడం.<br>• చర్చల్లో పాల్గొని అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తీకరించగలగడం.<br>• ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు విని అర్థం చేసుకుని, ప్రతిస్పందించగలగడం.<br>• పాత్రల స్వభావాలను, తారతమ్యాలను అర్థంచేసుకుని మాట్లాడడం.<br>• విమర్శనాత్మకంగా, హేతుబద్ధంగా ఉదాహరణలను సేర్కొంటూ మాట్లాడగలగడం. | • ఇచ్చిన అంశాన్ని సమర్థిస్తూ / విభేదిస్తూ సకారణంగా మాట్లాడగలగడం.<br>• పాఠశాలలో ఇచ్చే ప్రసంగాలను విని, అర్థంచేసుకుని వివరించగలగడం.<br>• రేడియో, దూరదర్శన్‌లలో ప్రసారమయ్యే అంశాలను విమర్శనాత్మకంగా వివరించగలగడం. | • ప్రకృతి దృశ్యాలను, వివిధ సంఘటనలను సొంతమాటల్లో వివరించగలగాలి.<br>• ఇచ్చిన అంశాలపై స్పష్టంగా సూటిగా మాట్లాడగలగాలి.<br>• పాఠ్యాంశాల్లోని కీలక అంశాల కీలక పదాల అంతరార్థాన్ని వివరించగలగాలి.<br>• పాఠ్యాంశాల్లోని నచ్చిన అంశాలను సకారణాలతో వివరించి చెప్పగలగాలి.<br>• పాఠ్యాంశాలకు శీర్షికలను సూచించి సకారణాలను విశ్లేషించి చెప్పగలగాలి.<br>• వివిధ పరిస్థితులను పోలుస్తూ మాట్లాడగలగాలి, చర్చించ గలగాలి.<br>• కవులు, రచయిత(తు)లు ఇచ్చిన సందేశాలను, అభిప్రాయాలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• ఇచ్చిన అంశాలపై చక్కగా ప్రసంగించ గలగాలి. |

### చక్కటి పఠనం

*నేడు పాఠశాలల్లో చక్కటి పఠనం అరుదుగానే ఉంటుంది. దీనికి కారణం మన ఉపాధ్యాయులు, అధికారులు కూడా పఠనాన్ని కళాదృష్టితో చూడడం లేదు. పఠనం కూడా ఒక కళ. ఆ దృష్టితో దానిని నేర్పడానికి మన విద్యా కార్యక్రమంలో ప్రముఖమైన స్థానం ఇవ్వాలి. ఇంతవరకు పఠన సామగ్రిని ఎంతవరకు విద్యార్థులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుందో అనే దృష్టితోనే ఎంపిక చేయడం జరుగుతూఉంది. ఇది సరికాదు.*

*- గిజుభాయి*

## 2. ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని ప్రతిస్పందించడం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • గేయం చదవడం, పంక్తులు గుర్తించడం.<br>• పాఠం ఆధారంగా జవాబులు రాయడం.<br>• పాఠ్యాంశ పేరా చదివి జవాబులు గుర్తించడం.<br>• పద్యం ఆధారంగా ప్రశ్నలు తయారుచేయడం.<br>• సంఘటన ఆధారంగా పాఠంలో పేరాలు గుర్తించడం.<br>• గేయంలోని ప్రాసపదాలు గుర్తించి రాయడం.<br>• చిత్రాల ఆధారంగా పాఠంలో వాటికి సంబంధించిన వాక్యాలు గుర్తించడం.<br>• అభ్యాసంలోని కరపత్రం చదివి ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>• అపరిచిత గద్యం / పద్యం చదివి ప్రశ్నలు, జవాబులు రాయడం.<br>• పాఠంలోని వర్ణన ఉన్న వాక్యాలు గుర్తించడం.<br>• పట్టికలోని పదాలను కలుపుతూ వాక్యాలు రాయడం. | • పాఠం ఆధారంగా జవాబులు రాయగలగడం.<br>• పద్యం, గేయం అర్థం చేసుకొని భావం చెప్పగలగడం, రాయగలగడం.<br>• అపరిచిత పద్యం / గద్యం అర్థం చేసుకుని ప్రశ్నలు, జవాబులు రాయగలగడం.<br>• భావం ఆధారంగా పాఠంలోని పద్య పాదాలు, గేయభాగాలు, పేరాలు గుర్తించడం, శీర్షికలు రాయగలగడం.<br>• పాఠంలోని పేరాలకు, గేయభాగాలకు ప్రశ్నలు తయారు చేయగలగడం.<br>• సందర్భాలను గుర్తించి రాయగలగడం.<br>• పాఠంలోని కీలకపదాలు గుర్తించి, అవి ఎందుకు కీలకమైనవో రాయగలగడం .<br>• పాఠం ఆధారంగా గేయ పాదాలను, పద్య పాదాలను పూరించగలగడం. | • పాఠం ఆధారంగా పట్టిక పూరించడం.<br>• పాఠంలోని పద్యాలను చదివి, అర్థంచేసుకొని ప్రతిపదార్థాలు రాయడం.<br>• పాఠం ఆధారంగా సందర్భవాక్యాలు రాయడం.<br>• పాఠం ఆధారంగా తప్పుఒప్పులు గుర్తించడం.<br>• గేయంలోని ప్రాసపదాలు గుర్తించడం.<br>• పాఠంలోని పేరాలు చదివి, శీర్షికలను సూచించగలగడం.<br>• అపరిచిత పద్యం / గద్యం చదివి ప్రశ్నలు, జవాబులు రాయగలగడం.<br>• పద్య / గేయ / గజల్ పాదాలకు సొంతంగా భావం రాయగలగాలి.<br>• పట్టికలోని అంశానికి తగిన కారణాలు రాయగలగడం. |

*భావ వ్యక్తీకరణలో మాట్లాడడం, చదవడం, రాయడం ముఖ్యమైనవి. ఈ నైపుణ్యాలను పెంపొందించడం బాల సాహిత్య ప్రధాన లక్ష్యంగా ఉండాలి. అందుకు అది దోహదం చెయ్యాలి. చక్కటి బొమ్మలు చిన్న పిల్లలను ఆకర్షిస్తే, ఆసక్తి, ఉత్కంఠ కలిగించే కథనం పుస్తకాల పట్ల ప్రేమను కలిగిస్తుంది.*

**- APSCF-2011**

*- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం-2011*

## 3. స్వీయరచన

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పాఠాల నుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు, వివరణలు రాయగలగడం<br>• కవుల, రచయితలు ఉద్దేశం, భావాలను అభిప్రాయాలను రాయగలగడం<br>• తాము పాల్గొన్న కార్యక్రమాల గురించి వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠ్యభాగ శీర్షికల గురించి కారణయుక్తంగా వివరించగలగాలి.<br>• ఆయాస్థానాల్లో తాముంటే ఎలా ఆలోచించేవారో, ప్రతిస్పందించే వారో తెలుపుతూ రాయగలగాలి.<br>• ఇచ్చిన అంశాలపై సరైన అభిప్రాయాన్ని రాయగలగాలి.<br>• కథలు, సంఘటనలు, అనుభవాలు, అనుభూతుల నుండి ఏమేం గ్రహించారో వివరిస్తూ రాయగలగాలి.<br>• శీర్షికలను నిర్ణయించి దానికి సరైన కారణాలను వివరిస్తూ రాయగలగాలి.<br>• ప్రసార మాధ్యమాల్లో చదివిన / చూసిన అంశాలపై అభిప్రాయాన్ని తెలుపుతూ రాయగలగాలి.<br>• తమ ఇష్టాయిష్టాలను గురించి వివరిస్తూ రాయగల్గాలి. | • సూచిత అంశాలను గురించి సకారణంగా వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠ్యాంశభావాలను సొంతమాటల్లో వివరిస్తూ రాయగలగాలి.<br>• ఇచ్చిన అంశంపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తూ రాయగలగాలి.<br>• జరుగబోయే సంఘటనను కథను ఊహిస్తూ రాయగలగాలి.<br>• శీర్షికల ఔన్నత్యాన్ని సకారణంగా వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా తాను నేర్చుకొన్న అంశాలను గురించిగాని, పొందిన సందేశం గురించిగాని వివరిస్తూ రాయగలగాలి.<br>• ఇచ్చిన వాక్యాన్ని సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి. సొంత అభిప్రాయాన్ని తెలియజేయ గలగాలి.<br>• వివిధ అంశాల మధ్య ఉండే భేదాలను సూచిస్తూ రాయగలగాలి.<br>• శీర్షికలను నిర్ణయించి, కారణాలను వివరించగలగాలి. | • పాఠాల ఆధారంగా కవుల ఉద్దేశాన్ని, అభిప్రాయాలను, సందేశాలను విశ్లేషిస్తూ రాయగలగాలి.<br>• తమ అనుభవాలను, అనుభూతులను గురించి సొంత మాటల్లో రాయగలగాలి.<br>• సొంత అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా రాయగలగాలి.<br>• సమస్యలకు పరిష్కారాలను గురించి ఆలోచించి సూచనలను రాయగలగడం.<br>• పాఠ్యాంశంపై సంపూర్ణ అవగాహనతోను, అధికారంతోను వివరణలు రాయగలగాలి.<br>• ఒక విషయాన్ని సమర్థిస్తూ లేదా విభేదిస్తూ సరైన కారణాలతో రాయగలగాలి.<br>• వివిధ అంశాలను పోలికలతో వివరిస్తూ రాయగల్గడం. కాలానుగుణంగా అన్వయిస్తూ రాయగలగడం.<br>• పాఠాల్లోని పాత్రల స్వభావాన్ని, కీలకాంశాలను, ముఖ్యసంఘటనలు మొదలైన వాటివల్ల కలిగే ఇతర ప్రయోజనాలను వివరించగలగడం.<br>• పాఠంలో నచ్చిన అంశాన్ని వివరిస్తూ రాయగలగాలి. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పాఠ్యభాగ సారాంశాలను, సందేశాలను, అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలగాలి.<br>• వివిధ తత్వాలను సూచించే మనుషుల స్వభావాలను వివరిస్తూ రాయగలగాలి.<br>• సూచిత అంశం గురించి వ్యాసం రాయగలగాలి.<br>• ఇచ్చిన వాక్యాల గురించి వాటి అర్థాన్ని తెలుపుతూ రాయగలగాలి.<br>• మీరు ఏకీభవించే విషయాలను సహేతుకంగా వివరిస్తూ రాయగలగడం.<br>• కవి భావనలను, సందేశాలను వివరిస్తూ వ్యాసం రాయగలగాలి.<br>• పద్యభావాలను సొంతమాటల్లో రాయగలగాలి.<br>• ఆయాస్థానాల్లో తాముంటే అనే విషయాలను ఊహించి రాయగలగడం.<br>• విరామ చిహ్నాలను, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను సందర్భోచితంగా రాయగలగడం.<br>• భావాలను క్రమపద్ధతిలో సరైన పదజాలాన్ని ఉపయోగించి, దోషరహితంగా రాయగలగడం. | • ఇచ్చిన అంశాలను పోలుస్తూ రాయగలగాలి.<br>• సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ రాయగలగాలి.<br>• కవుల / రచయితల గురించి వారి ఉద్దేశాలను, అభిప్రాయాలను వివరిస్తూ రాయగలగాలి.<br>• ఇవ్వబడిన అంశాలపై సకారణాత్మక ఆలోచనలతో వివరణలను రాయగలగాలి.<br>• ఉత్తరప్రత్యుత్తరాలను రాయగలగడం.<br>• వివిధ విషయాల్లో తమ ఇష్టాయిష్టాలను తెలుపుతూ రాయగలగడం.<br>• ఇచ్చిన విషయాన్ని చర్చించి, సారాంశాన్ని రాయగలగాలి.<br>• కీలకపదాల, అంశాల భావాలను సందర్భోచితంగా వివరిస్తూ రాయగలగడం.<br>• తాము పొందిన అనుభవాలను, అనుభూతులను సొంతమాటల్లో వివరిస్తూ రాయగలగడం. | • అంశాల వివరణకై తగిన కారణాలను ఊహిస్తూ రాయగలగడం.<br>• ఇచ్చిన అంశాలను విమర్శిస్తూ, విశ్లేషిస్తూ రాయగలగడం.<br>• తాము చూసిన ప్రదేశాలను వివరిస్తూ రాయగలగడం.<br>• పాఠాల ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు ఊహించి జవాబులు రాయగలగడం.<br>• కథ, సంఘటనను సంక్షిప్తీకరించి రాయగలగడం.<br>• వివిధ దృశ్యాలను, సంఘటనలను వర్ణిస్తూ రాయగలగడం.<br>• పాఠాల ద్వారా గ్రహించిన విషయాలను వివరిస్తూ రాయగలగాలి. |

## 4. పదజాలం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం, అవగాహన చేసుకుని, కొత్తపదాలతోపాటు సొంతవాక్యాల్లో ఉపయోగించగలగడం.<br>• నిఘంటువును ఉపయోగిస్తూ, స్వీయ అధ్యయనం చేయడం.<br>• మాండలిక భాషారూపాలను గుర్తించడం, వినియోగించడం.<br>• సమానార్థక పదాలను గుర్తించడం, వ్యతిరేక పదాలను గుర్తించడం, వాటిని సందర్భోచితంగా వాక్యాల్లో వినియోగించగలగడం. | • నిఘంటువునుపయోగించి కొత్తపదాలకు అర్థాలను తెలుసుకొని రాయగలగడం.<br>• నూతన పదాలను సొంత వాక్యాల్లో ఉపయోగించి రాయగలగడం.<br>• ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలను గుర్తించి అవగాహన చేసుకుని రాయగలగడం.<br>• మాండలిక భాషారూపాలను గుర్తించి వినియోగించడం.<br>• సమానార్థక పదాలను గుర్తించి రాయగల్గడం.<br>• వ్యతిరేక పదాలను గుర్తించి రాయగలగడం.<br>• గీతగీసిన పదాలకు అర్థాలు రాసి సందర్భోచితంగా వాక్యాల్లో వినియోగించగలగడం. | • పద విజ్ఞానం, నిఘంటువును ఉపయోగించడం ద్వారా భాషాక్రీడల ద్వారా పదజాలాన్ని పెంచుకోగలగాలి. ఆయా పదాలను సందర్భోచితంగా మౌఖికంగా, లిఖిత రూపకంగా వినియోగించగలగాలి.<br>• ప్రకృతి వికృతులు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలను తెలుసుకుని వివిధ సందర్భాల్లో ప్రయోగించగలగాలి.<br>• భాషలోని జాతీయాలను, సామెతలను ఉపయోగిస్తూ రచనలు చేయగలగాలి.<br>• వివిధ కొత్తపదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలను రాయగలగాలి. |

## 5. సృజనాత్మకత

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పాఠంలోని పదాలతోపాటు కొత్తపదాలు, వాక్యాలతో గేయం, కవిత రాయడం.<br>• ఆత్మకథ, కథరాయడం. | • పాఠ్యాంశాన్ని ఆత్మకథగా రాయడం.<br>• గేయాన్ని అభినయపూర్వకంగా పాడడం.<br>• సొంతంగా గేయం రాయడం. | • స్వతంత్రంగా వర్ణనాత్మకమైన కవిత, గేయం రాయడం.<br>• కరపత్రం, ప్రకటన, బ్రోచరు, పోస్టరు ఇచ్చిన అంశానికి సొంతంగా తయారు చేయడం.<br>• సంభాషణలు రాసి, అభినయించడం. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పద్యాలు, పాఠం ఆధారంగా సూక్తులు, నినాదాలు రాయడం.<br>• పాఠంలోని సన్నివేశానికి సంభాషణలు రాసి, అభినయించడం.<br>• గేయభాగాలకు అనుగుణంగా చిత్రాలు గీయడం.<br>• దినపత్రికలోని కార్టూన్ల ఆధారంగా సొంతంగా కార్టూన్లు గీయడం.<br>• పాఠం ఆధారంగా ప్రకృతిని వర్ణిస్తూ రాయడం.<br>• పాఠంలోని పాత్రను తీసుకొని ఏకపాత్రాభినయం చేయడం.<br>• పాఠంలోని ఇతివృత్తం ఆధారంగా కవితలు, గేయాలు, సేకరించడం.<br>• ముకాభినయం చేయడం. | • పాఠ్యాంశ కథను సంభాషణల రూపంలోకి మార్చి రాయడం.<br>• నాటకీకరణ చేసి ప్రదర్శించడం.<br>• పాఠ్యాంశ ఆధారంగా కవిత రాయడం.<br>• పాఠం ఆధారంగా సూక్తులు, నినాదాలు సొంతంగా తయారుచేయడం.<br>• సన్నివేశాన్ని, సంఘటనను, ఏదైనా ఒక అంశాన్ని వర్ణిస్తూ రాయడం.<br>• ఏకపాత్రాభినయం చేయడం.<br>• పాఠంలోని విషయానికి అనుగుణంగా, ఇచ్చిన అంశానికి కరపత్రం, పోస్టరు, ప్రకటనలు తయారు చేయడం.<br>• పాఠంలోని భావాలకు అనుగుణంగా చిత్రాలు గీయడం.<br>• ఇతివృత్తం ఆధారంగా కార్టూన్లు గీయడం.<br>• గేయాన్ని పొడిగించి రాయడం.<br>• విషయాన్ని సమర్థిస్తూ ఉపన్యాసం ఇవ్వడం. | • ఏకపాత్రాభినయం చేయడం.<br>• ఇచ్చిన అంశానికి స్వతంత్రంగా ఆత్మకథరాయడం.<br>• వృత్తులకు చెందిన చిహ్నాల చిత్రాలు గీయడం.<br>• వర్ణనాత్మకమైన వ్యాసం రాయడం.<br>• ప్రాసల ఆధారంగా వచన కవిత రాయడం.<br>• ప్రముఖ వ్యక్తులను ఇంటర్వ్యూ చేయడం. |

*చదవడం వలన విషయ అవగాహన, పరిజ్ఞానం పెరగడమే కాదు, విశ్లేషించడం, సృజనాత్మక ఆలోచనలు, మానసిక వికాసం వంటి గొప్ప ప్రక్రియలు మన జీవిత విధానంలో భాగమవుతాయి.*

*- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం-2011*

## 6. ప్రశంస

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • గేయాల్ని/ పద్యాలను / రాగయుక్తంగా భావయుక్తంగా పాడేవారిని ప్రశంసించగల్గడం. (కుల,మత, వర్ణ, లింగ, వర్గ విచక్షణ లేకుండా)<br>• గేయాల్ని అభినయపూర్వకంగా ప్రదర్శించినవారిని అభినందించగలగాలి.<br>• కవుల, రచయితల కవితా రీతులను ప్రశంసించగల్గడం<br>• మాండలికాలను తరతమ భేదంలేకుండా ప్రశంసించ గలగాలి<br>• ఇతర భాషలు, మతాలు, సంస్కృతులను, సంప్రదాయాలను అర్థంచేసుకుని ప్రశంసించ గలుగుతారు.<br>• ఇతరులలోని మంచిని ప్రశంచించగల్గుతారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోగల్గడం, వాటిని ప్రశంసించగల్గడం.<br>• ప్రత్యేక అవసరాలుగల పిల్లల్లోని సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రశంసించగలగడం, వారిని తమతో సమానంగా చూడగల్గడం<br>• ప్రకృతిని, పరిసరాలను ప్రశంసించగల్గుతారు<br>• ప్రాచీన సాహిత్య గ్రంథాల్లోని అంశాలను సహేతుకతతో ప్రశంసించగలగాలి.<br>• వివిధ రకాల వృత్తులను గౌరవించగలగాలి.<br>• ఇతర భాషల్లోని ప్రక్రియలను ఆదరించడం, అభినందిచడం చేయగలగాలి. | • ఇతర భాషలలోని గేయాలను కథలను తెలుసుకొని ప్రశంసించ గలుగుతారు.<br>• తరతమ భేదాలు లేకుండా ఆయా ప్రాంతాల / దేశ, సంస్కృతీ సాంప్రదాయాలను తెలుసుకుని వాటిలోని మంచిని ప్రశంసించ గలుగుతారు<br>• తోటివారిలోని మంచి గుణాలను అభినందించ గలగాలి<br>• ప్రకృతిని, పర్యావరణాన్ని వాటిలోని గొప్పతనాన్ని ప్రశంసించ గలగాలి.<br>• విభిన్న కవులరచనలను ప్రశంసించ గలగాలి.<br>• లలిత కళలను, స్థానిక కళారూపాలను అభేదంగా ప్రశంసించ గలగాలి.<br>• సమాజ హితాన్ని ఆశించి చేసే కార్యక్రమాలను, అవి చేసిన వారిని అభినందించ గలగాలి.<br>• సాహిత్యంలోని మంచి విషయాలను ప్రశంసించ గలుగుతారు.<br>• కుల, మత, వర్ణ, వర్గ, లింగ ప్రాంత, భాష భేదాలు లేకుండా ఇతరులలోని మంచిని అభినందించాలి. | • కవుల, రచయిత రచనలలోని ఆసక్తికరమైన వర్ణనలు, అంశాలను అభినందించగలగడం<br>• విజయాలు సాధించిన తోటి విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందించగలగాలి.<br>• తరతమ భేదాలు లేకుండా సంస్కృతి, సంప్రదాయాల్లోని మంచిని ప్రశంసించగలగాలి.<br>• దేశానికి / తల్లిదండ్రులకు / పెద్దలకు సేవచేసేవారిని ప్రశంసించగలగాలి.<br>• మానవవిలువలు, కుటుంబ విలువల్ని గౌరవించగలగాలి.<br>• పాఠ్యాంశాల్లో తమకు నచ్చిన పద్యాలను, విషయాలను ఆయా కవులను అభినందించగలగాలి.<br>• కార్మిక, కర్షక తేడాలేకుండా విభిన్న వృత్తుల పట్ల సానుకూల వైఖరిని కలిగి ఉండాలి.<br>• ప్రాచీన వారసత్వకట్టడాలు, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలల్లోని విశేషాలను ప్రశంసించగలుగుతారు.<br>• సమాజం మేలుకోరే వ్యక్తులను, సంస్థలను వారు / అవిచేసే పనులను ప్రశంసించగలగాలి.<br>• వివిధ రంగాలలో కృషి చేసిన వారిని ప్రశంసించగలగాలి. |

## 7. భాషాంశాలు (వ్యాకరణాంశాలు)

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • సంధిని గూర్చి తెలుసుకోవడం.<br>• అత్వసంధి, ఉత్వసంధి, ఇత్వసంధులు, యడాగమ, సవర్ణదీర్ఘ, యణాదేశ సంధులను గుర్తించ గలగడం, సూత్రీకరించ గలగడం.<br>• సమాసం గూర్చి తెలుసుకోవడం.<br>• ద్వంద్వ, ద్విగు సమాసాన్ని గుర్తించగలగడం.<br>• శబ్దాలంకారాన్ని గూర్చి అర్థం చేసుకోగలగడం, వృత్యానుప్రాస, అంత్యానుప్రాస అలంకారాలను గుర్తించగలగడం.<br>• అర్థాలంకారాన్ని గూర్చి తెలునుకోగలగడం. ఉపమాలంకారాన్ని గూర్చి తెలుసుకోవడం. | • ఔ! విభక్తులను గుర్తించడం, వాటిని ఉపయోగించి వాక్యాలు రాయగలగడం.<br>• వృద్ధి, గుణ, ఆమ్రేడిత, ద్విరుక్తటకార సంధులను గుర్తించగలగడం, సూత్రీకరించగలగడం.<br>• వాక్యభేదాలు తెలుసుకోవడం, వాటిని గుర్తించగలగడం (భావార్థకముగా).<br>• అంత్యానుప్రాస, వృత్యానుప్రాస, ఉత్ప్రేక్ష అలంకారాలను గుర్తించగలగడం.<br>• లఘు, గురువులను గుర్తించడం. | • వాక్యభేదాలను గుర్తించగలగడం, సందర్భోచితంగా వాక్యప్రయోగాలు చేయగలగాలి. (సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త).<br>• ఆమ్రేడిత సంధి, సరళాదేశసంధి, గసడదవాదేశసంధి మొ॥లగు సంధుల గుర్తించగలగడం, సూత్రీకరించగలగడం.<br>• కర్తరి, కర్మణి వాక్యాలు రాయగలగడం.<br>• ఛేకానుప్రాస, రూపక, అతిశయోక్తి, అలంకారాలను గూర్చి తెలుసుకోవడం, గుర్తించగలగడం, లక్షణాలు రాయగలగడం.<br>• తత్పురుష నమాన బేధాలు తెలనుకొనుట, గుర్తించగలగడం.<br>• గణవిభజన చేయడం, ఉత్పలమాల, చంపకమాల పద్యలక్షణాలను తెలుసుకోవడం, గుర్తించగలగడం. |

*పిల్లలు తమంత తాము రాయడం ప్రారంభించగానే వారి పురోగతి ఉపాధ్యాయుడి ప్రతిస్పందన మీద ఆధారపడడం ఆరంభిస్తుంది. మనదేశంలోని చాలా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుడి ఏకైక ప్రతిస్పందన స్పెల్లింగులు, వ్యాకరణ దోషాలు సరిదిద్దడం. పిల్లల కాపీ పుస్తకాల నిండా ఉపాధ్యాయుడి ఎర్రసిరాతో చేసిన దిద్దుబాట్లే కనిపిస్తాయి. పిల్లవాడు అంతా 'కరెక్టు'గానే రాస్తే ఉపాధ్యాయుడు కేవలం ఒక 'రైటు' గీత గీసి సంతకం పెడతాడు. సంపూర్ణ వినాశకరాలు కాకపోయినా ఈ రెండు రకాల ప్రతిస్పందనలూ ఎంతో అసమగ్రాలని మాత్రం చెప్పక తప్పదు.*

*- ప్రొ॥ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

# (అ) 6, 7, 8 తరగతులు భాషా సామర్థ్యాలు (ద్వితీయ భాష) - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. వినడం - అర్థంచేసుకోవడం, ఆలోచించి మాట్లాడడం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • ఇతరులు చెప్పిన దానిని విని అర్థం చేసుకొని మాట్లాడడం.<br>• నేర్చుకున్న గేయాలను, పద్యాలను రాగంతో పాడాలి. అభినయం చేయగలగాలి.<br>• సూచనలు, గేయాలు, పాటలు, సంభాషణలు, కథలు వంటివి విని అర్థం చేసుకోవాలి. దాన్ని గురించి చెప్పగలగాలి. ధ్వనుల మధ్య భేదాలు గుర్తించగలగాలి.<br>• తెలిసిన, విన్న, చూసిన, అంశాల గురించి సొంతమాటల్లో అర్థమయ్యేలా క్రమపద్ధతిలో చెప్పగలగాలి. స్పష్టమైన ఉచ్చారణతో సరైన క్రమంలో పదాలను, వాక్యాలను పలకాలి.<br>• ఏదైనా చిత్రాన్ని చూసి దాని గురించి మాట్లాడడం.<br>• ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పడం.<br>• తాను చేసిన ఏదైనా సన్నివేశాన్ని గూర్చి సొంత మాటల్లో చెప్పడం.<br>• విన్న అంశాలపై సందేహ నివృత్తి కోసం ప్రశ్నించడం. | • గేయాలు, సూచనలు, కథలు, పాటలు, సంభాషణలు, వ్యాసం వంటివి విని అర్థం చేసుకోవాలి, సొంతమాటల్లో చెప్పాలి.<br>• తెలిసిన, విన్న, చూసిన అంశాల గురించి సొంతమాటల్లో అర్థమయ్యేలా స్పష్టమైన ఉచ్చారణతో సరైన క్రమంలో చేర్చగలగాలి.<br>• గేయాలు, రాగంతో పాడాలి, అభినయం చేయాలి.<br>• వివిధ సన్నివేశాలలో సందర్భోచితంగా సరైన భాషను ఉపయోగించి మాట్లాడగలగాలి.<br>• వ్యక్తులు, సంఘటనలు, సన్నివేశాల గురించి మాట్లాడగలగాలి.<br>• చిన్న చిన్న ప్రసంగాలను విని అర్థం చేసుకోవడం.<br>• ఇతరుల సంభాషణల్ని విని అర్థం చేసుకుని గ్రహించిన భావాన్ని చెప్పడం.<br>• విన్న పాఠ్యాంశాల సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పడం.<br>• ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలను విని, అర్థం చేసుకుని తిరిగి చెప్పడం. | • పద్యాలు, గేయాలు, సంభాషణలు విని అర్థం చేసుకోవాలి. సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• పద్యాలను, గేయాలను రాగ, భావయుక్తంగా అభినయంతో పాడగలగాలి.<br>• ఆయా అంశాలకు సంబంధించిన కారణాలు వివరించగలగాలి.<br>• ఇవ్వబడిన అంశాలను సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.<br>• ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు విని అర్థం చేసుకుని ప్రతిస్పందించడం.<br>• స్థానిక కళారూపాల్ని చూసి, విని అర్థం చేసుకుని తన అభిప్రాయాన్ని చెప్పడం.<br>• పాత్రల స్వభావాల్ని, తారతమ్యాన్ని గ్రహించడం.<br>• సాహితీ ప్రక్రియల్లోని భేదాల్ని గుర్తించి తమ అభిప్రాయాన్ని చెప్పడం.<br>• చిన్న చిన్న సంఘటనల్ని వర్ణనాత్మకంగా చెప్పడం. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • వివిధ ప్రక్రియల్లో ఉన్న పాఠ్యాంశాల సారాంశాన్ని గ్రహించి సొంత మాటల్లో చెప్పడం. | • ఇతరుల ఆలోచనల్ని విని తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించడం.<br>• తన సందేహాల్ని సరైన భాషను ఉపయోగించి ప్రశ్నించడం.<br>• జాతీయాలకు, సామెతలకు మధ్య తేడాలను వివరించగలగడం.<br>• వివిధ పండుగలు జరుపుకునే విధానం గురించి మాట్లాడగలగడం.<br>• విహార యాత్రలకు సంబంధించిన అంశాలపై మాట్లాడగలగడం.<br>• తమ ప్రాంతంలో ఉండే వాగులు, నదుల గురించి మాట్లాడగలగడం. | • తాను విన్న, చదివిన జాతీయాలు, సామెతల్లోని అర్థాన్ని గ్రహించి చెప్పడం.<br>• పాఠ్యాంశాల్లోని సారాంశాన్ని గ్రహించి సంగ్రహంగా సొంత మాటల్లో చెప్పడం.<br>• పాఠంలో తనకు నచ్చిన భావం గురించి చెప్పగలగాలి.<br>• నాటికి ఈనాటికి మారిన పరిస్థితులను అర్థం చేసుకుని చెప్పగలగాలి.<br>• కవుల సందేశాలను / ఉద్దేశాలను అర్థం చేసుకుని చెప్పగలగాలి.<br>• తగిన కారణాలతో శీర్షికలను సూచించగలగాలి. |

## II. ధారాళంగా చదవడం- అర్థం చేసుకొని వ్యక్తీకరించడం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • గేయాలు, కథలు, పాటలు, వ్యాసం వంటి పాఠాలను ధారాళంగా చదవగలగాలి. చదివిన వాటి గురించి సొంత మాటల్లో చెప్పగలగాలి. | • గేయాలు, కథలు, వ్యాసం,ఆత్మకథ, సంభాషణ, పదాలు మొదలైన వాటిని ధారాళంగా చదవగలగాలి. | • పద్యాలను, గేయాలను ధారాళంగా భావయుక్తంగా, రాగయుక్తంగా చదవగలగాలి. వాటి పాఠ్యాంశాలను లేదా భావాలను గ్రహించాలి. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • వివిధ ప్రక్రియల్లో ఉన్న పాఠ్యాంశాల్ని ధారాళంగా చదివి తన సొంత మాటల్లో చెప్పడం.<br>• చదివిన అంశాల్లోని ప్రాస, జంట, వ్యతిరేక పదాల్ని గుర్తించి చెప్పడం.<br>• వివిధ రూపాల్లో ఉన్న బాలసాహిత్యాన్ని చదివి సొంతమాటల్లో చెప్పడం.<br>• కఠిన పదాలకు అర్థాల్ని గ్రహించి సందర్భాన్ని బట్టి ఉపయోగించడం.<br>• కథా చిత్రాల్ని పాఠ్యాంశంతో పోల్చి తన అభిప్రాయాన్ని చెప్పడం.<br>• పాఠం ఆధారంగా జవాబులు రాయగలగడం.<br>• గుణింతాలను చదవగలగడం.<br>• పాఠంలోని పదాలను గుర్తించగలగడం. చెప్పగలగడం.<br>• చిత్రాలను చూసి పదాలను చదవగలగడం. చెప్పగలగడం.<br>• పదాలు చదివి వాటితో వాక్యాలు చెప్పగలగాలి.<br>• అక్షరాల మధ్య తేడాను గుర్తిస్తూ చదవగలగడం. అక్షరాలతో పదాలు, వాక్యాలు చెప్పగలగడం. | • చదివిన అంశాల గురించి ఎవరు? ఏమిటి? ఎక్కడ? ..... .. వంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలగాలి. రాయగలగాలి.<br>• చదివిన అంశాలలోని పదాల అర్థాలను గ్రహించుకొని చదవాలి.<br>• వివిధ రూపాల్లోని బాలసాహిత్యాన్ని ధారాళంగా చదవగలగాలి. అర్థం చేసుకొని చెప్పగలగాలి.<br>• అపరిచిత కథలు, సంభాషణలు విని అర్థం చేసుకుని సొంత మాటల్లో చెప్పడం.<br>• పోస్టర్లు, ప్రకటనల్ని చదివి అర్థం చేసుకోవడం.<br>• వివిధ పాఠ్య ప్రక్రియల్ని ధారాళంగా చదివి, అర్థం చేసుకుని వ్యక్తీకరించడం.<br>• చదివిన పాఠ్యాంశాలపై ప్రశ్నలకు తగిన సమాధానాల్ని చెప్పడం.<br>• పాఠ్యాంశాల్లో సూచిత అంశాలకు శీర్షికలు పెట్టగలగడం.<br>• పద్యాలు, గేయాల్ని రాగయుక్తంగా చదివి భావాల్ని చెప్పడం.<br>• వార్తా పత్రికలు, లేఖలు ధారాళంగా చదివి అర్థం చేసుకోవడం. చేసుకుని తిరిగి చెప్పడం. | • అపరిచిత అంశాలను చదివి అర్థం చేసుకొని అవగాహనతో జవాబులు రాయగలగాలి. ప్రశ్నలను తయారుచేయగలగాలి.<br>• నిర్దేశించిన అంశానికి శీర్షికను నిర్ణయించగలగాలి. ఆయా అంశాలను క్రమంలో ఉంచగలగాలి. భేదాలను గుర్తించి రాయగలగాలి.<br>• పాఠ్యాంశాల ఆధారంగా ఇవ్వబడిన ప్రశ్నలకు సరైన రీతిలో స్పష్టమైన జవాబులు రాయగలగాలి.<br>• వివిధ పాఠ్య ప్రక్రియల్ని శైలీ భేదంతో చదివి అర్థం చేసుకుని సొంత మాటల్లో చెప్పడం.<br>• వ్యాసాలు, లేఖలు చదివి అర్థం చేసుకోవడం.<br>• చదివిన అంశాల్ని విశ్లేషించి తన అభిప్రాయాన్ని చెప్పడం.<br>• బాల సాహిత్య రూపాలు, నాటికలు, ఏకపాత్రలు, కవితలు ధారాళంగా చదివి అర్థం చేసుకుని స్పందించడం.<br>• తారుమారైన గేయ, పద్య భాగాలను పాఠ్యాంశము ఆధారంగా సరిచేసి రాయగలగాలి.<br>• పాఠ్యాంశానికి సంబంధించి సూచించిన విధంగా పట్టిక రాయగలగాలి. |

## III. స్వీయరచన (సొంతమాటల్లో రాయడం)

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • తప్పులు లేకుండా విరామ చిహ్నాలు ఉపయోగించి క్రమపద్ధతిలో రాయడం.<br>• సరైన పదాల్ని ఉపయోగించి సంపూర్ణ వాక్యాల్ని అర్థవంతంగా రాయడం.<br>• పాఠ్యాంశ సారాంశాల్ని సొంత మాటల్లో రాయడం.<br>• పద్య భావాన్ని సొంత మాటల్లో రాయడం.<br>• తెల్సిన, విన్న, చూసిన వాటి గురించి, తన అనుభవాల గురించి సొంత మాటల్లో కనీసం 8 నుండి 10 వాక్యాలు లేదా రెండు / మూడు పేరాలు రాయగలగడం.<br>• వాక్యాలలోని పదాలను సందర్భోచితంగా ఉపయోగించడం.<br>• సరళ పదాలు, వాక్యాలు రాయగలుగుతారు.<br>• చిత్రాలను చూసి పదాలను రాయగలుగుతారు.<br>• పట్టికలలోని అక్షరాలకు గుణింతాలు రాయగలుగుతారు. వాటితో పదాలు రాయగలుగుతారు.<br>• పదాల్లోని ఒత్తులను గుర్తించి రాయగలుగుతారు. | • రాసేటప్పుడు సంపూర్ణ వాక్యాలు అర్థవంతంగా సరైన పదాలను ఉపయోగించి విరామచిహ్నాలు ఉపయోగిస్తూ తప్పులేకుండా క్రమ పద్ధతిలో రాయగలగాలి.<br>• తెలిసిన, చదివిన, విన్న, చూసిన విషయాన్ని సొంత మాటల్లో రాయగలగాలి.<br>• విరామ చిహ్నాల్ని పాటిస్తూ విషయాన్ని సంఘటనా క్రమంలో రాయడం.<br>• పాత్రల స్వభావాల్ని రాయడం.<br>• వివిధ ప్రక్రియల్లో ఉన్న పాఠ్యాంశాల సారాంశాల్ని సొంత మాటల్లో రాయడం.<br>• పాఠంలో పేర్కొన్న అంశాలపై అభిప్రాయాలను రాయగలగడం.<br>• చిన్న చిన్న వ్యాసాలు, రాయడం.<br>• లేఖలు రాయడం.<br>• పాఠ్యాంశ శీర్షికలను గురించి తగిన కారణాలతో రాయగలగాలి. | • పాఠ్యాంశంలోని సంఘటనలను, ఆయా అంశాలను, ఆయా పాత్రలను, స్థలాలను, విషయాలను గురించి ఆలోచించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>• ముగింపు లేని విషయాలకు, లేదా అంశాలకు, కథలకు గేయాలకు ముగింపు ఊహించి రాయగలగాలి.<br>• ఆయా సంఘటనలపై తమ అభిప్రాయాన్ని, స్పష్టంగా సొంతమాటల్లో రాయగలగాలి.<br>• పాఠాల సారాంశాల్ని, భావాల్ని రాయడం.<br>• లేఖలు, లేఖలకు ప్రతిలేఖల్ని రాయడం.<br>• తనకు నచ్చిన విషయాల్ని గురించి తగిన కారణాలను రాయడం.<br>• కవి ఉద్దేశాలను, పాత్ర స్వభావాలను వివిధ విషయాలపై అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను సొంత మాట్లో రాయడం.<br>• ఇచ్చిన అంశాన్ని తగిన కారణాలతో సమర్థిస్తూ రాయగలగాలి. |

## IV. పదజాలం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • పదాలకు అర్థాలను తెలుసుకుని సందర్భోచితంగా ఉపయోగించడం.<br>• పదాలకు వ్యతిరేకార్థక పదాల్ని, వచనాల్ని రాయడం.<br>• ప్రాస, జంట పదాల్ని గుర్తించి రాయడం.<br>• జంట పదాలతో వాక్యాలు రాయడం. | • పదాలకు అర్థాలు తెలుసుకుని సొంత వాక్యాల్లో ప్రయోగించడం.<br>• వ్యతిరేకార్థ బోధక వాక్యాలు రాయడం.<br>• పర్యాయ పదాలు రాయడం.<br>• నూతన పదాల్ని ఉపయోగించి సొంత వాక్యాల్ని రాయడం.<br>• జాతీయాల గురించి తెలుసుకుని వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించగలగడం.<br>• ఏక, బహువచనాలు రాయడం. | • భాషాక్రియలు, పద పట్టికలు మొదలగు వాటి ద్వారా పదాలను రాయగలగడం.<br>• ప్రకృతి, వికృతుల్ని, జాతీయాల్ని, సామెతల్ని గుర్తించి సొంత వాక్యాల్లో ఉపయోగించడం.<br>• నిఘంటువును అధ్యయనం చేయడం.<br>• మాండలిక భాషా రూపాన్ని గుర్తించడం. వినియోగించడం.<br>• పదాలకు నానార్థాల్ని, పర్యాయపదాలను గుర్తించడం. నిత్యజీవితంలో వినియోగించడం.<br>• వ్యతిరేక పదాలను గుర్తించి, వాటితో సొంతవాక్యాలు రాయగలగడం.<br>• జంటపదాల్ని గుర్తించడం వాటితో సొంతవాక్యాలు రాయగలగడం. |

## V. సృజనాత్మకత

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • గేయాలు, కథలు పాడిగించడం.<br>• సూచనలకు తగిన బొమ్మలు గీసి, రంగులు వేయడం, దాని గురించి వివరించడం. | • కథల్ని, పాటల్ని, గేయాన్ని పొడిగించి రాయడం.<br>• జాతీయాలతో కథను / సంఘటనను రాయడం. | • కథలు అల్లడం, నాటకంలో పాత్రలు పోషించడం/ ఏకపాత్రాభినయం చేయడం.<br>• తన అనుభవాల్ని వర్ణించి చెప్పడం. |

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • చిత్రాలు గీసి రంగులు వేయడం, వాటి గురించి రాయడం.<br>• సన్నివేశానికి అనుగుణంగా చిత్రాలు గీయడం. సన్నివేశాన్ని ఊహించి రాయడం.<br>• చిత్రాన్ని చూసి కథను ఊహించి రాయడం.<br>• బయోడేటా రాయడం.<br>• సంభాషణలను ఊహించి రాయడం, పొడిగించడం.<br>• వస్తువులను తయారు చేసి వాటి గురించి వివరించడం/ వర్ణించడం.<br>• నాటకీకరణ చేయడం.<br>• వివిధ భావాలకు అనుగుణంగా కథలు రాయడం. | • గేయ కథలోని పాత్రల్ని గ్రహించి సంభాషణ రూపంలో రాయడం.<br>• దినచర్య/ డైరీ రాయడం.<br>• లేఖలు, వ్యాసాలు రాయడం.<br>• వర్ణించి రాయడం.<br>• గేయాల్ని కథలుగా రాయడం.<br>• భావాత్మక చిత్రాలు గీయడం.<br>• సంభాషణలను పొడిగించడం/ ఊహించి రాయడం.<br>• సూచనలు, సన్నివేశాలకనుగుణంగా చిత్రాలు గీయడం.<br>• ఊహించిన చిత్రాలు గీయడం. వాటి గురించి రాయడం.<br>• ఆత్మకథ రాయడం.<br>• నాటకీకరణ చేయడం. | • కథలు, గేయాలు, సంభాషణలు పొడిగించడం.<br>• భావాత్మక చిత్రాలు గీసి, కవితలు రాయడం.<br>• వర్ణించి రాయడం<br>• ఆత్మకథలు రాయడం.<br>• లఘునాటికలు రాయడం.<br>• ప్రకటనలు, నోటీసులు, ఆహ్వాన పత్రికలు, పోస్టర్లు శుభాకాంక్షలు తెలిపే కార్డులు తయారు చేయడం.<br>• లేఖలు, దరఖాస్తులు, డైరీలు రాయడం.<br>• నినాదాలు, సూక్తులు, లేఖలు మొదలగునవి రాయగలగడం.<br>• పత్రికలకొరకు వార్తలు రాయడం.<br>• సూచించిన అంశంపై వ్యాసం రాయగలగడం. |

*మనమందరం కూడా మన బాలలను బానిసలుగా తయారుచేస్తున్నాం. పెద్దలైన మనం ఇళ్లలోనో, పాఠశాలల్లోనో నియమాలను, వాటిని పాటించే పద్ధతులను మన చేతుల్లోనే ఉంచుకుంటున్నాం. పిల్లలు ఏమి చేయాలన్నా మనల్ని అడిగే చేయాలని ఏర్పాట్లు వేసుకున్నాం. ఈ పరిస్థితి కొనసాగినంతవరకు మన బాలల స్వతంత్రబుద్ధిని మనమే నాశనం చేస్తూ ఉంటాం.*

*- గిజుభాయి*

## VI. ప్రశంస

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • ఇతర భాషలకు చెందిన పదాలను తెలుసుకోవడం. ప్రయోగించడం.<br>• జంతువుల పట్ల, వృద్ధుల పట్ల, ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల సహానుభూతి కలిగి సహకరించడం. మానవీయ దృక్పథంతో ప్రవర్తించడం.<br>• ఇతరులు చేసిన మంచి పనులను అభినందించడం.<br>• ఇతర భాషల్లోని దేశభక్తిగేయాలను సేకరించడం. పాడగలగడం. | • వివిధ మతాలకు, భాషలకు చెందిన పిల్లలు పాడే పాటలను పాడడం.<br>• స్థానికంగా వాడే వివిధ భాషా రూపాలను ప్రశంసించడం.<br>• స్థానిక కళారూపాల్ని ప్రశంసించడం.<br>• పోటీలలో పాల్గొని గెలుపొందిన వారిని అభినందించడం.<br>• ఇతర భాషల్లోని సామెతలు, జాతీయాలను తెలుసుకొని ప్రశంసించడం.<br>• ఇతరుల్లోని మంచి గుణాలను ప్రశంసించడం.<br>• ఇతర భాషల్లోని దేశభక్తి గేయాలను సేకరించగలగడం. | • కవుల/ రచయితల రచనా విధానాన్ని వారి భావాలను ప్రశంసించగలగాలి.<br>• వివిధ నంస్కృతి నంప్రదాయాలను ప్రశంసించగలగాలి.<br>• తోటి పిల్లలు చేసిన నమూనాల్ని పరిశీలించి అభినందించడం.<br>• ఇతర భాషలు, మతాలు, సంస్కృతుల్ని అర్థం చేసుకుని గౌరవించడం.<br>• ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లోని ప్రత్యేకతల్ని గుర్తించి అభినందించడం.<br>• ఆడ పిల్లల్లోని ప్రతిభను గుర్తించి అభినందించడం.<br>• కవితా శైలిని గుర్తించి కవిని ప్రశంసించడం.<br>• అభినందన పత్రం తయారుచేయడం.<br>• ఇతర భాషల్లోని నీతి వాక్యాలను సేకరించి, ప్రశంసించగలగాలి.<br>• ప్రోత్సాహకలేఖలు రాయగలగడం.<br>• స్థానిక కళారూపాలను ప్రశంసించగలగాలి. |

## VII. భాషను గురించి తెలుసుకుందాం

| 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి |
|---|---|---|
| • వాక్య నిర్మాణక్రమాన్ని అర్థం చేసుకోవడం.<br>• వాక్యంలోని పదాల మధ్య సంబంధాన్ని గుర్తించడం.<br>• పదాల స్వభావాన్ని గుర్తించి వర్గీకరించడం.<br>• నామవాచకాలు తెలుసుకుని గుర్తించాలి. | • భాషా భాగాలను గుర్తించడం, ఉదాహరణలతో రాయడం. (స్వరూపం, క్రియ, విశేషణం)<br>• విభక్తులను గుర్తించడం. రాయడం, వాక్యాల్లో వినియోగించడం.<br>• లింగ భేదాలను గుర్తించి వినియోగించడం.<br>• భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను, క్రియారూపాల్ని గుర్తించి వినియోగించడం.<br>• వచన విభేదాలను గుర్తించడం, వినియోగించడం.<br>• క్రియా భేదాల గురించి తెలుసుకోవడం, ఉదాహరణలతో రాయడం.<br>• వాక్య భేదాల గురించి తెలుసుకోవడం, వాటిని గుర్తించి వివిధ సందర్భాలలో వినియోగించగలగడం. | • భాషాభాగాలను గుర్తించగలగడం, విభక్తులను గుర్తించి భాషలో వాటి ప్రాముఖ్యాన్ని తెలుసుకోగలగడం.<br>• లింగ భేద పదాలను, వాక్యాలను, వాటిని రాసే విధానాన్ని తెలుసుకొని రాయగలగడం.<br>• వాక్య నిర్మాణాన్ని గుర్తించడం.<br>• సమాపక, అసమాపక వాక్యాలు రాయడం.<br>• సామాన్య వాక్యాల్ని సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా మార్చడం.<br>• సంధులు, సమాసాలు, సవర్ణదీర్ఘసంధి, అత్వ, ఇత్వ, ఉత్వ సంధులను గూర్చి తెలుసుకొని గుర్తించడం సూత్రీకరించడం.<br>• వ్యతిరేకార్థక వాక్యాల పట్ల అవగాహన పెంచుకోవడం.<br>• భావార్థక వాక్యాలను తెలుసుకోవడం, గుర్తించడం.<br>• పురుషలను గూర్చి తెలుసుకొనుట, గుర్తించుట.<br>• సమాసము గూర్చి తెలుసుకుని ద్విగుసమాసమును గుర్తించగలగడం. |

## ఇ) పాఠ్యపుస్తకాలు

**6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాల లక్షణాలు :**

- భాషా వాచకాలు ప్రధానంగా విషయ ప్రాధాన్యం కంటే కూడా భాషా సామర్థ్యాలను, ఆలోచన శక్తిని, మానవత విలువలను, భాషాభిరుచిని పెంపొందింపజేయడానికి దోహదపడాలి.
- పాఠ్యపుస్తకాలు బహుళ రంగుల్లో ఆకర్షణీయంగా, ఆసక్తికలిగించే చిత్రాలతో, నాణ్యమైన కాగితం, ముద్రణతో ఉండాలి.
- రాష్ట్రంలోని విభిన్న మాండలికాలు పిల్లలకు పరిచయమయ్యేలా ఒక్కొక్కప్రాంతానికి సంబంధించిన మాండలికంలోని కొన్ని పాఠాలను చేర్చవచ్చు.
- ఎక్కువ పాఠాలు అన్ని ప్రాంతంలోని పిల్లలకు అర్థమయ్యేలా శిష్టవ్యవహారికంలోని భాషతో కూడినవై ఉండాలి.
- ఈ దశలో పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను పద్యం, గద్యం భాగాలుగా విభజించకుండా పాఠాలనిడివి, స్వభావాన్ని బట్టి వరుసక్రమంలో చేర్చాలి.
- పాఠ్యాంశాలను ప్రముఖ కవులు, రచయితలు, ప్రాచీన, ఆధునిక సాహిత్యం నుండి ఎంపిక చేయాలి.
- ఎంపిక చేసిన పాఠ్యాంశాలు పిల్లల ప్రపంచానికి దగ్గరగా, స్థాయికి తగినవిగా ఉండాలి.
- పాఠ్యాంశాలు కనీసం 3నుండి 8 పేజీల వరకు ఉండవచ్చు
- 30 శాతం వరకు చిత్రాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకంలో అభ్యాసాలు పాఠాల తర్వాత ఉన్నా కూడా పాఠం కంటే ముందు పిల్లలు పాఠాన్ని చదవడానికి పురికొల్పేలా ఆలోచింపజేసే చిత్రాలు లేదా ప్రశ్నలు ఉండాలి.
- పాఠాన్ని పిల్లలు చదివేలా, అర్థాన్ని గ్రహించేలా విద్యార్థులకు సూచనలను ప్రతి పాఠంలో ప్రారంభంలోనే ఇవ్వాలి.
- అభ్యాసాలు ప్రధానంగా భాషాసామర్థ్యాలు సాధించడానికి వీలుగా, సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉండాలి.
- అభ్యాసాలు పిల్లల్లో ఆలోచనా నైపుణ్యాలు, వ్యక్తీకరణ సామర్థ్యం పెంచే విధంగా ఉండాలి.
- పిల్లలు ప్రతిస్పందించడం, విశ్లేషించడం, నిర్ధారించడం, ఊహించడం, బహుకోణాల్లో ఆలోచించడం, దైనందిన జీవితంతో, సమకాలిక అంశాలకు అన్వయించడం వంటివి చేయగలిగేలా అభ్యాసాలు ఉండాలి.
- వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉండాలి.
- అభ్యాసాలు స్వీయ అధ్యయనానికి, అదనపు పఠన సామగ్రిని చదవడానికి పురికొల్పేవిగా ఉండాలి.
- వ్యాకరణాంశాలను నేరుగా పరిచయం చేయకుండా, ఉదాహరణల ద్వారా పరిచయం చేయాలి. పిల్లలే సూత్రీకరణ చేసుకోవడానికి వీలుగా వివరణలు ఉండాలి.

- పాఠాల కింద / ముందు అర్థాలు ఇవ్వడానికంటే సందర్భోచితంగా, అర్థాలు గ్రహించేలా అభ్యాసాలు ఉండాలి. అట్లే నిఘంటువు ఆధారంగా అర్థాలు గ్రహించేలా అభ్యాసాలు ఉండాలి.
- ఇందుకోసం పాఠ్యపుస్తకం చివర సందర్భోచితంగా అర్థాలు గ్రహించేలా 'పదాలు - అర్థాలు' పట్టికను ఇవ్వాలి.
- విస్తార పఠనం కోసం పాఠ్యపుస్తకంలోనే 'చదువు-ఆనందించు' అనే శీర్షికతో పాఠ్యాంశాలు, కథలను చేర్చవచ్చు, లేదా ఉపవాచక పాఠాలను పాఠ్యాంశాలతో కలిపి ఇవ్వాలి.
- 6వ తరగతిలోని ప్రారంభ పాఠాల్లో ప్రాథమిక స్థాయికి సంబంధించిన సామర్థ్యాలను పునశ్చరణ కోసం చేర్చాలి.
- పాఠ్యపుస్తకం ప్రారంభంలో విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాల జాబితాను చేర్చాలి.
- అట్లే పాఠ్యపుస్తకం వినియోగం గురించి ఉపాధ్యాయులకు సూచనలు చేర్చాలి.
- ప్రతి పాఠంలో ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల గురించి పిల్లలే తమను తాము అంచనా వేసుకోవడానికి 'స్వీయమూల్యాంకనం' కోసం అభ్యాసాన్ని చేర్చాలి.
- 8వ తరగతిలో ఉపవాచక పాఠాలను పాఠాల అనంతరం చేర్చాలి. హాస్యం, సంస్కృతి, స్థానిక చరిత్ర, మానవ సంబంధాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం మొదలగు అంశాలకు సంబంధించిన కథలు, కథానికలు, వ్యాసాలను, ఉపవాచక పాఠాలుగా చేర్చాలి.
- పాఠ్యపుస్తకాలలో మానవతావిలువలు, ఆత్మగౌరవం, స్వీయక్రమశిక్షణ, తోటివారిని సమభావంతో చూడడం, గౌరవించడం వంటి వైఖరులు పెంపొందించే పాఠ్యాంశాలు ఉండాలి. ప్రశంసాపూర్వకమైన వైఖరులు పిల్లల్లో పెంపొందేలా అభ్యాసాలు కూడా చేర్చాలి.
- పాఠ్యాంశ స్వభావాన్ని బట్టి ప్రతిపాఠంలో 'ప్రాజెక్టు పనిని' చేర్చాలి.
- పిల్లలు కూడా పాఠ్యపుస్తకాన్ని సరిగా వినియోగించేటట్లు చేయడానికి వారికి అర్థమయ్యేలా "విద్యార్థులకు సూచనల"ను పాఠ్యపుస్తకం ప్రారంభంలో ఇవ్వాలి.
- ప్రతిపాఠంలో "ప్రాజెక్టు పనిని" చేర్చాలి.
- కవులు, రచయితల వివరాలు చిత్రాలతో ప్రత్యేక గడిలో ఇవ్వాలి.
- పాఠాలను కింద తెలిపిన ఇతివృత్తాల ఆధారంగా ఎంపిక చేయాలి.
- దేశభక్తి, వృద్ధులపట్ల వైఖరి, నైతిక / మానవతా విలువలు, సామాజిక స్పృహ, భాషాభిరుచి, వికలాంగుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, రసానుభూతి, సంస్కృతి సంప్రదాయాలు, పర్యావరణం, కళలు, హాస్యం, స్త్రీసాధికారిత, బాలికలవిద్య, బాలల హక్కులు, శ్రమపట్ల గౌరవం, శ్రమ సౌందర్యం, కుటుంబ విలువలు, యాత్రాచరిత్ర, జాతీయ సమైక్యత...మొదలగునవి.
- గద్యప్రక్రియలు అనగా వ్యాసం, సంభాషణ, కరపత్రం, వార్తాంశం, ఆత్మకథ, లేఖ మొదలగు రూపాల్లో పాఠాలు ఉండాలి. 'పద్య' భాగం పేరుతో కేవలం పద్యాలతో కూడిన పాఠాలకే పరిమితం కాకుండా ద్విపద, వచన కవిత, గేయం, పాటలు, గజల్, రుబాయిలు.... వంటి ప్రక్రియలతోకూడిన పాఠాలు ఉండాలి.
- పిల్లలు తమకున్న భాషాసామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించడానికి వివిధ కృత్యాలతో కూడిన ప్రాజెక్టుపనులు ఉండాలి.

# ఈ) పాఠ్యాంశాల వివరాలు

**6వ తరగతి - పాఠాల వివరాలు** **తెలుగు - ప్రథమభాష**

| క్ర.సం. | ప్రధానాంశం/ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | సూచిత పాఠ్యాంశాలు | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | దేశభక్తి | గేయం | దేవులపల్లి | ప్రాచుర్యంలోని దేశభక్తి గేయం-ఆకాశంనిండా | 1. పదాలు - ధాతుపల్లవం, శబ్దపల్లవం<br>2. సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు<br>3. సంధి-తెలుగు<br>అత్వ, ఇత్వ, ఉత్వ సంధులు<br>i) సంస్కృత సంధులు<br>అ) సవర్ణదీర్ఘసంధి,<br>ఆ) యణాదేశసంధి<br>4. విభక్తి - ఉపవిభక్తి<br>5. సమాసం<br>అ) ద్వంద్వం<br>ఆ) ద్విగువు<br>6. క్రియారూపాలు<br>అ) సమాపక క్రియ<br>ఆ) అసమాపకక్రియ<br>7. ఛందస్సు<br>గురులఘువులు, మాత్రలు<br>8. అలంకారం<br>అర్థాలంకార, శబ్దాలంకార భేదం<br>ఉపమాలంకారం (పోలిక)<br>ఉత్ప్రేక్షాలంకారం (ఊహ) |
| 2. | వృద్ధులపట్ల వైఖరి | కథానిక | మధురాంతకం రాజారం | ‘ఇక్కడ అంతా క్షేమం’ నుండి లేఖ ఎంపిక | |
| 3. | నైతిక విలువలు | పద్యాలు | వివిధ కవులు | తిక్కన మహాభారతంలోని నీతి పద్యాలు, సుమతీ, వేమన, భర్తృహరి శతక పద్యాలు | |
| 4. | నీతి | కథలు | చిన్నయసూరి | పంచతంత్రం నుండి చిత్రగ్రీవం కథ | |
| 5. | మానవతా విలువలు | గేయకథ | కరుణశ్రీ | ‘ఉదయ శ్రీ’ నుండి మ్రోగిన గంటలు | |
| 6. | క్రీడావార్త | వార్తాంశాలు | వివిధ వార్తాపత్రికలు | క్రీడావార్త | |
| 7. | సామాజిక స్పృహ/ నైతికవిలువలు | ముక్తకాలు | ఆరుద్ర | కూనలమ్మపదాలు సామాజిక స్పృహకలిగే అంశం | |
| 8. | సామాజిక స్పృహ | లేఖ | - | భాషాభిమానం పెంపొందించటంపై | |
| 9. | భాషాభిరుచి | సంభాషణ | - | సంభాషణరచన | |
| 10. | వికలాంగుల ఆత్మవిశ్వాసం | ఆత్మకథ | అనువాదం | NCERT నుండి అనువాదం హెలెన్ కెలర్ గూర్చి | |
| 11. | ప్రకృతి - పర్యావరణం | ఆధునిక పద్యం | డా. వానమామలై వరదాచార్యులు | “మణిపూసల” నుండి కుసుమోపదేశం | |
| 12. | వర్ణన / రసానుభూతి | ప్రాచీనపద్యం | మొల్ల | రామాయణం నుండి సుందరకాండలోని అంశం | |
| 13. | సృజనాత్మకత | కాల్పనిక వ్యాసం | | సృజనాత్మకతను పెంపొందింపజేసే అంశాలపై పిల్లల అనుభూతుల ఊహారచన | |
| 14. | హాస్యం / భాషాభిమానం | పద్యాలు | వివిధ కవులు | సరదా పద్యాలు | |
| * | ఉపవాచకం: | | | | |
| | • త్యాగం | కథ | ---- | విక్రమార్క కథల నుండి త్యాగం | |
| | • చారిత్రక వీరగాథ | కథ | సురవరం ప్రతాపరెడ్డి | హైందవ ధర్మవీరుల నుండి సోమనాద్రి | |
| | • హాస్యం | వినోదకథ | అనువాదం | NBT/ CBT నుండి ఎలుకమ్మ పెళ్ళి | |
| | • అద్భుతం | కథ | అనువాదం / ఇతరములు | NBT/ CBT నుండి ఎత్తుకు పైఎత్తు | |

## 7వ తరగతి - పాఠాల వివరాలు　　　　తెలుగు - ప్రథమభాష

| క్ర.సం. | ప్రధానాంశం/ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1 | దేశభక్తి | గేయం | రాయప్రోలు | ప్రాచుర్యం పొందిన దేశభక్తి గేయంశ్రీలుపొంగిన జీవగడ్డ. | 1. సంధులు |
| 2 | సంస్కృతి సంప్రదాయాలు | పురాణకథ | ఉషశ్రీ | మహాభారతం నుండి కథ (సక్తుప్రస్థునికథ) | i) సంస్కృతసంధి |
| 3 | నైతిక విలువలు | పద్యాలు | శతక కవులు | గువ్వలచెన్న, కుమార, తెలుగుపూలు, వేమన, సుభాషితరత్నావళి, నార్లవారిమాట, నరసింహ శతకాల్లోని పద్యాలు | అ) వృద్ధిసంధి |
| 4 | పర్యావరణం | వైజ్ఞానిక వ్యాసం | కొడవటిగంటి. కు. | కొడవటిగంటివారి తాత్త్వికవ్యాసాల ఆధారంగా | ii) తెలుగు |
| 5. | త్యాగం (నైతిక విలువలు) | పద్యకథ | అనంతామాత్యుడు | **భోజరాజీయం** నుండి ఆవు-పులికథ | అ) ద్విరుక్తటకార |
| 6. | కళలు | ఆధునిక పద్యం | గుర్రం జాషువ | **ఖండకావ్యం** నుండి శిల్పి | ఆ) ఆమ్రేడిత (1) |
| 7. | సామాజిక స్పృహ | స్వగతం / గేయం | వినోబాబావే | భూధానోద్యమంలో వినోబా అనుభవాలు | 2. సమాసాలు |
| 8. | సామాజిక స్పృహ / చైతన్యం | | దాశరధి | **అగ్నిధార** కవితాసంపుటి నుండి ప్రకటన | ద్వంద్వ, ద్విగు |
| 9. | మానవసంబంధాలు / స్నేహం | లేఖ | ప్రముఖుల లేఖలు | నెహ్రూ లేఖల నుండి ఎంపిక | 3. అలంకారాలు |
| 10. | శాంతి | ఆధునిక కవిత | తిలక్ | **"అమృతం కురిసిన రాత్రి"** నుండి ? | i) శబ్దాలంకారాలు |
| 11. | భాషాభిరుచి | సంభాషణ | రచయితల బృందం | భాషాభిమానాన్ని కలిగించే రచన, సామెతలు, జాతీయాలు, శబ్దపల్లవాలు మొదలగువాటి గురించి వివరించడం. | అ) అంత్యానుప్రాసం |
| 12. | గ్రామీణ క్రీడలు | ప్రాచీన పద్యం | పోతన | **మహాభాగవతం** దశమస్కంధం నుండి ఏదైనా అంశం | ii) అర్థాలంకారాలు |
| 13. | స్త్రీ సాధికారత / బాలికల విద్య | బుర్రకథ | రచయితల బృందం | స్త్రీవిద్య, అవకాశాల గురించిన రచన | అ) ఉపమ |
| 14. | బాలల హక్కులు | కరపత్రం | మూలం:గల్లాచలపతి | కరపత్రం గురించి రాసిన రచనలు | ఆ) రూపక |
| * | ఉపవాచకం: | | | | 4. ఛందస్సు |
| | • మానవతా విలువలు | కథ | సేకరణ | NBT/ CBT అనువాద కథల అద్భుతమైన సెలవులు | గురు, లఘు పరిచయం |
| | • వైజ్ఞానిక కాల్పనికత | అనువాదకథ | సత్యజిత్ రే | సత్యజిత్‌రే కాల్పనికత కథ | 5. నానార్థాలు |
| | • హాస్యం | నాటిక | సేకరణ | బాలల అకాడమి రచనల నుండి గుశ్వం | పర్యాయపదాలు |
| | • శ్రమసౌందర్యం | వ్యాసం | సేకరణ | వివిధ వృత్తుల గొప్పదనం తెలిసేలా విషయ వివరణతో శ్రమ సౌందర్యాన్ని తెలిపేవ్యాసం | |

## 8వ తరగతి - పద్యభాగం - పాఠాల వివరాలు తెలుగు - ప్రథమభాష

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | కావ్యప్రశంస | ఇతిహాస కవిత | నన్నయ | శ్రీమదాంధ్ర మహాభారతం - ఆది సభాపర్వాలు, అరణ్యపర్వశేషం (6-8 అంశాలు) | 1. సంధులు<br>i) సంస్కృత సంధులు<br>సవర్ణ దీర్ఘ, గుణ, యణాదేశ, వృద్ధి అభ్యాసాలు<br>ii) తెలుగు సంధులు<br>అ) గ,స,డ,ద,వాదేశసంధి<br>ఆ) సరళాదేశసంధి<br>అత్వ, ఇత్వ, ఉత్వల అభ్యాసాలు<br>ఇ) ఆమ్రేడిత సంధి (2వ)<br>2. సమాసాలు<br>తత్పురుష సమాసం<br>3. అలంకారాలు<br>i) శబ్దాలంకారాలు<br>అ) వృత్త్యనుప్రాసం<br>ఆ) ఛేకానుప్రాసం<br>ii) అర్థాలంకారాలు<br>అ) రూపకం<br>ఆ) అతిశయోక్తి<br>4. ఛందస్సు<br>అ) గణప్రతిపాదన<br>i) వృత్త (ప్రధాన)<br>ఆ) ఉత్పలమాల<br>ఇ) చంపకమాల |
| 2. | వ్యక్తిత్వం, విలువలు | ద్విపద | గౌరన | హరిశ్చంద్రోపాఖ్యానం నుండి హరిశ్చంద్రుని వ్యక్తిత్వం గురించి | |
| 3. | వర్ణన | ప్రబంధం | అయ్యల రాజు రామభద్రుడు | రామాభ్యుదయం నుండి సముద్ర లంఘనం | |
| 4. | ప్రబోధం | గజల్ | సినారె | 'తెలుగు గజళ్ళు' నుండి ప్రబోధాత్మకమైనవి | |
| 5. | నైతిక విలువలు | శతకం | వివిధ కవులు | భాస్కర, ధాశరథి, సభారంజన, శ్రీకాళహస్తీశ్వర, వేంకటేశ్వర, మిత్రసాహసి, సుభాషిత రత్నావళుల శతకాల నుండి | |
| 6. | జాతీయ సమైక్యత | ఆధునిక పద్యం | ఎస్.టి. జ్ఞానానందకవి | సమైక్యభారతి కవితా సంకలనం నుండి | |
| 7. | మానవ సంబంధాలు సామాజిక చైతన్యం | వచన కవిత | శ్రీశ్రీ | మహాప్రస్థానం నుండి ప్రతిజ్ఞ | |
| 8. | పర్యావరణ పరిరక్షణ | గేయం | గంగాపురం హనుమచ్ఛర్మ | దుందుభి కావ్యం నుంచి వర్ణనా భాగం | |

## 8వ తరగతి - గద్యభాగం - పాఠాల వివరాలు                    తెలుగు ప్రథమభాష

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | వ్యక్తిత్వ వికాసం/ సామాజిక స్పృహ | కథానిక | వట్టికోట ఆళ్వారు స్వామి | ఆళ్వారుస్వామి కథానికలు | 5. వ్యుత్పత్త్యర్థాలు నానార్థాలు, పర్యాయపదాలు ప్రకృతి వికృతులు<br>6. కర్తరి, కర్మణి ప్రయోగాలు<br>7. సామాన్య వాక్యాలు సంయుక్త వాక్యాలు సశ్లిష్ట వాక్యాలు<br>8. వాక్యాల్లో భేదాలు (క్రియ ఆధారంగా) |
| 2. | కుటుంబ విలువలు | వ్యాసం | రచయితల బృందం | వ్యష్టి, సమష్టి కుటుంబభావనలు | |
| 3. | కళలు, దర్శనీయ స్థలాలు | యాత్రా చరిత్ర | నార్లవెంకటేశ్వరరావు | 'నార్ల రచనలు' నుంచి అజంతా యాత్ర విశేషాలు | |
| 4. | సంస్కృతి | వ్యాసం | బిరుదురాజు రామరాజు | రామరాజీయం నుండి వ్యాసం | |
| 5. | సామాజిక స్పృహ | వార్తా వాఖ్య | నండూరి రామ్మోహనరావు | 'నండూరి రామ్మోహనరావు వ్యాఖ్యావళీ గ్రంథం నుండి | |
| 6. | సాహిత్యావగాహన | సాహిత్యవ్యాసం | ఇరివెంటి కృష్ణమూర్తి | 'ఇరివెంటి వ్యాసాలు' నుండి వ్యాసం | |

**ఉపవాచకం:** రసవత్తర ఘట్టాలు (6) స్వాతంత్ర్యోద్యమం, సంఘసంస్కరణ, స్త్రీజనోద్ధరణ, ప్రపంచశాంతి, హాస్యం, సంఘసేవ. - సాంకేతిక విజ్ఞానం, సంస్కృతి, మానవసంబంధాలు, సృజన, ఉల్లాసం.

6వ తరగతి - పాఠాల వివరాలు  తెలుగు (ద్వితీయ భాష)

| క్రమ సంఖ్య | ప్రధానాంశం | ప్రక్రియ | పాఠం వివరాలు |
|---|---|---|---|
| 1 | తెలుగులో మాట్లాడడం | చిత్రాలు | ఇల్లు, పల్లె, బజారు, ఆటలకు సంబంధించిన కేవలం చిత్రాలతో కూడిన పాఠాలు. |
| 2 | వర్ణమాల పరిచయం (సరళ పదాలు) | గేయాలు | బడి గురించి, ఇల్లు గురించి, ఉడత గురించిన బాలగేయాలు. |
| 3 | గుణింతపదాల పరిచయం | గేయాలు, కథనం, కథ | వాన, ఉగాది పండగ, పూలు, జంతువులకు సంబంధించిన గేయాలు, రైలు ప్రయాణం గురించిన కథనం, జంతువుల కథ (న్యాయపతి రాఘవులు, కె.సభ రాసిన గేయాలు) |
| 4 | మహాప్రాణ అక్షరాలు | గేయం | తేనెల తేటల మాటలతో... గేయం (ఇంద్రగంటి శ్రీకాంత శర్మ) |
| 5 | ఒత్తుల పాఠాలు | కథలు, కథనం, సంభాషణ | పంటలు, సర్కస్సు, కుటుంబసభ్యులకు సంబంధించిన కథలు, సింహం కుందేలు కథ |
| 6 | దర్శనీయ స్థలం | సంభాషణ | హైదరాబాదు గురించిన సంభాషణ |
| 7 | ధారాళంగా చదవడం, భాషాభిరుచి, సంస్కృతి - సంప్రదాయాలు (చదువు - ఆనందించు) | చిత్రకథ, గేయాలు | చీమపావురం, వారాల పాట, తెలుగునెలల గురించి తెలిపేపాట, సహాయం గురించి తెలిపే కథ, శ్రీరాముని కథ, బాలలకు సంబంధించిన హాస్యకథ, ఋతువుల గేయం మొదలగునవి. |

## 7వ తరగతి - పాఠాల వివరాలు  తెలుగు (ద్వితీయ భాష)

| క్ర. సం. | ప్రధానాంశం/ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1 | దేశభక్తి | గేయం | దాశరథి | పిల్లల్లారా! పాపల్లారా గేయం | 1. భాషాభాగాలు<br>అ) నామవాచకం<br>ఆ) సర్వనామం<br>ఇ) క్రియ<br>ఈ) విశేషణం<br>2. వచనాలు<br>అ) ఏకవచనం<br>ఆ) బహువచనం<br>3. విరామచిహ్నాలు<br>అ) లింగ భేదం<br>4. విభక్తి ప్రత్యయాలు<br>5. క్రియాభేదాలు<br>అ) సమాపక క్రియ<br>ఆ) అసమాపక క్రియ<br>6. వాక్యభేదాలు<br>అ) సామన్యవాక్యం<br>ఆ) సంయుక్త వాక్యం<br>ఇ) సంక్లిష్ట వాక్యం<br>7. వాక్యాల్లో భేదాలు (కాలం)<br>అ) భూతకాలిక వాక్యాలు<br>ఆ) వర్తమానకాలిక వాక్యాలు<br>ఇ) భవిష్యత్ కాలిక వాక్యాలు |
| 2 | హాస్యం | కథ | అక్బర్ బీర్బల్ కథలు | చుక్కల లెక్కల కథ | |
| 3 | సృజనాత్మకత | కథ | రచయితల బృందం | పాయసం తయారి | |
| 4 | ప్రకృతి పరిశీలన | గేయం | తాడికొండ వెంకటనరసింహారావు | అడవి గురించిన గేయం | |
| 5 | హాస్యం | కథ | పరమానందయ్య శిష్యులు | గుర్రం గుడ్డు కథ | |
| 6 | కళలు | లేఖ | రచయితల బృందం | హస్తకళలకు సంబంధించి | |
| 7 | శ్రమైక జీవనం | గేయం | పొట్లపల్లి రామారావు | చీమల బారు | |
| 8 | కాల్పనికత | జానపథ కథలు | | ఉపకారంకథ | |
| 9 | పిల్లల స్వభావాలు | గేయకథ | నాళం కృష్ణారావు | మీగడ తరకలలోని అల్లరి సోముడు | |
| 10 | సంస్కృతి | సంభాషణ | రచయితల బృందం | సర్వమత సమానత్వం | |
| 11 | ఇతిహాసం/స్నేహం | కథ | రచయితల బృందం | మహాభాగవతం నుంచి కుచేలకథ | |
| 12 | విహారయాత్ర | దినచర్య | రచయితల బృందం | విహారయాత్ర గురించి | |
| 13 | పర్యావరణ పరిరక్షణ | ఆత్మకథ | రచయితల బృందం | గోదావరి ఆత్మకథ | |
| 14 | విలువలు | కథ | NBT పుస్తకం నుంచి | చెట్టు సాక్ష్యం | |
| 15 | సున్నితత్వం | నాటిక | రచయితల బృందం | చదరంగపు ఆట గురించి | |
| 16 | నైతిక విలువలు | పద్యాలు | శతకకవులు | సుమతి, వేమన, తెలుగుబాల, తెలుగుబిడ్డ శతకాల నుంచి పద్యాలు | |

## 8వ తరగతి - పాఠాల వివరాలు      తెలుగు (ద్వితీయ భాష)

| క్ర. సం. | ప్రధానాంశం /ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | దేశభక్తి | గేయం | దేవులపల్లి | సమైక్య భారతి గేయం | 1. భాషాభాగాలు<br>అవ్యయం |
| 2. | అద్భుతకథ | కథ | బాలాశ్రీ | 'మన జానపద కథలు' నుండి<br>ఒక కథ - కొయ్యగుఱ్ఱం. | 2. పురుషలు<br>ఉత్తమ, మధ్యమ, ప్రథమ |
| 3. | పిల్లలస్వభావం/ఇష్టం | గేయం | ఏటుకూరి ప్రసాద్ | సుప్రసిద్ధ గేయాలు, పాటలు<br>అనే సంకలనం నుండి | 3. లింగ భేదాలు<br>స్త్రీలింగ, పుంలింగ,<br>నపుంసకలింగ |
| 4. | వికలాంగుల<br>ఆత్మస్థైర్యం | కథ | సేకరణ | వికలాంగుల గురించి | 4. విభక్తులు |
| 5. | విశ్వాసకల్పన | వచన కవిత | బోయి భీమన్న | పాటల తోట నుండి నీవేమైనా<br>చేయగలవు అనే కవిత | 5. వ్యాభేదాలు<br>అ) ప్రశ్నార్థక<br>ఆ) విధ్యర్థక |
| 6. | విద్య, వ్యాయామం | ఆత్మకథ | గాంధీ | విద్య, వ్యాయామం అవసరాలు | ఇ) ఆశ్చర్యార్థక |
| 7. | పిల్లల బాల్యం | వ్యాసం | ఎల్లోరా | జానపద వాఙ్మయం నుంచి<br>వ్యాసం | ఈ) ఆశీర్యార్థక<br>ఉ) ప్రేరణార్థక<br>ఊ) నిషేధార్థక |
| 8. | నైతిక విలువలు | శతక పద్యాలు | శతక కవులు | సమతీ కుమారా, కుమారీ, శ్రీకాళహస్తీశ్వరా!,<br>తెలుగుబాల శతకాల నుంచి పద్యాలు | ఋ) అనుమత్యర్థక<br>ఎ) సామర్థ్యార్థక<br>ఏ) సందేహార్థక |
| 9. | పర్యావరణం | పద్యం | నాళం కృష్ణారావు | చిన్న వస్తువులు | ఐ) ప్రార్థనార్థక<br>ఒ) హేత్వర్థక |

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 10. | వైజ్ఞానిక కబుర్లు | సంభాషణ | రచయితల బృందం | పర్యావరణంపై అవగాహన కలిగించేలా | 6. సంధులు<br>I. అ) ఉత్వ<br>ఆ) ఇత్వ<br>ఇ) అత్వ<br>II. సవర్ణదీర్ఘసంధి<br>7. సమాసం<br>I. ద్విగు<br>8. ప్రకృతి - వికృతి |
| 11. | జాతీయ నాయకుల జీవిత విశేషాలు | వ్యాసం | సర్దార్ వల్లభాయ్‌పటేల్ | వ్యక్తిత్వాన్ని తెలిపే విషయాలు | |
| 12. | మానవత/విలువలు | పద్యం | తుమ్మల సీతారామమూర్తి చౌదరి | యుగకవితలు - సమసమాజం నుంచి | |

*నైతికాభివృద్ధి అంటే ఇది చేయాలి, ఇది చేయకూడదని చెప్పడం కాదు. ఏది ఒప్పో, ఏది సరైనదో, ఏది ఉత్తమమైనదో, ఏది అనుసరణీయమో, ఏది దయగలదో, ఏది సామాన్య ప్రజానీకానికి మేలుచేస్తుందో పిల్లలకు తెలియజెప్పడానికి అవసరమైన మార్గాలను రూపొందించుకోవాలి. వీటిని రూపొందించుకోవడంలో వైయక్తిక, సామాజిక విలువలను పరిగణనలోకి తీసుకోవాలి. పిల్లలు చూసిన, విన్న, అన్ని అంశాలను అర్థం చేసుకోగల్గుతారు. కాని చెప్పినదానికి, చేసినదానికి మధ్యగల వైరుధ్యాలను మాత్రం తరచుగా గుర్తించలేరు. ఇళ్ళలో పిల్లలకెదురయ్యే అనంగీకార స్థితి వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది ఇంటిలోని పెద్దల ఎడ శాశ్వత అసంతృప్తిని కానబరచుటకు ఒక్కో పర్యాయం కారణమౌతుంది. చిన్నతనంలో కల్గిన ఈ అనుభవాలు పిల్లలు పెద్దయ్యాక కలహశీలతను, ఎదురుతిరిగే తత్త్వాన్ని పెంపొందిస్తాయి. ఇందుకోసం తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యావిషయక ఉద్దేశాలతో ఒకే వేదికపైకి తీసుకురావాలి. వైయక్తిక నీతిని పెంపొందించుట కేవలం తల్లిదండ్రులు లేదా పాఠశాలవల్ల మాత్రమే సాధ్యంకాదన్న విషయాన్ని గుర్తించాలి.*

***- NCF 2005***

*- జాతీయ విద్యా ప్రణాళికా చట్రం 2005*

# ఉ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు

## 1. అభ్యసన వాతావరణం :

- పిల్లలు చదవడానికి వీలుగా కథలు, గేయాల పుస్తకాలు, నాటికలు, జీవిత చరిత్రలు మొ॥బాలసాహిత్య పుస్తకాలు, నిఘంటువులు తరగతిలో అందుబాటులో ఉంచి పిల్లలు వాడుకొనే స్వేచ్ఛను కల్పించాలి.
- వర్ణమాల, గుణింతాల ఛార్టులు, కవుల చిత్రాలు గోడలపై ప్రదర్శింపబడాలి.
- పిల్లలను ప్రభావితం చేసే సూక్తులు గోడలపై రాయించాలి.
- పిల్లలు రాసిన, గీసిన అంశాలు ప్రదర్శించడానికి గోడపత్రిక ఉండాలి.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు చెందిన ఉపకరణాలు, సౌకర్యాలు అందుబాటులో ఉండాలి.
- రేడియో, టేపురికార్డర్ లాంటి ప్రసార మాధ్యమాలను అందుబాటులో ఉంచి గేయాలను, పాటలను, పాఠాలను, ప్రసంగాలను సందర్భోచితంగా వినిపించాలి.
- అంధులకు బోధించడానికి వీలుగా బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులో ఉండాలి.
- ఆధునిక సాంకేతిక పరికరాలైన టీ.వి., కంప్యూటర్, ఎల్.సి.డి లాంటివి అందుబాటులో ఉంచాలి.
- అంతర్జాలం, యూట్యూబ్‌లను ఉపయోగించి కవులు, రచయితల జీవిత విశేషాలు, పాఠ్యాంశ చిత్రాలు సమాచారం మరియు యానిమేషన్ చిత్రాలు అందుబాటులో ఉంచాలి.

## 2. బోధనాభ్యసన ప్రక్రియలు :

- ప్రాథమికోన్నత స్థాయిలో ప్రారంభంలో పిల్లలందరూ చదవడం, రాయడం చేయగలరో లేదో తెలుసుకోవడానికి ప్రారంభ పరీక్ష నిర్వహించాలి.
- చదవడం, రాయడం సామర్థ్యంలేని పిల్లలకు తగిన అభ్యాసాలు కల్పించాలి.
- వైవిధ్యమైన బోధనావ్యూహాలను వినయోగించాలి. మేధోమథనం, వ్యక్తిగత జట్టు పూర్తి తరగతి కృత్యాలు, చదవడం - ప్రతిస్పందించడం, పాత్రపోషణ, నాటకీరణ, KWL కృత్యాలు, జిగ్‌సా విధానం, చర్చలు, సంభాషణలు, క్విజ్ నిర్వహణ, ప్రాజెక్టు పనులు మొదలగు వ్యూహాలను అమలుపర్చాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి.
- ఆలోచింపజేయడం, వ్యక్తీకరించడం ఆధారంగా బోధన కొనసాగాలి.
- పాఠ్యబోధన సోపానక్రమంగా జరగాలి. అనగా -
  ఉన్ముఖీకరణ, అర్థసంగ్రహణము, పఠనకృత్యాల నిర్వహణ, పాఠ్యాంశం గురించి చర్చ - అవగాహన, అభ్యాసాల సాధన, నేనివి చేయగలనా? స్వీయ మూల్యాకంన కృత్యాల నిర్వహణ మొదలగు వరుసక్రమంలో నిర్వహించాలి.
- ఉన్ముఖీకరణ సోపానంలో భాగంగా పాఠం ప్రారంభంలోని చిత్రం / సన్నివేశం / పద్యం / సూక్తి / సంఘటన మొదలగువాటిని పరిశీలింపజేయాలి. వీటికి సంబంధించిన ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పాఠ్యాంశ ఇతివృత్తం వైపు పిల్లల్ని సంసిద్ధులను చేయాలి. ఆ తర్వాత శీర్షికాప్రకటన, పాఠ్యాంశ ఉద్దేశం, నేపథ్యం, కవి పరిచయం వంటివి నిర్వహించాలి.

- పఠన కృత్యాలు - అర్థ సంగ్రహణంలో భాగంగా పిల్లలతో ప్రకాశ పఠనం, ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం, పిల్లల మౌన పఠనం, పాఠ్యాంశ చిత్రం గురించి మాట్లాడించడం, పిల్లలకు పాఠంలోని తెలియని పదాలను గుర్తింపజేయడం, వాటికి అర్థాలు సందర్భోచితంగా గ్రహించేలా చేయడం, నిఘంటువును పరిశీలించడం వంటివి నిర్వహించాలి.
- పాఠ్యాంశం గురించిన చర్చ, అవగాహన కోసం పల్లల్ని పాఠంలోని కీలకపదాలు, సందేశాత్మకవాక్యాలు, సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పిల్లలు పాఠంలోని విషయాన్ని, విలువలను దైనందిన జీవితానికి అన్వయించేలా విశ్లేషణాత్మక ప్రశ్నలు అడగాలి. పాఠ్యబోధన అంటే పాఠంలోని విషయాన్ని వివరించడం మాత్రమేకాదు. పాఠంలోని భావాన్ని, కవి ఉద్దేశాన్ని, ఆంతర్యాన్ని, రచనాశైలిని, నాటి సామాజిక జీవనాన్ని, సాంస్కృతిక అంశాలను అవగాహన చేసుకోవాలి.
- సామర్థ్యాల సాధనకోసం 'పాఠ్యాంశ విషయం'పై చర్చ ద్వారా అవగాహన కల్పించాలి తర్వాత అభ్యాసాలను సొంతంగా చేసేలా చూడాలి. తర్వాత నేనివి చేయగలనా? అనే స్వీయమూల్యాంకన కృత్యాన్ని నిర్వహించాలి.
- తప్పనిసరిగా పిల్లలు ప్రతిస్పందించేలా, అభిప్రాయాలు చెప్పేలా, బహుకోణాల్లో విశ్లేషించేలా తామైతే ఏంచేయగలరో మాట్లాడేలా అవకాశం కల్గించాలి.
- పాఠం బోధించేక్రమంలో కీలక విషయాలగూర్చి పదజాలం, జాతీయాలు, సందేశాత్మక వాక్యాలు మొదలైన వాటిని గూర్చి చర్చ జరపాలి.
- జట్టు, వ్యక్తిగత కృత్యాలు నిర్వహించాలి.
- అభ్యసనంలో పిల్లలందరూ భాగస్వామ్యులు కావాలి.
- పిల్లల్లో స్వీయరచన, సృజనాత్మకత సామర్థ్యాలు వృద్ధిచెందడానికి చర్చ జరగాలి. అనంతరం పిల్లలు వ్యక్తిగతంగా రాయడానికి ప్రోత్సహించాలి.
- పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా, వాక్యనిర్మాణం, పదజాలం, అక్షరదోషాలపరంగా సరిదిద్దావఆలి. తద్వారా తాము రాసిన అంశాన్ని పిల్లలే సరిచేసుకొని సొంతంగా రాసే నైపుణ్యాన్ని పెంపొందించాలి.
- పిల్లలచే పదాలకు నిఘంటువులో అర్థాలను గుర్తింపజేయాలి.
- పాఠ్యాంశంలోని సమాసపదాలు, జంటపదాలు గుర్తించి వాటిని విడదీయడం, కలపడం మధ్య మార్పులను చర్చద్వారా అవగాహన కల్గించాలి.
- పిల్లలు అభ్యాసాలను సొంతంగా చేసేలా చర్చించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల్లో ముఖ్యంగా పాత్రపోషణ, నాటకీకరణ, చిత్రాలద్వారా వ్యక్తీకరణ, చర్చలు, ఏకపాత్రాభినయాల ద్వారా ప్రదర్శింపజేయాలి.
- పాఠ్యబోధనకోసం అవసరమైన పీరియళ్ళను నిర్ధారించుకోవాలి. సగటున ప్రతి పాఠానికి 12 పీరియళ్ళు అవసరమైతాయి. ఉన్ముఖీకరణ, అర్థసంగ్రహణ కోసం రెండు పీరియళ్ళు, పాఠ్యాంశ గురించి చర్చ కోసం 3 లేదా 4 పీరియళ్ళు, అభ్యాసాల నిర్వహణకు 7 పీరియళ్ళు కేటాయించుకోవాలి.

## ఊ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు

- వార్షిక ప్రణాళికను కింది సోపానం ప్రకారం రాయాలి. 1) తరగతి, 2) సబ్జక్టు, 3) అవసరమైన పీరియళ్ళు, 4) సంవత్సరాంతానికి సాధించాల్సిన సామర్థ్యాలు, 5) మాసవారీగా పాఠాల విభజనలు,

| మాసం | బోధించాల్సిన పాఠాలు | పీరియళ్ళు | వనరులు | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

6) ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు (మాసవారీగా రాయాలి), 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు.

- పైన తెల్పిన విధంగా వార్షిక ప్రణాళికను రాయడానికి పాఠ్యపుస్తకాన్ని ఆమూలాగ్రం చదవాలి. ఉపాధ్యాయులకు సూచనలు, విషయసూచిక, సాధించాల్సిన సామర్థ్యాలు, పాఠాలు, అభ్యాసాలను క్షుణ్ణంగా చదవాలి. వీటి ఆధారంగా వార్షిక ప్రణాళికలోని సోపానాలను రాయాలి.
- తెలుగులో ప్రతి పాఠాన్ని ఒక యూనిట్‌గా భావించాలి. ఒక్కొక్క పాఠానికి పాఠ్యప్రణాళికను రూపొందించుకోవాలి. ఒక పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య దృష్టిలో పెట్టుకొని కింది నమూనాలో పాఠ్యప్రణాళికను రాయాలి. 1) పాఠం పేరు, 2) పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య, 3) పాఠంద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు, 4) పీరియళ్ళ వారీగా విభజన ప్రణాళిక,

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / కృత్యం | బోధనా వ్యూహాలు | వనరులు, సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

  5) ఉపాధ్యాయుల తయారీ - అదనపు సమాచారం సేకరణ, 6) ఉపాధ్యాయుల ప్రతిస్పందనలు
- వార్షిక, పాఠ్య పథకాలు తయారుచేసుకోవాలి.
- 6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాలను పూర్తిగా చదవాలి. పాఠ్యాంశాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి.
- పాఠ్యాంశాలకు అనుగుణంగా పూర్వగాథాలహరి, సంప్రదింపు గ్రంథాలు చదివి వీటిని బోధనాభ్యసన ప్రక్రియల్లో వినియోగించాలి.
- సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి.
- ఈ దశలో భాషాధ్యయనం, భాషగురించి తెలుసుకోవడం ప్రారంభమవుతుంది కాబట్టి వాక్యనిర్మాణం, రచనా శైలిపట్ల అవగాహన ఏర్పరచుకోవాలి.
- పద్యభాగానికి చెందిన పాఠాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలగాలి. పిల్లలతో అభ్యాసం చేయించాలి.
- పిల్లలు సొంతశైలిలో పాడడాన్ని ప్రోత్సహించాలి.
- గద్యభాగంలోని వివిధ రూపాల్లోని పాఠ్యాంశాలను తామే వివరించకుండా పిల్లలచేత చదవింపజేయడం, చర్చింపజేయడం వాటి సారాంశం చెప్పించడం, వర్ణనాత్మకంగా మాట్లాడించడం, ఒకరూపం నుండి మరొక రూపంలోకి మార్చడం వంటి కృత్యాలను నిర్వహించాలి.
- సొంతంగా ప్రశ్నాపత్రాలు తయారుచేసుకొని పరీక్షలు నిర్వహించాలి. జవాబుపత్రాలను దిద్ది విశ్లేషించాలి. తదుపరి చర్యలు చేపట్టాలి.
- తరగతిగదిలో బహుభాషా వాతావరణం ఉంటుంది. కాబట్టి పిల్లలను వారివారి మాతృభాషల్లో మాట్లాడించడం ద్వారా తెలుగు భాషతో పోల్చడం, సారూప్యతను గుర్తింపజేయడం జరగాలి.
- ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ కోసం పాఠానికి సంబంధించిన రిఫరెన్సు పుస్తకాలు, కవుల వివరాలు, సి.డి.లు, అదనపు కృత్యాలు, విశేషాంశాలు మొదలగునవి గ్రంథాలయ పుస్తకాలు, రిఫరెన్సు పుస్తకాలు, ఇంటర్నెటు ఆధారంగా సేకరించుకొని రాయాలి. పాఠంలోని విషయాన్నే ఎత్తి రాయకూడదు.
- మొత్తం పాఠం పూర్తయ్యాక ఏ ఏ సామర్థ్యాలు సాధించారు? పిల్లల ప్రగతి ఎలా ఉంది? తన అనుభవాలు, అనుభూతులను స్వీయ ప్రతిస్పందనల రూపంలో రాయాలి.
- పాఠ్య ప్రణాళికను మొత్తం పాఠానికి రాసేది. కాబట్టి ప్రతి పీరియడ్‌కు రాయాల్సిన అవసరం లేదు.
- భాషాధ్యయనంలో ఆలోచింపజేయడం, వ్యక్తీకరించడం కీలకం కాబట్టి పద్యభాగమైనా, గద్యభాగమైనా పిల్లలను ఆలోచింపజేయడం తప్పనిసరి. ఉదా: చదవడం, చదివిన దానిగురించి ప్రతిస్పందించడం, తెలిసిన సంఘటనను క్రమపద్ధతిలో వ్యక్తీకరించడం మొదలగునవి.

- ప్రాథమికోన్నతస్థాయి ప్రారంభంలో చదవడం, రాయడం చేయలేని పిల్లలుంటారు. ఇలాంటి పిల్లలందరూ చదవడం, రాయడం చేయగలిగేలా ప్రణాళిక రూపొందించుకొని అమలు పరచాలి.
- పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయ పుస్తకాలు, మ్యాగజైన్లు, పత్రికల వంటివి తరగతిగదిలో అందుబాటులో ఉంచాలి. పిల్లలచే చదివించాలి.
- పిల్లలకు ఇంటిపని పేరుతో చూసిరాసే అభ్యాసానికి బదులు (గైడ్లు, ప్రశ్నా నిధులు వంటి వాటిని చూసి రాయడం) పిల్లలు సొంతంగా రాసేలా ప్రతిరోజు ఏదోఒక అంశంపై స్వీయరచన అభ్యాసం కల్పించాలి.
- పిల్లల నోటుబుక్కులను యాంత్రికంగా చూడకుండా పిల్లలు రాసిన విధానం గురించి వారి నోటు బుక్కులలో రిమార్కులను రాయాలి.
- తరగతి గదిలో పిల్లలు సృజనాత్మక ప్రదర్శనకు గోడపత్రికను నిర్వహించాలి. పిల్లలు రాసిన కవితలు, కథలు, గేయాలు, జోకులు, వ్యాఖ్యలు మొదలగువాటిని గోడపత్రికలో ప్రదర్శించాలి.
- పాఠ్యాంశాల ఇతివృత్తాలకనుగుణంగా సేకరించడం, రాయడం వంటి ప్రాజెక్టు పనులను నెలకు ఒకటి చొప్పున పిల్లలకిచ్చి వీటి నివేదికలను తరగతిగదిలో ప్రదర్శించాలి.
- సృజనాత్మక అంశాలను క్రమపద్ధతిలో సరిదిద్దబడిన తరువాత, చక్కగా వాటిని రాయించి సంకలన రూపంలో పుస్తకం తయారుచేసి తరగతిగదిలో ప్రదర్శించాలి.

## ఋ) మూల్యాంకనం

- ఈ దశలో పిల్లలు తమకున్న భాషా సామర్థ్యంతో, భాషతోపాటు మిగతా సబ్జెక్టులలోని అంశాలను అభ్యసించడం, తమ అవగాహనను వివిధరూపాలలో వ్యక్తీకరించడం చేయాల్సి ఉంటుంది.
- క్రమపద్ధతిలో అర్థవంతంగా వ్యక్తీకరించగలగాలి. సందర్భోచితంగా సరైన పదజాలాన్ని వినియోగించాలి.
- ఈ అవగాహనను వ్యక్తీకరణ సామర్థ్యాలను అంచనా వేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం (CCE) తోడ్పడాలి.
- దీనిలో భాగంగా నిర్మాణాత్మక, (FA), సంగ్రహణాత్మక మూల్యాంకనాలను (SA) అమలు పరచాల్సి ఉంటుంది.
- పిల్లల భాషా స్థాయిని ఎప్పటికప్పుడు అంచనావేసి తదుపరి అభివృద్ధికోసం నిర్మాణాత్మక మూల్యాంకనం (FA) తోడ్పడేలా అనువైన సాధనాలను నిర్ధారించి అమలు పరచాలి.
- పిల్లలు విని అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, చదివిన దానిని అర్థంచేసుకొని వ్యక్తీకరించడం, ఉన్నతమైన వైఖరులను ప్రదర్శించడం, పదజాలాన్ని సందర్భోచితంగా వినియోగించగలగడం, భాషకు సంబంధించిన నియమాలను, సూత్రాలను అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలను అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలను అంచనావేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని వినియోగించాలి.
- పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు అంచనావేయడానికి పరిశీలనలను, పిల్లలురాసే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి నోటుపుస్తకాలను, పిల్లలు సందర్భోచితంగా తమకున్న భాషాసామర్థ్యాలను వినియోగించేశక్తిని అంచనావేయడానికి ప్రాజెక్టుపనులను నిర్మాణాత్మక మూల్యాంకనంలో (FA) సాధనాలుగా వినియోగించవచ్చు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సామర్థ్యాల ఆధారంగా నిర్వహించాలి.
- వినడం - మాట్లాడడం, ప్రశంస వంటి సామర్థ్యాలను మౌఖిక పరీక్షలు లేదా పరిశీలన ద్వారా అంచనావేయాలి.

- ధారాళంగా చదవడం - అర్థంచేసుకోవడం వంటి సామర్థ్యాన్ని మౌఖిక / రాత పరీక్ష రూపంలో నిర్వహించవచ్చు.
- స్వీయరచన, సృజనాత్మకత, పదజాలం, వ్యాకరణాంశాలను రాత పరీక్ష ద్వారా నిర్వహించాలి.
- అయితే సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని ప్రశ్నలు పిల్లలను ఆలోచింపజేసేలా ఉండాలి.
- బహుళ సమాధానాలు వచ్చేలా, స్వీయ అనుభవాలు, అనుభూతులు, అభిప్రాయాలు వెల్లడించడానికి వీలుగా, తాము గ్రహించిన పదజాలం వినియోగించే శక్తిని అంచనా వేయడానికి తోడ్పడేలా, భాషపై ఉన్నపట్టును, అవగాహనను పరీక్షించేదిలా ప్రశ్నల స్వభావం ఉండాలి.
- భాషావాచకాలలోని అభ్యాసాలలో ఇచ్చిన అంశాలను / ప్రశ్నలను ఇవ్వకుండా మార్చి ఇవ్వాలి.
- పిల్లలు గైడ్లు, ప్రశ్నల బ్యాంకులు, స్టడీమెటీరియల్‌ను నోట్సు నుండి బట్టీపట్టి రాయడానికి వీలుగా ప్రశ్న పత్రాలు ఉండకూడదు.
- పాఠాల వారీగా భారత్వాన్ని కేటాయించడానికి బదులు సామర్థ్యాల వారీగా భారత్వాన్ని కేటాయించాలి.
- పిల్లల ప్రగతిని సామర్థ్యాల వారీగా నమోదు చేసి, తల్లిదండ్రులకు తెలియజేయాలి.
- ఇందుకోసం పాఠశాలలో CCE రిజిష్టరులో వివరాలు నమోదుచేసి, పిల్లలకు క్యుములేటివ్ రికార్డులో నమోదు చేసి ఇవ్వాలి.
- భాషా వాచకాలలోని పాఠ్యాంశాలను బోధిస్తున్న క్రమంలో ఒక్కొక్కపాఠం పూర్తికాగానే ఆ పాఠానికి సంబంధించి సామర్థ్యాలను పిల్లలు ఏ మేరకు సాధించారో అంచనా వేసి వెనుకబడిన అంశాలలో / సామర్థ్యాలలో పునరభ్యాసము కల్పించాలి.

## ఎ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి

### I. 6, 7, 8 తరగతులకు పాఠ్యపుస్తక బోధనలో ఉపకరించే భాషా వనరులు:

విద్యాక్షేత్రంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎనలేనిది. గురువుగా, భావి జీవిత మార్గదర్శిగా ఉపాధ్యాయుడు సమాజం యొక్క గౌరవాభిమానాలకు లోనవుతున్నాడు. పలు విద్యార్హతలు సాధించి, ఉపాధ్యాయవృత్తి నిర్వహణకు సంవృత్తి పూర్వశిక్షణ, వృత్త్యంతర శిక్షణలు ఎన్నో పొందినప్పటికీ ఉపాధ్యాయుడు తన నిత్యబోధనలో కొత్త పుంతలు తొక్కడానికి, తన విద్యార్థుల వికాసానికి కృషిచేయడానికి, పాఠ్యపుస్తకానికి న్యాయం చేయడానికి, సమాజం, ప్రభుత్వం, తల్లిదండ్రులు తమ మీద పెట్టుకొన్ని ఆశయాలను సంపన్నం చేయడానికి విస్తారంగా చదవాలి. ఓ విధంగా నిరంతర విద్యార్థి కావాలి. ఇందుకు ఉపాధ్యాయులు తమ బోధనాంశంతోబాటు, బోధన శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, మనోవిజ్ఞానం, ఇతర శాస్త్రసంబంధ విజ్ఞానాల పరిచయాన్ని, ఆయా రంగాల్లో వెల్లువెత్తుతున్న సమకాలీన ధోరణులను పరిచయం చేసుకోవాల్సి ఉంది. ఈ పరిచయమే ఉపాధ్యాయుడిని పిల్లలముందు అత్యంత గౌరవప్రదమైన వ్యక్తిగా రూపొందిస్తుంది. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు కింది అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

- తాను పరిమితంగా చదివిన విషయాలను పునశ్చరణ చేసుకోవడం. కొత్త సమాజాన్ని చదువుతున్న విషయాలకు జతచేర్చడం.
- తన ముందు కూర్చుంటున్న పిల్లలు తన కంటె తెలివైనవారు. తనకంటె పరిసరాల పరిశీలనా శక్తి అధికంగా ఉన్నవారని గుర్తించడం.
- పిల్లల అవసరాలు, అనుభవాలు విస్తారాలని గుర్తించడం.
- పిల్లలు ఊహాశక్తిని, సృజనాత్మకత శక్తిని గలవారని గుర్తించడం.
- బోధన ఎడ నిబద్ధత కనబరచడం.

- పై అంశాలను తనలో పెంపొందించుకోవడానికి తెలుగు ఉపాధ్యాయులు తప్పనిసరిగా పలు గ్రంథాలను సంప్రదించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుడు తాము విషయ సంపన్నత కావడానికి ఉపకరించే కొన్ని గ్రంథాలను చూద్దాం.

1. నిఘంటువులు
   1. సూర్యరాయాంధ్ర నిఘంటువు
   2. సూర్యరాయంధ్ర నిఘంటు శేషము (శ్రీహరికోశము)
   3. శబ్ద రత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు
   4. తెలుగు నిఘంటువు - తెలుగు అకాడమి
   5. ఆంధ్రనామసంగ్రహము
   6. మాండలిక పదకోశాలు - తెలుగు అకాడమి
   7. బ్రౌణ్య నిఘంటువు - తెలుగు - తెలుగు
   8. ఆధునిక వ్యవహారకోశం - బూదరాజు రాధాకృష్ణ
   9. పత్రికా పదకోశం - ప్రెస్ అకాడమీ, ఆం.ప్ర.
   10. పర్యాయపదకోశం - జి.కె.రెడ్డి
   11. పారమార్థిక పదకోశం - పొత్తూరు వేంకటేశ్వరరావు
   12. నానార్థ పదకోశం
2. విజ్ఞాన సర్వస్వాలు
   1. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం
   2. తెలుగు భాషాసమితి వారి విజ్ఞాన సర్వస్వాలు 3, 4, 6 భాగాలు
   3. విశాలాంధ్ర వారి విజ్ఞాన సర్వస్వం
   4. బాల విజ్ఞాన సర్వస్వం - ఖాసింఖాన్
3. భాష
   1. భాష - సమాజం - సంస్కృతి - భద్రిరాజు కృష్ణమూర్తి
   2. తెలుగు భాషాచరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి
   3. భాష - ఆధునిక దృక్పథం - పోరంకి దక్షిణామూర్తి
   4. భాషాశాస్త్ర వ్యాసాలు - బూదరాజు రాధాకృష్ణ

**ఎలా బోధించాలి?**

*విద్యారంగంలో అత్యంత ప్రధానమైన మూడు ప్రశ్నలు ఉన్నాయి. అవి ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి? ఈ మూడు ప్రశ్నల పరిష్కారంపైనే విద్య ప్రయోజకత్వం ఆధారపడి ఉంది. విద్యకు సంబంధించిన ఏ ప్రణాళికలోనైనా, విద్యకు ఏ పద్ధతిలోనైనా ఈ మూడు అంశాలు తప్పకుండా గమనించబడాలి. ఈ మూడింటిని చక్కగా సమన్వయపరచాలి. అప్పుడే ఫలితాలు మంచివిగా మనకందగలవు. ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఈ రెండూ వ్యక్తి అవసరాలు, సమాజ అవసరాలు, దేశ అవసరాలపై ఆధారపడి ఉంటాయి. ఈ అవసరాలు కూడా తాత్కాలికమైనవిగాను, శాశ్వతమైనవిగాను రెండు రకాలుగా ఉంటాయి. అందువల్ల మనం నేర్పించదలచుకున్న దాని పద్ధతి మారుతూ ఉంటుంది. ఈ కారణం చేతనే విద్యాప్రణాళిక కూడా ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది. అలాగే విద్య నియమనిబంధనలు కూడా, పద్ధతులు కూడా, ఫలితాలు కూడా నిర్ధారించడానికి విద్యావేత్తలు, మేధావులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి.*

*- గిజుభాయి*

5. మన భాష - డా॥ డి. చంద్రశేకర్ రెడ్డి
6. వ్యావహారిక భాషా వికాసం - బూదరాజు రాధాకృష్ణ
7. మాటలు - మూటలు
8. మాటల వాడుక - వాడుక మాటలు - అనుభవాలు - న్యాయాలు, బూదరాజు రాధాకృష్ణ
9. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు - పి.ఎస్.సుబ్రహ్మణ్యం
10. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
11. భాషాంతరంగం - చేకూరి రామారావు
12. వాడుక భాషే రాస్తున్నామా - ముప్పాళ్ళ రంగనాయకమ్మ
13. అనువాద సమస్యలు - రాచమల్లు రామచంద్రారెడ్డి

4. పరామర్శ గ్రంథాలు
   1. పెద్ద బాలశిక్షణ
   2. పూర్వగాథాలహరి
   3. పురాతన నామకోశం
   4. విద్యార్థి కల్పవల్లి - రోహిణీ పబ్లికేషన్స్
   5. విద్యార్థి కల్పతరువు
   6. సంస్కృతి సూక్తి సౌరభం - తెలుగు అకాడమి
   7. సూక్తి ముక్తావళి - మహీధర జగన్మోహనరావు
   8. అక్షరాలు - ఎమెస్కో

5. చరిత్ర - సంస్కృతి
   1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
   2. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం - భాలేందు శేఖరం
   3. ఆచారాలు - శాస్త్రీయత - పాటీల్ నారాయణరెడ్డి - అనంతపురం

6. వ్యాకరణ - ఛందోలంకార శాస్త్రాలు
   1. వ్యాకరణ పదకోశం - తెలుగు అకాడమీ
   2. బాల వ్యాకరణం - వ్యాఖ్యతో
   3. ప్రౌఢ వ్యాకరణం - వ్యాఖ్యతో
   4. అప్పకవీయం

*విద్యావిషయ ప్రణాళిక రచన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యాలతోనే అర్థవంతమౌతుంది.. ఈ ప్రణాళికలో పాఠశాలకు అవసరమైన భౌతిక వనరులను సమకూర్చడం ఒక అంశమౌతుంది. మరో అంశం పిల్లల వైవిధ్యభరిత అవసరాల దృష్టిలో వారికి అవసరమైన విద్యావిషయక సహాయం ఇందుకు పాఠశాల అన్ని హంగులతో ప్రతిస్పందిచాలి. అవసరమున్న పక్షంలో తన అవసరాలను సమకూర్చుకోవాలి. పిల్లలకు విద్యనందించే క్రమంలో అవసరమైన ఈ ప్రణాళిక రచనలో స్థానిక సమాజ భాగస్వామ్యాల సహకారం అవసరం. ఐతే ఈ సహకారం ఏ రీతిన అవసరమో గుర్తించాలి.*

*- జాతీయ విద్యా ప్రణాళికా చట్టం - 2005 (NCF-2005)*

5. ఛందో వికాసం
6. సులక్షణ సారం
7. కావ్యాలంకార సంగ్రహము
8. ప్రతాపరుద్ర యశోభూషణం

**7. సాహిత్య చరిత్ర - కవుల చరిత్రలు**

1. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. ఆంధ్రసాహిత్య చరిత్ర - జి.నాగయ్య
3. ఆంధ్ర రచయిత్రులు - మధునా పంతుల

**8. సాహిత్య విమర్శ**

1. సాహిత్య శిల్ప సమీక్ష - పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వెల్చేరు నారాయణరావు
3. తెలుగు సాహిత్య విమర్శ - ప్రొ. ఎస్.వి.రామారావు

**9. విద్యాక్షేత్రం - బోధనాశాస్త్రం**

1. గిజుభాయి సమగ్ర సాహిత్యం - 7 సంపుటులు
2. రైలుబడి
3. పగటికల
4. పిల్లలు - భాష - ఉపాధ్యాయుడి విలువ - చంద్రశేఖర్ రెడ్డి
5. భాషా ఆధునిక ధోరణులు - సర్వశిక్షా అభియాన్
6. ప్రాథమికోన్నత స్థాయి - సర్వశిక్షా అభియాన్
7. ఆధునిక మూల్యాంకనం విద్యార్థులు - భాష - సర్వశిక్షా అభియన్
8. భాషాభివృద్ధి కార్యక్రమం - సర్వశిక్షా అభియాన్
9. భాష-భాషాబోధన ఆధారపత్రం
10. ఆం.ప్ర. విద్యా ప్రణాళిక పరిధిపత్రం
11. ఎన్.సి.ఎఫ్.2005
12. Language - Language Teaching - Position - NCERT
13. Learning Curve - Magazine APF Special Issue 14 languages learning
14. Languages and languages teaching - APF

### భాషా ప్రయోజనం

*భాష అనగానే భావ వినిమయ సాధనం అని నిర్వచించడం మనకు బాగా అలవాటయిపోయింది. ఈ అలవాటులో భాషను ఒక ఆలోచనా సాధనంగా, విషయాలకు అనుభూతి పొందించే, ప్రతిస్పందిపజేసే సాధనంగా దాని ప్రయోజనాన్ని తరచుగా మరిచిపోతూ ఉంటాం. చిన్న పిల్లలతో పనిచేయాలనుకునే వారికి భాషకు సంబంధించిన ఈ విస్తృత ప్రయోజనం ఎంతో ముఖ్యమైనది. ఎందుకంటే బాల్యంలో భాష పిల్లల వ్యక్తిత్వ, సామర్థ్యాల అభివృద్ధిలో ఒక నిర్మాణాత్మక పాత్రను నిర్వహిస్తుంది. ప్రపంచంపట్ల అవగాహనను, ఆసక్తులను, సామర్థ్యాలను చివరికి విలువలను, ఆలోచనా సరళులను పిల్లల్లో రూపొందించడంలో భాష సూక్ష్మమైనదే అయినా బలమైన శక్తిగా పనిచేస్తుంది. ప్రతి పిల్లా పిల్లవాడూ తన మాతృభాష ఏదైనప్పటికీ కొన్ని తక్షణ ప్రయోజనాలు పరిపూర్తి కోసం భాషను ఉపయోగిస్తారు. ఒక ముఖ్యమైన ప్రయోజనం ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. దీనికి భాష ఒక అద్భుతమైన సాధనంగా పనిచేస్తుంది. పిల్లవాడి దృక్పథాన్ని స్వీకరించి అతని జీవితంలో భాష నిర్వహించే కార్యకలాపాలను అవగాహన చేసుకుంటే తప్ప అధ్యాపకులుగా, వారి మంచి చెడ్డలు చూసేవారిగా, తల్లిదండ్రులుగా మనం మన పాత్రను సముచితంగా నిర్ధారించుకోలేం.*

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వ విద్యాలయం*

పై గ్రంథాలతోపాటు ఆయా అంశాలపై వెలువడుతున్న విమర్శ, సమీక్షా గ్రంథాలు, పరిశోధనా గ్రంథాలను ఉపాధ్యాయులు చదవాల్సి ఉంటుంది. వీటితోపాటు ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంలోని ప్రధాన గ్రంథాలను (కనీసం పాఠ్యాంశాలకు సంబంధమున్నవాటిని) తప్పనిసరిగా సంప్రదించాల్సి ఉంటుంది. అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా వెసులుబాటు లేకపోతే ప్రభుత్వంవారందిస్తున్న ఉపాధ్యాయ గ్రాంట్, పాఠశాల గ్రాంటుల నుండి పుస్తకాలు కొని గ్రంథాలయాన్ని ఏర్పరచుకోవాలి. నిరంతరం అధ్యయనం వల్ల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిచుకోవచ్చు. ఈ దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తారనే విశ్వాసంతో...

**II. 6, 7, 8 తరగతుల బోధనకు అవసరమయ్యే అదనపు గ్రంథాలు**

- దేశభక్తి గేయాలు
- ఆరుద్ర కవితలు - పాటలు
- రాయప్రోలు గేయాలు
- శతక కవులు - శతకాలు
- దాశరథి కృష్ణమాచార్యులు - రచనలు
- కరుణశ్రీ - పుష్పవిలాపం
- చాటుపద్యాలు - కవులు
- శ్రీశ్రీ కవితలు - గీతాలు
- డా ॥ సి. నారాయణరెడ్డి రచనలు, పాటలు
- స్ఫూర్తి దాతలగా నిల్చిన ప్రత్యేకావసరాలు గల వ్యక్తులు
- తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే పద్యాలు, పాటలు
- వివిధ రంగాలలో పేరుపొందిన స్త్రీ మూర్తులు
- సాంస్కృతిక చారిత్రక ప్రదేశాలు
- నదుల చరిత్ర
- వివిధ భాషా మాండలికాలకు చెందిన కథలు
- సంఘ సంస్కర్తలు
- నోబుల్ బహుమతి గ్రహీతలు

### ప్రసంగ పద్ధతి

*పురాతన అత్యంత అధ్వాన్నమైన పద్ధతుల్లో ప్రసంగపద్ధతి లేక ఉపదేశ పద్ధతి అత్యంత ముఖ్యమైనది. ప్రస్తుతం మన విద్యాలయాల్లో ఎక్కువగా ఈ పద్ధతిలోనే విద్య గరపబడుతోంది. విదేశీ ప్రభుత్వం భారతదేశాన్ని పరిపాలించే కాలంలో ఇక్కడ తన విద్యాపద్ధతిని ప్రవేశపెట్టినప్పుడు ఈ ప్రసంగ పద్ధతినే పాఠశాలల్లో పరిచయం చేసింది. అందువల్ల ఈ నాటికి కూడా దీని వేళ్ళు మన భూమిలో గట్టిగానే వ్యాపించి ఉన్నాయి. ప్రస్తుతం విదేశాలలో ఈ ప్రసంగ పద్ధతిని చాలా వరకు వదిలివేశారు. అయితే మన దేశంలో మాత్రం ఇంకా దీన్నే పట్టుకువేలాడుతున్నాం. ఇందుకు కారణం మన విద్యాబోధనా పద్ధతిలో ఏవైనా మార్పులు వచ్చినా అవి అత్యంత మెల్లగా వస్తున్నాయి. విద్యావ్యవస్థను నడిపించే అధికారులు, మేధావులు కూడా మన బోధనా పద్ధతిలో తేవాల్సిన మార్పుల గురించి అంతగా పట్టించుకోవడంలేదు. అందువల్లే ఈ నాటికి కూడా మన బోధనలో ఈ ప్రసంగం పద్ధతే అనేక లోపాలతో ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనికి బాలలు బలైపోతూనే ఉన్నారు.*

*- గిజుభాయి*

- ప్రముఖులు రాసిన లేఖలు (పుస్తకరూపంలో ఉన్నవి) ఉదా॥ నెహ్రూ లేఖలు
- సామెతలు
- పొడుపుకథలు

**III. 6, 7, 8 తరగతులకు బోధనాభ్యసన సామగ్రి**

- వివిధ భాషలకు చెందిన పాఠ్యపుస్తకాలు.
- నిఘంటువులు, పరామర్శగ్రంథాలు, మూలగ్రంథాలు మొదలైనవి.
- మ్యాగజైన్లు.
- తరగతిగది గ్రంథాలయ పుస్తకాలు - బాలసాహిత్యం.
- బాలలకు సంబంధించి మాస, వార పత్రికలు.
- పండుగలు, దర్శనీయ స్థలాలు, గొప్పవ్యక్తుల జీవిత చరిత్రలకు చెందిన పుస్తకాలు మొదలైనవి.
- ఆధునిక సాంకేతిక సామగ్రి - టి.వి., డి.వి.డి., సి.డి., టేప్‌రికార్డర్‌లు, రేడియో, ఇంటర్నెట్, యూట్యూబు మొదలైనవి.
- పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు.
- సృజనాత్మకత అంశాలపై పిల్లలకు అవగాహన కలిగించుటకు ఆయా అంశాలకు అనుగుణంగా ఉండే పుస్తకాలు, కరపత్రాలు, ప్రకటనలు, బ్రోచర్లు, పోస్టర్లు మొదలైన నమూనాలు ఉండాలి.

*'తెలుసుకోవడం' అనేది అందరూ చేయగలరు. కానీ అందరూ 'నిపుణులు' మాత్రం కాలేరు. ఈ రెండు విషయాలు విభిన్నమైనవి. నిపుణుడికి తన విషయపరిజ్ఞానంతోపాటు ఇతరులకు దాన్ని నేర్పించే కళకూడా వచ్చిఉండాలి. విభిన్న విషయాలను విభిన్న పద్ధతుల్లో ఎలా నేర్పాలో తెలిసినప్పుడే ఇతరులకు ఈ విషయాలను సక్రమంగా నేర్పించగలడు. లేకపోతే ఇతరుల మెదళ్ళలో తనకు తెలిసిన విషయాలన్నింటినీ విచక్షణారహితంగా కూర్చేయగలడు. తన పరిజ్ఞానాన్నంతటినీ ఎదుటనున్న పిల్లవాడి మెదడులో నింపలేకపోయినప్పుడు అతడు బెత్తానికి పని పెడతాడు. బోధనా పద్ధతి తెలియని నేటి ఉపాధ్యాయుడు పిల్లలను దండిస్తాడు లేక బహుమతులనే లంచం ఇవ్వచూపుతాడు. ఆ విధంగా పిల్లల మెదళ్ళలో తనకు తెలిసిన విషయాలను బలవంతంగా నింపుతాడు. ఆ పిల్లలు ఆ బరువుతో తల్లడిల్లిపోతారు.*

*- గిజుభాయి*

*ప్రతి దాన్ని తప్పుపట్టడం, సరిదిద్దే ప్రయత్నం చేయడం వల్ల పిల్లలు నేర్చుకోరు.*
*భాషా ప్రపంచంలోకి ఎంత ఎక్కువగా ప్రవేశిస్తే అంతే త్వరగా వాళ్ళు తప్పులు చేయడం తగ్గుతుంది.*
*ఎంత స్వేచ్ఛగా పాల్గొనేలా చేస్తే అంత సమర్థవంతంగా భాషను నేర్చుకోగలుగుతారు.*

*- జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005*

# VII. పాఠ్యప్రణాళిక - నాల్గవదశ - 9, 10 తరగతులు (ప్రథమ, ద్వితీయ భాషలు)

## అ) 9, 10 తరగతులు భాషా సామర్థ్యాలు (ప్రథమ భాష) - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. అవగాహన - ప్రతిస్పందన

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • ఇచ్చిన అంశం గురించి విభేదిస్తూ లేదా సమర్థిస్తూ మాట్లాడగలగడం.<br>• విన్న, చూసిన, చదివిన అంశాలపై విమర్శనాత్మకంగా మాట్లాడడం, చర్చల్లో పాల్గొనడం.<br>• పోస్టాఫీసు, బ్యాంకులు, రైల్వేస్టేషన్లు, ఇ- సేవాకేంద్రాలు, ఆయా ప్రాంతాల్లో జాతరలు, విచారణ కేంద్రాల వద్ద తమకు అవసరమైన సమాచారాన్ని ప్రశ్నించడం ద్వారా సేకరించడం.<br>• పాఠశాలలో వివిధ దినోత్సవాల సందర్భంగా స్వేచ్ఛగా పాల్గొని ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం.<br>• చదివిన అంశం గురించి తార్కికంగా ప్రశ్నించడం.<br>• అపరిచిత అంశాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయడం,<br>• చదువుతున్న అంశానికి చెందిన భావాన్ని గ్రహించడం, కీలక పదాలను గుర్తించడం.<br>• వార్తాపత్రికల్లోని సామాజికాంశాలను చదివి వాటిపై ప్రతిస్పందించడం<br>• నేపథ్యాంశాల కోసం మూలగ్రంథాలను చదవడం. | దీంట్లో "వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి, అర్థంచేసుకొని, వ్యక్తీకరించడం" అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.<br>• విన్న, చదివిన అంశాలు అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలు వ్యక్తపరచాలి.<br>• సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలు వివరించగలగాలి.<br>• నచ్చిన సందర్భాన్ని అనుభూతులను వర్ణించగలగాలి.<br>• పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• వక్తృత్వ పోటీల్లో పాల్గొని మాట్లాడగలగాలి. సద్యోభాషణం చేయగలగాలి. (ఇచ్చిన అంశం గురించి అప్పటికప్పుడే మాట్లాడడం).<br>• పాఠం చదివి జాతీయాలు, సామెతలు గుర్తించగలగాలి.<br>• ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? గుర్తించగలగాలి / వివరించగలగాలి.<br>• పాత్రల స్వభావాన్ని పట్టికరూపంలో తయారుచేయగలగాలి.<br>• భావాలకు తగిన పద్యపాదాలను, గేయపాదాలను గుర్తించాలి.<br>• వివరాల కనుగుణంగా పట్టికలు తయారుచేయగలగాలి.<br>• చదివిన అంశంలోని కీలకాంశాలు, కీలకపదాలు రాయగలగాలి. |

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • సగటున నెలకు మూడు, నాలుగు కథల పుస్తకాలు, మాసపత్రికలను చదవడం.<br>• రచనల్లోని శైలి భేదాలననుసరించి చదవడం, కొత్త పోకడలను గుర్తించడం. | • పేరాలకు శీర్షికలు పెట్టడం, శీర్షికలకనుగుణంగా పేరాలను గుర్తించడం చేయగలగాలి.<br>• అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.<br>• పాఠంలో చుక్కగుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని ప్రతిపదార్థం, భావం - రాయగలగాలి.<br>• సులభశైలిలో ఉన్న పద్యాలను చదివి భేదాలను, పోలికలను గుర్తించి మౌఖికంగా, లిఖితంగా వ్యక్తీకరించగలగాలి.<br>• శీర్షికలను విశ్లేషించగలగాలి. వాటి ఔన్నత్యాన్ని గురించి వివరించగలగాలి.<br>• పాఠ్యాంశాల్లోని సంభాషణలను, సంఘటనలను, ముఖ్యాంశాలను గుర్తించి రాయగలగడం.<br>• ఇచ్చిన అంశాలపై స్పష్టమైన వైఖరితో మాట్లాడగలగాలి.<br>• సూచిత పదాల, వాక్యాల అంతరార్థాన్ని చెప్పగలగాలి, రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా విషయ, భావపరంగా తప్పొప్పులను గుర్తించగలగాలి.<br>• కవుల గురించి మాట్లాడగలగాలి. |

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • కథలను, విజ్ఞానశాస్త్రానికి చెందిన కాల్పనిక అంశాలను, వివిధ ప్రక్రియలను చదివి అర్థం చేసుకొని, సొంతమాటల్లో రాయడం.<br>• జీవిత విశేషాలు వర్ణనాత్మకంగా రాయడం. | దీంట్లో "స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస" సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.<br>• కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి. |

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • ఇచ్చిన ప్రశ్నలకనుగుణంగా విశ్లేషణాత్మకంగా జవాబులు రాయడం.<br>• స్వీయరచన చేయడం.<br>• పాఠ్యాంశాల ఆధారంగా ప్రాజెక్టుపనులు పూర్తిచేసి, నివేదికలు రూపొందించడం<br>• ప్రక్రియలను ఒకదాన్ని మరొక రూపంలోకి మార్చడం. ఉదా॥ (కథను గేయంగా / సంభాషణగా)<br>• విరామ చిహ్నాలను సమర్థవంతంగా ఉపయోగిస్తూ, దోషరహితంగా, క్రమపద్ధతిలో రాయడం.<br>• కరపత్రాలు, నివేదికలు, ఆహ్వానపత్రికలు, అభినందన పత్రం, పోస్టరు తయారుచేయడం.<br>• భాషాసంఘంలో సభ్యులుగా చేరి పాఠశాల పత్రిక (మ్యాగజైన్) రూపకల్పనలో భాగస్వాములు కావడం, సాహితీ సమావేశాలు నిర్వహించడం.<br>• పాఠాల నుంచి గ్రహించిన అంశాలను వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగించుకోవడం.<br>• పద్యాలకు సొంతంగా భావాలు రాయగల్గడం.<br>• ఇతర భాషలకు చెందిన కథలు, పాటలు, గేయాలు, వివిధ ప్రక్రియలకు చెందిన ఇతివృత్తాలను అవగాహనతో ప్రశంసించడం. బహుభాషాతత్వాన్ని గుర్తించి అభినందించడం.<br>• అభినందనపత్రం, పోస్టరు తయారుచేయగలగాలి.<br>• ఏకాంకిక రాయగలగాలి.<br>• పాఠంలోని పాత్రలకు సొంతంగా సంభాషణలు రాసి, ఏకపాత్రాభినయం చేయగలగాలి. | • అభిప్రాయాలు రాయగలగాలి. ఇష్టాయిష్టాలు రాయగలగాలి.<br>• రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.<br>• సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.<br>• ప్రకృతి దృశ్యాలను వర్ణించి రాయగలగాలి.<br>• రచనాశైలిని అభినందిస్తూ రాయడం, అభినందన వ్యాసం, కరపత్రాలు తయారుచేయడం, ఇంటర్వ్యూ కోసం ప్రశ్నావళి తయారుచేయడం, కవితలు రాయగల్గడం, సన్మానపత్రం తయారుచేయగలగడం, పత్రికలకు లేఖ లేదా సాహిత్యవ్యాసాలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి చేయగలగాలి. సృజనాత్మకత సంభాషణలు, కథనాలు రాయగలగాలి.<br>• కథను, భావాన్ని సంక్షిప్తీకరిస్తూ, పోలుస్తూ రాయగలగాలి.<br>• ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆయా అంశాల గురించి రాయగలగాలి.<br>• పాఠ్యాంశాల్లో ఆయాసందర్భాలు, సంఘటనలు, పదాలు, వాక్యాల యొక్క అంతరార్థాన్ని సొంతమాటల్లో వివరిస్తూ రాయగలగాలి.<br>• అంశాలు, సంఘటనలు, సన్నివేశాలు, సందేశాలు మొదలైన వాటివల్ల కలిగే ప్రయోజనాలను, నష్టాలను వివరిస్తూ సొంతమాటల్లో రాయగలగాలి.<br>• విషయాన్ని విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా రాయగలగాలి.<br>• పరిస్థితుల, కాలానుగుణంగా విషయాన్ని అన్వయిస్తూ, వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా వ్యక్తుల స్వభావాలను విశ్లేషిస్తూ సొంతమాటల్లో రాయగలగాలి.<br>• కవులు, రచయితలు చెప్పిన ప్రముఖ వాక్యాల యొక్క ఉచితానుచితాల గురించి రాయగలగాలి. |

## III. భాషాంశాలు

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • వివిధ రంగాలకు చెందిన (క్రీడలు, కళలు, సాంకేతిక విజ్ఞానం, నిర్మాణాలు, వృత్తులు మొ॥) పదజాలంపై పట్టు సాధించడం, చదివేటప్పుడు, రాసేటప్పుడు ఈ జ్ఞానాన్ని వినియోగించుకోవడం.<br>• వివిధ పదజాలాలకు చెందిన అర్థపరిణామం గుర్తించడం.<br>• నిఘంటువుతోపాటు విద్యార్థి కల్పతరువులాంటి పుస్తకాలను వినియోగించడం.<br>• సంధి, సమాస లక్షణాలను అవగాహన చేసుకోవడం, ప్రయోగించడం.<br>• ప్రత్యక్ష, పరోక్ష కథనాలు, కర్తరి, కర్మణి వాక్యరూపాలు అవగాహన చేసుకోవడం.<br>• కావ్యభాష / ప్రాచీనభాషలోని వాక్యాలను ఆధునిక వ్యావహారిక రూపంలోకి మార్చడం.<br>• వివిధ వాక్యభేదాలను గ్రహించి, ప్రయోగించడం.<br>• అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు తెలుసుకొని వాక్యాలలో ప్రయోగించగలగాలి. | ఇది ''పదజాలం, వ్యాకరణాంశా''లకు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్నవాటితోపాటు పిల్లలు కిందివి చేయగలగాలి.<br>• పదాలకు అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు రాయగలగాలి.<br>• ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను సమర్థంతంగా వాక్యాల్లో ఉపయోగించాలి.<br>• ప్రకృతికి వికృతులను, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.<br>• దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలు జాతీయాలు, సామెతలు వినియోగించగలగాలి.<br>• ఆటవెలది, సీసం, ద్విపద, కందం లక్షణాలు అర్థం చేసుకోవాలి. ఆయా ఛందాలను గుర్తించగలగాలి.<br>• పుంప్వాదేశసంధి, విసర్గసంధి, అనునాసికసంధి, నుగాగమ సంధి, ప్రాతాదిసంధి. శ్చుత్వసంధులను అర్థం చేసుకొని ఆయా సంధుల గురించి వివరించి రాయగలగాలి.<br>• అవ్యయీభావసమాసాన్ని అవగాహన చేసుకొని ఉదాహరణలు ఇవ్వగలగాలి.<br>• ముక్త పదగ్రస్తం, యమకం, లాటానుప్రాస, అతిశయోక్తి, అర్థాంతరన్యాస శ్లేష అలంకారాలు అవగాహన చేసుకొని గుర్తించగలగాలి.<br>• కర్తరి, కర్మణి వాక్యాలను గుర్తించి రాయగలగాలి.<br>• వృత్తి పదాలు, వైజ్ఞానిక, వ్యాకరణ పదాల అర్థాలను తెలుపగలగాలి.<br>• ప్రాచీన, ఆధునిక/మాండలిక శైలుల్లోకి వాక్యాలను మార్చగలగాలి.<br>• కింది తరగతుల్లో నేర్చుకున్న పదజాలాన్ని, వ్యాకరణాంశాలను గుర్తించగలగాలి. వివరించగలగాలి. |

## ఆ) 9, 10 తరగతులు భాషా సామర్థ్యాలు (ద్వితీయ భాష) - అభ్యసనా సూచికలు

## (Language Competencies - Learning Indicators)

### I. అవగాహన - ప్రతిస్పందన

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| **వినడం - అర్థంచేసుకోవడం - ఆలోచించి, ధారాళంగా మాట్లాడటం**<br>• పదాలు, గేయాలు, సంభాషణలు మొదలగు వాటిని విని అర్థంచేసుకోవాలి. వాటి సారాంశాలను సొంతమాటల్లో చెప్పగలగాలి. అభినయపూర్వకంగా ప్రదర్శించగలగాలి.<br>• కథను పొడగిస్తూ చెప్పగలగాలి.<br>• ఇవ్వబడిన అంశాలను సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.<br>• ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు విని అర్థం చేసుకోవడం, ప్రతిస్పందించగలగాలి.<br>• చర్చల్లో పాల్గొనడం, అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తీకరించడం, ఆయా అంశాలకు సంబంధించిన కారణాలు వివరించగలగాలి.<br>• చూసిన, విన్న కళారూపాలను అర్థం చేసుకోవడం. ఆసక్తిని, అభిరుచిని గురించి వివరించగలగాలి.<br>• పాత్రల స్వభావాలను, తారతమ్యాలను గ్రహించడం. విచక్షణతో ఆలోచించి చెప్పగలగాలి.<br>• తాము పాల్గొన్న సేవా / సహాయక కార్యక్రమాల గురించి చెప్పగలగాలి.<br>• సాహిత్య ప్రక్రియలలోని భేదాలను గుర్తించి అవగాహనతో అభిప్రాయాలను వ్యక్తీకరించగలగాలి.<br>• చిన్న చిన్న సంఘటనలను వర్ణనాత్మకంగా వివరించగలగాలి. | **దీంట్లో వినడం - మాట్లాడడం,ధారాళంగా చదివి, అర్థం చేసుకొని, వ్యక్తీకరించడం అనే సామర్థ్యాలుంటాయి**<br>• పాఠాల్లోని పద్యాల/కవితల భావాలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• సమాజంలో కీర్తిని పొందిన వారి గురించి చెప్పగలగాలి.<br>• పాఠాల పేర్లను / శీర్షికలను విన్నప్పుడు చదివినప్పుడు కలిగిన అనుభూతులను / భావాలను చెప్పగలగాలి.<br>• వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను సూటిగా స్పష్టంగా చెప్పగలగాలి.<br>• పాఠ్యాంశాల ద్వారా గ్రహించిన / తెలుసుకొన్న విషయాలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• కవుల / రచయితల భావాలను, ఉద్దేశాలను, సందేశాలను అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>• సూచిత అంశాలను సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి.<br>• ఇచ్చిన అంశాలను పోలుస్తూ, భేదాలను గుర్తిస్తూ చెప్పగలగాలి, కారణాలు వివరించగలగాలి.<br>• తమకు నచ్చిన విషయాలు / వ్యక్తుల గురించి సహేతుకంగా వివరించగలగాలి.<br>• వార్తలు / చూసిన సంఘటనలు గురించి చెప్పగలగాలి. |

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| • పల్లెలు / పట్టణాల్లో ఉన్న సమస్యల గురించి చెప్పగలగాలి. కారణాలను వివరించగలగాలి.<br>• తెలిసిన వీరులు, కళాకారులు, నాయకులు, సంఘటనల గురించి వివరించగలగాలి.<br>• శీర్షికకు, పాఠానికి మధ్య గల సంబంధాన్ని సహేతుకంగా వివరించగలగాలి.<br>• ప్రకృతి వింతల గురించి చెప్పగలగాలి. చూసిన ప్రదేశాల గురించి వివరించగలగాలి.<br>**చదవడం - అవగాహనతో రాయడం**<br>• పద్య, గేయ, వచన అంశాలను అవగాహనతో చదవడడం, రాగయుక్తంగా చదవడం, చదువుతున్న అంశాలలో కీలక విషయాలను గుర్తించగలగాలి.<br>• సూచిత అంశాలను పాఠంలో గుర్తించి రాయగలగాలి.<br>• పద్యం గానీ, గద్యం గానీ చదివి ప్రశ్నలు, జవాబులు అవగాహనతో రాయగలగాలి. (పరిచిత, అపరిచిత)<br>• పాఠం ఆధారంగా పద్యపాదాలను / వాక్యాలను క్రమపద్ధతిలో రాయగలగడం. అర్థవంతంగా రాయగలగాలి.<br>• వార్తా పత్రిక చదివి అర్థం చేసుకుని, వాటిలోని విషయాలను తార్కికంగా ఆలోచించి సొంతంగా రాయగలగాలి.<br>• వ్యవహారిక రూపాలను రాయగలగాలి.<br>• పదాలను ఒక క్రమంలో వినియోగించి వాక్యాలు రాయగలగాలి.<br>• చదివి అర్థం చేసుకున్న విషయాలను విశ్లేషించి అభిప్రాయాలు చెప్పడం, ముగింపు లేని అంశాలకు ముగింపు రాయగలగాలి. (ఉదా: కథ, గేయం) | • పాఠాల భావాలను సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>• పాఠాల / అంశాల శీర్షికల గురించి మాట్లాడగలగాలి.<br>• సూచిత అంశాలను, వాక్యాలను పాఠాల్లో గుర్తించగలగాలి.<br>• అపరిచిత పద్య, గద్యాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. ప్రశ్నలను తయారు చేయగలగాలి. ప్రశ్నలకు సమాధానాలను గుర్తించగలగాలి.<br>• పద్యపాదాలను క్రమంలోను, భావానుగుణంగాను రాయగలగాలి, గుర్తించగలగాలి.<br>• సూచిత వాక్యాలను పాఠంలో ఎవరు ఎవరితో అన్నారో, ఆయా సందర్భాలేమిటో రాయగలగాలి.<br>• పాఠం ఆధారంగా ఆయా విషయాలు / అంశాలకు సంబంధించిన వివరాలను పట్టికల్లో పూరించగలగాలి.<br>• ఇచ్చిన పేరాను చదివి తప్పొప్పులను గుర్తించగలగాలి.<br>• పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులను రాయగలగాలి. |

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| **దీంట్లో స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస అనే సామర్థ్యాలుంటాయి.**<br><br>స్వీయరచన<br>• సమర్థిస్తూ, విభేదిస్తూ, పరిష్కారాలను తన స్థాయిలో సూచిస్తూ సొంత మాటల్లో రాయగలగాలి.<br>• ఆయా సంఘటనల్లో తానుంటే ఏం చేసేవాడో అభిప్రాయాన్ని స్పష్టంగా సొంతమాటల్లో రాయగలగాలి.<br>• వివిధ అంశాల / విషయాలపట్ల ఉండే కష్టనష్టాలను, ప్రయోజనాలను వివరించగలగాలి.<br>• పాఠాల నుండి తాము గ్రహించిన విషయాల గురించి రాయగలగాలి.<br>• వివిధ విషయాలపై తన అభిప్రాయాలను వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠ్యాంశంలోని విషయాలను గ్రహించి ప్రశ్నలకు సొంత మాటలలో సమాధానాలు రాయగలగాలి.<br>• అడిగిన ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు రాయగలగాలి.<br>• తాము చూసిన ప్రదేశాలను / సంఘటనలను వివరిస్తూ రాయగలగాలి.<br>• అర్థవంతమైన పదాలను సందర్భోచితంగా ఉపయోగిస్తూ విరామ చిహ్నాలను పాటిస్తూ వాక్యాలు రాయగలగాలి.<br>• స్వీయ అభిప్రాయాలను క్రమ పద్ధతిలో రాయగలగాలి.<br>• తాము పాల్గొన్న సేవా / సహాయక కార్యక్రమాల గురించి వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠాల సారాంశాలను సొంత మాటల్లో వివరించగలగాలి. | • సూచిత అంశాలపై / విషయాలపై అభిప్రాయాలను తెలుపుతూ రాయగలగాలి.<br>• ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను హేతుబద్ధంగా ఆలోచించి రాయగలగాలి.<br>• ఇచ్చిన అంశాలను / విషయాలను సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.<br>• కవులు / రచయితలు ఇచ్చిన సందేశాలవలన కలిగే ప్రయోజనాలను సొంతమాటల్లో రాయగలగాలి.<br>• కవుల / ఉద్దేశాలను / అభిప్రాయాలను అర్థం చేసుకొని సొంతమాటల్లో వివరించగలగాలి.<br>• పాఠ్యాంశాలద్వారా గ్రహించిన విషయాలను వివరిస్తూ రాయగలగాలి.<br>• పాఠ్యాంశాల్లో ఉన్న పాత్రల స్వభావాలను గురించి వివరిస్తూ రాయగలగాలి.<br>• చూసిన / విన్న ఘటనల గురించి సొంతమాటల్లో వివరిస్తూ రాయగలగాలి.<br>• వివిధ అంశాలు / విషయాల గొప్పతనాన్ని వివరిస్తూ వ్యాసం రాయగలగాలి.<br>• కథ / కవితను కొనసాగించగలగాలి.<br>• ఊహాత్మకంగా కథలు రాయగలగడం.<br>• సూక్తులను / నీతివాక్యాలను తయారు చేయగలగడం.<br>• పాఠాల ఆధారంగా మంచి లక్షణాలు / గుణాల పట్టికను తయారుచేయగలగడం. |

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| సృజనాత్మకత<br>• తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు అంటే కథలు, కవితలు, గేయాలు, నినాదాలు, సూక్తులు, లేఖలు మొదలగు వాటిని రాయగలగాలి.<br>• తెలిసిన విషయాలను వర్ణిస్తూ చెప్పగలగాలి/ రాయగలగాలి.<br>• పేరడీలు, కవితలు, కథను పొడిగించడం, గేయాలు అల్లడం మొ॥వి చేయగలగాలి.<br>• శుభాకాంక్షలను తెలిపే కార్డులను వివిధ సందర్భాలకు తయారు చేయగలగాలి.<br>• ఆహ్వాన పత్రికలు, పోస్టర్లు రాయగలగాలి.<br>• లేఖలు, దరఖాస్తులు రాయగలగాలి.<br>• పాఠ్యాంశానికి తగినట్లు చిత్రాలు గీయగలగాలి, దాని గురించి రాయగలగాలి.<br>• నాటకీకరణ, ఏకపాత్రాభినయం చేయగలగాలి.<br>ప్రశంస<br>• కవుల/ రచయితల రచనా విధానాన్ని వారి భావాలను ప్రశంసించగలగాలి.<br>• భిన్న మతాలు, భిన్న సంస్కృతులను అర్థం చేసుకుని మంచిని గ్రహించి. గౌరవించగలగాలి.<br>• కులమతాలకు అతీతంగా తోటి విద్యార్థులను గౌరవించగలగాలి.<br>• ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తమతో సమానంగా ఆదరించడం, వారిలో గొప్పదనాన్ని గుర్తించి ప్రశంసించగలగాలి. వారికి తోడ్పాటునివ్వగలగాలి. | • స్థానిక కళలను / జాతీయకళలను, సంస్కృతి సంప్రదాయాల గురించి మాట్లాడటానికి ఓ వ్యాసాన్ని రాయగలగాలి.<br>• లేఖలను, కవితలను, సంభాషణలను, చిన్నచిన్న గేయాలను రాయగలగాలి.<br>• నాటికలను పాఠం ఆధారంగా రాసి ప్రదర్శన చేయగలగాలి.<br>• కవుల/రచయితల రచనలను, ప్రశంసించగలగాలి.<br><br>*భాషాబోధన బహుభాషా లక్షణాలు కల్గిఉండాలి. ఇది కేవలం భాషల సంఖ్యకు మాత్రమే పరిమితం కాక బహుభాషీయులు గల తరగతి గదికి ఒక వనరుగా, ఒక వ్యూహాత్మక రచనకు తోడ్పడాలి. పిల్లల గృహభాష పాఠశాలల్లో అభ్యసన మాధ్యమంగా ఉండాలి. ఒకవేళ అన్ని పాఠశాలల్లో పిల్లల ఇంటి భాషను బోధించే సౌకర్యాలు లేకపోతే కనీసం ప్రాథమిక దశలో ఇంటి భాషయే బోధన భాషగా ఉండాలి. మనం పిల్లల ఇంటి భాషను గౌరవించడం తప్పనిసరి. రాజ్యాంగంలోని 350-ఎ ఆర్టికల్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.*<br>*- NCF 2005* |

## III. భాషాంశాలు

| 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|
| పదజాలం<br>• పదాలను సందర్భానుసారంగా సరైన రీతిలో సొంతవాక్యాలలో వినియోగించగలగాలి.<br>• పర్యాయ పదాలను వివిధ సాంకేతిక పదాలను గ్రహించి నిత్యజీవితంలో వినియోగించగలగాలి.<br>• భాషాక్రీడలు, పదపట్టికలు మొదలగు వాటి ద్వారా పదాలను రాయగలగాలి.<br>• ప్రకృతి వికృతులను, జాతీయాలను గుర్తించి వినియోగించగలగాలి.<br>• నిఘంటువును ఉపయోగించగలగాలి.<br>భాషాంశాలు<br>• గసడదవా దేశ, యడాగమ సంధులను తెలుసుకొని గుర్తించగలగాలి.<br>• ఉపమ, వృత్యనుప్రాస అలంకారాలను తెలుసుకొని గుర్తించగలగాలి.<br>• గుణ సంధులను గూర్చి తెలుసుకొని గుర్తించగలగాలి.<br>• ద్వంద్వ, ద్విగు, షష్ఠీ తత్పురుష సమాసాలను గుర్తించగలగాలి.<br>• వాక్యాలు - రకాలు తెలుసుకొని, ప్రయోగించగలగాలి.<br>• ఛందస్సు - లఘు, గురువులను గుర్తించగలగాలి. | **దీంట్లో పదజాలం, వ్యాకరణాంశాలు అనేవి ఉంటాయి.**<br>• తమకు తెలియని పదాల అర్థాలను 'పదాలు - అర్థాలు', నిఘంటువును ఉపయోగించి తెలుసుకోగలగాలి. వాటిని వాక్యాల్లో ప్రయోగించగలగాలి.<br>• పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, వ్యతిరేక పదాలు, ప్రకృతి వికృతులను గుర్తించి, వాక్యంలో వినియోగించగలగాలి.<br>• సరైన పదాలతో ఖాళీలను పూరించగలగాలి. పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చిన ప్రత్యేక పదాల గురించి వివరించగలగాలి.<br>• భాషాభాగాలను గుర్తించి రాయగలగాలి.<br>• త్రికసంధి, యణాదేశ సంధులను తెలుసుకొని, గుర్తించగలగాలి.<br>• అవ్యయీభావసమాసం, విశేషణ పూర్వపదకర్మధారయ సమాసాల గురించి తెలుసుకొని గుర్తించగలగాలి.<br>• అంత్యానుప్రాస, అతిశయోక్తి అలంకారాలను తెలుసుకొని గుర్తించగలగాలి.<br>• గణవిభజన చేయగలగడం, ఉత్పలమాలవృత్తాన్ని గుర్తించి లక్షణాన్ని వివరించగలగాలి.<br>• ఇచ్చిన పునఃశ్చరణలను చేయగలగాలి. |

## ఇ) పాఠ్యపుస్తకాలు

**అ) 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాల లక్షణాలు :**

- 9, 10 తరగతులు పాఠశాల విద్యలో చివరి దశ కాబట్టి భాషపట్ల అవగాహన, అభిరుచి, అభిమానం పెంచేలా పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి.
- పిల్లల్లో విమర్శనాత్మక దృక్పథం, హేతుబద్ధంగా ఆలోచించడం, భాషా వినియోగ సామర్థ్యం, విచక్షణ వంటివి పెంపొందించేలా పాఠ్యపుస్తకం రూపకల్పన జరగాలి.

- పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను పద్యం, గద్యం భాగాలుగా విభజించకుండా కలిపి ఇవ్వాలి.
- ఉపవాచక పాఠాలు, ఉపవాచక పాఠ్యపుస్తకంలోనే చేర్చాలి.
- 9వ తరగతిలో ఉపవాచక పాఠాలలో స్ఫూర్తి కలిగించే కళాకారులు, తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసినవారు, స్త్రీ విద్యకోసం / సాధికారిత కోసం పాటుపడిన వారి జీవిత చరిత్రలను ఆసక్తికల్గించే విధంగా సంక్షిప్తంగా ఇవ్వాలి.
- 10వ తరగతిలో ఉపవాచకంగా రామాయణం లేదా మహాభారతాన్ని సంక్షిప్తంగా 20 నుండి 30 పేజీలలో ఇవ్వాలి.
- పాఠ్యాంశాలను ప్రముఖ కవులు, రచయితలకు సంబంధించిన ప్రాచీన, ఆధునిక సాహిత్యం నుండి ఎంపిక చేయాలి.
- ఎంపిక చేసిన పాఠ్యాంశాలు పిల్లల స్థాయికి తగినవిగా, వారి ప్రపంచానికి దగ్గరగా ఉండాలి.
- పాఠ్యాంశాలు కనీసం 3 నుండి 10 పేజీల వరకు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలలో కనీసం 20 శాతం వరకు చిత్రాలు ఉండాలి.
- పాఠం కంటే ముందు పాఠాన్ని చదవడానికి పురికొల్పేలా ఆలోచింపజేసేలా సన్నివేశాలు, పద్యాలు, సూక్తులు, కార్టున్లు వంటివి ఉండాలి. వీటికి సంబంధించిన ప్రశ్నలు కూడా ఉండాలి.
- అభ్యాసాలు ప్రధానంగా భాషాసామర్థ్యాలు సాధించడానికి వీలుగా సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉండాలి.
- ప్రతి పాఠంలో ప్రాజెక్టు పనిని ఇవ్వాలి.
- ప్రతిస్పందించడం, హేతుబద్ధంగా, విమర్శనాత్మకంగా ఆలోచించడం, అభిప్రాయాలు చెప్పడం, కారణాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, సృజనాత్మకత, ప్రతిపాదనలు చేయడం వంటి ఆలోచన నైపుణ్యాలు పెంపొందించేలా అభ్యాసాలు ఉండాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలు గుర్తించేలా, విశ్లేషించి వాఖ్యానించేలా, అవగాహనను ప్రదర్శించేలా అభ్యాసాలు ఉండాలి.
- దైనందిన జీవితానికి అన్వయించేలా, సమకాలిన అంశాలతో పోల్చి విశ్లేషించేలా, భాషా వినియోగం జరిగేలా అభ్యాసాలుండాలి.
- రచయితల ఉద్దేశ్యం రచనలోని ఆంతర్యం గ్రహించి విమర్శనాత్మకంగా ప్రతిస్పందించేలా అభ్యాసాలు ఉండాలి.
- రచయితలు, కవుల రచనా శైలిని, సాహిత్యాన్ని అభినందించేలా ఆసక్తిని పెంపొందించేలా అభ్యాసాలుండాలి.
- అభ్యాసాలు స్వీయఅధ్యయనానికి, అదనపు పఠన సామాగ్రిని చదవడానికి పురికొల్పేలా ఉండాలి.
- కింది తరగతుల్లో నేర్చుకున్న వ్యాకరణాంశాలు, సామర్థ్యాలను పునఃశ్చరణ చేస్తూ తదుపరి స్థాయికి సంబంధించినవి కొనసాగించాలి.
- పాఠాల కింద / ముందు అర్థాలు ఇవ్వడానికి కంటే సందర్భోచితంగా, అర్థాలు గ్రహించేలా అభ్యాసాలు ఉండాలి. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకం చివర 'పదాలు - అర్థాలు' పట్టికను చేర్చాలి.

- పాఠ్యపుస్తకం చివర నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలు పట్టిక కూడా ఇవ్వాలి.
- విస్తారపఠనం కోసం పాఠ్యపుస్తకంలోనే 'చదువు - ఆనందించు' అనే శీర్షికతో పాఠ్యాంశాలను, కథలను చేర్చవచ్చు.
- 10వ తరగతిలో 'అవగాహన - ప్రతిస్పందన', వ్యక్తీకరణ సృజనాత్మకత భాషాంశాల రూపంలో ఇవ్వాలి.
- ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాన్ని ఆశించిన విధంగా వినియోగించేలా చేయడానికి అవసరమైన సూచనలను స్పష్టంగా ఇవ్వాలి.
- ప్రణాళికాబద్ధంగా బోధించడానికి అవసరమైన మార్గదర్శకాలను ఉపాధ్యాయులకు సూచనల్లో చేర్చాలి.
- అట్లే పిల్లల కోసం కూడా సూచనలు చేర్చాలి.
- పాఠ్యపుస్తకాలలో మానవతా విలువలు, ఆత్మగౌరవం, స్వీయక్రమశిక్షణ, తోటివారిని సమభావంతో చూడడం, గౌరవించడం వంటి వైఖరులు పెంపొందించే పాఠ్యాంశాలు ఉండాలి.
- పాఠ్యాంశాలు పిల్లల్లో మహిళలు, పర్యావరణం, జీవవైవిధ్యం, శ్రమపట్ల గౌరవం వంటి అంశాలపట్ల సున్నితత్వం పెంపొందించేలా ఉండాలి.
- ఇతర భాషలకు చెందిన అనువాద కథలను సాహితీ ప్రక్రియలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. అట్లే ఇతర దేశాలకు చెందిన జానపద కథలను కూడా చేర్చవచ్చు.
- కవుల, రచయితల గురించిన వివరాలను చిత్రాలతో ప్రత్యేక గడిలో పొందుపరచాలి.
- ప్రతిపాఠంలో ప్రాజెక్టుపనిని చేర్చాలి. పిల్లలు పాఠశాల గ్రంథాలయాలు, పరామర్శాగ్రంథాలు, అదనపు పఠన సామగ్రిని, బాలల సాహిత్యాన్ని, అంతర్జాలాన్ని వినియోగించేలా ప్రాజెక్టుపనులు ఇవ్వాలి.
- పాఠ్యాంశాలను కింద తెలిపిన ఇతివృత్తాల ఆధారంగా సాహిత్యం నుండి ఎంపికచేయాలి. అవి: శాంతిస్థాపన, భాషాభిరుచి, ప్రకృతివర్ణన, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, స్ఫూర్తి, సామాజిక స్పృహ, హాస్యం, సంస్కృత సంప్రదాయాలు, స్త్రీ విద్య, స్త్రీ సాధికారత, చైతన్యం, మానవ సంబంధాలు, మానవ స్వభావం, శాస్త్రీయ పరిశీలన, కృతజ్ఞత, గ్రామీణ జీవనం, జీవకారుణ్యం మొదలగునవి.
- విభిన్న ప్రక్రియలు / భాషా వ్యవహార రూపాల్లో పాఠాలు ఉండాలి. ప్రధానంగా ఈ దశలో అభినందన వ్యాసం, కథనం, శాస్త్రీయ పరిశీలనకు సంబంధించిన వ్యాసం లేదా కథనం, ముందుమాట, పుస్తక పరిచయం, అధిక్షేప వ్యాసం, ఊహాత్మక లేఖలు, నాటిక, అనువాద కవిత, ఆత్మకథ, ఇతిహాస కథ, మొదలగు రూపాల్లో గద్యపాఠాలు, ఆధునిక సాహిత్యంలోని పద్యాలు, వచన కవిత, రుబాయిలు మొదలగు రూపాల్లో పాఠాలు ఉండాలి.
- భాషలోని విభిన్న ప్రక్రియలను అర్థంచేసుకోవడం, వినియోగించగలగడం.
- నైతిక విలువల కోసం చేర్చే శతక పద్యాలలో ప్రాచీన కవులు రాసిన శతక పద్యాలతోపాటు ఆధునిక కవులు రాసిన శతకాలలోని పద్యాలు కూడా చేర్చాలి.
- పిల్లలు తమకున్న భాషాసామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించడానికి వివిధ కృత్యాలతో కూడిన ప్రాజెక్టుపనులు ఉండాలి.

## ఈ) పాఠ్యాంశాల వివరాలు

**9వ తరగతి - పద్యభాగం - పాఠాల వివరాలు** **తెలుగు - ప్రథమభాష**

| క్ర. సం. | ప్రధానాంశం /ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | శాంతి స్థాపన | ఇతిహాసం ప్రాచీనపద్యం | తిక్కన | శ్రీమదాంధ్ర మహాభారతం ఉద్యోగపర్వం నుంచి కృష్ణరాయబారం | 1. సంధులు<br>i) సంస్కృత సంధులు<br>అ) జశ్త్వ సంధి<br>ii) తెలుగు సంధులు<br>అ) లు, ల, న, ల సంధి<br>ఆ) పడ్వాదిసంధి<br>ఇ) రుగాగమ సంధి<br>ఈ) టుగాగమ సంధి<br>ఉ) త్రికసంధి<br>2. సమాసాలు<br>అ) బహువ్రీహి<br>ఆ) కర్మధారయ<br>3. అలంకారాలు<br>i) అర్థాలంకారాలు<br>అ) స్వభావోక్తి<br>ఆ) దృష్టాంతం |
| 2. | కృతజ్ఞత | కథాకావ్యం | కొరవి గోపరాజు | సింహాసన ద్వాత్రింశిక నుండి కథ | |
| 3. | నైతిక విలువలు | శతకం | శతక కవులు | రాజశేఖర, సర్వేశ్వర, శ్రీభర్గ, నరసింహ, నారాయణ, దాశరధీ, శ్రీకాళహస్తీశ్వర, కుమార, సుమతీ శతకాల నుండి పద్యాలు | |
| 4. | గ్రామీణ జీవనం | ఆధునిక పద్యం | దువ్వూరి రామిరెడ్డి | కృషీవలుడు నుంచి పద్యాలు | |
| 5. | సామాజిక చైతన్యం | వచన కవిత | కాళోజీ | నా గొడవ నుంచి కవిత “ఈప్స” | |
| 6. | ప్రకృతి వర్ణన | గేయం | పుట్టపర్తి నారాయణాచార్యులు | శివతాండవం | |
| 7. | సామాజిక స్పృహ | అనువాద కవిత | సామల సదాశివ | రుబాయిలు | |

## 9వ తరగతి - గద్యభాగం - పాఠాల వివరాలు తెలుగు - ప్రథమభాష

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | సంస్కృతి | కథానిక | పి. యశోదారెడ్డి / | 'నూరేళ్ళపంట' గ్రంథం నుంచి ఒక కథానిక | 4. ఛందస్సు<br>అ) శార్దూలం<br>ఆ) మత్తేభం<br>ఇ) తేటగీతి<br>5. కర్తర్థక, కర్మార్థక వాక్యాలు<br>6. ప్రత్యక్ష, పరోక్ష కథనాలు |
| 2. | వ్యక్తిత్వవికాసం | ఆత్మకథ | డా. ఎ.బి.జె. అబ్దుల్‌కలాం | ఒక విజేత ఆత్మకథ నుంచి సంఘటనల ఎంపిక | |
| 3. | జీవకారుణ్యం | కథ | పిలకా గణపతి శాస్త్రి | ప్రాచీన గాథాలహరి నుండి కథ | |
| 4. | భాషాభిరుచి | వ్యాసం | పానుగంటి లక్ష్మీనరసింహారావు | సాక్షి వ్యాసావళి (స్వభాష) | |
| 5. | స్త్రీ చైతన్యం | లేఖ | కనుపర్తి వరలక్ష్మమ్మ | శారద లేఖల నుండి ఒక లేఖ | |
| 6. | ప్రకృతి పరిశీలన | వ్యాసం | జిడ్డు కృష్ణమూర్తి | అనాది స్రోతస్సు నుంచి వ్యాసం | |
| 7. | మానవతా విలువలు | పుస్తక పరిచయం | సావిత్రి | సావిత్రి సమగ్ర సాహిత్యం నుంచి పుస్తక పరిచయము | |

**ఉపవాచకం:** స్ఫూర్తి దాతల జీవిత విశేషాలు (ఏడుగురు) వివేకానందుడు (12 పుటలు), నేనూ-సావిత్రీబాయిని (7 పుటలు), గిడుగురామ మూర్తిపంతులు (5 పుటలు), ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (5 పుటలు), బళ్ళారి రాఘవ (3 పుటలు), కాపురాజయ్య (4 పుటలు), మిద్దెరాములు (4 పుటలు)

## 10వ తరగతి - పద్యభాగం - పాఠాల వివరాలు　　　　తెలుగు - ప్రథమభాష

| క్ర. సం. | ప్రధానాంశం /ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | ప్రకృతి వర్ణన | పద్యం (ప్రాచీనం) | ఎఱ్రన | నృసింహపురాణం నుంచి వర్ణనాత్మక ఘట్టం | 1. సంధులు<br>i) సంస్కృత సంధులు<br>అ) అనునాసిక సంధి<br>ఆ) విసర్గ సంధి<br>ఇ) శ్చుత్వసంధి<br>ii) తెలుగు సంధులు<br>అ) ప్రాతాదిసంధి<br>ఆ) నుగాగమ సంధి<br>ఇ) పుంప్వాదేశ సంధి<br>2. సమాసాలు<br>అ) అవ్యయీభావం<br>3. అలంకారాలు<br>i) శబ్దాలంకారం<br>అ) ముక్తపదగ్రస్తం<br>ఆ) యమకం<br>ఇ) లాటానుప్రాస<br>ii) అర్థాలంకారాలు<br>అ) శ్లేష<br>ఆ) అర్థాంతరన్యాస<br>ఇ) అతిశయోక్తి |
| 2 | మానవ స్వభావం | కావ్యం | శ్రీనాధుడు | కాశీఖండం నుంచి వ్యాసుడికి సంబంధించినది | |
| 3. | సంస్కృతి | ద్విపద | పాల్కురికి సోమనాథుడు | బసవపురాణం నుంచి బసవడి వివాహ ఘట్టం | |
| 4. | స్త్రీలపట్ల గౌరవం | పద్యం (ఆధునిక) | గడియారం వేంకటశేషశాస్త్రి | శ్రీ శివభారతం నుంచి స్త్రీలపట్ల శివాజి చూపిన గౌరవానికి సంబంధించిన ఘట్టం | |
| 5. | సామాజిక స్పృహ | నగరగీతం | అలిశెట్టి ప్రభాకర్ | సిటీలైఫ్ నుండి మినీ కవితలు | |
| 6. | సామాజిక స్పృహ, | వచనకవిత | విద్వాన్ విశ్వం | మాణిక్యవీణ | |
| 7. | నైతిక విలువలు | శతక పద్యాలు | శతక కవులు | భక్త చింతామణి, చిత్తశతకం, మల్లభూపాలియం, ఉత్పలమాల, లొంకరామేశ్వర, తరిగొండనృసింహ విశ్వనాథేశ్వర శతకం నింబగిరి నరసింహ శతకాల నుండి పద్యాలు | |

## 10వ తరగతి - గద్యభాగం - పాఠాల వివరాలు తెలుగు - ప్రథమభాష

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | నైతిక విలువలు | కథ- గ్రాంథిక వచనం | చిన్నయసూరి | మిత్రలాభం నుంచి కథ | 4. ఛందస్సు<br>అ) ఆటవెలది<br>ఆ) సీసం<br>ఇ) కందం<br>ఈ) ద్విపద<br>5. శైలీ భేదాలు<br>అ) ప్రాచీన కావ్యభాషాశైలి<br>ఆ) ఆధునిక ప్రమాణ భాషాశైలి<br>6. భాషా భేదాలు<br>అ) మాండలికం<br>ఆ) ప్రామాణికం<br>7. పరిభాష |
| 2. | అనువాదం/ శాస్త్రీయ పరిశీలన | కథనం | ధన్‌గోపాల్ ముఖర్జీ | చిత్రగ్రీవం - ఓ పావురం కథ నుంచి కథనం | |
| 3. | హాస్యం | నాటిక | విశ్వనాథ సత్యనారాయణ | విశ్వనాథ అసంకలిత సాహిత్యం నుంచి "యక్షుని అప్పు" నాటిక | |
| 4. | స్త్రీ సాధికారత | ముందుమాట/ పీఠిక | మహిళా రచయితలు | మహిళావరణం గ్రంథ పీఠిక "మా ప్రయత్నం" | |
| 5. | మానవ సంబంధాలు, సామాజిక సేవ | కథనం | పులికంటి కృష్ణారెడ్డి | మానవ సంబంధాలను తెలిపే కథ "గోరంత దీపాలు" (పులికంటి సాహిత్యం నుండి) | |
| 6. | స్ఫూర్తి | అభినందన వ్యాసం | పి.వి.నరసింహారావు | బూర్గుల గురించి పి.వి. రాసిన వ్యాసం | |
| 7. | శ్రమపట్ల గౌరవం, | లేఖ | బోయ భీమన్న | 'జానపదుని జాబులు' నుంచి ఒక లేఖ | |

**ఉపవాచకం: ఇతిహాసాలు:–** వాల్మీకి రామాయణం సంక్షిప్త రూపం.

## 9వ తరగతి - పద్యభాగం - పాఠాల వివరాలు తెలుగు - ద్వితీయభాష

| క్ర. సం. | ప్రధానాంశం /ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | దేశభక్తి | గేయం | గురజాడ వెంకట అప్పారావు | దేశమంటే.... | 1. వాక్యాలు, పునశ్చరణ<br>2. వాక్యాలు<br>అ) కర్తరి<br>ఆ) కర్మణి<br>3. సంధులు<br>I. అ) గ,స,డ,ద,వాదేశ<br>ఆ) యడాగమ<br>II. గుణ సంధి<br>4. సమాసాలు<br>అ) ద్వంద్వ<br>ఆ) షష్ఠీతత్పురుష<br>5. అలంకారాలు<br>అ) ఉపమ<br>ఆ) వృత్త్యనుప్రాస<br>6. ఛందస్సు<br>లఘు, గురు పరిచయం<br>7. నానార్థాలు<br>8. పర్యాయపదాలు |
| 2. | సేవాభావం | ప్రాచీనపద్యం (ద్విపద) | గోన బుద్ధారెడ్డి | రంగనాథరామాయణం యుద్ధకాండ నుంచి సేవకు సంబంధించిన ఉడుత సాయం | |
| 3. | నైతిక విలువలు | శతక పద్యాలు | వివిధ కవులు | కుమార, భాస్కర, సుమతీ, వేమన మనోబోధ, ప్రగతిగీత శతకాల నుంచి పద్యాలు | |
| 4. | ప్రగతి పథం | వచన కవిత | అడవిబాపి రాజు | మెట్లు | |
| 5. | శ్రమ సౌందర్యం | పద్యం | గంగుల సాయిరెడ్డి | 'కాపుబిడ్డ' గ్రంథం నుంచి - రైతు సమస్యలు | |
| 6. | తెలుగు నేల | గేయం | సినారె | తెలుగునేల గొప్పదనం గురించిన గేయం "జాతి మేలుకొంటున్నది, తెలుగుజాతి మేలుకొంటుంది" | |
| 7. | వ్యక్తిత్వ వికాసం | గీతం (అనువాదం) | దాశరథి | జీవిత సత్యాలకు సంబంధించిన గీతాలు - గాలిబ్‌గీతాలు | |

**9వ తరగతి - గద్యభాగం - పాఠాల వివరాలు** **తెలుగు - ద్వితీయభాష**

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం |
|---|---|---|---|---|
| 1. | సహకారం | కథానిక/ కథ | | పరస్పర సహకారాన్ని తెలిపే కథలు |
| 2. | పర్యావరణం | వ్యాసం | పాటిల్ నారాయణరెడ్డి రాసిన "ఆచారాలు-శాస్త్రీయత" ఆధారంగా | ప్రాకృతికాంశాలు |
| 3. | పిల్లల శక్తి సామర్థ్యాలు | కథనం | | పుస్తక సంకలనంకు సంబంధించింది |
| 4. | కళలు | ఆత్మకథ | చిందు ఎల్లమ్మ | చిందు ఎల్లమ్మ ఆత్మకథ నుంచి |
| 5. | పట్టణసమస్యలు | సంభాషణ | | పట్టణ సమస్యల గురించిన సంభాషణలు |

*మన దేశంలో ప్రతి ఉపాధ్యాయుడూ పాఠ్యపుస్తకం పూర్తిచేయాలి అంటే పాఠ్యపుస్తకంలోని ప్రతి పాఠాన్ని ఒకటొకటిగా, దానికి సంబంధించిన అభ్యాసాలు చేయిస్తూ ఇంటిపని ఇస్తూ, ప్రతిపాఠంలోని విషయంపట్ల వాడికి పూర్తిగా వచ్చేటట్లు చేయాలని భావిస్తారు. భాషాబోధనకు సంబంధించినంత వరకు ఈ భావనలు నష్టాన్నే చేకూరుస్తాయి. పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలను రోజూ కొంచెం కొంచెంగా పిల్లవాడికి ఇష్టం ఉన్నా లేకపోయినా, అతని మెదడులోకి ఎక్కించే ప్రయత్నం ఆహ్లాదకరమైన అనుభవంకాని, ఆసక్తిదాయకమైన అనుభవం కాని కాదు.*

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

10వ తరగతి - పద్యభాగం - పాఠాల వివరాలు తెలుగు - ద్వితీయభాష

| క్ర. సం. | ప్రధానాంశం /ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం | వ్యాకరణాంశాలు |
|---|---|---|---|---|---|
| 1. | భాషాభిరుచి | పురాణం | పోతన | భాగవతంలోని పద్యాలు | 1. వాక్యాలు<br>అ) ప్రత్యక్షానుభూతి<br>ఆ) పరోక్షానుభూతి<br>2. సంధులు<br>I. అ) త్రిక<br>II. అ) యణాదేశ<br>ఆ) వృద్ధి<br>3. సమాసాలు<br>అ) విశేషణపూర్వపద<br>ఆ) అవ్యయీభావ<br>4. అలంకారాలు<br>అ) అతిశయోక్తి<br>ఆ) అంత్యానుప్రాస<br>5. ఛందస్సు<br>గణప్రతిపాదన<br>ఉత్పల, చంపకమాలలు |
| 2. | సంస్కృతి | ద్విపద | తరిగొండ వెంగమాంబ | రమాపరిణయం నుండి | |
| 3. | నైతిక విలువలు | శతక పద్యాలు | శతక కవులు | కుమార, కాళికాంబ, దాశరథి, భర్తృహరి సుభాషిత రత్నావళి, నరసింహశతకాల నుండి పద్యాలు | |
| 4. | సామాజిక స్పృహ | అనువాద కవిత | పల్లా దుర్గయ్య | నవోదయం | |
| 5. | మానవతా విలువలు | కవిత | ఇస్మాయిల్ | మనిషీ! మనీషి | |

10వ తరగతి - గద్యభాగం - పాఠాల వివరాలు　　　　తెలుగు - ద్వితీయభాష

| క్ర. సం. | ప్రధానాంశం / ఇతివృత్తం | ప్రక్రియ | కవి / రచయిత | పాఠం |
|---|---|---|---|---|
| 1. | సామాజికస్పృహ / హాస్యం | నాటిక | కాళ్ళకూరి నారాయణరావు | వరవిక్రయం నుంచి |
| 2. | సంస్కృతి, కళలు | వ్యాసం | దేవులపల్లి రామానుజరావు | సంస్కృతి, కళలు |
| 3. | మానవ స్వభావం | ఇతిహాస కథ | ఉషశ్రీ | రాయబారఘట్టం (సంజయ రాయబారం) |
| 4. | జీవకారుణ్యం | అనువాద కథ | పొన్‌కున్నం వర్కేయ్ | "మాట్లాడేనాగలి" కథ<br>సమకాలీన భారతీయులు<br>సాహిత్యం - కథల సంపుటి నుండి |
| 5. | పిల్లల శక్తిసామర్థ్యాలు | ఆత్మకథ | తిరుమల రామచంద్ర | 'హంపీ నుంచి హరప్పా దాకా' పుస్తకం నుంచి |

**ఉపవాచకం :** 1. బుద్ధుడు, 2. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, 3. రామదాసు, 4. బిస్మిల్లాఖాన్

*పాఠ్యపుస్తకంలోని పాఠాలన్నింటిని పూర్తిచేయడం లక్ష్యం కాదనీ పిల్లవాడితో భాషనుపయోగించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమనీ ఉపాధ్యాయులు స్పష్టంగా గ్రహించాలి.*

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

# ఉ) అభ్యసన వాతావరణం - బోధనాభ్యసన ప్రక్రియలు

**1. అభ్యసన వాతావరణం :**

- విద్యార్థులకు నిఘంటువులను, విజ్ఞాన సర్వస్వాలు, పరామర్శగ్రంథాలు, మూలగ్రంథాలు మొదలైన పఠన సామగ్రి తరగతి గదిలో అందుబాటులో ఉండాలి. పిల్లలు చదువుకోవడానికి అనువైన స్వేచ్ఛను కల్పించాలి.
- కవులు, రచయితల చిత్రాలు గోడలపై ప్రదర్శించాలి.
- పిల్లలను ప్రభావితం చేసే సూక్తులు గోడలపై రాయించాలి.
- పిల్లలు రాసిన, గీసిన అంశాలను ప్రదర్శించే వీలు కల్పించాలి.
- ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఉపకరణాలు మరియు అంధులకు బ్రెయిలీపుస్తకాలు, టేప్ రికార్డర్‌లాంటి అందుబాటులో ఉండాలి.
- బోధనలో ఆధునిక సాంకేతిక పరికరాలైన టి.వి.కంప్యూటర్ మరియు ఎల్.సి.డి లాంటివి అందుబాటులో ఉండాలి.
- అంతర్జాలం, యూట్యూబ్‌లను ఉపయోగించి కవులు, రచయితల జీవిత విశేషాలు పాఠ్యాంశ చిత్రాలు, సమాచారం మరియు యానిమేషన్ చిత్రాలు అందుబాటులో ఉంచాలి.

**2. బోధనాభ్యసన ప్రక్రియలు :**

- ఈ దశలో స్వయం అభ్యసనం ఒక అలవాటుగా మారాలి. చర్చలు, ప్రతిస్పందనలు, వ్యక్తిగత జట్టు పూర్తి కృత్యాలు, ప్రాజెక్టుపనులు, మేధోమథనం, చదవడం - ప్రతిస్పందించడం, సంభాషణలు, విశ్లేషణలు - వ్యక్తీకరణ, నాటకీకరణ, పాత్రాభినయం, కొరియోగ్రఫీ వంటి వ్యూహాలను అమలుపర్చాలి.
- ఉపాధ్యాయుడిపై ఆధారపడడం తగ్గాలి.
- కింది దశలకు చెందిన శిశుకేంద్రీకృత, కృత్యాధార వ్యూహాలను ఈ దశలోకూడాఉపయోగించాలి.
- ఈ దశలో వివిధ పఠన సామగ్రిని నిఘంటువులను, విజ్ఞాన స్వర్వస్వాన్ని పరామర్శ గ్రంథాలను, మూలగ్రంథాలను స్వతంత్రంగా, వివేకవంతంగా చదవడం, విశ్లేషించడం తద్వారా బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనడం జరగాలి.
- పిల్లలు వివిధ రకాలైన పరామర్శ, మూలగ్రంథాలు చదవడానికి ఉద్యుక్తులయ్యేందుకు పఠనపూర్వక చర్చజరగాలి.
- పిల్లల అభిప్రాయాలు, నివేదికలు, సమీక్షలు తరగతిగదిలో ప్రదర్శించాలి. వాటిపై చర్చ నిర్వహించాలి.
- తప్పనిసరిగా పఠన కృత్యం అనంతరం అనుసరణ కృత్యాలు నిర్వహించాలి. అనగా చదివిన అంశం గురించి అభిప్రాయాలు చెప్పడం, పోల్చడం, నివేదికలు సమర్పించడం, వివిధ రీతుల్లో వాఖ్యానించడం మొదలైనవి జరగాలి.
- ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్యప్రణాళికలు రాసుకొని తగిన సంసిద్ధతతో పాఠ్యబోధన చేయాలి.
- పాఠ్యబోధన అంటే పాఠాన్ని వివరించడం మాత్రమేకాదు, పాఠంలోని విషయం ఆధారంగా చర్చించడం, అభిప్రాయాలు చెప్పించడం, సమకాలీన అంశాలకు

అన్వయించడం. కవి రచనాశైలిని విశ్లేషించడం, అభినందించడం, సృజనాత్మకంగా వ్యక్తీకరించడం, బహుకోణాల్లో విశ్లేషించడం, పాఠంలోని పాత్రలు, సంఘటనలు, సన్నివేశాల గురించి ప్రతిస్పందించడం మొదలగునవి జరగాలి.

- పాఠానికి చెందిన బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలను మళ్ళీ మళ్ళీ పాఠ్యాంశం చదివించేలా, అదనపు పఠనసామాగ్రిని చదివేలా పురికొల్పాలి.
- ఈ దశలో పిల్లలు కనీసం నెలకొకసారి భాషాపరమైన ప్రాజెక్టు పనిలో పాల్గొనాలి.
- పిల్లలు భాషాపరమైన కార్యక్రమాలు మేళాలు, పఠనోత్సవాలు, బాల కవిసమ్మేళనాలు మొదలగు వాటిలో పాల్గొనాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల్లో ప్రధానంగా ఈ కింది కృత్యాలను ఉపయోగించుకోవచ్చు.
    - పాత్రపోషణ
    - నిజజీవిత సన్నివేశాలను ప్రదర్శించడం.
    - నాటకీకరణ
    - మూకాభినయం
    - సమస్య పరిష్కారం
      నిర్ణయం గైకొనడం
    - సమాచార పత్రికలు, ఛార్టులను విభిన్న కోణాలలో విశ్లేషించడం.
- వివిధ పత్రికలను చదవడం / రచయిత వైఖరులను గుర్తించడం, విశ్లేషించడం.
- భాషాక్రీడలు, పజిల్స్, కార్టూన్లు ఉపయోగించడం, వాటిగురించి చర్చించడం.
- కథాకథనం, చర్చ, సంఘటనలపై చర్చించడం.
- ఇద్దరిద్దరు జతగాను, జట్లుగాను, వ్యక్తిగతంగానూ కృత్యాలలో పాల్గొనడం.
- పాఠ్యబోధన సోపాన క్రమంగా జరగాలి. అనగా ఉన్ముఖీకరణ, అర్థసంగ్రహణం, పాఠ్యాంశబోధన - చర్చ - అవగాహన, అభ్యాసాల సాధన, పిల్లల అవగాహన పరిశీలన మొదలగు వరుస క్రమంలో నిర్వహించాలి. (వీటి గురించి ఇంతకు ముందు దశల్లో చర్చించాం)
- పిల్లల్లో స్వీయరచన, సృజనాత్మకత సామర్థ్యాలు వృద్ధి చెందడానికి చర్చ జరగాలి. అనంతరం పిల్లలు వ్యక్తిగతంగా రాయడానికి ప్రోత్సహించాలి.
- పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా, వాక్యనిర్మాణం, పదజాలం, అక్షరదోషాలు సరిదిద్దబడాలి.
- పాఠం బోధించే క్రమంలో కీలక విషయాల గూర్చి పదజాలం, జాతీయాలు, సందేశాత్మక వాక్యాలు మొదలైన వాటిని గూర్చి చర్చజరపాలి.
- పిల్లలు తప్పనిసరిగా ప్రతిస్పందించేలా, తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పేలా, బహుకోణాల్లో విశ్లేషించేలా, తామైతే ఏం చేయగలరో మాట్లాడేలా అవకాశం కల్పించాలి.
- అభ్యసనంలో పిల్లలందరూ భాగస్వాములు కావాలి.

## ఊ) ఉపాధ్యాయుల తయారీ - బాధ్యతలు

- పాఠ్యపుస్తకాల ఆధారంగా వార్షిక, పాఠ్య ప్రణాళికలు తయారుచేసుకోవాలి. వీటి నమూనాలను ఇంతకు ముందు దశల్లో చర్చించాం. నిర్ణీత నమూనాల్లో వార్షిక, పాఠ్య ప్రణాళికలు రాయాలి. సగటున ఒక పాఠానికి 12 పీరియళ్ళు అవసరమైతాయి. ఉన్ముఖీకరణ, పఠనకృత్యాలు - అర్థసంగ్రహణ, పాఠ్యాంశం గురించిన చర్చ అవగాహన కోసం సుమారు ఐదు పీరియళ్ళు అవసరమైతాయి.
- అభ్యాసాల సాధన కోసం సుమారు ఏడు పీరియళ్ళు అవసరమైతాయి.
- సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి అనగా యాంత్రికంగా పాఠాలు వివరించడం కాదు. ఆ పాఠ్యాంశం ఆధారంగా సామర్థ్యాల సాధన జరగాలి.
- పాఠ్యపుస్తకాలు క్షుణ్ణంగా చదవాలి. అవగాహన ఏర్పరచుకోవాలి.
- గద్య పద్య భాగాలను దృష్టియందుంచుకొని అదనపు పఠన సామగ్రిని, రెఫరెన్స్ పుస్తకాలు పిల్లలకు తరగతిగదిలో అందుబాటులో ఉంచి వారి స్వయం అధ్యయనాన్ని ప్రోత్సహించాలి.
- పాఠశాల స్థాయిలో ఈ దశ చివరిది కాబట్టి పిల్లలకు భాషపై పట్టు, ఆసక్తి కలిగేలా కృత్యాల నిర్వహణ జరగాలి. ప్రధానంగా పిల్లలు పాఠ్యాంశాన్ని చదవడం పదాలు, వాక్యాలు, భావం, వ్యాకరణాంశాలు, రచయిత దృష్టితో ఆలోచించడం, సమకాలీన పరిస్థితులతో పోల్చడం, భాషా శైలిని విశ్లేషించడం వంటివి బోధనాభ్యసన ప్రక్రియల్లో కీలక వ్యూహాలు కావాలి.
- ఈ దశలో పిల్లలు మూడు భాషలను అభ్యసిస్తుంటారు కాబట్టి వివిధ అంశాలను ఇతర భాషల్లోకి మార్చడం, అట్లే ఇతర భాషలోనివి తెలుగులోకి కూర్చడంపై అభ్యాసం కల్పించాలి.
- ఉపాధ్యాయులు సొంతంగా సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నాపత్రాలు రూపొందించి జవాబుపత్రాలను దిద్ది, విశ్లేషించి పిల్లలతో చర్చించాలి.
- పిల్లలు స్వతంత్ర రచన చేసేలా అభ్యాసం కల్పించడంతోపాటు పిల్లలే గోడపత్రిక, గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ, మ్యాగజైను రూపకల్పన వంటివి చేపట్టేలా చూడాలి.
- ఈ దశపూర్తయ్యేసరికి పిల్లలందరూ కథలు, కవితలు, గేయాలు, వ్యాసాలు, వ్యాఖ్యానాలు, సమీక్షలు, కరపత్రాలు, నినాదాలు, గ్రాంథిక భాషలో ఉన్న అంశాన్ని వ్యవహార రూపంలో రాయడం వంటివి చేయగలగాలి.
- తరగతిగదిలో భాషా వాతావరణం నెలకొనాలి అనగా పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, తెలిసిన సంఘటనలను క్రమపద్ధతిలో వివరించడం, అదనపు పఠన సామగ్రి, రిఫరెన్స్, నిఘంటువులు వంటివి ఉండాలి.
- భాషాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు అనగా భాషమేళాలు, బాల కవిసమ్మేళనం, వ్యాసరచన పోటీలు, ఇంటర్వ్యూలు, పద్యభాషణం, పఠనోత్సవాలు, మేళాలు వంటివి కార్యక్రమాలు రూపొందించి వార్షిక ప్రణాళికలో పొందుపరిచి దాని ప్రకారం వాటిని నిర్వహించాలి.
- పిల్లలు గ్రంథాలయ పుస్తకాలు చదివి వాటిపై సమీక్షలు రాయాలి. ఈ సమీక్షల సంకలనాలను పుస్తక రూపంలో తరగతి గదిలో అందుబాటులో ఉంచాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలన రూపంలో పుస్తకం తయారు చేసి తరగదిలో ప్రదర్శించాలి.

## ఋ) మూల్యాంకనం

- RTE - 2009 చట్టం ప్రకారం ఎలిమెంటరీస్థాయి (I to VIII) వరకు నిరంతర సమగ్రమూల్యాంకనం అమలు జరుగుతుంది.
- వీటిలోని స్వభావాలు, గుణాత్మక అంశాలను 9,10 తరగతులలో కొనసాగించాల్సి ఉంటుంది.
- 9వ తరగతిలో పూర్తిగా CCE ని అమలు పరచవచ్చు.
- 10వ తరగతిలో పిల్లలు బోర్డు పరీక్షకు హాజరుకావలసి ఉంటుంది.
- అయితే కేవలం వార్షిక పరీక్షకే పూర్తి ప్రాధాన్యతను కేటాయించకుండా అంతర్గత మూల్యాంకనం (Internal Assessment)కు కూడా కొంత భారత్వాన్ని కేటాయించాల్సి ఉంటుంది.
- భాషాప్రాజెక్ట్ పనులు, పిల్లల పోర్టుఫోలియోలు, అసైన్‌మెంట్లు (నియోజనాలు) మొదలగు వాటిని అంతర్గత మూల్యాంకనానికి సాధనాలుగా పరిగణించవచ్చు.
- రోజువారి బోధనాభ్యసన ప్రక్రియల ఆధారంగా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి అంతర్గత మూల్యాంకన సాధనాలు వినియోగించాలి.
- వీటి ఆధారంగా పిల్లల భాషాభ్యసనంలోని ఇబ్బందులను పిల్లలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, వారి అభ్యసన స్థాయిలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలి. తద్వార 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఒత్తిడిని, ఆందోళనను అధిగమించవచ్చు.
- 10వ తరగతి పబ్లిక్ పరీక్షకోసం రూపొందించే భాషాప్రశ్నపత్రాలను భాషాసామర్థ్యాల ఆధారంగా రూపొందించాలి.
- ప్రశ్నల స్వభావం పిల్లలను ఆలోచింపజేసేలా, పిల్లల భాషాసామర్థ్యాల సాధన స్థాయి అంచనా వేయడానికి వీలుగా ఉండాలి.
- భాషా వాచకాలలో పిల్లల అభ్యస నిమిత్తం ఇచ్చిన ప్రశ్నలను ఉన్నది ఉన్నట్లుగా వార్షిక పరీక్షలలో ఇవ్వకూడదు. దీనివల్ల పిల్లలను బట్టీ విధానాల నుండి నిరోధించవచ్చు.
- కవుల గురించి, రచనాశైలి గూర్చి, రచనాశైలిలోని అంతరార్థము, ఆంతర్యం (కవులు / రచయితలు) గూర్చి పిల్లలు ప్రతిస్పందించేలా ప్రశ్నలస్వభావం ఉండాలి.
- భాషా వినియోగశక్తిని పరీక్షించే రీతిలో ప్రశ్నలుండాలి.
- ఇందుకోసం అవగాహన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, ప్రతిస్పందన భాషాంశాలు (పదజాలం / వ్యాకరణం) అనే సామర్థ్యాలకు భారత్వాన్ని కేటాయించి ప్రశ్నపత్రాలను రూపొందించాలి.
- 9వ తరగతిలో 8వతరగతి వరకు కొనసాగించిన విధానమే కొనసాగిస్తూ, 10వ తరగతి పిల్లలు తయారయ్యేలా మూల్యాంకన విధానాలు వినియోగించాలి.

## ఎ) భాషా వనరులు, పరామర్శ గ్రంథాలు, సామగ్రి

### I. 9, 10 తరగతులకు నూతన పాఠ్యపుస్తక బోధనలో ఉపకరించే భాషా వనరులు :

విద్యార్థులలో భాషా సామర్థ్యాల సాధనకు భాషోపాధ్యాయునికి ప్రధాన సహాయకారిగా నిలబడేది పాఠ్యపుస్తకం. నిరంతర బోధన, సాధన, అధ్యయనాల ద్వారా అంకితభావం గల ఉపాధ్యాయులు స్వప్రయత్నంతో పాఠాలన్నీ ముందుగా చదువుకొని, తగు విధంగా సంసిద్ధులవుతారు. పాఠాన్ని రమ్యంగా, అర్థవంతంగా, వైవిధ్యభరితంగా, సమర్థంగా బోధించడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. వ్యక్తిగత శ్రద్ధ చూపి, ఆ విధంగా తయారై పాఠ్యబోధన చేసే ఉపాధ్యాయులు సదా అభినందనీయులు.

- నూతన పాఠ్యపుస్తకం బోధించడానికి ఏ ఏ వనరులు అవసరమని మీరనుకుంటున్నారు?
- వనరుల ఉపయోగం ఎంతమేర ఉంటుంది?
- ఏ ఏ వనరులు ఉండాలి?
- బోధన పరిపుష్ఠం కావాలంటే ఇంకా ఏమేం అవసరం?

భాషాబోధనలో భాషాశాస్త్ర, వ్యాకరణ గ్రంథాల ఆవశ్యకత తప్పనిసరి అవుతుంది. అట్లాగే పాఠ్యబోధన, తరగతిగది నిర్వహణ అర్థవంతం, ఆసక్తికరం, ఫలవంతం కావడానికి మరికొంత సామగ్రి అవసరమవుతుంది.

భాషా సామర్థ్యాల సాధనకు, వ్యక్తివికాసానికి, విలువల స్థాపనకు, మానవ సంబంధాలను పటిష్టం చేయడానికి తెలుగు (భాషా) బోధన ఉపయోగపడుతుంది. దీనికి ప్రధాన సాధనం పాఠ్యపుస్తకమే. కాని పాఠ్యపుస్తకంలోని విషయాలన్నీ సమగ్రంగా అవగాహన చేసుకొంటేనే సమర్థంగా బోధన నిర్వహించడానికి వీలవుతుంది. అట్లా అవసరమయ్యే వస్తువులు, వనరులు ఏమేముంటాయో ఒక్కసారి ఆలోచిద్దాం.

పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణలో, విద్యార్థుల మానసిక, మేథోవికాసనంలో భాషోపాధ్యాయులదే ప్రధాన భూమిక. అందుకు కారణం వారికి భాషపైన పట్టు ఉండటం, వాక్పటిమ ఉండటం, వివిధ అంశాల పట్ల సదవగాహన ఉండటం, సంస్కృతీ సంప్రదాయాల గురించి అవగాహన ఉండటం, విద్యార్థుల పట్ల వాత్సల్యం కల్గి ఉండటం మొదలైన అనేక అంశాలుంటాయి. ఎప్పటికప్పుడు ఈ శక్తియుక్తులకు సానపెడుతూ తన ప్రతిభను ఇనుమడింపచుకుంటూ, నూతన విధానాలను గ్రహిస్తూ, ప్రయోగిస్తూ, నిత్య విద్యార్థిగా తనను తాను మలచుకున్నప్పుడే ఉపాధ్యాయుడు సరియైన గుర్తింపు పొందుతాడు. వృత్తికి వన్నెతెస్తాడు. ఈ నేపథ్యంలో పాఠ్యబోధనను, విధి నిర్వహణను మరింత గొప్పగా నిర్వహించడానికి అవసరమయ్యే వనరులలో ఈ కింద పేర్కొన్నవి దోహదపడగలవు.

1. పాఠశాల గ్రంథాలయం
2. పరామర్శ గ్రంథాలు

3. సాంకేతిక విజ్ఞానం
4. ఉత్సవాల నిర్వహణ
5. ప్రదర్శనలు
6. యాత్రలు - సందర్శనలు - వనభోజనాలు
7. పాఠశాల సంచిక
8. వార్తా పత్రికలు, సంచికలు (వార, మాసపత్రికలు)
9. ఇతరములు

1. **పాఠశాల గ్రంథాలయం** : ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పాఠశాల గ్రంథాలయాలు తదనంతర కాలంలో క్షీణదశకు చేరుకొని, ఇటీవలే మళ్ళీ ప్రాణం పోసుకుంటున్నాయి. రాజీవ్ విద్యామిషన్ (SSA) సహకారంతో ప్రతి ఏటా వేలకొలది ధనం ఈ వ్యవస్థకు వినియోగించబడుతున్నది. విద్యార్థుల విస్తార పఠనానికి, మౌన పఠనానికి, వ్యక్తిగత అధ్యయనానికి గ్రంథాలయం చక్కని వేదిక. భవిష్యత్తులో సార్వత్రిక గ్రంథాలయాలను వినియోగించుకునే విధానం అలవడి, విజ్ఞానార్జనకు దోహదం చేస్తుంది. అందుకే ఉన్నంతలో సువ్యవస్థితమైన గ్రంథాలయ నిర్వహణ ద్వారా విద్యార్థులకు గ్రంథాలయ వినియోగాన్ని అలవాటుచేయాలి. పుస్తకాలను పద్ధతి ప్రకారం అమర్చడం, కేటాలాగులు తయారుచేయడం; పుస్తకాలు ఇచ్చిపుచ్చుకునే పట్టికను నిర్వహించడం; మౌన పఠనాన్ని అలవాటుచేయడం; ముఖ్యాంశాలను రాసుకోవడం వంటి పనులకు పాఠశాల గ్రంథాలయం మార్గదర్శనం చేయాలి.

2. **పరామర్శ గ్రంథాలు** : పాఠ్యబోధనను సమగ్రంగా నిర్వహించడానికి పరామర్శ గ్రంథాలు తప్పనిసరి. పాఠ్యపుస్తకంలో ఎన్ని వివరణలున్నా అవి పరిమితంగానే ఉంటాయి. పదవిజ్ఞానం, పూర్వగాథలు. వ్యాకరణాంశాలు, అదనపు సమాచారాలు... ఇవి ఎంత విరివిగా సంపాదించగలిగితే ఉపాధ్యాయులకు అంత సౌకర్యంగా, విద్యార్థులకు ఉత్సాహభరితంగానూ ఉంటాయి. ఈ కింద కొన్ని ముఖ్యమైన పరామర్శ గ్రంథాలు సూచింపబడ్డాయి. పాఠశాల అవసరాన్ని బట్టి వీటి విస్తరణ, కుదింపూ సంభవం.

   1. శబ్దరత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు
   2. బ్రౌణ్యనిఘంటువు - తెలుగు - తెలుగు
   3. మాండలిక పదకోశాలు - తెలుగు అకాడమి
   4. ఆంధ్రనామ సంగ్రహము
   5. విద్యార్థి కల్పతరువు
   6. విజ్ఞాన సర్వస్వం (3, 4, 6 భాగాలు) - తెలుగు భాషాసమితి
   7. బాల విజ్ఞాన సర్వస్వం - ఖాసింఖాన్

8. విశ్వవిజ్ఞాన దర్శిని - ఆచార్య నరేంద్రదేవ్
9. భాష - సమాజం - సంస్కృతి - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి
11. వ్యావహారిక భాషా వికాసం - బూదరాజు రాధాకృష్ణ
12. మాటలు - మాటలు - బూదరాజు రాధాకృష్ణ
13. మాటల వాడుక - వాడుక మాటలు - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. పూర్వగాథాలహరి - వేమూరి శ్రీనివాసరావు
16. పురాతన నామకోశం - బూదరాజు రాధాకృష్ణ
17. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ - డా॥ ఎస్. నళిని
18. పాలమూరు జిల్లా దేవాలయాలు - కపిలవాయి లింగమూర్తి
19. దుందుభి (గేయకావ్యం) - గంగాపురం హనుమచ్ఛర్మ
20. రామరాజీయం - బిరుదురాజు రామరాజు
21. శ్రీమదాంధ్ర మహాభారతం (ఆది, సభా, అరణ్య) - నన్నయ
22. శతక సాహిత్యం (1, 2 భాగాలు) - సాహిత్య అకాడమి.
23. మహాప్రస్థానం - శ్రీశ్రీ
24. దర్శనీయ స్థలాలు (అజంతా, ఎల్లోరా...)
25. హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద) - గౌరన
26. నార్ల రచనలు (ఐదవ సంపుటి) - నార్ల వేంకటేశ్వరరావు
27. వట్టికోట ఆళ్వార్‌స్వామి కథలు
28. తెలుగు గజళ్ళు (సమగ్రాంధ్రసాహిత్యం - 6వ సంపుటి) - డా॥ సి.నారాయణరెడ్డి
29. రామాభ్యుదయం - అయ్యలరాజు రామభద్రుడు
30. నండూరి రామమోహనరావు వార్తావాఖ్యలు
31. సమైక్యభారతి (కవితా సంకలనం) - రాష్ట్ర సమాచారశాఖ

### బాలలను ప్రేమించండి

*ఉపాధ్యాయులకు ఉండవలసిన లక్షణాలల్లో పిల్లల పట్ల ప్రేమ, వారిపట్ల సానుభూతి, వారి తల్లిదండ్రులతో స్నేహసంబంధాలు, బాలల మంచి కొరకు సహకరించే కోరిక, కర్తవ్యంపట్ల అత్యంత శ్రద్ధ మొదలగునవి కూడా ఉంటాయి. తమ తరగతి పిల్లలను ప్రేమించని ఉపాధ్యాయుడు, వారి పట్ల సానుభూతి చూపని ఉపాధ్యాయుడు అసలు ఉపాధ్యాయుడే కాదు. అలాంటి వారు తమ వృత్తిలో ఏనాటికీ జయప్రదం కాలేరు. ప్రేమను, సానుభూతిని ప్రదర్శించినప్పుడు వారి హృదయకవాటాలు మనకోసం తెరుచుకుంటాయి. వారి హృదయాల్లో ఉపాధ్యాయుడు శాశ్వతంగా ఉండిపోతాడు. నిజానికి ఈ ప్రపంచం మొత్తం ప్రేమకు మాత్రమే వశమై ఉంది. ఇక పిల్లల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. స్నేహపూర్వకమైన ఉపాధ్యాయుడు పిల్లలకు సమస్తం అందివ్వగలడు. అయితే ఉపాధ్యాయుడి ఈ ప్రేమ బాలలకు భద్రతను ఇవ్వాలి. ఇందుకొరకు ఉపాధ్యాయుడు పిల్లలను ముఖస్తుతి చేయాల్సిన అవసరం లేదు. ప్రేమ అనగా బాల్యదశలో ఆనందం, బాలల వికాసానికి సంబంధించిన ఆలోచన, వారి ఉన్నతిలో శ్రద్ధ, విశ్వాసాలు ఉంచడం. బాలల పట్ల ప్రేమ అంటే ఉపాధ్యాయుడి సఫలత అనే అర్థం.*

*- గిజుభాయి*

32. శ్రీమదాంధ్ర మహాభారతం (ఉద్యోగపర్వం) - తిక్కన
33. వచన రామాయణం
34. వచన మహాభారతం
35. సాక్షివ్యాసావళి (3వ సంపుటి) - పానుగంటి లక్ష్మీనరసింహారావు
36. శివతాండవం - పుట్టపర్తి నారాయణాచార్యులు
37. ఒక విజేత ఆత్మకథ - ఎ.పి.జె.అబ్దుల్ కలామ్
38. శారద లేఖలు - కనపర్తి వరలక్ష్మమ్మ
39. సింహాసన ద్వాత్రింశిక - కొరవి గోపరాజు
40. నూరేళ్ళపంట - డా॥ భార్గవీరావు
41. రుబాయిలు - డా॥ సామల సదాశివ
42. అనాది స్రోతస్సు - జిడ్డు కృష్ణమూర్తి
43. నా గొడవ - కాళోజీ
44. సావిత్రి సమగ్ర రచనా సంపుటి - అరణ్య కృష్ణ (సంపాదకులు)
45. కృషీవలుడు - దువ్వూరి రామిరెడ్డి
46. ప్రాచీన గాథాలహరి - పిలకా గణపతిశాస్త్రి
47. పారమార్థిక పదకోశం - పొత్తూరి వేంకటేశ్వరరావు
48. వ్యాకరణ పదకోశం - తెలుగు అకాడమి
49. సాహిత్య పదకోశం - తెలుగు అకాడమి

*నిఘంటువులోని "పదాలు-అర్థాలు" కంఠస్థం చేయడంవల్ల కూడా మనం నిజమైన అర్థాలు గ్రహించలేం. నిఘంటువు సాయంతో సరియైన అర్థం తెలుసుకునే ప్రయత్నంలో మనం తప్పుడు అర్థం కూడా తెలుసుకునే అవకాశం ఉంది. భావాన్ని అనుసరించి ఒకే పదానికి ఎన్నో అర్థాలు ఉంటాయి. కొన్ని పదాలకు ఒకే అర్థం ఉండవచ్చు. అయితే భాష మన అనుభవంతో కలగలసి పోతూ ఉన్నప్పుడు పదాల అర్థాలు, పదాలలోని శక్తి సమార్థ్యాలు, పదాల సమతుల్యం మన గ్రహింపుకు వస్తూ ఉంటాయి. మన అనుభవమే పదాలకు సూక్ష్మతను, గంభీరతను ఇచ్చి వాటిని సజీవంగానూ, కాంతివంతంగానూ తయారుచేస్తాయి.*

*- గిజుభాయి*

3. **సాంకేతిక విజ్ఞానం (Technology)** : ఆధునిక కాలంలో సాంకేతిక విజ్ఞానం విరివిగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా (Electronic media) విశేషంగా వాడుకలో ఉంది. విద్యారంగానికి సంబంధించినంత వరకు దృశ్యశ్రవణ ఉపకరణాలు చాలా కాలంగా వినియోగిస్తున్నాం. అయినా కొంతమంది ఈ విషయంలో నిర్లిప్తంగా ఉన్నారు. 'తెలుగు బోధన'కు వాటితో పనేంటి?' అనేవాళ్ళూ కనిపిస్తున్నారు ఇప్పటికీ. ఇది అభిలషణీయంకాదు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణా సంస్థ (SCERT), రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ (SIET), మనటీవీ వంటి సంస్థలు విద్యార్థుల కోసం రేడియో పాఠాలను, టీవీ పాఠాలను రూపొందించి ప్రసారం చేస్తున్నారు. ఆడియో, వీడియో సి.డి.లను అందజేస్తున్నారు. అవన్నీ విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరగాలి. అలాగే అంతర్జాలం (INTERNET) ద్వారా భాషా అవసరాలకు సరిపడిన ఎంతో సమాచారాన్ని, చిత్రాలనూ పొందవచ్చు.

4. **ఉత్సవాల నిర్వహణ :** పాఠశాలలో నిర్వహించే వివిధ ఉత్సవాల ద్వార విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలను పెంపొందించడమేగాక మూర్తిమత్వ నిర్మాణానికి బాటలు వేయవచ్చు. ఈ సందర్భంగా విద్యార్థులను కార్యక్రమ యోజనలో, నిర్వహణలో భాగస్వాములను చేయవచ్చు. భాషా సంబంధమైన రకరకాల పోటీలు (పద్యపఠనం, వ్యక్తృత్వం, వ్యాసరచన, క్విజ్...) నిర్వహించి విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టవచ్చు. ఆహ్వాన పత్రికలు, ప్రకటనలు రాయించడం, నివేదికలు తయారు చేయించడం పిల్లల్లోని భాషా సామర్థ్యాలను పెంపొందింపజేస్తుంది.

5. **ప్రదర్శనలు :** పాఠశాలలో నిర్వహించే రకరకాల ప్రదర్శనలు విద్యార్థులలో కొత్త స్ఫూర్తిని నింపి, భాషావగాహనను, వినియోగాన్ని ఇతోధికం చేస్తాయి. వీటిలో సాంస్కృతిక ప్రదర్శనలు, పద్య పఠనాలు, పాటల పోటీలు, అంత్యాక్షరి కార్యక్రమాలు, నృత్యాలు, అభినయగేయాలు, విజ్ఞాన ప్రదర్శనలు, ఎగ్జిబిషన్లు తదితర కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేటట్లు చేయాలి. తద్వారా అప్రయత్నంగానే భాషా కౌశలాలు వెలుగులోకి వస్తాయి.

6. **యాత్రలు - సందర్శనలు - వనభోజనాలు :** ప్రతి ఏటా పాఠశాల చేపట్టే కార్యక్రమాల్లో విద్యా విజ్ఞాన విహార యాత్రలు, తీర్థ, క్షేత్రాల సందర్శనలు, వనభోజనాదులు చోటు చేసుకుంటాయి. యాత్రల ప్రాథమిక లక్ష్యం విజ్ఞాన సముపార్జనే అయినా, భాషా సంబధమైన సామర్థ్యాల సాధనలోనూ అవి ప్రముఖ భూమిక వహిస్తాయి. తాము చూసిన ప్రదేశాలను వర్ణించడం, ప్రతిస్పందించడం, దర్శించిన వాటిని రికార్డు చేయడం, బొమ్మలు గీయడం, అనుభవాలు అక్షరబద్ధం చేయడం, స్వగతాలుగా రాయడం, కవితలు, కథలు, గేయాలు రాయడం వంటి సామర్థ్యాలను ఇవి పెంపొందిస్తాయి. విభిన్న సంస్కృతీ, సంప్రదాయాల అధ్యయనానికి ఇవి బాటలు వేస్తాయి. ప్రకృతి ఆరాధన, కళారాధన, సున్నితత్వం, సృజనాత్మకత వంటి భాషా సామర్థ్యాలు సహజంగా వికసించడానికివి ఉపకరిస్తాయి.

7. **పాఠశాల సంచిక :** విద్యార్థులలోని సృజనాత్మకు పదునుపెట్టి ప్రోత్సహించడానికి ఉపకరించే మేలైన సాధనం పాఠశాల సూచిక. కనీసం సంవత్సరానికి ఒక సంచిక విడుదల చేసే ప్రయత్నం జరగాలి. రచనలు, చిత్రాలు, కల్పనలు, ఊహలు, కథలు, ఆలోచనలు, ఆశయాలు ప్రతిబింబించే విధంగా పిల్లల కళలను అద్దంలో చూపినట్లు సంచికను రూపొందించాలి. ఇందుకు సంపాదక బాధ్యతలు నిర్వహించే తెలుగు ఉపాధ్యాయులు ఎంతో ఓపికను, విజ్ఞతనూ ప్రదర్శించాలి. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. రచనలను సరియైన దారిలో నడిపించాలి. అవసరమైన ఆర్థిక వనరులను సేకరించడంలో, పత్రిక ముద్రణ విషయంలోనూ తగిన శ్రద్ధ చూపాలి. ఇది తప్పకుండా పిల్లలలో స్ఫూర్తి నింపుతుంది.

8. **వార్తా పత్రికలు, వార, మాస పత్రికలు :** ఈనాడు మార్కెట్‌లోకి వస్తున్న ప్రతి పత్రిక కూడా భాషాక్రీడలకు, సాహితీ విషయాలకూ ప్రాధాన్యతనిస్తున్నది. సాహితీ వేత్తల పరిచయాలు, పుస్తక పరిచయాలు, భాషా సంబంధ విషయాలు, పదక్రీడలు, ఆధునిక సాహిత్యం పోకడలు తదితరాంశాలు ఏ ఏ పత్రికల్లో ఎప్పుడెప్పుడు ప్రచురితమవుతున్నాయో గమనించి, వాటిని సేకరించి రికార్డు చేయడం, అవసరాన్ని, సందర్భాన్ని బట్టి పిల్లలకు పరిచయం చేయడం, భాషా క్రీడల్లో పాలుపంచుకునేట్లు చేయడం, ప్రాజెక్టు పనులు లాంటివి కల్పించడం, విస్తార పఠనాన్ని ప్రోత్సహించడం వంటివి చేయవచ్చు.

9. **ఇతరములు :** పైన పేర్కొన్న అంశాలేగాక, టీవీలో వివిధ ఛానెళ్ళలో భాషా సాహిత్యాంశాలు, సమీక్షలు, పరిచయాలు, విశ్లేషణలు వంటి అంశాలు అనేకం ప్రసారమవుతున్నాయి. వాటిని రికార్డుచేసిగాని, సి.డి.లు సేకరించిగానీ విద్యార్థులకు ప్రదర్శించడం, అటువంటి కార్యక్రమాలు చూసేటట్లు ప్రోత్సహించడం. అలాగే సినిమా పాటల్లోనూ, మంచి సాహిత్యం ఉంటే గ్రహించమని, సంభాషణల్లోనూ విలువైన, చమత్కారపూరితాలైన మాటల్ని సేకరించమని విద్యార్థులను ప్రోత్సహించవచ్చు. అట్లాగే నాటక ప్రదర్శనలను, జానపదకళలను వీలైనప్పుడల్లా చూసి, వాటి మంచి చెడులను విశ్లేషించడం, ప్రోత్సహించడం, అభ్యసించడం వంటి వాటిని పిల్లల్లో ప్రేరేపించవచ్చు.

ఇక భాషోపాధ్యాయుడు భాష తప్ప మరో విషయం బోధించడానికి అర్హుడుకాదని, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రాల బోధనతో అతడికి సంబంధం లేదని, ఆ బోధనకు అతడు అంతగా న్యాయం చేయడని పలువురు భావిస్తారు. అట్లే ఇతర భాషలపై కూడా అంతగా అధికారముందన్న అపవాదు కూడా ఉంది. అందువల్ల భాషోపాధ్యాయుడు పాఠశాలల్లో బోధించే అన్ని విషయాలతో తన పరిచయాన్ని పెంచుకోవాలి. వాటిని ప్రత్యేకంగా చదవాలి. అందుకు అంతగా సమయం కూడా వెచ్చించాల్సిన అవసరంలేదు. ఒకటో తరగతి నుండి ఇంటర్‌మీడియట్ స్థాయి పాఠ్యపుస్తకాలు చదివితేచాలు. ఇక భౌతిక రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రాలు, సాంఘికశాస్త్రాలు, గణితశాస్త్రాల్లోని కీలకభావనలను గ్రహిస్తేచాలు. ఇందుకోసం అందుబాటులో ఉన్న పరామర్శగ్రంథాలు చదవండి. ఆయా శాస్త్రాల పారిభాషిక నిఘంటువులతో పరిచయం పెంచుకోండి. పాఠశాలలో ఆయా విషయాలు బోధించే ఉపాధ్యాయులు సెలవుపై వెళ్ళినప్పుడు వారిస్థానంలో భాషోపాధ్యాయులు తాత్కాలికంగా ఆ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ పీరియళ్ళలో భాషాబోధనకు వినియోగించకుండా ఆయా అంశాల బోధనకు వినియోగిస్తే పిల్లలకు భాషోపాధ్యాయుల యందు గౌరవం ఇనుమడిస్తోంది. ఉపాధ్యాయబృందానికి ఆదర్శంగా నిలువవచ్చు. తమ పిల్లలకు కూడా ఇంటివద్ద ఆయా అంశాలను విపులంగా చెప్పుకోవచ్చు. సొంత లాభానికి, సమూహ లాభానికి అన్ని విషయాలను తెలుసుకొనియుండడం ఈ నాటి వైజ్ఞానిక యుగంలో అవసరమన్న విషయం విస్మరించరానిది. ఉపాధ్యాయుడు అందునా భాషోపాధ్యాయుడు 'భాషాంశాలు' అన్న విషయాన్ని వాస్తవం చేద్దాం. అందుకు ప్రయత్నిద్దాం.

**"అలసతకూడదించుకయు - అధ్యయనంబున బోధనంబునన్"**

**"స్వాధ్యాయప్రవచనాభ్యాం అప్రమదితవ్యమ్"**

## *విమర్శనాత్మక బోధనా విధానం*

*విమర్శనాత్మక బోధన విధానం విద్యార్థులు తమపైచేసే పెత్తనాన్ని ప్రశ్నించేటట్లు చేసి సందేహాలను, అపనమ్మకాలను నివృత్తి చేయడానికి దోహదపడుతుంది. విద్యార్థిలో విమర్శనాత్మక చేతనకు దోహదకారి అవుతుంది. విద్యార్థి మాట్లాడటం, రాయడం వంటి వాటికే పరిమితం కాకుండా అర్థాల పరిధిని దాటి తులనాత్మకంగా చైతన్యంతో ఆలోచించగలగాలి. అపోహలు, ఊహాజనిత భావనల నుంచి బయటపడి తెలివిని పెంచుకోవాలి. ఇందుకు విమర్శనాత్మక బోధనాశాస్త్రం దోహదపడుతుంది. ఇది విద్యార్థిని సమర్థంతంగా శక్తివంతులుగా తయారుచేయడానికి ఉపయోగపడుతుంది. ఇతరుల సంస్కృతిని గౌరవించడం ద్వారా తనకు తాను ప్రపంచాన్ని విభిన్న దృక్కోణాలలో విమర్శనాత్మకంగా వీక్షించడంలో ఈ బోధనా విధానం ఉపాధ్యాయులకు కూడా ఉపకరిస్తుంది.*

*- ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం - 2011*

## II. 9, 10 తరగతులకు అదనపు గ్రంథాలు

- ప్రపంచశాంతి కొరకు కృషిచేసిన వారిని గూర్చి తెలిపే పుస్తకాలు
- వివిధ శాస్త్రవేత్తలు (శాస్త్రవేత్తలను గూర్చి తెలిపే పుస్తకం)
- భారతదేశంలోని ప్రధాన నగరాలను గూర్చి తెలిపే పుస్తకం
- "కన్యాశుల్కం" - గురజాడ
- శ్రీనాథుని రచనలు
- "చిత్రగ్రీవం ఓ పావురం కథ" - ధనగోపాల్‌ముఖర్జీ
- పక్షులను గూర్చి తెలిపే గ్రంథం.
- నృసింహపురాణం - ఎఱ్ఱన
- నీతిచంద్రిక - చిన్నయసూరి
- శ్రీ శివభారతం - డా॥గడియారం వేంకటశేషశాస్త్రి
- జానపదుని జాబులు - డా॥బోయిభీమన్న
- మల్లభూపాలీయం (నీతిశతకం) - ఎలకూచి బాలసరస్వతి
- చిత్తశతకం - శ్రీపతి భాస్కర కవి
- తరిగొండ నృసింహశతకం - తరిగొండ వెంగమాంబ
- విశ్వనాథేశ్వర శతకం - గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ
- నింబగిరి నరసింహశతకం - అందెవేంకటరాజం
- శ్రీలొంకరామేశ్వర శతకం - నంబిశ్రీధరరావు
- అలిశెట్టి ప్రభాకర్ కవితలు
- "అసంకలిత సాహిత్యం - 4, రూపకాలు సంపాదకీయాలు" - విశ్వనాథసత్యనారాయణ
- బసవ పురాణం - పాల్కురికి సోమనాథుడు

*ఉపాధ్యాయులు సతతం అధ్యయన శీలురుగా ఉండాలి. వారు విద్యాసంబంధమైన మంచి వ్యాసాలు చదువుతూ ఉండాలి. విద్యాశాఖే వారికి మంచి సూచనలు ఇచ్చే విధంగా పత్రికలు నిర్వహించాలి లేదా అలాంటి పత్రికలు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలి. నాలుగైదు పాఠశాలలకు ఒకటిగా గ్రంథాలయం, పఠనాలయం ఏర్పాటు చేయవచ్చు. వాటిలో ఆ ప్రాంతపు ఉపాధ్యాయులు పుస్తకాలు చదువుకోవాలి. పత్రికలు చదువుకోవాలి. అలా విద్యాసంబంధమైన తమ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి. ఉపాధ్యాయులు ఎప్పుడు కూడా తమ బాల్యాన్ని మరవరాదు. వారికిగాని తమ బాల్యం గుర్తుంటే ఈనాడు తమ ఎదుట ఉన్న బాలల బాల్యాన్ని కూడా ఆదరించడం నేర్చుకుంటారు.*

*- గిరిధారిలాల్ వ్యాస్*

- ఉత్పలమాల శతకం - ఉత్పల సత్యనారాయణ చార్య
- భక్తచింతామణి శతకం - వడ్డాది సుబ్బారాయ కవి
- మహిళావరణం (సంపుటి)
- విద్వాన్ విశ్వం రచనా సంపుటి
- కథా వాహిని - పులికంటి కృష్ణారెడ్డి
- కాశీఖండం - శ్రీనాథుడు
- వాల్మీకి రామాయణం

## II. 9, 10 తరగతులకు బోధనాభ్యసన సామగ్రి

- వివిధ భాషలకు చెందిన పాఠ్యపుస్తకాలు.
- నిఘంటువులు, పరామర్శ గ్రంథాలు, మూలగ్రంథాలు మొదలైనవి.
- మ్యాగజైన్లు
- తరగతిగది గ్రంథాలయ పుస్తకాలు, బాలసాహిత్యం.
- బాలలకు సంబంధించిన మాస, వారపత్రికలు
- పండుగలు , దర్శనీయ స్థలాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలకు చెందిన పుస్తకాలు మొదలైనవి.
- ఆధునిక సాంకేతిక సామగ్రి - కంప్యూటర్, టి.వి, డివిడి సిడిలు. టేప్‌రికార్డరు, రేడియో వంటి ఉపకరణాలు.
- ఇంటర్నెట్, యూట్యూబు వంటి సాంకేతిక సామగ్రి.
- పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు
- సృజనాత్మకత అంశాలపై పిల్లలకు అవగాహన కలిగించుటకు ఆయాఅంశాలకు అనుగుణంగా ఉండే పుస్తకాలు, కవితలు, ఇంటర్వ్యూ ప్రశ్నావళి, సన్మానపత్రాలు, అభినందన వ్యాసాలు, కరపత్రాలు, నివేదికలు, ఆహ్వానపత్రాలు మొదలైన నమూనాలు ఉండాలి.

# VIII. అనుబంధం

## అ) పిల్లలూ- భాష

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మానవ నాగరికతను మలుపు తిప్పింది భాష అని మనకు తెలుసు. భాష మానవుడి ప్రమేయాన్ని బయటి ప్రపంచంలో విప్లవీకరించడమే కాదు మానవుణ్ణి అంతర్గతంగా కూడా విప్లవీకరించింది. వానరుడి నుండి నరావతారం జరిగాక నరుడిలోని అనేక మార్పులకు భాష ఒక కారణమని ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయం. అప్పటి దాకా బయటి శక్తులు పరిణామక్రమాన్ని నిర్ణయిస్తే భాష పుట్టాక అంతర్గత శక్తి (భాష) పరిణామాన్ని నిర్దేశించిందన్నమాట.

ఇప్పుడు భాష సార్వత్రికం, సార్వజనీనం. లిపిలేని భాషలున్నాయి గానీ ధ్వనుల్లేని, మాటల్లేని భాషలు లేవు. అత్యంత ప్రాథమిక స్థాయి (Primitive) భాష సైతం అద్భుతంగా ఆయా జాతుల అవసరాల్ని తీర్చగల స్థాయిలో ఉంది. అలాగే అవసరాలు పెరిగేకొద్దీ భాష తనకు తాను అద్భుతంగా మార్పులకు లోనవుతుంది. ఎప్పటికప్పుడు జవసత్వాలు సమకూర్చు కొంటోంది. భాషా, మానవుడూ చెట్టాపట్టాలేసుకొని పాతాళపుపొరల్నీ, గగనాంతరాళాల్నీ పిడికిట్లో బిగించుకొంటున్న యుగం మనది.

**భాషా నిర్మాణం :**

మనమందరం మాట్లాడుతున్నాం. అలవోకగా మాట్లాడుతున్నాం. మాట్లాడ్డమంత సులభం మరేముంది గనుక? కానీ కొంచెం లోతుగా చూస్తే భాషకు ఎంత సంక్లిష్టం!!!

అలాగే భాషకున్న ఈ ప్రాథమిక నిబంధనలన్నీ సార్వత్రికాలు, అన్ని భాషలకు సమానంగా వర్తించేవి.

ప్రతి భాషలోనూ హల్లు - అచ్చు - హల్లు - అచ్చు పద్ధతే ఉంటుంది. హల్లుల్ని అచ్చులేకుండా పలకలేము. ఒకవేళ పలికినా రెండు మూడు హల్లులకు మించి ఒకటిగా పలకలేము. మూడు హల్లుల సంయుక్తాక్షరాలు గల పదాలు ఏ భాషలోనైనా పట్టుమని పది చెప్పండి. చూద్దాం. స్త్రీ, శాస్త్రం, స్ట్రీట్, స్ట్రక్చర్ ఇలా చెప్పొచ్చు. ఎంత చెప్పినా ఎస్,టి,ఆర్ ధ్వనులతో తప్ప ఇతర ధ్వనులతో (హల్లులు) గల సంయుక్తాక్షరాలు ఎక్కడా చిక్కవు. ఇక నాల్గు హల్లులు గల సంయుక్తాక్షరం అసాధ్యం.

మన వాగ్యంత్రం ఎక్కువ హల్లుల కలయికను అంగీకరించదు. అందుకే మనం 'ఇస్కూలు' అంటాం. సూర్యుణ్ణి సూరీడు అని సరిపెట్టుకొంటాం.

ప్రతి భాషలోనూ మాటలకూ వాటి అర్థాలకూ సంబంధం లేదు. 'గాడిద' అని గుడ్డలు మోసేదాన్నే ఎందుకనాలి? ఇంటిక్కావలి ఉండే జంతువుని పంది అని ఎందుకనగూడదు? దీనికి జవాబెక్కడా చిక్కదు. అంటే మాటలన్నీ కేవలం కొండ గుర్తులు (సింబల్స్), అమూర్తాలు.

ఒక రకంగా చూస్తే భాష అత్యంత సంక్లిష్టమైంది. అంతా సంకేతాలతోనే నిండిఉంటుంది. చిన్న మార్పు చేసినా కొంప మునిగిపోతుంది.

సీత వంట చేస్తుంది.

సీత వంట చూస్తుంది.

ఒక్క దీర్ఘమే తేడా, అర్థంలో బోలెడు మార్పు.

రాముడు బడికి పోతున్నాడు సీత బడికి పోతూ ఉంది.

ఇక్కడ కర్త లింగాన్ని బట్టి క్రియ మారిపోతుంది. అదే సీత గానీ రాముడు గానీ తమను గురించి చెప్పుకొంటే 'నేను బడికి పోతున్నాను' అని ఒకే రకంగా చెప్పవచ్చు. ఇలా ప్రతి భాషలోనూ చిన్న మార్పులు పెద్ద తేడాల్ని తెస్తుంటాయి.

వాక్యాల్లోనూ ఇంతే. ఒక క్రమం ఉంటుంది. మనం ఆ క్రమంలోనే మాట్లాడతాం.

'పోతున్నాడు బడికి రాముడు' అనొచ్చు. అయినా ఇది కృతకం.

పదాలు కొన్నే వాక్యాలు లక్షలు. ఎన్ని వాక్యాలైనా మనం తయారు చేసుకోగలం. నిజానికి ఒకసారి చేసిన వాక్యం మరోసారి చెయ్యం.

***అంతా సందర్భం మీద (contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే! మూడేళ్ల బిడ్డ భాషా పరంగా పెద్దవాడి కిందే (linguistic adult) లెక్క.***

ఎప్పటికప్పుడు కొత్త వాక్యాల్ని సృష్టించుకోగలం. ప్రతి భాషకూ అంత వివిధత, సృజనాత్మకత అత్యంత సాధారణం.

భాష నిరంతరం పరిణామశీలి. ఒక లెక్క ప్రకారం మాట్లాడేవాడు చెప్పేదీ. వినేవాడు స్వీకరించేది నూటికి నూరుపాళ్లు ఒక్కటిగానే ఉండదు. తాత భాషా, తండ్రి భాషా, తన భాషా ఒకటి కానేగాదు. అసలు మనం మాట్లాడేప్పుడు కూడా ఒకసారి ఒక చోట పలికేది, మరోసారి మరోచోట పలికేది ఒకటిగాదు.

భాషా పండితులు ఎంత గీపెట్టినాసరే అది తనకు తాను మారుతూనే ఉంటుంది. ఈ వాక్యాల కంటే పదాలు, పదాల కంటే ధ్వనులు ఎక్కువగా మార్పుకు లోనవుతాయి.

ఈ మార్పులు సందర్భాన్ని బట్టి ఉంటాయి. అంతా సందర్భం మీద (Contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే!

భాషకూ భావాలకూ మధ్య అంతు చిక్కని సంబంధం ఉంటుంది. 'తోడేలు' అనగానే 'భయం' కమ్ముకొంటుంది. 'ఐస్‌క్రీం' అనగానే నోరు ఊరుతుంది.

ఒకే మాట పలు సందర్భాల్లో పలు అర్థాలివ్వవచ్చు. 'నా మాట ఏం చేశావ్' అన్నప్పుడూ 'మాటా మాటా పెరిగింది' అన్నప్పుడూ 'మాట' వినడానికి ఒకటే. అర్థం మాత్రం ఒకటి గాదు.

ఇలా చూస్తే భాష అత్యంత క్లిష్టమైంది, అత్యంత గహనమైంది. ఎవరైనా పరాయిభాషను వయసొచ్చాక నేర్చుకొంటూంటే ఈ సంక్లిష్టత అర్థమవుతుంది. ఇంత 'న్యూసెన్సు' ఏమిటా అని తల తిరిగి పోతుంది.

**పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు? :**

మరి ఇంత క్లిష్టమైన భాషని పిల్లలు అలవోకగా ఎలా నేర్చుకొంటున్నారు? ఒకటి గాదు రెండు, మూడు భాషలు కూడా ఏకకాలంలో ఎలా నేర్చుకొంటున్నారు? అంటే మూడేళ్ల బిడ్డ భాషాపరంగా పెద్దవాడి కిందే లెక్క.

ప్రతి బిడ్డా మూడేళ్ల వయసులో భాష నేర్చుకొంటోంది. ఇదొక సార్వజనీన సూత్రం. కొంచెం క్రమంలో తేడా ఉండవచ్చు, వేగంలో అటూ ఇటూ ఉండొచ్చు. కానీ మాతృభాష మాత్రం అందరికీ మూడేళ్లలో అనర్గళంగా వచ్చి తీరుతుంది. ఇదెలా సాధ్యం?

విచిత్రమేమంటే పిల్లలు నేర్చుకొనే క్రమం కూడా ప్రపంచమంతా ఒకటే. ముందు చిన్న చిన్న సరళ వాక్యాలు మాట్లాడతారు.

'నాన్న' అంటే అదీ వాక్యమే, 'నాన్న వచ్చాడు' 'నాన్న పోతున్నాడు', 'నాన్న కన్పించడం లేదు' ఇలా ఏదైనా కావచ్చు! ఆ తర్వాత రెండు పదాలతో వాక్యాలుంటాయి.

సరళ వాక్యాల తర్వాత వ్యతిరేక వాక్యాలు పిల్లలకు వస్తాయి. ఆ తర్వాత ప్రశ్నార్థకాలు నేర్చుకొంటారు.

ప్రతి బిడ్డకూ హల్లు-అచ్చు, హల్లు-అచ్చు (CVCV) సూత్రం తెలుసు. వీటిని కలగాపులగం చేసి గందరగోళపడినట్టు ఎక్కడా కన్పించదు.

ఒక వాక్యాన్ని సందర్భానుసారంగా అర్థం చేసుకోవడం పిల్లలకీ వచ్చు. నవ్వుతూ 'నేను రాను' అంటే 'వస్తానులే' అన్న ధ్వని అందులో ఉందని బిడ్డకు తెలుసు. చివర మనం చేసే చిన్న మార్పు వల్ల ప్రశ్నలుగా వాక్యాలు మారుతుంటాయి. వీటిని పిల్లలు అట్టే పట్టేస్తారు.

'సీత పుస్తకం చదువుతున్నాడు' అని మనం అంటే ఏ మూడేళ్ల పాపైనా 'ఇందులో ఏదో తప్పుందన్న'ట్టు మనల్ని వెక్కిరిస్తుంది. కాకుంటే తప్పేమిటో ఆ పిల్ల స్పష్టంగా చెప్పలేకపోవచ్చు.

భిన్నార్థాల మాటలని సందర్భాన్ని బట్టి పిల్లలు అర్థం చేసుకొంటున్నారు. వాక్యంలోని పదాల క్రమాల్ని కర్త ఆధారంగా క్రియలో వచ్చే మార్పుల్ని, కర్తా కర్మల విభక్తుల్ని తెలుసుకోడమేగాదు అవసరాన్ని బట్టి వాక్యాల్ని వివిధ విన్యాసం చేయగల నేర్పునీ పిల్లలు అత్యంత సహజంగా పొందుతున్నారు.

అంతకంటే అద్భుతం తమకు తెలిసిన పరిమిత పదాలతోనే వారు వేలాది వాక్యాలు కొత్త కొత్తవి స్వంతంగా తయారుచేసుకోవడం. ఇదంతా పెద్దల్లాగానే వాళ్లూ చెయ్యగల్గుతున్నారు.

మరీ విచిత్రం - పిల్లలు రెండు మూడు భాషల నియమాల్ని కూడా పట్టేస్తున్నారు. ఇంత సంక్లిష్ట నిర్మాణం గల నైరూప్య విషయాన్ని ఇంత సులభంగా పిల్లలెలా గ్రహిస్తున్నారు? ఇంత గొప్పగా ఎలా ఉపయోగించుకోగల్గుతున్నారు?

**దీన్ని భాషా శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలూ ఇలా విశ్లేషిస్తున్నారు.**

- ఆసక్తికర వాతావరణంలోనే పిల్లలు భాష నేర్చుకొంటున్నారు. అవసరమైన వాతావరణమే ఆసక్తికరమైంది. సహజమైందీ.
- ఈ భాషాభ్యసన క్రమంలో తప్పని సరిగా మనం అందజేసేది (ఇన్‌పుట్) ఉంటుంది. కానీ ఫలితం (అవుట్ పుట్) ఉండదు. అంటే ఇన్‌పుట్‌కు సమానంగా - అవుట్‌పుట్ ఉండదు. దీనర్థం పిల్లలకి ఎన్నో మాటలు వినిపిస్తుంటాయి. వాటిని వాళ్లు కొన్నింటిని గ్రహిస్తుంటారు. గ్రహించినవి తిరిగి ఒప్పజెప్పాల్సిన అవసరం ఈ నేర్చుకొనే క్రమంలో లేదు.

- ఒక్క సంవత్సరం పాటు పిల్లలు వింటూనే ఉంటారు. జవాబు చెప్పాల్సిన, ఉపయోగించుకోవాల్సిన పని ఉండదు. ఎవ్వరూ అలా ఒత్తిడి చెయ్యరు. ప్రతి చర్య అవసరంలేని స్వీకరణ ఇది. ఇదొక మౌన మహాయుగం.
- ప్రతీది సందర్భం నుంచే పిల్లలు నేర్చుకొంటారు. తాము పాల్గొనని తమకు సంబంధం లేని, అమూర్త నిర్వికారాంశాలకు ఇక్కడ తావులేదు.
- ఇలా నేర్చుకొనేప్పుడు వాళ్లకేమో ఒక క్రమం లేదు. ముందు అక్షరాలు, తర్వాత పదాలు, ఆ తర్వాత వాక్యాలు ఇలాంటి వరుస లేదు. ముందు 'అ' చివర 'క్ష' అనే క్రమం అసలే లేదు.
- ముందు సులభం, తర్వాత క్లిష్టం అనే వరస కూడా లేదు. దీర్ఘాలు ముందురావచ్చు. హ్రస్వాలు వెనక రావచ్చు. పిల్లలకందుతున్న భాష ఒక నిర్ధారిత క్రమంలో ఉండదు. దానికో ప్రణాళికా పద్ధతీ ఏమీ ఉండవు.
- ఈ అభ్యసన క్రమంలో ఏమి మాట్లాడారన్నది ప్రధానం కాదు. ఏదైనా మాట్లాడవచ్చు. మాట్లాడకుండానూ ఉండొచ్చు. ఎలాంటి ఒత్తిడీ లేదు.
- తమ స్వంత పద్ధతిలో పిల్లలు నేర్చుకొంటారు. దాన్ని ఎవ్వరూ రూపకల్పన చెయ్యరు. 'టీ' అనే ఒక మాటను ఒక పాపెలానైనా వాడు కొంటుంది. తాను పాలు తాగుతున్నా, అమ్మమ్మ కాఫీ తాగుతున్నా, నాన్నా టీ తాగుతున్నా, అన్నిటినీ 'టీ' అనే అంటుంది. ముందు తాను పట్టుకొన్న ఒక పేరు అన్న పానీయాలకూ పెట్టి, తర్వాత వేర్వేరు పేర్లు పెట్టుకొనే ఒక స్వంత క్రమం ఆ పాప ఏర్పరచుకొన్నదన్నమాట.
- ప్రతి రూలునూ తనకు తానే బిడ్డ తెలుసుకొంటుంది. వ్యాకరణం ఎవ్వరూ చెప్పరు.
- విచిత్రంగా అన్ని భాషల పిల్లలూ మొదట ప, బ, మ ధ్వనుల్ని ఇష్టపడతారు. 'అమ్మ, బాబా, పాపా' వంటివి వారికిష్టం.

భాష ఇంత సంక్లిష్టంగా ఉండే అంశం కావడమేమిటీ? నేర్చుకోవడం ఇంత సులభతరంగావడమేమిటి? భాషకున్న నిబంధనలు ఇంత సార్వత్రికం కావడమేమిటి? నేర్చుకొనే క్రమం ఇంత సార్వజనీనం కావడమేమిటి? అంతా విచిత్రంగా ఉంది గదూ! అవును పెద్దలకు, మనకు విచిత్రమే! పిల్లలకేమో ఇది అత్యంత సహజం.

ఇప్పుడు పెద్దలం, మనం పట్టుకోవల్సిందల్లా ఈ అభ్యసన క్రమాన్నీ, రహస్యాన్నీ.

## ఆ) పిల్లలు భాష నేర్చుకొన్నట్టే రాయడమూ నేర్చుకోగలరా?

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

భాషా, లిపీ ఈ రెండింటి స్వభావం ఒకటేనా? పరిణామ వికాస క్రమాలూ ఒకటేనా? అలా అయితే భాష నేర్చుకొన్నట్టే అక్షరాల్నీ పిల్లలు సహజంగా నేర్చుకొనే వీలుందా? రెండిటి అభ్యసన క్రమం, ఒకటేనా? ఈ ప్రశ్నలు కొంచెం లోతైనవి. పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు. అన్న ప్రశ్నకు సందర్భం, స్వప్రమేయం, స్వీయావసరం, స్వేచ్ఛల ఆధారంగా నేర్చుకొంటారనీ దీన్నే సహజ అభ్యసనమనీ ఇప్పుడు చాలా మంది అంగీకరిస్తున్నారు. మరి లిపికీ (అక్షరాలకూ) ఇది వర్తిస్తుందా? అంటే అంతే అని చెప్పడానికి మాత్రం వీళ్ళల్లో చాలా మంది తటపటాయిస్తారు.

అసలు మనం మాట్లాడడం నేర్పడం లేదు. పిల్లలే తమకు తాము నేర్చుకొంటున్నారు. కానీ ఏమీ నేర్పకుండా రాయడం నేర్చుకొనే వాళ్లెవరున్నారు? కాబట్టి మాట్లాడడం, రాయడం రెండూ ఒకేగాటన కట్టెయ్యదగినవి కావని ఎవరైనా తేలిగ్గా జవాబు చెప్పొచ్చు. మరి కొంచెం లోతుగా చెప్పదల్చుకొంటే అసలు మాట్లాడడం ఒక తప్పనిసరి అవసరం. బిడ్డకి ఆకలి వేసినప్పుడు దాన్ని ఏడుపు రూపంలో వ్యక్తం చేసినట్టే, ఆకలి తీరినప్పుడు దాన్ని కేరింత రూపంలో వ్యక్తం చేస్తుంది. దీన్ని భాషకు ప్రాథమిక రూపంగా మనం అనుకొంటే ఇది మనుగడకు సంబంధించిన సమస్య. ఇలా చూస్తే భాష ఓ విధంగా ఒక సహజాతం లాంటిది. అందుకు దీన్ని వ్యక్తీకరించేందుకు సహజమైన ఏర్పాటు ఉంది. మన వాగ్యంత్రం ఇందులో భాగం. మరి లిపికీ స్వభావం ఎక్కడుంది? లిపి మనం అవసరం కొద్దీ కల్పించుకున్నది. రాసేందుకు వాడే సాధనాలు నోరులాగా, నాలుకలాగా సహజమైనవి గావు. అవి మనం సృష్టించుకొన్నవి. అవి మనిషి బాహిరమైనవి. అలాంటప్పుడు భాష నేర్చుకొన్నట్టే పిల్లలు లిపి ఎలా నేర్చుకోగలరు? దీనికి నేర్పడం తప్పనిసరి. ఒక క్రమంలో నేర్పడం మరింత తప్పనిసరి. ఈ రకమైన చర్చ ముందుకొస్తుంది.

**అక్షరాల స్వభావం :**

దీన్ని తేల్చుకోవాలంటే లిపి స్వభావంలోకి మనం వెళ్ళాలి. దాని లక్షణాల్ని కొంచెం పరిశీలించాలి.

మొదటిది - మనం పెట్టుకొన్న పేరుకీ ఆ వస్తువుకీ ఎలా సంబంధం లేదో మనం రాస్తున్న అక్షరానికీ పలుకుతున్న ధ్వనికీ సైతం సంబంధం లేదు. గాడిదను గాడిద అనే ఎందుకనాలో చెప్పలేనట్టే ఒకానొక కంఠధ్వనిని 'క' అనే ఎందుకు రాయాలో కూడా మనం చెప్పలేం. గాడిదలాగే 'క' కూడా మనం పెట్టుకొన్న ఓ సంకేతం. అమూర్త సంకేతం.

అందువల్లనే ఒక లిపిలో ఏ భాషనైనా రాయగలం, అన్ని భాషల్నీ అన్ని లిపుల్లోనూ రాయగలం. ఉదా : KUKKA (తెలుగు), DOG (ఆంగ్లం), KUTHE (హిందీ)

ఇలా లిపి కేవలం సంకేతం మాత్రమేగాబట్టి ఏ లిపీ సమగ్రం, సంపూర్ణం కాదు. ఒక ధ్వనిని అనేక రూపాల్లో రాయడం సాధ్యం. ఒక అక్షరాన్ని అనేక విధాలుగా పలకడమూ జరుగుతున్నదే. ఋషిని రుషి అని రాస్తే 'ఆవు'ను 'ఆఉ' అని రాస్తే 'ఒకటి'ని 'వొకటి' అని రాస్తే చదవడానికేమీ ఇబ్బంది ఉండదు. రెండు వస్తువులకు ఒకే పేరున్నట్టే రెండు ధ్వనులకు ఒకే అక్షరమూ మనం రాస్తున్నాం. ఒక ధ్వనిని ఒకచోట ఒకలాగా మరోకచోట మరోలాగా పలుకుతున్నట్టే ఒక అక్షరాన్ని ఒకచోట ఒక ధ్వనికీ, మరో చోట మరో ధ్వనికీ మనం

ఉపయోగించుకొంటున్నాం. మనం చెప్పదల్చుకొన్న ప్రతి దానికి సరిపోయే మాటలు లేనట్టే మనం రాయదల్చుకొన్న ప్రతిధ్వనికీ సరిపోయే అక్షరాలూ లేవు. చేప, చాప, చాట ఈ మూడింటా పలుకుతున్న ధ్వనియేది? రాస్తున్నదేది? లేదా రాస్తున్నదేది? పలుకుతున్నదేది?

**లిపీ మారుతోంది :**

మరో అంశం పరిశీలిద్దాం. భాష రోజు రోజుకీ మారుతోంది. దాని పరిణామ క్రమాన్ని మనం రికార్డు చెయ్యొచ్చుకూడా. గుఱ్ఱబు, గుఱ్ఱంబు, గుఱ్ఱమ్ము, గుఱ్ఱము, గుఱ్ఱం. గుర్రం ఇలా రూపాంతరం చెందడం మన కళ్ల ముందే చూస్తున్నాం. సందర్భాన్ని బట్టి, వ్యక్తిని బట్టి వేగాన్ని బట్టి కూడా భాషలో మార్పులు కొల్లలుగా మనం చూడొచ్చు. ఇందులో ఏది సరైంది? (లాక్షణికమైంది) ఏది సరైంది గాదు? అని ప్రశ్నిస్తే ఎవరికివారి భాషే సరైంది అనడం కంటే వేరేజవాబు ఉండదు. పిల్లవాడికి గుల్లం సరైంది. పండితుడికి గుఱ్ఱము సరైంది. అనడం కంటే జవాబు ఉండదు. పిల్లవాడికి గుల్లం సరైంది. పండితుడికి గుఱ్ఱము సరైంది. మనకు గుర్రం సరైంది. స్కూలు మొహం ఎప్పుడూ చూడని వారికి ఇస్కూలు అంతే సరైంది. కాకుంటే మనం (అంటే సమాజం మీద ఒక పట్టుగల) ఒకానొక భాషని లాక్షణికం అంటున్నాం. అక్కడితో ఆగక ఈ లక్షణాలు తెలీని వారి భాషని గ్రామ్యం అనీ అచ్చ తెలుగులో అలగాజనం భాష అనీ కూడా ఎద్దేవా చేస్తున్నాం.

మరి లిపి కూడా ఇలానే మారుతోందా? మారుతోంది గానీ భాష మారినంత వేగంగా మారడం లేదు. దానిక్కారణం భాషకున్నంత అవసరం, ప్రాచుర్యం. సందర్భ వైవిధ్యం రాయడానికి లేకపోవడం గావచ్చు. కానీ మారుతుండటం మాత్రం అక్షరసత్యం. ఇప్పుడు కాఫీలోని ఫీకి కొత్త అక్షరం వచ్చింది. అమెరికన్లు డౌట్‌లో బి ఎందుకని ఎదురు తిరుగుతున్నారు. మన పిల్లలు చే, జే లకు ఎగనామం పెట్టేశారు. బండి 'ఱ' తిరిగి రాని లోకాలకి వెళ్ళిపోయింది. పాపం 'ౠ' అంతరించి 'ఋ' తోడులేక మినుకుమినుకుమంటోంది శ, ష, సలలో ఏదో ఒకదానికి తొందర్లోనే మూడేటట్టుంది. అసలు స(శ) స(ష) అని రాస్తే పోతుంది గదా అనే సవాలూ వస్తోంది. అక్కడితో ఆగక 'అ' ఒక్కటే మిగిలించి దానికి దీర్ఘం (తా) గుడీ (తి) ఇత్యాదులిచ్చి ఆ, ఇ, ఈ అని పలికితే అక్షరాలు కలసి రావూ అనే పొదుపు ఉద్యమమూ తలెత్తుతోంది. ఎలక్ట్రానిక్ యుగం ఇంకొంచెం ముదిరితే ఏ అక్షరాలు (పాపం వాటి పేరేమో అక్షరాలు - నశించనివి) ఏమవుతాయో ఎవరు చెప్పగలరు? ప్రపంచీకరణ ప్రభావం వల్ల అన్ని భాషలకీ ఒకే లిపి అనే చట్టం రాదని హామీ ఎవరివ్వగలరు?

భాషకీ లిపికీ మధ్య ఓ అనిర్వచనీయమైన లయ ఉందిగదా అనొచ్చు. లిపి ఏర్పడ్డాక ఆ లిపిలో మన భాషని ఏళ్ల తరబడి చూసుకోవడం అలవాటయ్యాక మనకలా కన్పిస్తోంది. ఇది కేవలం స్వీయ మానసిక విషయం. అంతేగానీ ఈ అనుబంధమేదీ భాషకీ లిపికీ మధ్య లేదని ఆధునిక లిపి శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

**లిపి - సహజాభ్యసనం :**

భాషకీ లిపికీ మధ్య ఈ సాన్నిహిత్యం చూసాక ఇక లిపిని నేర్చుకోవడం దగ్గరికి వద్దాం. భాషలా లిపి ఒక సహజాతం లాంటిది కాదుగదా మరి సహజ అభ్యసనం ఎలా సాధ్యమనేది చాలా విలువైన ప్రశ్న. పిల్లలు అవసరం ఉన్నా లేకున్నా ఏదో ఒకటి గొణక్కుంటుంటారు. ఏదో ఒక శబ్దం చేస్తూనే ఉంటారు. ఇది చాలా చిన్న వయస్సు నుంచీ మనం చూస్తున్నాం. అలాగే పిల్లలు ఏదో ఒకటి నేల మీద, గోడల మీద గీయడమూ మనం గమనించొచ్చు. తాను భావిస్తున్న దానికి (ఆ మూర్త భావనకి) ఓ సంకేతం (మూర్త రూపం) కల్పించుకోవడంలో ఇది భాగమా? లిపికిదే ప్రాథమిక రూపమా? అసలు ఆదిమ మానవుడు మాటలు రాక సైగలు చేసుకొనే కాలంలోనే తన భావాల్ని బొమ్మల ద్వారా సంకేతాల ద్వారా తెలియజేసేవాడని చాలా ఆధారాలు కూడా మనకు దొరుకుతున్నైకదా! కాబట్టి భాష లానే రాత కూడా ఓ సమాజావసరం. సహజాతం లాంటిదనే వాదన కూడా ముందుకొస్తోంది.

అదెలా ఉన్నా భాష నేర్చుకొనే క్రమానికీ, రాత నేర్చుకొనే క్రమానికీ మధ్య సామ్యం మాత్రం మనం గమనించి తీరాలి. అంగీకరించి తీరాలి. అసలు పిల్లలు భాషనీ అక్షరాల్నే గాదు నడక నేర్చుకోవడంలో కూడా ఓ క్రమం ఉంది. ఓ వ్యాకరణం ఉంది. ప్రతి అమూర్తాంశాన్ని మనిషి తెలుసుకోడానికీ ఒక క్రమం ఉంది. ఈ క్రమాల మూల స్వభావం, లక్షణం ఒకటిగానే ఉంటై. దీన్ని అర్థం చేసుకొంటే పిల్లలు రాయడం నేర్చుకోవడంలోనూ, భాషను నేర్చుకోవడంలో ఒక క్రమమే చాలా వరకు ఉందని మనం అనుభవం నుంచి తెలుసుకోవచ్చు.

భాషని పిల్లలు ఒక సందర్భంలో నేర్చుకొంటారని మనం అంగీకరిస్తే లిపినీ ఒంటరిగా గాక ఒక సందర్భం (కాన్‌టెక్స్ట్)లోనే పిల్లలు నేర్చుకొంటారు. మనం అలా నేర్పడమే సహజాభ్యసనం. అ, ఆ, ఇ అని దిద్దేప్పుడు ఏ సందర్భం ఉంది?

పిల్లలు స్వప్రమేయంతోనే భాషను నేర్చుకొన్నట్లే రాయడంలో కూడా జరగాలి. రాయడం సహజాభ్యసనం ద్వారా జరగాలి. (బొమ్మలు, గీసినట్టు అక్షరాలు స్వంతంగా గీయడానికి ఉద్యుక్తులు కావాలి).

పిల్లలు భాషని ముక్కలు ముక్కలుగాగాక సమగ్ర రూపంలోనే నేర్చుకొన్నట్లు లిపినీ అ, ఆ, ఇ, ఈ అని ముక్కలు చెయ్యడం గాకుండా పదాలు, వాక్యాలుగా నేర్చుకోవడం (అదీ ఒక సందర్భంలో) సహజాభ్యసనం.

మనం పట్టుబట్టి ప్రతిమాటా నేర్పితే, వ్యాకరణం చెపితే పిల్లలకు భాష రాలేదు. అలాగే ఎంతసేపు దిద్దిస్తే అంతగా అక్షరాలు వస్తాయనేది మన భ్రమ. మాట్లాడుతున్న క్రమంలో భాష వచ్చినట్టే చదువుతున్న క్రమంలోనే రాయడం వస్తుంది.

తప్పులు మాట్లాడుతూనే బాగా మాట్లాడడం నేర్చుకొన్నట్లు తప్పులు రాస్తూనే పిల్లలు సరిగా రాయడం నేర్చుకొంటారు. పిల్లలు మాట్లాడేటప్పుడు గుర్రాన్ని ‘గుల్లం’ అనగానే మనం ఎలా బెంబేలు పడమో అలాగే ‘అమ్మను’ ‘అమం’ అని రాయగానే మనం అన్యాయం జరిగిపోయిందనుకోకూడదు.

ఇన్‌పుట్ - ఔట్‌పుట్ అనే సూత్రం భాషకు మల్లే రాతకీ వర్తిస్తుంది. ఒక పదాన్ని చదవగల్గిన మరునాడే డిక్టేషన్ చెప్పడం అర్థరహితం. ఏడో పాఠంలో ఉన్నవాడు మూడో పాఠం పదాలు బాగా రాయగల్గితే చాలు. పరిసరాలు అనుకూలంగా ఉంటే పిల్లలు రెండు భాషలూ మాట్లాడగల్గినట్టే రెండు లిపులూ నేర్చుకోగలరు. కానీ ఏ భాషా వాతావరణం ఎక్కువగా ఉంటే ఆ భాషలో పట్టు చిక్కినట్టే, ఏ లిపి వాతావరణం ఎక్కువుంటే అందులో బాగా రాయగలరు.

ఇలా ఎంతైనా చెప్పుకోవచ్చు గానీ అసలు సూత్రం మాత్రం ఒక్కటే. అదేమంటే పిల్లలు దేన్నైనా నేర్చుకోవడానికి ఓ క్రమం, ఓ పద్ధతి ఉంటుంది. ఆ క్రమం, పద్ధతీ అన్నింటా దాదాపు ఒక్కటే. కావల్సిందల్లా దీన్ని మనం అర్థం చేసుకోవడం, అంగీకరించడం.

## ఇ) భాషా బోధనలో భిన్న ధోరణులు

*- "చదువు విజ్ఞానం", జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం*

భాషను అభివృద్ధి చెందిన మానవుడి మెదడుకు ఫలితంగానేగాక మానవుడి మెదడు అభివృద్ధికి ఒకానొక హేతువుగా కూడా నేడు పరిగణిస్తున్నారు. సైగల రూపంలో, చిన్న చిన్న ధ్వనుల రూపంలో మొదలైన భాష నేడు అత్యంత విస్తృతంగా, సంక్లిష్టంగా కూడా పరిణతి చెంది మన అవసరాల్ని అద్భుతంగా నెరవేరుస్తోంది.

భాషా నిర్మాణం వాస్తవానికి అంత సరళమైంది ఏమీ కాదు. ప్రతి భాషకూ తనదైన నిర్మాణ పద్ధతి ఉంది. అదే సందర్భంలో అన్ని భాషలకూ సమానమైన కొన్ని నియమాలు ఉన్నాయి. ఏ చిన్న నియమాన్ని ఉల్లంఘించినా, చిన్న పొరపాటు చేసినా మొత్తం చెప్పదల్చుకొన్నదే తారుమారయ్యే ప్రమాదం ఉంది. 'వేసవిలో సంపన్నులు తాళలేక ఊటీ, సిమ్లా వంటి శీతల ప్రదేశాలకు వెళుతుంటారు' అనే వాక్యంలో 'తాళలేక' అనే పదాన్ని 'తాళంలేక' అని చదివితే ఏమవుతుంది? ఇలాంటివి ఉదాహరణలు ఎన్నైనా మనం నిత్యజీవితంలో చూడవచ్చు.

వచనం మారినప్పుడు, లింగం వేరైనప్పుడు, కాలాల్లో భేదం వచ్చినప్పుడు క్రియల్లో వచ్చే మార్పులకు మనం అలవాటు పడ్డాం గాబట్టి మాతృభాషలో సవాళ్లుగా కన్పించవుగానీ ఇతర భాషల్లోనైతే తలనొప్పిగా ఉంటాయి. సంస్కృత భాషలో 'దారా:' (భార్యలు) అనేది పుంలింగం. అది బహువచనంలో మాత్రమే ఉంటుంది. హిందీలో నపుంసక లింగం లేదు. ఉన్నదల్లా స్త్రీ పురుషాలే. హిందీలో 'నే' ప్రత్యయం వచ్చినప్పుడు క్రియ కర్తనుబట్టిగాక కర్మను బట్టి మారుతుంది. ఆంగ్లంలో కర్మణి (passive voice) ప్రాధాన్యత ఎక్కువ.

ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. మరి ఇంత సంక్లిష్టమైన, దేనికది ప్రత్యేకమైన భాషల్ని మనం ఇంత అలవోకగా ఎలా నేర్చుకొంటున్నాం? మనలో ధారాళంగా మాట్లాడడం గానీ, అభిప్రాయాలు వ్యక్త చెయ్యడం గానీ చేతగాని వాళ్లు ఎవ్వరూ లేరు. అందరం కొంచెం అటూ ఇటూగా అత్యంత సమర్థంతంగా విని అర్థం చేసుకొంటున్నాం. మాట్లాడుతున్నాం. ఈ నైపుణ్య సంపాదనా క్రమంలో కూడా మన మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. అందరం ఒకే వయస్సులో ఒకే 'పాండిత్యం' సంపాదిస్తున్నాం. మన పిల్లలకు గల పదజాల సంపద కూడా దాదాపు ఒకే మోతాదులో ఉంటోంది. ఇదెలా సాధ్యమవుతోంది?

మనమెవ్వరమూ ముందు వ్యాకరణం నేర్చుకొని తర్వాత మాట్లాడడం మొదలు పెట్టలేదు. ప్రతిదీ ఎవరో ఒకరు పట్టుపట్టి, చెవిమెలిపెట్టి నేర్పితేనే మనకిది వొంటపట్టలేదు. అన్నిటికంటే మించి ఒక పద్ధతి, ఒక క్రమం ఎవరో నిర్దేశిస్తే దాని ప్రకారం మనం నేర్చుకోలేదు.

మరి చదవడం, రాయడం దగ్గరికొచ్చేటప్పటికి ఇలా జరగడం లేదు. ఎక్కువ మంది ఇందులో వెనకబడిపోతున్నారు. కొందరు సాధ్యంగాదని పారిపోతున్నారు. చాలా మంది పెద్ద భారంగా ఈదలేక సతమతమవుతున్నారు. దీనిక్కారణాలేమిటి? ఈ నైపుణ్యాలు (చదవడం, రాయడం) వినడం, మాట్లాడడం కంటే చాలా సంక్లిష్టమైనవా? మనిషి మెదడు ఈ నైపుణ్యాల్ని సంతరించుకోవడానికి వెనకబడేంత బలహీనమైందా? ఒకేసారి రెండు మూడు భాషలు కూడా మాట్లాడగల్గుతున్న పిల్లలు మాతృభాషను కూడా ఎందుకు చదవలేకపోతున్నారు? సంవత్సరాల తరబడి శ్రమించినా ఎందుకు అనుకొన్న ఫలితాలు సాధించలేకపోతున్నారు?

పిల్లలు సహజమైన సందర్భాల్లో స్వేచ్ఛగా పాల్గొనడం వల్ల మాట్లాడడం అంత సులభంగా నేర్చుకోగల్గుతున్నారని ఇప్పుడందరం అంగీకరిస్తున్నాం. భయం, ఒత్తిడీ లేని వాతావరణంలో తప్పుల్ని లెక్కించి ప్రతిదీ సరిచేసే పరిస్థితి లేనిచోట, ఎంత నేర్చుకొన్నారని అడుగడుగునా మూల్యాంకనం చేయని పద్ధతిలో వారు నేర్చుకొంటున్నారు.

అంతేకాదు. పిల్లలు భాషను అవసరాల ప్రాతిపదికన నేర్చుకొంటున్నారు. విస్తృత సమాచారం అందుబాటులో ఉండటంతోపాటు అందులోంచి తమ ఇష్టం వచ్చింది, తమక్కావల్సింది ఉపయోగించుకొనే, సంగ్రహించుకొనే స్వేచ్ఛ కూడా వారికి ఉంది. తమ అవసరాల్ని ఏది తీరుస్తుందో దాన్ని మాత్రమే పిల్లలు అభివృద్ధి చేసుకొంటారు. ఈ క్రమం నుంచే పిల్లలు నేర్చుకొంటున్నారు.

భాషా తత్త్వవేత్తలు దీనిమీద ఇప్పటికే కావల్సినన్ని తర్జనభర్జనలు చేశారు. మళ్ళీ దీని జోలికి మనమిక్కడ వెళ్ళనక్కరలేదు. కానీ ఈ నేపథ్యంలో మనం భాషను తరగతి గదిలో నేర్పుతున్న పద్ధతిని మాత్రం సమీక్షించుకోవలసి ఉంది.

సాధారణంగా మనమందరం నేర్చుకొన్నదీ, నేర్పుతున్నదీ అక్షరాల్ని ఒక వరుస క్రమంలో రాయించే (దిద్దించే) పద్ధతి. దీన్ని అక్షరపద్ధతి అంటున్నాం. ప్రతి భాషకూ ఒక అక్షరమాల ఉంటుంది. అందులోని అక్షరాలకు ఒక వరస ఉంటుంది. ఈ వరస ప్రకారం పలికించడం (గుర్తించడం), రాయించడం నేర్పడంతో మనం భాషాబోధనను ప్రారంభిస్తున్నాం. ఆంగ్లంలాంటి భాషకున్న అక్షరమాల చిన్నది. తమిళం లాంటి భాషకు గల అక్షరమాల చాలా సరళమైంది. ప్రతిధ్వనికీ ఒకే అక్షరాన్ని పలుధ్వనులతో పలకడం వారి సంప్రదాయం. సంస్కృతంలో, తెలుగులో అలా కాదు. అక్షరమాల చాలా పెద్దది. వీటికితోడు గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు, సంశ్లిష్టాలు కూడా కలిపితే ఇది చాలా పెద్దదవుతుంది. ఇవన్నీ నేర్చుకోవడమే, గుర్తించి రాయగల్గడమే భాష నేర్చుకోవడంగా మనం పరిగణిస్తున్నాం.

ఒక్క మన భాషకే గాదు, మనదేశంలోనే కాదు ప్రపంచమంతా ఈ పద్ధతి చాలా కాలం నుంచి, బహుశా లిపి ఏర్పడినప్పటి నుంచీ కొంచెం తరతమ తేడాలతో కొనసాగుతోంది. దీనికి అనుకూలంగా వ్యతిరేకంగా చాలా వాదనలున్నాయి. వినడం, మాట్లాడడం చేసినట్లే చదవడం, రాయడం నేర్చుకోలేమేమో అన్నదానిపై తర్జనభర్జలున్నాయి.

అనుకూలంగా మాట్లాడేవారు - ''అసలు అక్షరాలు రాకుండా చదవడం ఎవరైనా ఎలా నేర్చుకొంటారు?'' అని ప్రశ్నిస్తారు. ఒక ఇల్లు కట్టడానికి వరసగా ఇటుకలు పేర్చినట్టే ముందు అక్షరాలు నేర్చుకొన్నాకే రాయడం వస్తుంది. అప్పుడీ అక్షరాల్ని కలుపుకొంటే సరిపోతుందనేది సాధారణమైన సమాధానం. ప్రతి భాషకూ ఒక లిపి ఉంటుంది. ఆ లిపి ఆ భాషకు స్వంతం. భాషా హృదయం లేదా సౌందర్యం (లయ) లిపిలో దాగి ఉంటుంది. అందువల్ల భాష నుంచి లిపిని విడదీయలేం. ఉదాహరణకు తెలుగులోని అచ్చులు వాటిలోని హ్రస్వదీర్ఘాలు ఒకానొక పద్ధతిలో (లయాత్మకంగా) ఉన్నాయి. వాటిని అదే వరసలో నేర్చుకోవడం తప్పనిసరి. అలా నేర్చుకోడం వల్ల ధ్వనుల్ని గుర్తించడం తేలిక, వాటిలోని భేదాల్ని లేదా సామ్యాల్ని గుర్తించడం తేలిక అనేది మరో వివరణ. శ, ష, స అనేవి మూడు ఒక వరుసలో ఉండటంవల్లే వాటిలోని సున్నితమైన తేడాని గుర్తించగల్గుతున్నాం. 'అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ' లలో ఒక క్రమం ఉంది. ఒక లయ ఉంది. అవి (అచ్చులు) నేర్పాక హల్లులు నేర్పితే గుణింతాలు నేర్పడం తేలిక, శాస్త్రీయం కూడా. చాలా మంది అభిప్రాయమిది.

వినడం, మాట్లాడడం నేర్చుకొన్నట్టుగా, అంత సహజంగా మనం చదవడం రాయడం నేర్చుకోలేం. భాష మౌఖికంగా అందుబాటులో ఉన్నంతగా రాతలో అందుబాటులో ఉండదు. అంటే వాతావరణం, సందర్భం కల్పించడంలో శ్రవణ, భాషణ నైపుణ్యాలకున్న అవకాశం పఠన, లేఖన నైపుణ్యాలకు లేదు. ఆవశ్యకత ప్రాతిపదికన చూసినా మొదటి రెండింటికి గల ప్రాధాన్యత రెండోవాటికి లేదు. అందువల్ల కూడా రెండూ ఒకే రకంగా నేర్చుకోగల్గడం అసాధ్యం. మరో అంశం ఏమంటే మానవ శరీరాంతర్గతంగానే స్వర యంత్రం ఉంది. అత్యంత సహజంగా ఇతరావయవాలు స్పందించినట్లే ఇదీ స్పందించి ధ్వనుల్ని ఉత్పత్తి చేయగలదు. వినడం, మాట్లాడడం అనేవి ఒక రకమైన స్పందనలు, కానీ చదవడం, రాయడం అలా కాదు. వీటికోసం బయటి పరిసరాల మీద ఆధారపడాల్సిన ఉంది. ఇదొక అదనపు నైపుణ్యమే తప్ప అత్యవసర సహజావసరం కాదు, స్పందనా కాదు. అందువల్ల ఒకేలా నేర్చుకోవడం మొదటి రెండు నైపుణ్యాలకూ, తర్వాతి రెండు నైపుణ్యాలకూ కుదరదనేది మరో సమాధానం.

ఇక రెండో వాదన ఇటీవలది. ఇది ఎక్కువగా భాషాశాస్త్రం మీద, మానవ అభ్యసన పరిశోధనల మీద, మానసిక తత్వశాస్త్రం మీద ఆధారపడి ఉంది. సాపేక్షంగా ఇది ఆధునిక వాదం.

భాషకు లిపి మనం కల్పించుకొన్నదే. అక్షరమాల, అందులోని క్రమం మనకు మనం పెట్టుకొన్నదే. అందువల్ల ఒక్కో భాష ఒక్కో క్రమం ఉంటుంది. ఒకవేళ ఒకే క్రమం ఉన్నట్లు కన్పించినా (ఉదా : ద్రావిడ, ఆర్య భాషలు వేరైనా అక్షర మాలాక్రమం ఒకటిగానే ఉంది) అది ముందుగా ఒక భాష ఏర్పరుచుకొన్న క్రమాన్ని అనుసరించి మరొక భాషవారు పెట్టుకొన్నదే తప్ప మరొకటి కాదు. చాలాకాలం ఒకే వరసలో చదివీ చదివీ అలవాటుపడి దాన్ని సహజ క్రమంగా, ఆ భాషకు మాత్రమే సరిపోయే స్వంత క్రమంగా మనం భ్రమపడుతున్నాం. లయ అనబడేది కూడా చాలావరకు అంతే. సంస్కృతం లాంటి భాషలు వర్ణమాలలోని అక్షరాల్ని వాటి ఉత్పత్తి స్థానాల ఆధారంగా నిర్ణయించాయి. (ఆ-కంఠ్యం, ఆ-తాలవ్యం). కొన్ని సుదూర భాషల వర్ణమాలల మొదటి అక్షరాలు ఒకటి రెండు ఒకే ధ్వని గలవి ఉండొచ్చు. అది కొంత యాదృచ్ఛికం, కొంత ధ్వనికి గల ప్రాధాన్యత ప్రాచుర్యం, సౌలభ్యం మీద (ఉదా: ఆంగ్లంలో 'ఎ' తెలుగులో 'అ' రెండూ మొదట ఉన్నాయి) ఆధారపడిన విషయం. అంతకు మించి శాస్త్రీయత అక్కడేమీ లేదు. కాబట్టి ఇదే క్రమంలో నేర్చుకోవడం వల్ల భాష నేర్చుకోవడంలో వొరిగేదేమీ ఉండదని వీరి అభిప్రాయం. అంతేగాదు ఈ రోజు కాకుంటే రేపైనా అన్ని భాషలకూ ఓ లిపి (అంతర్జాతీయ లిపి) వీలున్నన్ని తక్కువ అక్షరాలతో వస్తుందని ఇది లిపి పరిణామక్రమమని వీరు నమ్ముతున్నారు. మనం ఎంత కావాలనుకొన్నా కొన్ని అక్షరాలు అదృశ్యమవుతున్నాయి. కొన్ని కొత్తవీ వచ్చి చేరుతున్నాయి. బాగా అభివృద్ధి చెందిన భాషలు అక్షరాల్ని మరీ తగ్గించుకొంటున్నాయి. ఇవన్నీ కూడా లిపి-భాషల మధ్య విడదీయరాని సంబంధం ఉందనడాన్ని వ్యతిరేకిస్తున్న అంశాలుగా వీరు పేర్కొంటున్నారు.

అన్నిటికంటే ముఖ్యమైంది మరొకటి ఉంది. అదేమంటే మనం భాషను ముక్కలు ముక్కలుగా నేర్చుకోవడం లేదు. మొత్తంగానే నేర్చుకొంటున్నాం. పిల్లలు చేసే చిన్న చిన్న ధ్వనులు కూడా సారాంశంలో వాక్యాలే. అలాగే వాళ్ళు వచ్చీ రాక పలికే చిన్న చిన్న పదాలు కూడా వాక్యలే. 'అమ్మ' అంటే అమ్మ వచ్చిందనో, కొట్టిందనో, కావాలనో అర్థం మనం మొదట చిన్న చిన్న ధ్వనులు, తర్వాత పదాలు, వాక్యాలు భాషా నిబంధనలు నేర్చుకోవడం లేదు. ఒకే రకమైన ధ్వనుల్ని ముందుగానూ, మరొక రకమైనవి తర్వాత నేర్చుకోవడమూ లేదు.

కేవలం గుర్తు పెట్టుకోవడం ద్వారా, అంటే జ్ఞాపకశక్తి మీద ఆధారపడి కూడా మనం భాషను నేర్చుకోవడంలేదు. అనేక సందర్భాల్లో పాల్గొంటూ మన అవసరాల్ని మాటిమాటికీ ఉపయోగించుకొంటున్నందువల్లనే ఏమాటలైనా మనం నేర్చుకోగల్గుతున్నాం. వినియోగం లేనివి మనం వదిలేస్తాం లేదా మరిచిపోతాం. అలాగాక అక్షరాలు నేర్పే పద్ధతిలో కేవలం అక్షరాల్ని వేరుగా నేర్పుతున్నాం. అంటే భాషను ముక్కలు ముక్కలుగా చేసి ఒక క్రమం పెట్టి నేర్పుతున్నామన్నమాట. అంతేగాక అక్షరాలకు అర్థం లేదు. స్వంతంగా వినియోగంలేదు. ఒక రకంగా మొండిగా గుర్తుంచుకొనే సర్కసు తప్ప మరొకటి లేదు. ఇది కృత్రిమమైన క్లిష్టమైన పద్ధతి. ఎన్ని అక్షరాలు నేర్పినా పదాలు రావు. అప్పటి దాకా నేర్చుకొన్న అక్షరాలు ఏమాత్రం వినియోగంలోకి రావు. అలాంటివి ఎలా గుర్తుంటాయి? ఎందుకు గుర్తుండాలి? మానవ అభ్యసన విధానానికే ఇది విరుద్ధం. ఇలా ఈ పద్ధతిని నేడు చాలామంది వ్యతిరేకించి సమగ్ర దృక్పథాన్ని భాషాభ్యసనంలో శాస్త్రీయమైనదిగా ముందుకు తెస్తున్నారు.

పూర్వం మనం ముందు అక్షరాలన్నీ ఒక్కటి కూడా పొల్లు పోకుండా నేర్చుకొని, తర్వాత వాటి గుణింతాలు, ఆ తర్వాత వాటి వొత్తులు నేర్చుకొని అప్పుడు మాత్రమే పదాలు రాసేవాళ్ళం. నిజానికి 'అ' నుంచి 'క' వరకు నేర్చుకోగానే ఎవరైనా 'ఈక', 'ఒక' లాంటి పదాలు నేర్చుకోవచ్చు. ఇది కూడా మనం చేసేవాళ్ళం గాదు.

క్రమక్రమంగా సాంప్రదాయిక అక్షర పద్ధతిలో కూడా మార్పులు వస్తున్నాయి. అవసరం లేని 'ఋ, ౠ' లాంటివి కనుమరుగైనాయి. అంతగా ప్రాచుర్యం లేని మహా ప్రాణాలను (ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ) వరుస నుంచి తప్పించి చివర నేర్పుతున్నారు. కొన్ని అక్షరాలు నేర్పగానే వాటితో వచ్చే పదాలు నేర్పి, ఆ అక్షరాల్ని కల్పిస్తున్నాం. (కొందరైతే మరో ముందడుగు వేసి పదాలతోనే భాష నేర్పడం కూడా చేస్తున్నారు. అర్థంలేని, స్వంతంగా వినియోగంలో లేని అక్షరాల్ని నేర్పడం వల్ల వాటిని గుర్తుంచుకోవడం అసాధ్యమన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారు.)

ఈ పద్ధతిలో అక్షరాల్ని వరస క్రమంలో నేర్పడం ఉండదు. బాగా ప్రాచుర్యంగల, వాడుకలోని పదాల్ని నేర్పి వాటిలోని అక్షరాల్ని కూడా పరిచయం చేస్తారు. దీనివల్ల పదజాలం పిల్లలకు మొదటి నుంచే అందుబాటులో ఉంటుంది. నేర్చుకొన్న ప్రతిదీ వినియోగంలోకి వస్తుంది. గుడ్డిగా గుర్తుంచుకోనక్కరలేదు.

కొన్ని పదాలు నేర్పగానే చిన్న చిన్న వాక్యాలు కూడా నేర్పవచ్చు. అప్పుడు నేర్చుకొన్నది మరింత వినియోగంలోకి వస్తుంది. ప్రతిదీ అర్థవంతంగా కన్పిస్తుంది.

అక్షర పద్ధతి మీద మరొక సవాలు కూడా చాలా విలువైంది ఉంది. ఈ పద్ధతిలో మొదట రాయడం తర్వాత చదవడం నేర్పుతున్నాం. భాషాభ్యసన క్రమానికిది విరుద్ధం. ముందు చదవడం తర్వాత మాత్రమే రాయడమనేది శాస్త్రీయం. ముందు చదవాలంటే అవి గుర్తుంచుకోవాలి. గుర్తుంచుకోవడం వినియోగించుకొనే క్రమంలో మాత్రమే సాధ్యమవుతుంది. అంతేకాదు చదవగలవారు మాత్రమే రాయగల్గుతారు. మనం ఎంత దిద్దినా హిందీ అక్షరాల్ని ఇప్పుడెంతమంది గుర్తుంచుకోగల్గుతున్నాం? దీనిక్కారణం వీటిని వినియోగించకపోవడమే. మన మెదడుకు అవసరం ప్రాతిపదికన ఎన్నిటికైనా గుర్తుంచుకొనే సామర్థ్యం అద్భుతంగా ఉంది.

దీనికి మరో ముక్తాయింపు కూడా లేకపోలేదు. అసలు ఏ విద్యావంతుడైనా చదవడానికి వినియోగించుకోవడంలో 10వ వంతు కూడా రాయడానికి భాషను వినియోగించుకోడు. మహా కవులకు కూడా ఇది వర్తిస్తుంది. గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు వయోజన విద్య నేర్పించేటప్పుడు పలకా బలపాలుండేవి కాదు. వారి విద్యలో రాయడానికి స్థానమే లేదు. కేవలం చదవడం మాత్రమే నేర్పేవారు. దీనర్థం మనం రాయడం నేర్పనక్కర లేదని కాదు చదవడానికి రాయడం నేర్చుకోవడం తప్పనిసరి అవసరం కాదని చెప్పడానికి మాత్రమే.

మరి ఈ పద పద్ధతిలో కూడా ఉన్నదేమిటి? ప్రాచుర్యం గలవి, సులభమైనవి అనే పేర కొన్ని పదాల్ని వాటి అక్షరాల్ని ఎంపిక చేసి మళ్ళీ ఒక క్రమాన్ని నిర్దేశించుకొని భాష నేర్పడమే గదా! నేర్పినవి వినియోగంలోకి రావడం తప్ప, అర్థవంతంగా నేర్చుకోవడం తప్ప వినడంలా, మాట్లాడడంలా ఇది భాషను మొత్తంగా నేర్పడం కాదుగదా. ఇది సహజమైన ప్రక్రియ కాదుగదా! ఇంకా చెప్పాలంటే ఒక రకంగా అక్షరాలు ముందు నేర్పే పద్ధతికి అంతో ఇంతో దగ్గరిదే గదా! ఈ చర్చా లేకపోలేదు.

భాషా ప్రపంచాన్ని (అక్షరాలు, పదాలు, సంభాషణలు, పాటలు, కథలు) విద్యార్థికి వీలున్నంత అందుబాటులో ఉంచి పలు సందర్భాల్లో వాటిని విరివిగా వినియోగించుకొనేట్టు చేయడం ద్వారా భాషను మొత్తంగానే నేర్పవచ్చు అనే వాదమొకటి బలంగా ఉంది.

ఇందులో ఏ క్రమమూ ఉండదు. ఏ నిర్దేశమూ ఉండదు. మాట్లాడడం నేర్చుకొన్నట్టే పిల్లలు మొత్తంగా భాషను నేర్చుకొంటారు. ఇది కూడా సాధ్యమే అనడం కన్నా ఇదే శాస్త్రీయం అనేవాళ్ళూ నేడు తక్కువగా లేరు.

లిపి మానవుడికి తెలిసి కొన్ని వేల సంవత్సరాలు గడిచినా దీన్ని నేర్పడం పట్ల ఇంత తర్జనభర్జనలు ఇప్పటికీ జరగడం విచిత్రంగా మనకు కన్పించవచ్చు. కానీ శాస్త్రం పెరుగుతున్న కొద్దీ, పరిశోధనలు నూతనాంశాల్ని ఆవిష్కరిస్తున్న కొద్దీ ఇలాంటి తర్కాలు ముందుకు వస్తూనే ఉంటాయి. ఆచరణలో ఏవి సాధ్యమైతే అవి నిలుస్తాయి. మిగిలినవి అవి ఎంత ఆధునికమైనవైనా, ఎంత ప్రాచీనమైనవైనా గతిస్తాయి.

ఎటొచ్చీ పిల్లల్ని హింసించకుండా, వారి సహజ స్వభావానికి, అభ్యసన క్రమానికి సంబంధం లేకుండా గుడ్డిగా యాంత్రికంగా నేర్పడం ఒక్క భాషకే కాదు దేనికైనా న్యాయం చేకూర్చదు. ఇది అన్నిటికీ వర్తించే సాధారణ సూత్రం. దీన్ని మనసులో ఉంచుకొన్నప్పుడు మనం పాటించే పద్ధతుల్లో ఏ లోపాలున్నాయో మనకే సులభంగా అర్థమవుతుంది.

## ఈ) పిల్లలు చదివే పుస్తకాలేవీ? కథలేవీ?

*- కొడవగంటి కుటుంబరావు, సంవేదన, అక్టోబర్ 1968*

మన దేశంలో బాలసాహిత్యమంటూ ఇప్పుడిప్పుడే వస్తున్నది. బెంగాలీ, హిందీ మొదలైన భాషలలో రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం కూడా బాలపత్రికలుండినట్టు తెలుస్తోంది. తెలుగులో మాత్రం బాల పత్రికలు స్వాతంత్ర్యం వచ్చే రోజుల్లోనే బయలుదేరాయి.

నా చిన్నతనంలో బాలసాహిత్యమంటూ వేరే లేదు. నాకు చదవటమూ, రాయటమూ రాగానే సుమతీ శతకం కంఠస్థం చెయ్యమన్నారు. వావిలకొలను వారు రచించిన పాకెట్ సైజ్ కథల పుస్తకాలేవో ఉండేవి. భాగవతం నుంచి కుచేలోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం లాంటి కథలు చదివాను. వాటిలోని కొన్ని పద్యాలు నాకిప్పటికింకా జ్ఞాపకం ఉన్నాయి.

అర్థ శతాబ్దం క్రితం ఇదే బాలసాహిత్యం, నిజానికిది పిల్లల కోసం ప్రత్యేకించి రాసిన సాహిత్యం కాదు. పెద్దల సాహిత్యమే. పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికి వచ్చేదంతా పిల్లల సాహిత్యంగా చలామణీ కావటం మన సంప్రదాయం. మనం ఈ రోజు బాల సాహిత్యం గురించి పాశ్చాత్యుల అభిప్రాయాలు అరువు తెచ్చుకొని లాభం లేదు.

ఇంచుమించు ఇరవై ఏళ్లుగా బాలసాహిత్యంతో నాకు గల సంబంధాన్ని బట్టి బాల సాహిత్యం ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అన్న అభిప్రాయాలు కొన్ని ఏర్పరుచుకొన్నాను. కొంత కాలమయ్యాక వాటికి కాలదోషం పట్టవచ్చు. ప్రస్తుతానికి ఈ నా అభిప్రాయాలు సముచితమైనవని భావించి వాటిని ఇక్కడ చెబుతున్నాను.

పశుపక్ష్యాదులు పాత్రగా గల నీతి కథలూ, దేవతలూ, రాక్షసులూ, మాంత్రికులూ, అతీత శక్తులూ మొదలైన వాటితో కూడిన దేవతా కథలూ గడిచిపోయిన యుగాలకూ, సమాజానికీ సంబంధించిన జానపద కథలూ బాల సాహిత్యంలో ప్రముఖ స్థానం కలిగి ఉంటాయి.

**వాస్తవికత :**

పైన చెప్పిన కథలలో వాస్తవికతకు చోటు లేదు. “బుల్లి చేపల చేత మాట్లాడించటంలోనే ఉన్నది చిక్కంతా!” అన్నాడట ఆలివర్ గోల్డ్‌స్మిత్ చేపలూ, కాకులూ, ఎలుకలూ మాట్లాడటం వల్ల వాస్తవికత పోతుందని అతడు భయపడి ఉంటాడు. కాని బాల సాహిత్యంలో అలాంటి వాస్తవికత అవసరం. పిల్లలు తాము వినే (చదివే) కథలలోని సన్నివేశాలనూ, సంఘటనలనూ తమ పరంగా అన్వయించుకోనవసరం లేదు. వాళ్ళు వాటికి ఎడంగా ఉండే ఆనందం పొందాలి. “అనగనగా ఒక రాజు, ఆరాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చి ఎండవేశారు... ఏ రాజు? ఏడుగురు వేటకు పోయి ఏడు చేపలేనా తెచ్చారు? ఏడు చేపలు ఎండేస్తే ఎవరి ముక్కులోకి?” ఇలాంటి సందేహాలు వేటికీ కథలో తావులేదు.

కొన్ని నీతి కథలను కొందరు ఆధునికం చెయ్యాలని ప్రయత్నిస్తారు. ఇది పొరపాటు. మాంసం ముక్క నోట కరుచుకొన్న కాకిని నక్క, “కాకిబావా, కాకిబావా! ఒక్క పాటపాడు!” అనగానే ఈ ఆధునిక కాకి మాంసం ముక్కను కాలి కింద పెట్టుకొని, పాటపాడి నక్కను ‘ఫూల్’ చేస్తుంది. ఇది నీతికథ కాదు, జర్నలిజం.

పిల్లల కథలు వర్తమాన జీవితానికి సంబంధించి ఉండాలనీ, అందులో వాస్తవికతకు చోటు కలిగించాలనీ కొందరు కొన్ని రకాల రచనలు చేస్తారు. మాటవరుసకు సీత పుట్టిన రోజు పండుగ అనుకోండి. సీతకు పుట్టిన రోజు పండుగ చేస్తారు. బామ్మ తలంటి పోస్తుంది. నాన్నారు తెచ్చిన కొత్తపూల పరికిణి కట్టుకొంటుంది. మామయ్య తెచ్చిన పూల జాకెట్టు వేసుకొంటుంది. అన్న తెచ్చిన కొత్త రిబ్బను ఎంచక్కా పెట్టుకొంటుంది. అమ్మ పూరీలు, జిలేబీలు, మైసూర్‌పాకూ, బాదం హల్వా చేసి పెడుతుంది.

ఇదే విధంగా తంతు జరిగిపోతుంది. ఇది పిల్లల కథ కాదు. పెద్దవాళ్ళు నెలల పిల్లలతో (వాళ్ళకర్థమవుతుందనుకొనీ, వాళ్ళ భాషే మాట్లాడుతున్నామనుకొనీ) 'ఓంతిలా? అయి కావాలా?' అన్నట్టుగానే ఉంటుంది ఇలాంటి కథ కూడానూ. ఇటువంటి కథలు మరీ జాస్తిగా చదివితే పిల్లలకు తమ పరిసరాల మీద చాలా రోత పుడుతుంది. సినిమాలలో చూపే ప్రేమ నిజమనుకొన్నవాడు వాస్తవ జీవితంలోని ప్రేమ చూసి అనుకొన్నట్లుగా పిల్లలు పెద్దలయ్యాక, వంచింపబడ్డామనుకోగలరు. ఎందుకంటే ఈ కథల్లో ఉండేది 'స్టెరిలైజ్' చేసిన జీవితం వాస్తవంగా ఉన్నట్లు భ్రమగొల్పే అవాస్తవం. చేపలూ, కొంగలూ మాట్లాడే కథలు ఇలా మోసం చెయ్యవు.

**మౌలిక భావాలు :**

బాల సాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగానాటాలి. ధైర్యసాహసాలు, నిజాయితీ, స్నేహపాత్రత, త్యాగబుద్ధీ, కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి. అన్యాయాన్ని జయించటం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా ఉన్నా, పిల్లల మనస్సులకు చాలా మేలు చేస్తాయి. దురాశా, ఓర్వలేని తనమూ, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ మొదలైనవి శిక్షించబడటం కూడా పిల్లలకు తృప్తినివ్వాలి.

కొన్ని కొన్ని సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించటమూ, ప్రమాదం తెచ్చిపెట్టటమూ జరుగుతుంది. భూతదయ చాలా మంచిది. నిస్సహాయులపట్ల దయ చూపటం వరకూ ఇబ్బందిలేదు. కాని దుర్మార్గుల పట్ల చూపే దయ ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుచేతనే బోను నుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలికాదు. అది తెచ్చి పెట్టిన ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్కయుక్తిగా తప్పిస్తుంది. యుక్తి కథలకు బాల సాహిత్యంలో చాలా స్థానం ఉంది.

స్థూలంగా చెప్పాలంటే పిల్లల్లో దౌర్బల్యాన్ని పెంపొందించేది మంచి బాల సాహిత్యం కాదు. మహాసత్త్వుల కథలు ఉత్తమ బాల సాహిత్యం. ఒక లక్ష్యం పెట్టుకొన్నాక మహాసత్త్వుడైన వాడు ఎన్ని ప్రమాదాలనూ లక్ష్యపెట్టడు. అటువంటి పాత్రలు గల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు కారెక్టర్ అంత బాగా ఏర్పడుతుంది. మన దేశాలవంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బు మీద దృష్టి ఏర్పడటం కన్నా 'కారెక్టర్' ఏర్పడటం చాలా అవసరం.

రాక్షసులను మనుషులు జయించటమూ, ధనికులను వాళ్ళ సేవకులు భంగపరచటమూ, అతి సామాన్యమైన వ్యక్తులలో అసాధారణ శక్తులుండటమూ లేదా వారికవి లభ్యం కావటమూ - ఇలాంటి ఇతివృత్తాలు గల జానపద కథలు ప్రపంచ మంతటా ఉన్నాయి. వాస్తవ సంప్రదాయాలకు ఎదురు వెళ్ళే ఈ కథలు చదవటంవల్ల కూడా పిల్లలకు కొంత లాభం ఉన్నది. ముఖ్యంగా చిన్న పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూ లాంటివి అతి తేలికగా అబ్బుతాయి. ఆ భయాలను తగ్గించే దొంగల కథలూ, దయ్యాల కథలూ పిల్లలు చదివి ఉండటం మంచిది.

దేవుడి మీద భక్తినీ, మత విశ్వాసాలనూ ప్రచారం చెయ్యటానికే రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిది కాదు. కథల్లో దేవతలూ, భక్తులూ ఉండరాదని కాదు. దేవుణ్ణి నమ్ముకొంటే అన్ని సుఖాలూ ఒనగూడతాయన్న అభిప్రాయాన్ని పెద్దలు కలిగి ఉండటం ఎంత తప్పో, పిల్లలకు ఇవ్వటం అంతకు పదింతలు తప్పు, కథలో నెగ్గవలసినది మనుష్యయత్నమూ, మనిషి సద్బుద్ధీనూ, ఇది చాలా ముఖ్యం.

**రచనా విధానం :**

బాల సాహిత్యం రాసేటప్పుడు కథనం పెద్దవాళ్ళు పిల్లలతో మాట్లాడుతున్నట్టుండాలనుకోవటం నా బుద్ధికి చాదస్తంగా కనిపిస్తుంది. "అప్పుడేమయిందనుకొన్నారూ" "రాజుకో కూతురుందనుకొన్నాం కాదూ?.. చూశారా, వాడి దుర్మార్గం వాణ్ణి ఏ స్థితిలోకి తెచ్చిందో?" ఇలా అడుగడుగునా బాల పాఠకులను తట్టుతూ ఉండటం అనవసరం అనుకొంటాను.

రచనలో వ్యర్థపదాలూ, ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ పిల్లలను అంతగా ఆకట్టవు. 'కీకారణ్యం', 'కటికచీకటి', 'పండువెన్నెల', 'పెద్ద కెరటాలతో ఉప్పెన' ఇలాంటి మాటలతో వాళ్ళు ఎంతైనా ఊహించుకోగలరు.

పాత్రలు చాలా మంచివాళ్ళయినా కావాలి, చాలా చెడ్డవాళ్ళయినా కావాలి. చాలా తెలివిగల వాళ్ళయినా కావాలి. వట్టి మూర్ఖులైనా కావాలి. చాలా అందంగానైనా ఉండాలి. వికారంగానైనా ఉండాలి. ఓ మాదిరి మంచీ, సుమారైన తెలివీ, ఎటూగాని అందమూ బాల సాహిత్యానికి అవసరం. పాత్రల అంతస్సంఘర్షణలు కూడా అంతే.

పిల్లల కోసం రాయటం ఒక గొప్ప కళ. తెలుగులో ఆ కళను చెప్పుకోదగినంతగా వృద్ధి చేసినవారెవరూ ఉన్నట్టు కనబడదు. కొందరు పాత్రోచిత భాష ప్రవేశపెట్టాలని హీన పాత్రల చేత యాసగా మాట్లాడించటం లాంటి ప్రయోగాలు చేస్తారు. నా దృష్టిలో ఇది గూడా ఈనాటికీ పొరపాటే. కథల్లో సంభాషణలు ఉండక తప్పదు. కాని వాటిలో అంత వాస్తవికత నిరుపయోగం.

**బాలగేయాలు, ఇతర రచనలు :**

అదృష్టవశాత్తూ ఈనాడు మనలో చక్కని బాలగేయాలు రాసేవారున్నారు. నిజానికి పెద్ద వాళ్ళకన్నా పిల్లలు గేయాలను ఎక్కువగా ఆనందించగలరు. బాలగేయ రచనలు పిల్లలకు ఎంతగా అందుతున్నాయో నాకు తెలీదు. కొన్నిటికి బహుమతులు కూడా లభించాయనుకొంటాను.

పిల్లలకు విజ్ఞానం కూడా కొంతవరకూ అవసరమే. ఈ స్పుత్నిక్ - హైడ్రోజన్ బాంబు యుగంలో వాళ్ళు తెలుసుకోదగిన వైజ్ఞానిక విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆకాశానా, భూమిమీదా, సముద్రం అడుగునా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఆరోగ్య సంబంధమైన అంశాలు చిన్నతనం నుంచీ తెలుసుకోదగినవి ఎన్నయినా ఉన్నాయి. అడవిలో చెట్లలాగా ఈనాటి పిల్లలు వీటిని గురించి ఏమీ తెలుసుకోకుండా పెరగటం చాలా తప్పు.

**బాల గ్రంథాలు :**

బాల గ్రంథాలు చూడటానికి అందంగా ఉండాలి. అచ్చు చక్కగా ఉండాలి. బొమ్మలు ఊహలను కదిలించేవిగా ఉండాలి. వాటిలో ఎలాంటి అచ్చుతప్పులు ఉండరాదు. అవి చవగ్గా కూడా ఉండాలి.

వ్యాపార యుగంలో ఈ రెండూ కుదరవు. అందుకని సోషలిజం వచ్చేదాకా ఈ సమస్యను తడిపి ఉంచడానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుతం ఉన్న మార్గాలు ఏవంటే.

1) పిల్లల కోసం వేసే పుస్తకాలకు ప్రభుత్వం, లేక ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వటం,

2) ప్రచురణ కర్తలు ఈ పుస్తకాలను అనేక వేల సంఖ్యలో ముద్రించటం (లక్షల సంఖ్యలో కాకపోతే).

పుట్టిన రోజు పండుగలకూ, ఇతర పండుగలకూ పెద్ద వాళ్ళు పిల్లలకు మిఠాయి వగైరాలతో బాటు చక్కని పుస్తకాలు కూడా బహూకరించడం. ఇతర దేశాలలో ఇరవై అయిదు రూపాయలు ఖరీదు చేసే పిల్లల పుస్తకాలు సైతం అచ్చు అవుతున్నాయి. పెద్ద వాళ్ళు బహూకరించకపోతే నిత్య ఖర్చులో నుంచి పిల్లలు అలాంటి పుస్తకాలు కొనటం సాధ్యమా?

పిల్లల పుస్తకాల ప్రచురణ ఆంధ్రలోనే చాలా వెనుకబడి ఉన్నట్టు కనబడుతుంది. మంచి ముద్రణాలయాలు లేకపోవటమూ, బాల పుస్తకాల ప్రచురణ పెట్టుబడిదార్లను ఆకర్షించలేకపోవటమూ, అందుకు కారణాలు కావచ్చు. పిల్లలకు తగినట్టుగా బొమ్మలు వేసే చిత్రకారులు కూడా చాలా తక్కువగానే ఉన్నట్టు కనిపిస్తారు.

పిల్లలు పుస్తకాలకు గిరాకీ రాగానే అందరూ బొమ్మల రామాయణాలు, భారతాలూ ప్రచురించారు. రామాయణ, భారతాలు పిల్లలకు అనవసరమననుగానీ, వాటికన్నా చాలా మంచి బాల సాహిత్యం ఉన్నది. రాసేవాళ్ళూ, వేసేవాళ్ళూ ఉంటే.

## ఉ) మన చదువుల్లో కథల స్థానం ఏమిటి?

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మన స్కూళ్ళలో ఒకటీ రెండు తరగతులకైనా రోజూ ఒక పీరియడ్ కథలు చెప్పుకోవడానికుంటే ఎంత బావుంటుంది! ప్చ్! మన పిల్లలు ఆ మాత్రం భాగ్యానికైనా నోచుకోలేకపోతున్నారు. ఈ అవకాశమే ఉంటే బడిలో చేరిన పిల్లలు బడి నుంచి జారిపోకుండా సగం సమస్య పరిష్కారమయ్యేది. 'కథలు చెప్పుకొంటే డ్రాపౌట్ తగ్గుతారా' అని నన్ను చాలా మంది ఎగతాళిగా చూడొచ్చు. ఇంత పెద్ద సమస్యను ఇంత తక్కువగా పరిగణిస్తున్నానని నన్ను ఎద్దేవా చెయ్యొచ్చు. ఇలాంటి సలహా నేనిచ్చినప్పుడు నాపట్ల వెటకారంగా (సానుభూతితోనూ) చూసిన సీనియర్ అధికార్ల నెందరినో నేనెరుగుదును. ఏం చేద్దాం మరి? వారి 'అపార పరిపాలనానుభవం' వాళ్ళనలా తయారు చేసింది! ఒకప్పుడు ఈ అధికార్లూ నాలానే ఎంతో కొంత ఆలోచించి ఉండకపోరు. కానీ పాపం వాళ్ళు సీనియర్లయిపోయాక ఇలా మారిపోయారు!

ఇంతకన్నా ఘోరం ఏమంటే మన ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో కథలకు కాసింత చోటయినా చిక్కడంలేదు. ''కథల ప్రాధాన్యం' మీద మొత్తం శిక్షణా కోర్సుల్లో ఎక్కడయినా ఓ పాఠం ఉంటే ఉండొచ్చు. అంతకంటే కొంచెం లోతుకు పోయిన పాపాన ఈ సంస్థలెప్పుడూ పోవు.

నాకో తీరని కల ఉంది. అదేమంటే మన టీచర్లకు కనీసార్హతగా ముప్ఫై కథలయినా తడుముకోకుండా చెప్పడం ఉండే రోజు ఎప్పుడొస్తుందా అని. మన ప్రాచీన కథల మీద ఈ మాత్రం పట్టు ఉండే టీచర్లుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో గదా అని! 'పట్టు' అంటే గందరగోళపరచకుండా, గజిబిజి చెయ్యకుండా సాఫీగా చెప్పగల్గడం అన్నమాట.

కథలు చెప్పుకోవటం మన సమాజపు సహస్రాబ్దాల సంప్రదాయం, వారసత్వం! ఒకటీ రెండా? వేలాది సాంప్రదాయక కథలు చెవి నుంచి చెవికి, గుండె నుంచి గుండెకు ఎన్ని శతాబ్దాల పాటు ఎక్కిపొయ్యాయో! అంత దూరం నేనాశించడం లేదు గానీ కనీసం ముప్ఫై కథలు చెప్పగల్గితే మన ఒకటి రెండు తరగతుల పిల్లలు ఎన్నో విలువలు నేర్చుకొంటారు. ఇతర సబ్జక్టులతో పాటు కథలకింత చోటివ్వగల్గితే ఎన్నో విషయాలు పిల్లలకు తెలుస్తాయి. మనం చెప్పే ఇతర పాఠ్యాంశాలు కూడా కావల్సినన్ని తెలుస్తాయి.

**కథలెక్కడ దొరుకుతాయి?**

సాంప్రదాయిక కథలంటే ఏమిటి? వీటి ప్రాధాన్యత ఏమిటి? దీన్ని మనం పరిశీలించాలి. ఈ కాలపు కుర్ర టీచర్లను కథలు చెప్పమంటే పిల్లల పత్రికల్ని తిరగేస్తున్నారు. కామిక్స్‌ను, వాస్తవగాథల్ని, చివరికి పెద్ద పెద్ద జోక్స్‌ను సైతం పిల్లలకి కథలుగా చెప్పడానికి పూనుకొంటున్నారు. ఇవన్నీ కథల జాబితాలోనే వస్తాయి? వస్తే రావచ్చు. కానీ మన ఆరేడేళ్ళ పిల్లల్ని ఇవి మన పాత కథలంత ప్రభావితం చేస్తాయా అనేది మాత్రం అనుమానాస్పదం.

మన సాంప్రదాయక కథలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ఆ లక్షణాలు ప్రస్తుత పత్రికల్లో వస్తున్న కథల్లో కన్పించడం లేదు. మంచి కథకుండే లక్షణాలేమిటి? వీటిని తర్వాత పరిశీలిద్దాం. దీనికి ముందు ఇలాంటి మంచి కథలెక్కడ దొరుకుతాయో చూద్దాం.

పంచతంత్రం, జాతక కథలు, మహాభారతం, అరేబియన్ నైట్స్, విక్రమాదిత్య కథలు, వివిధ ప్రాంతాల జానపద కథలు మనకు ఎన్ని మంచి కథల్నయినా అందిస్తాయి. ఇదొక పెద్ద భాండాగారం. గులిస్తాన్, బోస్టన్, బీర్బల్, తెనాలి రామలింగడు, జానపదాలు లాంటివి కావల్సినన్ని దొరుకుతాయి. ఒక్క మన దేశానికే గాదు ప్రపంచమంతా మంచి కథలు కోకొల్లలు. 'ఇంత పరిశోధన మాకెక్కడ సాధ్యం' అని మీరనవచ్చు. కథలు చెప్పాలనే అనుకొంటే మంచి కథల్ని ఎన్నుకోవడం, వెతుక్కోవడం చాలా చిన్నపని అని నా అభిప్రాయం.

**మంచి కథ ఎలా ఉంటుంది? :**

ఏది మంచి కథ అని నన్నెవరైనా ప్రశ్నిస్తే పిల్లలు తరతరాల నుంచి దేన్ని అద్భుతంగా ఆస్వాదిస్తున్నారో అదే మంచి కథ అని నేను జవాబిస్తాను. ఇక్కడ న్యాయ నిర్ణేతలు పిల్లలే తప్ప మనం కాదని నా దృఢ విశ్వాసం. మన పంచతంత్రంలోని 'సింహం-కుందేలు' కథనే తీసుకోండి. దీన్ని మనం చాలా సీదాసాదా కథగా భావిస్తాం. కానీ లోతుల్లోకి వెళ్లితే ఇందులోని మంచి కథ లక్షణాల్ని మనం పసిగట్టవచ్చు. ఈ కథలోని మలుపుల్ని ఇప్పుడు కొంచెం పరిశీలిద్దాం.

మన బుజ్జి కుందేలు సింహానికి కవళంగా వెళ్ళాల్సిన దుర్దినం వచ్చింది. తీరిగ్గా కుందేలు సింహం గుహ దగ్గరకెళ్ళేటప్పటికి ఆకలితో సింహం నకనకలాడిపోతోంది. మిన్నూ మన్నూ తెలిసే స్థితిలో లేదది. ఇప్పుడు మన కుందేలు తన అబద్దాల పురాణాన్ని ప్రారంభించాలి. సింహంతో కనీసం మాట్లాడ్డానికయినా తగిన సందర్భమేనాయిది? ఏ మాత్రం కాదని కథ వినే వాళ్ళందరికీ తెలుసు. అయినా కుందేలు తానెందుకు ఆలస్యంగా రావల్సి వచ్చిందో, దారిలో తనని మరో సింహం ఎలా అడ్డగించిందో ప్రాణాలకు తెగించి చెప్పింది. ఆకలి కంటే కోపం తీవ్రమైందని కుందేలుకు తెలుసు. సరిగ్గా ఆ పాయింటునే అది పట్టుకొంది. పెత్తందార్లకు అహంకారం ఎక్కువ. అది ఏ మాత్రం దెబ్బతిన్నా వాళ్ళు ఓర్చుకోలేరు. అందుకే సింహం ఆకల్ని అవతలబెట్టి శత్రువు సంగతి తేల్చుకోవాలని కుందేలు వెంట నడిచింది. గుడ్డిగా బావి దగ్గరికి చేరింది.

మళ్ళీ ఇది కుందేలుకు కష్టకాలం (కథలో ఇదో మలుపు). ఇక్కడ కూడా కుందేలు తెలివిగా సింహం తెలివితక్కువ ఆవేశం మీదా, అసూయ మీద ఆధారపడింది. సింహం బావిలోకి చూసి తన బింబాన్ని శత్రుసింహం అనుకొని దూకి దిక్కులేని చావు చచ్చింది.

ఇన్నాళ్ళూ ఇంత ప్రచారం పొందిన ఈ కథను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. ఈ కథా వస్తువేమీ సామాన్యమైంది కాదు. దుర్మార్గమైన అధికార పిశాచం ముందు ప్రాణాల్ని ఉంచి బయటపడ్డం దాదాపు అసాధ్యమైన వేళ కుందేలు లాంటి బడుగు ప్రాణి పాపం ఏం చెయ్యాలి? అనేది ఇక్కడున్న సమస్య. నిజానికిది చాలా పెద్ద విషయం. సాధారణంగా ఇంత పెద్ద విషయాల్ని మనం పిల్లలకు దూరంగా ఉంచాలనుకొంటాం. విచిత్రమేమంటే పిల్లలు ఇంత పెద్ద విషయాన్నే ఇష్టపడతారు! ఎందుకిష్టపడతారు? దాన్ని తర్వాత పరిశీలిద్దాం.

ఇక్కడ మరో అంశం కూడా మనం పరిశీలించాలి. ఒక బక్క ప్రాణి మహా బలవంతుడైన ఒక శత్రువు బారిన పడి కష్టాల్లో చిక్కుకొన్న సందర్భమిది. ఇందులోంచి బయటపడ్డానికి ఈ బక్క జీవి ఒక ఎత్తుగడ వేసింది. ఈ ఎత్తుగడలో ఏ మాత్రం 'నీతి' లేదు. మరో సందర్భంలో ఇలాంటి అబద్ధాలు చెపితే మనం కుందేల్ని టక్కరి కుందేలు కింద లెక్కగడతాం. కానీ ఇక్కడ ఈ బడుగు ప్రాణి అసాధారణమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. అమోఘమైన ధైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్ని చూపింది. చిట్టచివరి దాకా ఏ మాత్రం తొణక్కుండా నిలబడికార్యం సాధించింది. ఇందుకోసం ఒక పెత్తందారుతో సాధారణ బడుగు వ్యక్తి మాట్లాడినట్టే భయం భయంగా మాట్లాడింది. అనుకొన్న పని నెరవేర్చుకొంది.

ఈ కథ నడకను కూడా మనం పరిశీలించాలి. కథారంభంలో జంతువులు సింహంతో కుదుర్చుకొన్న ఒప్పందం ఫలితంగా ఒక వింత శాంతి నెలకొంటుంది. పైకి కాలం సజావుగా నడుస్తున్నట్లు కన్పించినా ఇది దినదినగండమే. ఉన్నట్టుండి కుందేలు వంతు రావడంతో అసలు కథ తెరమీదికి వచ్చేస్తుంది.

ఇక మన కథ ఒక్క క్షణం కూడా ఆగకుండా చకచకా సాగిపోతుంది. మన కుందేలు ఈ కష్టం నుంచి బయటపడాలంటే ఒక్క నిమిషం వ్యర్థం చేసినా కొంప మునుగుతుంది. అదొక ఎత్తుగడ వేసింది. ఆ ఎత్తుగడేమీ నల్లేరు మీద నడక కాదు. మహా ప్రమాదకరమైంది. అయినా కుందేలు దానికే పూనుకొంది. శ్రోతకిక్కడ గుక్క తిప్పుకొనే వీలుండదు. ఏ మాత్రం తటపటాయింపుకు అవకాశం ఉండదు. అతడిప్పుడు కుందేలు పక్షపాతి. అది ఏం చేసినా అతనికది ఎంతో న్యాయంగా ఉంటుంది! ప్రతిదీ మన శ్రోత కుందేలు వైపు నుంచే ఆలోచించడం మొదలు పెడతాడు!

ఈ కథని పిల్లలెందుకంతగా ఇష్టపడుతున్నారో గుర్తించడానికి ఈ పరిశీలన సరిపోతుందనుకొంటాను. తమను అందులో చూసుకొని మమైకం కాగల ఒక పాత్ర, ఒక హీరో ఈ కథలో వారికి చిక్కింది. అదే కుందేలు. పిల్లల రోజువారీ జీవితంలో కూడా కుందేలు ఎదుర్కొన్న సవాళ్ళ వంటివి ఎన్నో ఎదురవుతుంటాయి.

పిల్లలు చిన్నవాళ్ళు, బలహీనులు, ఎక్కువ సందర్భాల్లో వాళ్ళకిష్టం లేనిదాన్ని వాళ్ళు చెయ్యాల్సివస్తుంటుంది. అధికారం, శారీరకాధిక్యత గల వారి వల్ల వాళ్ళెప్పుడూ కష్టాల పాలవుతుంటారు. భయాందోళనలకు గురవుతుంటారు. కుందేలు ఎదుర్కొనే సవాళ్ళతో పిల్లలెదుర్కొనే సవాళ్ళకెంతో సామ్యం ఉంది. దీన్ని మనం ఎప్పుడూ గుర్తించం. మన పద్ధతిలో మనం అధికారమంతా మన చేతిలోనే పెట్టుకొని వాళ్ళతో నిత్యవ్యవహారాలు జరుపుతుంటాం.

హఠాత్తుగా ఒక బంధువో, మరొకరో చనిపోతే పిల్లల మీద అది ఎంత ప్రభావం కల్గిస్తుందో, వాళ్ళెంత ఆందోళనకు గురవుతారో మనం గుర్తించం. అలాగే వాళ్ళు తమ కంటే శక్తివంతులైన పెద్దలతో పడే ఘర్షణను కూడా మనం గమనించం.

అందువల్లనే కథా ప్రారంభంలోనే పిల్లలు కుందేలులో తమను చూసుకొంటారు. కథ నడిచే కొలదీ కుందేలు వారికి పెద్ద ఆకర్షణగా మారుతుంది. కుందేలు ఒక ఎత్తుగడ పన్నింది. అది ఫలించింది. దీంతో తన సమస్యనేగాదు అందరి సమస్యనూ కుందేలు పరిష్కరించింది. పిల్లలు ఇలాంటి పరిష్కారాన్నే ప్రేమిస్తారు. కుందేలు ఎత్తుగడలో పిల్లలకు నచ్చే మరో అంశం కూడా ఉంది. అదేమంటే ఏదో ఒక సాకు చెప్పి అది తప్పించుకొనజూడ్డం. ఎందుకు ఆలస్యమైంది? అని సింహం అడిగితే కుందేలు చెప్పిన సాకు పిల్లల్ని ఎందుకాకర్షిస్తుందో చెప్పగలరా? ఎందుకేముంది పిల్లలు కూడా ఇలా సాకులు చెప్పి 'కష్టాల్నించి' బయటపడేవాళ్ళే గదా! అందుకని ఈ ఎత్తుగడతో కుందేలు తనను కాపాడుకోవడమే గాదు సింహాన్ని అంతంచేసింది. శత్రువును హతమారిస్తే తప్ప పాపం కుందేలు ప్రమాదం నుంచి బయటపడలేదు. అంటే ఈ కథ మనుగడ కోసం సాహసంతో చేసే విధ్వంసాన్ని నాటకీయంగా మన

ముందు పెడుతోంది. ఇందులో ఏమి నీతి ఉంది? మనుగడకోసం చేసే పోరాటం తప్ప ఇందులో ఏ నీతి లేదు. పిల్లల వైపు నుంచి చూస్తే తప్ప నిజానికి కథలో మనం అభినందించదగ్గది ఏదీ లేదు. పెద్దలుగా మనం చూస్తే ఈ కథ నీతిలేని కథ. కుందేలు చేసింది పచ్చి మోసం తప్ప మరేమీ కాదు.

**కథల ప్రయోజనం ఏమిటి? :**

అంటే పిల్లలకు చెప్పడానికి ఎన్నుకొనే మంచి కథల్లో నీతి తప్పనిసరి కాదన్నమాట! అయితే 'సింహం - కుందేలు' కథలో ప్రత్యక్ష నీతి గాకపోయినా పరోక్షనీతి లేకపోలేదు. పిల్లల్ని భావోద్రేకానికి గురిచేసే అంశం ఇందులో ఒకటి ఉంది. ఒక ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఎంత నిబ్బరంగా నిదానంగా ఉండాలో అది చెపుతుంది. సరైన ఆలోచన చురుకుదనం అప్పుడే సాధ్యమని కూడా ఈ కథ చెపుతుంది.

కానీ సాంప్రదాయకార్థంలో ఇలాంటి పరోక్ష నీతిని కథా నీతిగా లెక్కించలేం. నీతి స్పష్టంగా ఉండాలి గానీ ఏదో డొంక తిరుగుడుగా వెతికి వెతికి చూస్తే తప్ప కనబడకుండేదిగా ఉండకూడదు.

ఈ చర్చా సారాంశం ఏమిటి? పిల్లల్లో నైతిక విలువల్ని పెంచడం మన సాంప్రదాయక కథల ప్రధానోద్దేశం కాదు. కథలు చెప్పడం వల్ల వచ్చే అసలైన లాభాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు వాటిని చూద్దాం.

**మంచి శ్రవణం :**

మంచి శ్రోత అంటే ఎవరు? చివరి దాకా వినేవాడే మంచి శ్రోత. కానీ చాలా మంది చివరిదాకా వినరు. మనం పిచ్చాపాటీ మాట్లాడేటప్పుడు కూడా చాలామంది మధ్యలోనే అడ్డం వస్తుంటారు. మనం చెప్పబొయ్యేది ముందే తెలిసి వాళ్ళిలా చేస్తే కొంత అర్థం చేసుకోవచ్చు కానీ అసలు వీళ్ళకి అంతదూరం వినడానికే ఓపిక ఉండదు. పెద్ద పెద్ద మేనేజిమెంటు, పరిపాలనా కోర్సుల్లో సైతం ఈ రోజుల్లో ఓపిగ్గా వినడాన్ని ఓ నైపుణ్యంగానే గాక ఓ మంచి లక్షణంగా కూడా పరిగణిస్తున్నారు. కథలు చెప్పడం చాలా చిన్న వయస్సు నుంచే ఇలా జాగ్రత్తగా ఓపిగ్గా వినే లక్షణాన్ని పెంపొందిస్తుంది. పెద్దయ్యాక ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కథలు చెప్పడం, వినడం ఒక మహత్తర సంప్రదాయంగా గల మన దేశంలో ఎదుటి వాడిని ఓపిగ్గా వినేవాళ్ళ సంఖ్య ఈ రోజుల్లో తగ్గిపోవడం చాలా విచిత్రంగా అన్పించవచ్చు. కానిది వాస్తవం. చిన్న వయస్సులో పిల్లలకు కథలు చెప్పకపోవడం దీనికొక ప్రధాన కారణమని నా అభిప్రాయం. నాగరికత పెరిగాక పిల్లలకు కథలు చెప్పడానికి మనకు తీరిక చిక్కడంలేదు. దీని ఫలితం మనల్ని ఈ దుస్థితికి తెచ్చింది.

**ఊహించడం, తర్కించడం :**

తమకు నచ్చిన కథను పిల్లలు మళ్ళీ మళ్ళీ వినాలనుకొంటారు. తమకు తెలియకుండా ఇలాంటి కథల పట్ల వాళ్ళు మక్కువ పెంచుకొంటారు. రెండోసారో మూడోసారో కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందో ముందే వాళ్ళు చెప్పగల్గుతారు. ఇలా జరగబొయ్యేది ముందుగా చెప్పగల్గడం ఒక సామర్థ్యం. మళ్ళీ మళ్ళీ ఒకే కథ వినడంవల్ల ఇలాంటి సామర్థ్యం పెరుగుతుంది. వాళ్ళ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వాళ్ళ సర్వతోముఖాభివృద్ధికిది దోహదపడుతుంది. మొదటి రెండు తరగతుల పిల్లలు చదవడం నేర్చుకొనేదశలో ఈ 'ముందుగా చెప్పగల్గడం' అనే సామర్థ్యం ఎంతైనా ఉపయోగపడుతుంది.

గణితం నేర్చుకోవడంలో కూడా ఈ సామర్థ్యం విలువ ఎనలేనిది. గణిత సూత్రాలన్నీ 'ముందుగా ఊహించి చెప్పగల్గడం' మీదనే కదా ఆధారపడతాయి. అందువల్ల గణిత అభ్యసనానికీ ఈ కథా శ్రవణ సామర్థ్యానికి మధ్య ఓ సామ్యం, సంబంధం ఉందని నా అభిప్రాయం. కథకు కూడా కొన్ని నిబంధనలు, పద్ధతులు ఉంటాయి. వాటిని పిల్లలు కథలు

వినేకొద్దీ పట్టుకొంటారు. ఇలా పట్టుకొనే కొద్ది వాళ్ళు ముందుగా ఏం జరగబొయ్యేదీ ఊహించి మరింత బాగా చెప్పగల్గుతారు. అలాంటి పిల్లలు గణిత సూత్రాల్ని కూడా ఇంతే బాగా పట్టుకోగలుగుతారు.

## మరో ప్రపంచం :

పిల్లలు తమ చుట్టూ చూస్తున్న ప్రపంచాన్ని కథలు విస్తృతపరుస్తాయి. తాము ఎప్పుడూ పాల్గొనని సందర్భాలను, చూడని మనుషులను, పాత్రలను వాళ్ళు కథల్లో చూస్తారు. ఇలాంటి వాటితో మనకేం పని అని మీరనుకోవచ్చు. కానీ ఇవి కూడా మన జీవితంలో భాగాలు! వాటిని ఎప్పుడూ మనం చూడకున్నా అవి మనల్ని, మన ఆలోచనల్ని కదిలిస్తాయి. చిన్న వయస్సులో ఈ కదలిక మరింత ఎక్కువగా ఉంటుంది. జీవితాంతం ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుంది. తమ చుట్టూ ఒక్క చెడ్డమనిషి కూడా లేకున్నా పిల్లలు చెడ్డవాళ్ళను గురించి ఆలోచిస్తారు. అలాగే అసాధారణ ప్రతిభావంతుల్నీ, బుద్ధిమంతుల్నీ, అందగాళ్ళనూ కలుసుకొనే ఛాన్సు తమకెప్పుడైనా దక్కకపోతుందా అని ఆరాటపడతారు. ఆదర్శమూర్తుల్ని అభిమానించడం పిల్లల మనస్తత్వంలో ఒక భాగం. అలాగే ప్రమాదాలన్నా దుష్టశక్తులన్నా భయపడ్డం కూడా వాళ్ళ స్వభావంలో భాగం. మన సాంప్రదాయక కథలు పిల్లల ఈ మనస్తత్వాన్ని కనుగుణంగా ఉండటం వల్లనే ఇంత కాలం పిల్లల్నిలా ఆకర్షింపగల్గుతున్నాయి. అక్షర ప్రపంచంలోకి ఇంకా అడుగు పెట్టని బిడ్డ ఓ అమ్మమ్మ కథలో అద్భుతమైన మరో ప్రపంచాన్ని చూస్తుంది. అది తన వాస్తవ ప్రపంచం కంటే ఎంతో విస్తృతంగా ఉంటుంది. పిల్లలకు కథల్లో కన్పించే ఈ మరో ప్రపంచం గజిబిజిగా గందరగోళంగా ఉండదు. అందులో ఓ క్రమబద్ధత ఉంటుంది. ఆ క్రమబద్ధతలోనే కొన్ని నైతిక విలువలుంటాయి. కానీ ఆ విలువలు మనం నమ్మే సాంప్రదాయకార్థంలో ఉండవు. ఆ కథల్లో వంచితుడే గెలుస్తాడు. అయితే ఇలా గెలవడానికి వాడు కొన్ని పద్ధతులు పాటిస్తాడు. అవి అనైతికమైనవిగా మనకు సాంప్రదాయకార్థంలో కన్పించవచ్చు. ఆకలితో నకనకలాడే సింహానికి కుందేలు చెప్పిన అబద్ధాలు ఇలాంటివే.

## నూతన పదజాలం :

కథలు చెప్పడం పిల్లల భాషా ప్రపంచాన్ని ఎలా విస్తృతం చేస్తుందో కూడా మనం చూడొచ్చు. మాటలు పూర్తిగా వ్యక్తిగత ఆస్తి, ఆ మాటలతో ప్రపంచానికి మనం పేర్లు పెట్టే తీరు కూడా వ్యక్తిగతమైనదే. కానీ ఇదే పదజాలం సామాజిక ఆస్తి కూడా. ఎందుకంటే మన అనుభవాల్ని ఇతరులతో పంచుకోవడానికి ఈ మాటలే ఆధారం. పదాలకున్న ఈ వ్యక్తిగత, సామాజిక లక్షణాలే పదాల అర్థాల్ని నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పిల్లవాడికి 'ఆకలి' అంటే ఏమిటో అనుభవం నుంచి తెలుసు. దీన్నుంచే సింహం 'ఆకలి'తో ఉన్నప్పుడు ఎలా ఉండి ఉంటుందో పిల్లవాడు గ్రహించగలడు. ఇలా 'ఆకలి' అనే తనకు తెలిసిన పదం సింహానికి కూడా వర్తింప చేసుకునేలా ఈ కథ శ్రోతకు సహకరిస్తుంది. మరికొన్ని కథలు వినేకొలదీ మరికొన్ని పదాల సామాజికార్థాలు పిల్లలకు తెలుస్తాయి. తన స్వంత పదజాలాన్ని ఇతరులకు వర్తింపజేసుకొనే క్రమం వేగిరమవుతుంది. తర్వాత 'చదవడం'లోకి వెళ్ళే పిల్లలకు ఇది చాలా ఉపకరిస్తుంది.

పైన మనం చెప్పుకొన్న నాలుగు కథాప్రయోజనాల్లోని అంశాలు చదవడానిక్కూడా వర్తిస్తాయి. పిల్లలు చదివేకొలదీ భాషాసూత్రాలను, నిర్మాణాన్ని అర్థం చేసుకోగల్గుతారు. ముందుగా ఊహించి చెప్పగల్గడం పెరిగే కొలదీ చదవడంలో సామర్థ్యం పెరుగుతుంది. భాషా నిర్మాణంలో సూత్రాలతో పరిచయం పెరిగే కొద్దీ వాక్యంలో తర్వాత ఏమీ వచ్చేదీ పిల్లలు గ్రహిస్తారు. ఇలా చూస్తే కథలు చెప్పడం పిల్లల భాషా జ్ఞానాన్ని పెంచడానికి అమోఘంగా ఉపకరిస్తుంది!

## కథా నైపుణ్యం :

కథలు చెప్పాలనుకొన్నప్పుడు మనకా కథ బాగా మనసుకు పట్టి ఉండాలి. అందులో తడబాటు ఏమీ ఉండకూడదు. తడబడితే మధ్యలో అతుకు కన్పిస్తే కథను ఖూనీ చేసినట్టే లెక్క. బాగా మనసుకు పట్టిన కథ అయితే మనం సాఫీగా చెప్పగలం. అలా చెప్పగల్గినప్పుడే కథ చెప్పేవాడికీ, వినేవారికీ మధ్య ఒక సజీవ సంబంధం ఉంటుంది.

అలాగే కథ బాగా మన మనసుకు పట్టి ఉంటే ఆ కథకు సంబంధించిన ఒక స్కెచ్ మన మనస్సులో ఉంటుంది. అప్పుడు శ్రోతల పరిస్థితిని బట్టి మనం ఇష్టం వచ్చినట్లు దాన్ని మార్చుకోగలం. ఒక్కోసారి కథను పెంచాల్సి వస్తుంది. ఒక్కోసారి తగ్గించాల్సి వస్తుంది. కుందేలు సింహం ముందు నిలబడ్డప్పుడు కథను మనం సాగదియ్యలేం. అక్కడే వేగంగా కథ నడవాలి. సింహం ఆకలితో నకనకలాడుతూ ఆలోచిస్తున్నప్పుడు కథను మనం నెమ్మదిగా చెప్పొచ్చు. అలాగే కుందేలు భయం భయంగా తన ఎత్తుగడను నెమరేసుకొంటూ అడవిలోంచి వస్తున్నప్పుడు కథను అంత వేగంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇదంతా మనకు కథ మీద ఉన్న పట్టునుబట్టి ఉంటుంది.

ఇక కథలోని సంభాషణల సంగతేమిటి? వాటినెలా చెప్పాలి అనే ప్రశ్నలున్నాయి. దీనికి మనం పలు మార్గాల్ని రెండు రకాల స్వరాలతో పలకొచ్చు. హావభావాల్ని ప్రదర్శిస్తూ చెప్పొచ్చు. చిన్నసైజు తోలుబొమ్మల్ని ఆడిస్తూ చెప్పడం వల్ల సంభాషణలు చాలా రక్తికడతాయి. ఒక్కో పాత్రను గురించి చెపుతున్నప్పుడు తరగతి గదికి ఈవైపు నుంచి ఆవైపునకు పచార్లు చేస్తూ చెప్పొచ్చు. ఇలా ఎన్నో సృజనాత్మక పద్ధతుల్ని పాటించవచ్చు. ఇవన్నీ పిల్లలకు చాలా ఉత్తేజాన్నిస్తాయి. ఒకే కథను ప్రతి సంవత్సరం చెప్పాల్సిరావచ్చు. ఒకే కథను ఒకే సంవత్సరంలో పలుసార్లు చెప్పాల్సి రావచ్చు. దీనికి తగ్గట్టుగా మనం తయారుకావాలి. ఒక కళగా కథాకథనాన్ని అధ్యయనం చెయ్యాలి. అలవరచుకోవాలి. ఇది ప్రతి టీచరుకూ ఒక తప్పనిసరి సవాలు.

కథలు చెప్పడం తన జీవితంలో విడదీయరాని భాగమైతే ఏ టీచరు జీవితమూ నిస్సారంగా ఉండదని నా గట్టి నమ్మకం. ఇది జరగాలంటే ప్రాథమిక పాఠశాలల పాఠ్యాంశాల పట్ల మన దృక్పథంలో కూడా తీవ్రమైన మార్పు రావాలని నా దృఢ విశ్వాసం.

## ఊ) పిల్లలూ - పుస్తక ప్రపంచం

*- కీర్తి జయరాం, ఢిల్లీ*

నాలుగైదేళ్ళ పిల్లల్లో వస్తున్న మార్పును మీరు జాగ్రత్తగా గమనించండి. ఈ మార్పు ఇంటి వాతావరణం నుంచి బడి వాతావరణంలోకి అడుగుపెట్టడమే గదా అని మీరనవచ్చు. కానీ ఈ మార్పులో అంతర్లీనంగా ఓ అంశం దాగి ఉంది. అదేమంటే ఈ వయస్సులోనే పిల్లలు తమ అభిప్రాయాల్ని, ఆసక్తుల్ని మౌఖిక పద్ధతి నుండి అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరించడం ప్రారంభిస్తారు. బడికే రానిది అక్షరాలెక్కడివి? అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరణ ఎక్కడిది అని మీరనవచ్చు..

**అక్షర ప్రపంచంలోకి తొలి అడుగు :**

ఈ అంశం మీద చాలా పరిశోధనలు ఇటీవల జరిగాయి. భాషాతత్వవేత్తలు, మనస్తత్వవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేశారు. మాటల్లోంచి రాతల్లోకి మారే ఈ పరిణామక్రమాన్ని మనం పిల్లలు చేసుకొనే ఆటవస్తువుల్లో, వేసుకొనే బొమ్మల్లో, గీసుకొనే పిచ్చిరాతల్లో, ఏర్పరుచుకొనే గుర్తుల్లో, అమూర్తసంకేతాల్లో మనం గమనించవచ్చు.

పెద్దల్లాగా వ్యవహరించాలని పిల్లలకు అంతులేని ఉబలాటం ఉంటుంది. ఇందుకోసం పిల్లలు పై పద్ధతుల్ని కనిపెడతారు. కొత్త సమాచార వ్యవస్థను రూపొందించుకొంటారు. అక్షర ప్రపంచంలోకి ఇలానే వాళ్ళు అడుగిడతారని మనం గుర్తుంచుకోవాలి.

ఆటల్లో పిల్లలకు ఓ చిన్న పెట్టె ఇల్లుగా మారిపోతుంది. ఓ కర్రపుల్ల గుర్రం అయిపోతుంది. మట్టిలో చిన్నపుల్లతో వాళ్ళు రాసే గీతల్లో ఎక్కడెక్కడి ఊహలూ సాక్షాత్కరిస్తాయి. పెద్దలు చేసే పనులన్నీ వీళ్ళిలా చేస్తుంటారు. మనం కొంచెం జాగ్రత్తగా గమనిస్తే మనం చేసే చేష్టలన్నీ పిల్లలు కొత్త రూపాల్లో చేస్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది.

ఈ సంకేతాల్ని పిల్లలు ఎక్కడి నుంచి సంపాదించుకొంటారు? తమ వాతావరణం నుంచే సంపాదించుకొంటారు. మరి పల్లెటూరి పిల్లల వాతావరణం, పరిసరాలు వేరు. పట్టణ విద్యాధిక కుటుంబాల్లోని పిల్లల పరిసరాలు వేరు. సహజంగానే అక్షరాలు, చిత్రాలు, బొమ్మలు, దృశ్యాలు, గ్రామీణ పిల్లలకు అందుబాటులో ఉండవు. పుస్తకాలు వారికి దొరకవు. మౌఖికంగా అందే పాటలు. కథలు, జోకులు, వినోదాంశాలు కూడా ధనికుల పిల్లల కందుబాటులో వున్నట్టు పేదపిల్లల కందుబాటులో వుండవు. టి.వి.లో, అగ్గిపెట్టెల మీద, వస్తువుల ప్యాకెట్ల మీద కన్పించే అక్షరాలే వీళ్ళకి అక్షర ప్రపంచం! ఇక తమ తల్లిదండ్రులు కాగితాలతో, కలంతో పనిచెయ్యడం వీళ్ళ ఊహక్కూడా అందని విషయం, కనీసం క్యాలెండర్లు, ఫోటోలు, దృశ్యాలక్కూడా అవకాశం ఉండదు. బడిలో అడుగు పెట్టినప్పుడు మాత్రమే వాళ్ళవన్నీ చూస్తారు. బడిలో వున్నంతసేపు మాత్రమే వాళ్ళకీ అవకాశం ఉంటుంది.

**మన పద్ధతి – మన వాచకాలు :**

ఇక పిల్లలు చదవడం, రాయడం ఎలా నేర్చుకొంటారో చూద్దాం. అక్షరాంటే ధ్వనుల సంకేత రూపాలు. అక్షర రూపానికీ ధ్వనికీ సంబంధం ఏమీ ఉండదు. ధ్వనులను పేర్చి పదాలు, పదాల్ని కూర్చి వాక్యాలు రూపొందించాలి. ఇదొక సంక్లిష్ట ప్రక్రియ. అయితే వాస్తవానికి వినడం, మాట్లాడడం కూడా ఇలాంటి ప్రక్రియే. వేల ధ్వనులుంటాయి. వేల పదాలుంటాయి. వస్తువుకీ పదాలకీ మధ్య సంబంధం ఏమీ ఉండదు. ఇక వాక్య నిర్మాణం సరేసరి. అయినా పిల్లలు అద్భుతంగా చెప్పింది అర్థంచేసుకొంటున్నారు. మాట్లాడుతున్నారు. ఇదెలా జరుగుతోంది?

భయం, జంకూ లేకుండా మాట్లాడనిచ్చినందువల్లే పిల్లలు మాటలు నేర్చుకొంటున్నారు. రాయడం కూడా అంతే! ఇష్టం వచ్చినవి - అవి అనుభవాలు కావచ్చు, ఊహలు కావచ్చు, పిచ్చిపిచ్చివి కావచ్చు. వాగడానికి వీలుండబట్టే పిల్లలు మాటకార్లుగా మారుతున్నారు. రాతలోనూ అంతే. అసలు పిల్లలకో లోకం ఉంటుంది. ఆ లోకాన్ని వ్యక్తీకరించుకొనే రూపంలోనే భాష వారికి పట్టుబడుతుంది. భాషలోని ఏ నైపుణ్యమైనా ఇలానే వంటబడుతుంది.

ఇప్పుడు మన స్కూళ్ళ దగ్గరకొద్దాం. అక్షరాలతో మనం ప్రారంభిస్తాం. ఈ అక్షరాలు కేవలం అమూర్త సంకేతాలు, ఆ అక్షరాలు కూడా ఒక క్రమంలోనే ఉంటాయి. ఆ క్రమంవల్ల పిల్లలకి వొరిగేదేమిటో ఎవ్వరికీ తెలియదు. పిల్లలక్కావల్సింది తమ ఆసక్తుల్ని వ్యక్తీకరించడం తప్ప అక్షరమాలలోని హ్రస్వదీర్ఘాల్ని, పరుష సరళాల్ని గుర్తించడం కాదు. వ్యాకరణ పాండిత్యం కాదు. దీన్ని మనం మరచిపోతాం.

అక్కడితో ఆగదు. ఈ అక్షరాలన్నిటినీ గుర్తుంచుకోవాలి. ఎప్పుడో ఏడాది తర్వాత వాడుకోవాలి (పదాలుగా!) ఇక అక్షరాల్ని వాడుకోవడంలో మనం పెట్టే ఆంక్షలు కోకొల్లలు. మూసపోసినట్టు పిల్లలందరూ ఒకే పదాలు వల్లించాలి. ఒకే వాక్యాలు చదవాలి. ఈ పదాలకీ పిల్లల అవసరాలకీ సంబంధం ఉండదు. వీళ్ళ లోకంతో అసలే సంబంధం ఉండదు. అంతా మనం బిగించిన చట్రంలోనే జరగాలి.

అక్షరమాలను దిద్దించే పద్ధతి ఎంత వికృతమైందో మన వాచకాలు కూడా అంతే వికృతంగా ఉంటాయి. వాచక నిర్మాణం ధ్వనుల క్రమాన్ని పరిచయం చెయ్యడంతో ముడిపడి వుండటం ఒక వికారమైతే అపరిచిత, అర్థరహిత, కృత్రిమ పదాలూ, వాక్యాలూ మరో వికారం. 'తమది' అని ఆనందించే అంశం వీటిలో పిల్లలకి ఒక్కటీ ఉండదు.

ఇవన్నీ చాలక తప్పులెక్కడా దొర్లకూడదని మనం గొంతు మీద కత్తి పెడతాం. కొత్త విషయాల్లోకి పోతే తప్పులొస్తాయి. అందువల్ల వాచకం వేదమవుతుంది. కంఠస్థం పరమార్థమవుతుంది. ఇక్కడితో పిల్లల ఊహలు ఖతం. ఆసక్తులు ఖతం. ఆలోచనలు ఖతం. అత్యున్నత వర్గాల స్కూల్లోనైనా, మామూలు ప్రభుత్వ స్కూల్లోనైనా సారాంశం మాత్రం ఇదే.

**పుస్తకాలూ - పిల్లలూ :**

పిల్లలు అక్షర ప్రపంచంలోకి ఎలా అడుగిడతారో మనం మొదట చూశాం. దీనికి కొనసాగింపుగా మన పాఠశాలల్లో ఏమైనా చెయ్యగలమా? పేదపిల్లలు ఇంట్లో అక్షర ప్రపంచానికి దూరమెలా అవుతారో మనం చూశాం. దీనికి పరిష్కారం మనం బడిలో ఏమైనా చూపగలమా? ప్రాథమిక స్థాయిలో అక్షరలోకంలోకి అడుగిడే మన పిల్లలకు పుస్తకాలు ఏమైనా సాధించిపెడతాయా అనేది ఇప్పుడు చూద్దాం. ఇందుకోసం నా అనుభవాలు కొన్ని చెపుతాను.

1990 ప్రారంభంలో ఎస్.సి.ఇ.ఆర్.టి. ఢిల్లీలో ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. ఇది 12 మున్సిపల్ స్కూళ్ళలో అమలు జరిగింది. మూడవ తరగతి స్థాయిలో ఎక్కువమంది పిల్లలు బడి మానేస్తున్నారని గుర్తించి ఈ ప్రాజెక్టు చేపట్టారు. 3వ తరగతి పిల్లల్ని కొందర్ని గుర్తించారు. వీరికి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా 1,2 తరగతుల పిల్లల్ని నూతన పద్ధతిలో అక్షర ప్రపంచంలోకి అడుగిడేలా చెయ్యడం దీని లక్ష్యం.

ఈ ప్రాజెక్టులోకి ప్రవేశించగానే 1,2 తరగతుల పిల్లలకు వాచకాలు తప్ప ఎలాంటి పుస్తకాలు అందుబాటులో లేవని మాకు తెలిపోయింది. దాదాపు పిల్లలందరూ చదవాలన్నా, రాయాలన్నా సతమతమవుతున్నారు. వాచకాల్లోని వాక్యాల్ని కొంచెం తారుమారు చేస్తేచాలు వాళ్ళు చదవలేకపోతున్నారు. వాళ్ళర్థవంతంగా ఏమీ చదవడంలేదని, కేవలం వల్లిస్తున్నారని మాకర్థమైపోయింది. అదే సమయంలో ఈ పిల్లలకి చదవాలనే తృష్ణ విపరీతంగా వుండటం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది.

మొదట మేం కథలు చెప్పడంతో మొదలెట్టాం. తెలిసిన కథలు, కొత్త కథలు లెక్కలేనన్ని పిల్లల ప్రపంచంలో పుట్టుకొచ్చాయి. ఆ తర్వాత కథను మధ్యలో ఆపేసి తర్వాత ఏం జరిగిందో చెప్పమన్నాం. ఒక్కొక్కరు ఒక్కోలా ముగించారు. తాము స్వతంగా కథలు అల్లినట్టు పిల్లలు ముచ్చటపడ్డారు. వాచకాల్ని వదిలేసి ఆ తర్వాత కథలు పెద్దగా చదివి విన్పించసాగాం. పిల్లలు స్వేచ్ఛగా ఆరుబయట ఎవరిష్టం వచ్చినట్టు వారు కూర్చునే వారు. కథలు వినేవారు. చిన్నపిల్లలు కోసం పెద్ద పిల్లలు పుస్తకాలు సేకరించారు. ఆదివారం దినపత్రికలు పట్టుకొచ్చారు. పిల్లలు వీటిలోని బొమ్మల్ని చూసేవారు. తమలో తాము మాట్లాడుకొనేవారు. విచిత్రం ఏమంటే మనం చాలా చిన్నవని, పనికిరానివనీ అనుకొన్నవి కూడా పిల్లల్లో మహా ఉత్సాహం కలిగించేవి. పిట్టలు, పురుగులు, జంతువులు, ఆకులు, పూలు కూడా వాళ్ళతో గుసగుసలాడేవి. ఇలా పుస్తకాల్ని 'చదవడం' పిల్లలు మొదలెట్టారు. ఈ 'చదవడం' విచిత్రంగా ఉండేది. ఓ సింహం బొమ్మ ఉందనుకోండి. 'నేను కూడా అడవికి వెళ్ళా, పెద్ద సింహాన్ని గుహలో చూశా' అని ఓ పిల్లతన ఉత్తుత్తి 'అనుభవాన్ని' దీనికి జోడించేది. ఓ పువ్వు కన్పిస్తే చాలు' ఇలాంటి పూలు మా ఊళ్ళో బోలెడు పూస్తాయి' అని మరో పిల్ల అనేది. అంటే పిల్లలీ బొమ్మలతో, కథలతో మమేకమై వాటిని స్వంతం చేసుకొనేవారు. ఆ స్కూళ్ళ టీచర్లు మొదట దీన్ని అర్థం చేసుకోలేక పోయారు. వాళ్ళ దృష్టిలో పలకలమీద రాయడమే అక్షరాలు నేర్చుకోవడం. ఇదంతా దండగమారి పని అనీ, వాళ్ళ సమయం వృథా అవుతోందనీ వాళ్ళ అభిప్రాయం. కానీ తర్వాత భాష నేర్చుకోవడంలో దీని ప్రాధాన్యత గుర్తించి వాళ్ళు కూడా క్లాసులో కథలు మొదలెట్టారు.

దీన్ని మేం మరికొంత విస్తృతం చేశాం. అక్షరాలతో, పదాలతో ఆటలాడ్డం, అంత్యానుప్రాసాలు, స్వంతవాక్యాలు చెప్పడం నుంచి నచ్చిన పదాల్ని చూసి రాయడం దాకా దీనికి జోడించాం. పిల్లలకు అక్షరాలు, పదాలు, వాక్యాలు ఇలా పరిచయమయ్యాయి. అక్షరాల రూపాలతో పాటు కొన్ని అక్షరాలు ఎడమ నుంచి కుడికి వరుసగా పేరిస్తే పదాలుగా, పదాల్ని

పేరిస్తే వాక్యాలుగా మారతాయనే సంగతీ వాళ్ళు పసిగట్టారు. వాళ్ళు బొమ్మలేసేటపుడు, పిచ్చిరాతలు కూడా వాక్యాల్లో వరుసగా వుండేవి. కొందరైతే పదాల్ని రాసేవారు. బొమ్మలకు పేర్లు పెట్టేవారు. బొమ్మలేసి అది చేస్తున్న పనిని చింకిరిబింకిరిగా రాసేవారు.

అన్నిటికంటే విశేషం గంటల తరబడి పిల్లలీ పుస్తకాలతో గడపడం. వాటిని తిప్పుతూ బొమ్మల్ని వేళ్ళు పెట్టి చూస్తూ, చేతులతో తడుముతూ, ముద్దు పెట్టుకొంటూ వాళ్ళు ఏమోమో చేసేవారు. వాళ్ళకి చాలామందికి చదవడం ఏమీరాదు. అయినా చదువుతున్నట్టే తల పుస్తకంలో పెట్టి ఏమేమో మాట్లాడేవారు. వాటి మీద రాసేవారు. కాపీ చేసేవారు. ప్రతి దానికీ తమ జీవితాన్ని, అనుభవాన్ని జోడించేవారు. స్వేచ్ఛగా వదిలినందువల్లనే ఇది సాధ్యమైంది. 'ఇలాకాదు ఇలా చెప్పాలి' అని ప్రతిసారీ తప్పులు వెతకడం లేనందువల్లే ఇది వీలైంది.

**ఒక్కో మెట్టు పైపైకి :**

ఈ ఉత్సాహం మాకు మరింత పనిపెట్టింది. మేం మరిన్ని సేకరించాల్సి వచ్చింది. సేకరించాం. చార్టులు, బొమ్మలు గోడకు వేలాడదీశాం. పిల్లల రాతల్ని కూడా గోడకు తగిలించాం. వాళ్ళ బొమ్మల్ని ప్రదర్శించసాగాం. ఇవన్నీ పిల్లలు చూడ్డానికి (చదవడానికి) అందుబాట్లో ఉండేంత ఎత్తులో ఉంచాం. ఇలా మాకూ కొత్త కొత్త ఆలోచనలు రాసాగాయి. గోడమీద రకరకాల సంజ్ఞలు రాయడం ఈ ఆలోచనల్లో ఒకటి. ఈ సంజ్ఞలు ఒక్క వాక్యంలో ఉంటాయి. ఉదాహరణకి ' మీచేతులు పైకెత్తండి', 'ఆడుకొందాంరండి', 'అదిగో ఆ చెట్టును తాకి పరిగెత్తిరండి' ఇలాంటి సంజ్ఞలన్నమాట. వీటిని పిల్లలు చదివి అలా చేసేవారు. చూస్తుండగానే ఇదొక ఆటలా మారిపోయ్యింది. పెద్ద పిల్లల్ని ఈ సంజ్ఞలు రాయమనేవాళ్ళం. వాళ్ళు పోటీ పడేవాళ్ళు. అలాగే ఆసక్తి కలిగించే శీర్షికలున్న బొమ్మల్ని తగిలించేవాళ్ళం. పుస్తకాల పేర్లు బోర్డు మీద రాసి ఆ పుస్తకాల్ని గుర్తించమనేవాళ్ళం. పొడుపు కథలు రాసేవాళ్ళం. ఇలా పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు మాస్టార్లయి పొయ్యారు!

దీన్ని ఇంకో మెట్టు ఎక్కించడానికి మరో ఆలోచన చేశాం. పిల్లల అనుభవాల్ని రన్నింగు బోర్డు మీద రాయించాం. మొదటి దశలో ఇవి చిన్న చిన్న ఆలోచనలే కావచ్చు. ''నేనీరోజు ఒక పిట్టను చూశా', 'నిన్న మా ఇంటికి ఒక కుక్క వచ్చింది.' నా పుస్తకం చినిగిపొయ్యింది. నాకు ఏడుపొచ్చింది.' ఇలాంటి అనుభవాలన్నమాట. ఇలా రాయడంలో పిల్లలు చాలా తప్పులు రాసేవాళ్ళు. మాక్కావల్సింది ఆలోచనలేగాని వ్యాకరణం కాదుగా, ఇష్టారాజ్యంగా రాయమనేవాళ్ళం. పిల్లలు ఈ రాతలు చుట్టూ మూగేవాళ్ళు. చదివేవాళ్ళు. చర్చించుకొనేవాళ్ళు. చదవలేనివాళ్ళు చదవగలవాళ్ళ దగ్గర చెప్పించుకొనేవాళ్ళు. అక్షరాల్ని మెల్లమెల్లగా గుర్తించేవాళ్ళు.

ఇంకో తమాషా పని ఏమంటే చిన్న పిల్లల అనుభవాల్ని పెద్ద పిల్లలు రాయడం, చిన్న పిల్లలు ఏవేవో చెప్పేవాళ్ళు. పెద్ద వాక్యాలుగా, పిచ్చి పిచ్చి వాక్యాలుగా అవి ఉండేవి. వాటిని అలానే రాయమనేవాళ్ళం. వాటిని మళ్ళీ చదివి వాళ్ళకి విన్పించేవాళ్ళం. వాటిని గోడకు వేలాడతీసేవాళ్ళం. ఆ తర్వాత చిన్న పిల్లలు కూడా రాయసాగారు. అలా రాయడానికి వాళ్ళకంత భాషరాదుగదా అందుకోసం ఒక బొమ్మ వెయ్యమనేవాళ్ళం. ఆ బొమ్మకింద ఏదో ఒకటి రాయమనేవాళ్ళం లేదా పెద్ద పిల్లల చేత రాయించేవాళ్ళం. అయితే ఒక జాగ్రత్త తప్పకుండా తీసుకొనేవాళ్ళం. అదేమంటే ఏం రాసినా పిల్లల భాషలోనే ఉండాలి.

ఈ అనుభవాన్ని నేను మాటల్లో చెప్పలేను. పిల్లలు ఎంత ఆనందిస్తారో! ఎంత ఉబలాటపడతారో! కానీ మనం గమనిస్తే ఇందులో చదవడం, రాయడం నేర్చుకోవడంలోని ప్రాథమిక దశ ఉంది. అచ్చం ఇది వినడం, మాట్లాడ్డం నేర్చుకొనే దశలాంటిది.

**సంచీలో పుస్తకాలు :**

కొంతకాలం నేనూ, మా పిల్లలు కలిసి ఒక గ్రామంలో ఒక గ్రంథాలయం నడిపాం. గ్రంథాలయం అంటే ఏమిటో అనుకొనేరు. ఒక సంచిలో పుస్తకాలు ... అంతే! వీటిని ప్రతి శుక్రవారం బడికి తీసుకెళ్ళేవాళ్ళం. ప్రశ్నలు వేసేవాళ్ళం. పిల్లలచేత ఆ కథల్ని పలురకాల ముగింపులతో తిరగచెప్పించేవాళ్ళం. కొంతకాలం తర్వాత పుస్తకాలు ఇంటికిచ్చి మళ్ళీ శుక్రవారం తీసుకొనేవాళ్ళం. ఎనభైశాతం పిల్లలు పుస్తకాలు ఏమాత్రం చించకుండా తెచ్చేవాళ్ళు. పుస్తకాలతో పాటు ఆటలు, పాటలు, పొడుపుకథలు, అక్షరాలతో క్రీడలు, స్వీయ కథనాలు, బొమ్మలు వెయ్యడాలు, కథలు రాయడాలు, పాటలు రాయడాలు కూడా చేశాం. ఇదంతా పెద్ద హంగామాగా మారిపొయ్యింది. శుక్రవారం వస్తోందంటే చాలు పిల్లలు ఎక్కడలేని సంబరాన్ని ప్రదర్శించేవారు. క్రమంగా ఇది పెద్ద పిల్లలకు, బడి మానేసిన అమ్మాయిలకూ పాకింది. వాళ్ళని సభ్యులుగా చేర్చుకుని పుస్తకాలు ఇవ్వసాగాం. ఆ చిన్న ఊళ్ళో మాకు 120 మంది సభ్యులయ్యారు. చినిగిపోయిన పుస్తకాల్ని అతికించడం, అట్టలు వేయించడం, మరీ చినిగిపోయినవి కత్తిరించి ఛార్టులుగా మార్చడం - ఇవన్నీ పిల్లలే చేసేవారు. ఈ అనుభవం మాకు నేర్పిందేమంటే పిల్లల ఉత్సాహానికి తగినన్ని పుస్తకాలు మా వద్దలేవు. ఈ దేశంలో చిన్నారి పిల్లల పుస్తకాల క్కూడా ఎంత దారిద్ర్యమో!

**భోజన విరామంలో పుస్తక పఠనం :**

నా మరో అనుభవం చెపుతా వినండి. మా స్కూల్లో మధ్యాహ్న విరామ సమయంలో నేను ఇలాంటి గ్రంథాలయాన్నే నడిపాను. పుస్తకాలు తీసుకెళ్ళడం ఒక రూంలో తాళ్ళకి వేలాడదీయడం నా పని. పిల్లలు మెల్లగా గుమిగూడ్డం ప్రారంభించేవారు. కొందరు దూరంగా నిలబడి చూచేవారు. కొందరు బొమ్మల్ని తిరగేసేవారు. మరికొందరు తీసుకొని చదివేవారు. ఇలా క్రమంగా నా లైబ్రరీ ' జనాదరణ' పొందసాగింది. లంచ్‌టైంలో నేను స్టాఫ్‌రూంలో లేకుండా ఏమైపోతున్నానో నా తోటి టీచర్లకు కొన్నాళ్ళు తెలిసేది కాదు. ఆ తర్వాత వాళ్ళు అర్థం చేసుకొన్నారనుకోండి. క్రమంగా నేను పుస్తక మిత్రుల్ని తయారుచేసుకొన్నాను. వాళ్ళకి పుస్తకాలు ఇంటికివ్వడం మొదలుపెట్టాను. ఇక్కడ కూడా నన్ను వెంటాడిన సమస్య పుస్తకాల కొరత. మంచి పిల్లల పుస్తకాల కొరత.

చివరిగా ఒక్కమాట. పిల్లలకి పుస్తకాల్ని తమవిగా అన్పించేలా చెయ్యాలి. అంటే వాళ్ళు స్వంతం చేసుకోవాలి. అప్పుడు పిల్లలు పుస్తకాల వెంట పడతారు. పిల్లలు ఈ చిన్న లైబ్రరీల్ని అద్భుతంగా నిర్వహిస్తారు. రెండోది వాళ్ళ ప్రపంచం వాళ్ళకి అందులో కన్పించాలి. అలాంటి పుస్తకాలుండాలి. మూడోది స్వేచ్ఛగా వాళ్ళిష్టం వచ్చినట్లు వాళ్ళు పుస్తకాల్ని వాడుకోనివ్వాలి. చూడ్డం కూడా చదవడమే అని మనం గుర్తించాలి. నాలుగవది పుస్తకాల చుట్టూ మనం రకరకాల కృత్యాలు చేపట్టాలి. పిల్లల ఆసక్తులు, ఆనందాతిరేకాలు, అనుభూతులు రాబట్టాలి. వాటితో భాషను అనుసంధానం చెయ్యాలి. అప్పుడు వాళ్ళ స్వప్నలోకమంతా మన ముందు సాక్షాత్కరిస్తుంది. ప్రాథమికదశలో ఇలా చెయ్యడం భాష నేర్చుకోవడంలో (చదవడం, రాయడంలో) చాలా కీలకపాత్ర వహిస్తుందని మనం నమ్మితేనే ఇలా చెయ్యగలం. వాచకాలు వల్లించడమే భాష నేర్చుకోవడం కాదని మనం ఒప్పుకొంటేనే ఇది సాధ్యం!

## ఋ) కథలోంచి భాష నేర్పడం ఎలా?

అమ్మమ్మ ఒడిలోనో తాతయ్య పక్కలోనో అతుక్కుపోయి మంత్రాలు, దయ్యాలు, భూతాలు కథల్లో వస్తుంటే బిక్కుబిక్కుమంటూనే ఊ ఊ అంటూ కథలు విన్నకాలం కంటే బాల్యంలో తీపి గుర్తు ఎవరికైనా ఏముంటుంది? తల్లిదండ్రులూ టీచర్లూ బోధనలో అభ్యసన ప్రక్రియలో ఈ కథలకెంత ప్రాధాన్యత ఉందో ఇంకా గుర్తించలేదు. మన బోధనా వైఫల్యాల్లో ఇదొకటి.

**కథలంటే పిల్లల ప్రపంచం :**

పిల్లలు ఒక కథ వింటున్నారంటే దానివల్ల వాళ్ళలో మనకు తెలియకుండానే అనేక సామర్థ్యాలు ఏర్పడుతుంటాయి. ఓర్పుగా శ్రద్ధగా వినే నైపుణ్యం వాళ్ళకి కథల వల్లే వస్తుంది. కథ ముగిసేదాకా పాత్రల చేష్టల్ని, ఘటనల్ని వాళ్ళు కెమరాలో లాగా మనసులో బంధించి పెట్టుకొంటారు. కథకి సరికొత్త మలుపుల్ని, ముగింపుల్ని వాళ్ళు ఊహించుకొంటారు. కథలో ఓ ఆసక్తికరమైన వాళ్ళస్వంత ప్రపంచం ఉంటుంది. అందులోకి వాళ్ళు ప్రవేశిస్తారు.

చదవడం, రాయడంలోకి వెళ్ళడం ఈ ప్రపంచంలోనే జరగాలి. అప్పుడే దానికర్థం ఉంటుంది.

పిల్లలకు తెలిసిన కథను మనం చదివి వినిపిస్తున్నపుడు పిల్లల అనుభూతుల్ని, చేష్టల్ని గమనించండి. ఒక వాక్యం మనం చదివాక తర్వాత ఏ వాక్యం వస్తుందో వాళ్ళు ముందుగానే ఊహిస్తారు. చెప్పేస్తారు. అంటే పిల్లలకి చదవడం నేర్పడంలో కీలకాంశం వాళ్ళకి అర్థవంతమైందిగా వున్న దాన్ని చదివించడంలో ఉంది. అలాగాక అక్షరాలో, పదాలో ఒంటరిగా చదివించడానికి పూనుకోవడం అర్థరహితం. మనం పిల్లలకు వీలున్నంత విషయాన్ని - వాళ్ళకు అర్థవంతమైందిగా ఉన్న దాన్ని అందించాలి. ఇలాంటి విషయాలు కథల కంటే మంచివీ, ఆసక్తికరమైనవీ, ఏవీ ఉండవు.

**కథ చదివి విన్పించడం :**

పిల్లలు ఒక కథను విని, తోటి పిల్లలతో చర్చించుకొని, స్వంతంగా చదివిన తర్వాత మనం ఎన్నైనా అక్కడి నుంచి మొదలు పెట్టవచ్చు.

మనం మొదట చెయ్యవల్సింది కథను చదివి విన్పించడం. ఇలా విన్పించడం పదాల్ని తప్పుల్లేకుండా గుర్తించడానికో, వాక్యవిన్యాసాల్ని అర్థం చేసుకోవడానికో, కొత్తపదాల్ని నేర్పడానికో కాదు. ఇవన్నీ చాలా సంక్లిష్టమైన వ్యవహారాలు. ఒక క్రమంలో పిల్లలే వీటిని గుర్తించి పట్టుకొంటారు. మాట్లాడేపుడు వాళ్ళు ఈ నియమాలన్నిటినీ అలాగే ఒక క్రమంలో గ్రహిస్తారు. కథ విన్పించడం కథని ఆస్వాదించడానికి మాత్రమేనని మనం ముందు ఒప్పుకోవాలి.

ప్రతి దాన్నీ మనం ప్రశ్నించి ఎంత వచ్చిందో రాబట్టుకొనేందుకు ప్రయత్నించడం ద్వారా భాషను ఎప్పటికీ నేర్పలేము. వింటూ, చూస్తూ, చదువుతూ, రాస్తూ ఉండే క్రమంలో భాషా నియమాల్ని పిల్లలే స్వంతంగా గ్రహిస్తారు. దీన్ని మనం మొదట అంగీకరించాలి. కథని బాగా చదివి విన్పించండి. తర్వాత ఇతర సంగతులు వాటికంత అవే జరిగిపోతాయి.

**కథ నుంచి రాయడంలోకి... :**

మరో విషయం పిల్లలు విన్న కథని తమలో తాము చిత్రించుకొంటారు. దాన్ని బొమ్మల రూపంలో 'రాయాలని' కోరుకొంటారు. ఈ బొమ్మలు మనకి పెద్దవాళ్ళకి అర్థం లేనివిగా అన్పించవచ్చు. అయినా సరే మనం వాటిని ప్రోత్సహించాలి. పిల్లల మెదళ్లలోని అర్థంగాని అనేక మిస్టరీలను ఇవి విప్పి చెపుతాయి. కొంచెం మనసు పెడితే ఈ బొమ్మలకర్థం మనక్కూడా తెలుస్తుంది.

పిల్లలు ఈ బొమ్మల కింద ఏదో ఒకటి రాయాలని ఉబలాట పడతారు. అవి పదాలు కావచ్చు. వాక్యాలు కావచ్చు. సవాలక్ష తప్పులతో ఉండొచ్చు. అయినా వాళ్లకవి ప్రాధాన్యత గల 'విషయాలు', రాయడం నేర్పించడంలో ఇదొక ముఖ్యమైన మొదటి అడుగు. ఇక్కడ కీలకమైన అంశం పిల్లలు తప్పుల్లేకుండా రాయడం కాదు. అది ఓ క్రమంలో అలవడుతుంది. కీలకమైంది వాళ్ళు ఏం చేస్తున్నారా, ఏం రాస్తున్నారా అనేది.

**నటనలోకి, ఊహల్లోకి... :**

కథకు 'చదివించడం', 'చిత్రించడం', 'రాయించడం' జతపరిచినట్టే నాటకీకరణను కూడా జోడింపవచ్చు. పిల్లల్ని గ్రూపుల్లో చర్చించుకోనివ్వండి. కథను పూర్తిగానో, ఒక ఘట్టాన్నో నాటకంగా వెయ్యమనండి. పాత్రల్ని వాళ్ళే నిర్ణయించుకొంటారు. సంభాషణల్ని వాళ్ళే తయారుచేసుకుంటారు. ఎలా నటించాలో వారే నిర్ధారించుకొంటారు.

కథలోని పాత్రలు తమాషాగా ఉంటాయి. ఒక్కో పాత్రకు ఒక్కోప్లాన్ ఉంటుంది. దాని చేష్టల్లో అది బయట పడుతుంది. పిల్లలకి ఈ పాత్రల ఆలోచనలు, చేష్టలూ అంటే మహా ఇష్టం. మరి అవే పాత్రలు సరికొత్త ఆలోచనలూ, చేష్టలూ చేసేలా పిల్లల్ని ఊహించమనండి. కథని పిల్లలకిష్టమొచ్చిన మలుపు తిప్పమనండి. ఇష్టం వచ్చిన ముగింపు చెయ్యమనండి పాత్రల్ని మంచివి, టక్కరివిగా, మొద్దువి, తెలివైనవిగా పిల్లలు మార్చేస్తారు. ఇలా పిల్లలు కథల్ని 'స్వంతం' చేసుకొంటారు. ఏ అంశంమైనా పిల్లల స్వంతమయ్యాక అందులోంచి ఎన్ని అద్భుతాలైనా జరుగుతాయి!

**వ్యాకరణంలోకి... :**

వయస్సును బట్టి మానసిక స్థాయినిబట్టి ఇక కథ ద్వారా మనం ఎన్ని అంశాలనైనా రాబట్టవచ్చు. నామవాచకాల్ని, క్రియల్ని, విశేషణాల్ని, క్రియా విశేషణాల్ని ఆ పేరు చెప్పకుండా ఎన్నిటినైనా రాబట్టవచ్చు. వాక్యాల్ని వాటి నిర్మాణ పద్ధతుల్ని పసిగట్టేలా చెయ్యవచ్చు. ఒకే ధ్వనిగల పదాల్ని క్రోడీకరింపచెయ్యవచ్చు. మనం వ్యాకరణం అని దేన్ని చెపుతున్నామో దాన్నంతా ఆపేరు చెప్పకుండా ఎంతయినా నేర్పించవచ్చు. దీనికోసం పిల్లలు కథను మళ్ళీ మళ్ళీ చదువుతారు. చదివే కొలదీ భాషా రహస్యాలన్నీ ఒక్కొక్కటీ బట్టబయలవుతాయి. అక్షరాలతో, పదాలతో ఆటలు తయారవుతాయి. భాషా సౌందర్యం, చమత్కారం, రహస్యం ఒక్కొక్కటీ ఆవిష్కృతమవుతాయి.

**అసలు విషయం పిల్లలు స్వంతం చేసుకోవడం :**

పిల్లలచేత కథను తిరగరాయించవచ్చు. వాళ్ళ వాక్యాలు ఎలాగైనా ఉండనీయండి అక్షరాలతో, పదాలతో భాష నేర్పడం ప్రారంభించేవాళ్ళు, సందర్భంలేని వాక్యాల్ని పిల్లలకి నేర్పేవాళ్ళు భాషనేర్పడమంటే ఇంతేనని నమ్ముతారు. పిల్లలశక్తిపట్ల వాళ్ళకి నమ్మకం తక్కువ. పెద్ద పెద్ద వాక్యాల్ని పిల్లలు పట్టుకోలేరని వాళ్ళనుకొంటారు. కఠినమైన పదాల్ని రాయలేరని వాళ్ళు అనుకొంటారు. ఇందులో ఏమాత్రం వాస్తవంలేదు.

విషయం ఎంత విలువైనదన్నది ప్రధానం. చదవడంగానీ, రాయడంగానీ విషయాన్ని పిల్లలు ఎంత స్వంతం చేసుకొన్నారనే దానిమీద, ఎంత స్వంతం చేసుకొనగల్లేలాగా ఆ విషయం ఉందనేదాని మీద ఆధారపడి ఉంటాయి. విషయం స్వంతమైనపుడు అందులోని వ్యాకరణమంతా పిల్లలకి కరతలామలకమవుతుంది. ఈ క్రమంలో పిల్లల్ని ప్రతిదాన్నీ ప్రశ్నించి ఎంత తెలుసుకొన్నారో మనం పరీక్షించనక్కరలేదు. సమాధానం ఎంత ఖచ్చితంగా చెప్పగల్గుతున్నారని కాదు మనం చూడాల్సింది. పిల్లవాడి పరిశీలన ఎంత చురుకుగా సాగుతున్నదీ మనం చూడాలి. ఈ క్రమాన్ని మనం ఒప్పుకొంటే చాలు.

అసలు మనం భాషను గురించి పట్టించుకోకూడదు. భాష నేర్చుకొంటున్నామన్న స్పృహ లేనపుడే భాష ఒంటబడుతుంది! భాష నేర్పడంలో మనం గుర్తించాల్సిన రహస్యాల్లోకెల్లా పరమ రహస్యమిది.

భాష, భాషావిద్యకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వెబ్‌సైట్లు, ఉపయుక్త గ్రంథాల వివరాలు :

### ఎ. భాషాభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వ సంస్థలు వివరాలు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మైసూర్ | www.cill.org |
| 2. | కమీషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టర్మినాలజీ, న్యూఢిల్లీ | www.cstt.nic.in |
| 3. | నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్, న్యూఢిల్లీ | www.ncert.nic.in |
| 4. | నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ | www.ntm.org.in |

### బి. స్వచ్ఛంద సంస్థల పేర్లు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | సెంటర్ ఫర్ లర్నింగ్, బెంగుళూర్ | http://cfl.in |
| 2. | సెంటర్ ఫర్ లర్నింగ్ రిసోర్సెస్, పూనె | www.clrindia.net |
| 3. | దిగంతర్ శిక్ష ఏవమ్ ఖేల్‌కుద్ సమితి, జైపూర్ | www.digntar.org |
| 4. | ఏకలవ్య, ముంబాయి | http://eklavya.in |
| 5. | ప్రథమ్, ముంబాయి | www.pratham.org |
| 6. | రిషివ్యాలి ఇనిస్ట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, చిత్తూర్ డిస్ట్రిక్ట్, ఆం.ప్ర. | http://www.rishivalley.org |
| 7. | ద టీచర్ ఫౌండేషన్, బెంగుళూర్ | www.teacherfoundation.org |
| 8. | విద్యాభవన్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ వి.బి.టీచర్స్ కాలేజ్, ఉదయ్‌పూర్ | http://vidyabhavansociety-eminar-org |

## సి. ప్రచురణ సంస్థల పేర్లు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | విజయవాణి పబ్లికేషన్స్, చిత్తూర్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ | |
| 2. | ఎమెస్కో పబ్లికేషన్స్, హైదరాబాద్ | |
| 3. | విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ | |
| 4. | ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ | |
| 5. | అన్వేషి (తూడిసి బుక్స్) – టేల్స్ ఫ్రమ్ ది మార్జిన్స్ ఏ సీరిస్ ఆఫ్ 8 బుక్స్) | http://www.anveshi.org/content/view/172/99 |
| 6. | భారత్ జ్ఞాన్ విజ్ఞాన్ సమితి (బిజివియస్) | www.bgws.org |
| 7. | సెంటర్ ఫర్ లర్నింగ్ రిసోర్సెస్ | www.clirindia.net/ materials/childrenbooks.html |
| 8. | చందమామ ఇండియా | www.chandamama.com |
| 9. | చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్ | www.childrenbooktrust.com |
| 10. | ఏకలవ్య | http://eklavya.in |
| 11. | ఇండియా బుక్ హౌస్ | www.ibhworld.com |
| 12. | జన్‌చేతన | http://janchetnaa.blogspot.com |
| 13. | కరాడి టేల్స్ కంపెనీ | www.karaditales.com |
| 14. | కథ, న్యూఢిల్లీ | www.katha.org |
| 15. | మెక్‌మిలన్ పబ్లిషర్స్ | http://international.macmillan.com |
| 16. | నేషనల్ బుక్ ట్రస్ట్ | www.nbtindia.org.in |
| 17. | నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ | www.ncert.nic.in |

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 18. | నవనీత్ ప్రకాశన్ కేంద్ర, అహ్మదాబాద్, గుజరాత్ | – |
| 19. | పిసియమ్ చిల్డ్రన్స్ మాగజైన్ | www.pcmmagazine.com |
| 20. | ప్రథమ్ బుక్స్ | www.prathambooks.org |
| 21. | పుస్తక్ మహల్ | www.pustakmahal.com |
| 22. | రూమ్ టు రీడ్ | www.roomtoread.org |
| 23. | ద లర్నింగ్ ట్రీ స్టోర్ | http://www.tltree.com |
| 24. | తులిక బుక్స్ | www.tulikabooks.com |

### డి. భాషాభ్యాసానికి సంబంధించిన కొన్ని వెబ్‌లింకులు

1) http://www.bbc.co.uk/schools/magickey/adventures/drogon game.shtml is a game that helps learn about a question and a question mark.

2) http://www.proteacher.com/cgi.bin/outsidesite.cgi?id=4731Extexternel=http://www.sdcoe.k12.ca.us/actbank/sorganiz.htmEtoriginal=http://www.proteacher.com/070037.shtmltitle=Graphic%20organizers containswell-delineated writing standards. level wise.

3) http://www.lessonplanspage.com/LAK1.htm contains a whole host of ideas for language activities

4) http://www.0P97.org/ftcyber/jack/puzzles/puzzles.html has easy, medium and hard jigsaw puzzles that are based on fairy tabes.

5) http://www.youtube.com.watch?v=2LVNi-FPEuYhas a video of the panchatantra story about the doves ina hunter's net (collective strength) in Hindi.

6) http://www.darsie.net/talesofwonder/contains Folk and Fairy Tales from around the world.

7) http://www.thepromisefoundation.org/TPFLt RB.pdf is report of a study on Learning to Read in Bengali, useful for language researchers in Indian languages.

8) http://www.rubybridges.org/story.htm contains the inspring story of Ruby Bridges and her teacher.

9) http://puzzlemaker.discoveryeducation.com/allows the user to create and print customized word search, criss-cross, match puzzles, and more using his/her own word lists.

10) http://gem.win.co.nz/mario/wsearch/wsearch.php allows you to generate your own word maze/word search puzzle.

11) http://georgerncgurn.com/articles/reading forpleasure.html has a good article on reading for pleasure.

12) http://www.atozteacherstuff.com/pages/374.shtml for a lovely idea on getting children excited about reading.

13) http://lesl.about.com/od/vocabularylessonplans/a/characteradj.htm for an excellent activity that develops and broadens knowledge of character adjective vocabulary.

14) http://www.scholastic.com/ispy/play/for a set of award winning puzzles and games that allow children to discover word associations, word play and themes help them build important learning skills including reading.

15) http://www.readwritethink.org/materials/in the bag/index, html for an interactive game that builds vocabulary.

16) http://www.sacred.texts.com/hin/ift/index.htm has links to indian fairy tales.

17) http://primary.naace.co.uk/activities/BigBooks/index.htm has audio-e-books for kids.

18) http://www.vrml.k12.la.us/krause/Reading.htm for slide shows that excite a childr to read.

19) http://www.thepromisefoundation.org/TPFLtkb.pdf is report of a study on Learning to Read in Bengali, useful for language researchers in Indian languages.

20) http://www.thepromiselfoundation.org/TPFRdk.pdf is report of a study on Reading difficulties in Kannada, useful for languages researchers in indian language.